

'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8+20 వెల: ₹ 5.00

సంపుటి: 11

సంచిక: 289

బుధవారం 9-1-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఆగితే.. అపూర్వ వరమిది!

లలితా జ్యువెల్లరిలో నగలు కొంటే.. మీరు మరింత ఆదా చేయొచ్చు!

మా నగలన్నీ BIS 916 హాల్‌మార్క్ బంగారంతో చేసినందువల్ల
నాణ్యతకు 100% గ్యారెంటీ ఉంటుంది.

వజ్రాభరణాలు

మార్కెట్‌లోనే తక్కువధర

క్యారెట్ రూ. 46000 నుంచి!

V.A. గ్రాముకు రూ.975 మాత్రమే

అన్ని వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ అందజేస్తాం.

100% Quality. E-F Colour Grade & VVS Clarity.

మా దగ్గర కొన్న వజ్రాభరణాలకు 100% ఎక్స్ఛేంజ్ చేసుకునే సౌకర్యం మరియు 85% క్యాష్‌బాక్ సౌకర్యం.



వెండి వస్తువులు

మార్కెట్‌లోనే తక్కువధర



నగల కొనుగోలు పథకం

ప్రతినెల మీరు చెల్లించే కష్టార్జితానికి తగ్గ విలువను కల్పించే ఏకైక నగల కొనుగోలు పథకం.

11 నెలల 'నగలు కొనుగోలు పథకం'!

తొలి వాయిదా ఉచితం!
+
V.A. 50% ఉచితం!

కస్టమర్ GST చెల్లించాల్సి ఉంటుంది.



తయారీ ధరకే.. బంగారు ఆభరణాలు..!

మార్కెట్‌లోనే అందరికన్నా తక్కువ ధరకే మా వద్ద నగలు లభ్యం.
ఇతర షోరూంల మాదిరిగా ఖేరమాడే అవసరం మీకు ఏమాత్రం ఉండదు.

గాజులు



Daily wear Machine cutting	4% నుంచి 8% V.A.
Bombay Fancy	6% నుంచి 9% V.A.
CNC Rhodium cutting	7% నుంచి 9% V.A.
Kolkata	8% & 9% V.A.

చైన్లు

Saradu	3% V.A.
V Chain	4% V.A.
Hollow Rope	4% V.A.
Indrani	6% V.A.
Parinda	6% V.A.
Hollow Flat Rope	6% V.A.
Gopi Cutting	6% V.A.
Kerala	7% V.A.
Kerala	7% V.A.

మా ప్రత్యేకతలివి

- తయారీ ధరకే బంగారు ఆభరణాలు. (హోల్‌సేల్ ధరకే లభ్యం.)
- మార్కెట్‌లోకెల్లా అతి తక్కువ V.A.
- ఇతర షోరూంలకన్నా మీరు చెల్లించే డబ్బుకు అధిక గ్రాముల బంగారం.

మేం చేయనివి!

- అధిక V.A. ఛార్జీలను ముందుగానే వేసి.. ఆ తర్వాత చిన్న డిస్కౌంట్‌తో మిమ్మల్ని సంతోషింపజేయడానికి ప్రయత్నించడం.
- నగల ప్రత్యేకతను మించి గొప్పలు చెప్పడం వంటి జిమిక్కులు చేసి ఛార్జీలను పెంచడం.
- ఇచ్చిన నగదుకు సరైన గ్రాముల బంగారాన్ని ఇవ్వకుండా.. ఉచితాలను ఇవ్వడం.

నగలు కొనడం ఎలా?.. అన్న విషయంపై రూపొందించిన పుస్తకం మా షోరూంలో ఉచితంగా లభ్యమవుతుంది.

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్
లక్షలాది డిజైన్లు!

విజయవాడ : 60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, సిద్ధార్థ నగర్, సిద్ధార్థ క్యాటరింగ్ కాలేజ్ ఎదురుగా. ఫోన్: 0866-2481133 / 91332 98333 / 91332 98444.

వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001.

తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్కరోడ్, (V.V. మహల్‌రోడ్) ఫోన్: 0877-666 0505 / 0606 / 7888. www.lalithaajewellery.com

హైదరాబాద్ : 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040 - 6748 6677.

చెన్నై • తిరువళ్లూరు • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8+20 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 289

బుధవారం 9-1-2019



'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

పుట్టింట్లోనే టీ20 పండుగ

మార్చి 23 నుంచి ఐపీఎల్.. స్వదేశంలోనే నిర్వహిస్తామన్న బీసీసీఐ - స్పోర్ట్స్‌లో



బుమ్రాకు విశ్రాంతి

ఆసిస్, కివీస్‌లతో వన్డే సిరీస్‌కు హైదరాబాద్ బౌలర్ సిరాజ్ ఎంపిక - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సీబీఐ చీఫ్‌గా మళ్లీ అలోక్ వర్మ

పునర్నియమించిన సుప్రీంకోర్టు • కేంద్రానికి ఎదురుదెబ్బ

- తొలగించే, బదిలీ చేసే అధికారం కేంద్రానికి లేదని స్పష్టీకరణ
- ప్రధాన విధానపరమైన నిర్ణయాలు తీసుకోకుండా అధికారాలకు కోత
- రఫేల్ దర్యాప్తు నుంచి మోదీ తప్పించుకోలేరు: రాహుల్
- సమతూకం ఉన్న తీర్పు ఇది: అరుణ్ జైట్లీ

9లో

"సీబీఐ డైరెక్టర్‌ను ఒకసారి నియమించాక ప్రభుత్వం రెండేళ్లలోపు తొలగించడం కుదరదు. ఒకవేళ తొలగించాలంటే నియామకం చేపట్టిన అత్యున్నత స్థాయి త్రిసభ్య కమిటీనే ఆ పని చేయాలి. ఢిల్లీ ప్రత్యేక పోలీస్ సంస్థ చట్టంలోని నిబంధనల ప్రకారం ఎంపిక కమిటీ ఆమోదం లేకుండా సీబీఐ డైరెక్టర్‌ను బదిలీ చేయడానికి కూడా వీల్లేదు. అలోక్‌వర్మపై సీవీసీ ఇంకా విచారణ జరుపుతున్నందున, వారంలోగా సమావేశమై ఈ కేసును పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలి.

- సుప్రీంకోర్టు ధర్మాసనం





అగ్రవర్ణ పేదలకు 10 శాతం కోటా బిల్లుకు

లోక్‌సభ ఆమోదం

124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు పార్టీలకు అతీతంగా లభించిన మద్దతు

- సభ నుంచి వాకౌట్ చేసిన అన్నాడీఎంకే
- బిల్లును వ్యతిరేకించిన ఇండియన్ ముస్లిం లీగ్, ఎంఐఎం
- ఓటింగ్ అనంతరం లోక్‌సభ నిరవధిక వాయిదా
- నేడు రాజ్యసభలో ప్రవేశపెట్టనున్న కేంద్రం
- బిల్లు కోర్టులో నిలబడగలదా? అని విపక్షాల అనుమానం
- సుప్రీంకోర్టులోనూ గట్టెక్కుతుంది: గహ్లోత్
- రాష్ట్రాల ఆమోదం అక్కర్లేదు: జైట్లీ

8లో

323 అనుకూల ఓట్లు

3 వ్యతిరేక ఓట్లు



బిల్లుకు లోక్‌సభ ఆమోదం అనంతరం కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌ను అభినందిస్తున్న ఎంపీలు



'ఏలేరు' కుంభకోణంపై

దర్యాప్తు కొనసాగించండి

సీబీసీఐడీకి హైకోర్టు ఆదేశం

- జాప్యానికి తావు లేకుండా చార్జిషీట్ దాఖలు చేయండి
- బాధ్యులపై సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఫిర్యాదు చేయాలి
- దీనిపై జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు విచారణ జరపాలి

- వివరాలు 7లో

అడుగులన్నీ.. ఆవైపే

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి భారీగా తరలివస్తున్న ప్రజలు

నేడు ముగియనున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పాదయాత్ర ముగింపు సందర్భంగా ఆవిష్కరించనున్న పైలాన్ మంగళవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో ఇలా తళుకులీనుతోంది

పాదయాత్రలో ఆఖరి ఘట్టం తిలకించేందుకు పోటెత్తిన అభిమాన జనం
వణికించే చలిలోనూ రోడ్డుపైనే జాగారం
ఉప్పొంగుతున్న ఉత్సాహంతో యువత
బారులుదీరుతున్న వాహన శ్రేణులు
పర్యాటక ప్రాంతాలుగా మారిన వైఎస్సార్, షర్మిల పాదయాత్ర స్థూపాలు
ప్రజా సంకల్పయాత్ర పైలాన్ వద్ద సెల్ఫీలు..
ఎటు చూసినా పండుగ వాతావరణం..
కిటకిటలాడుతున్న హోటళ్లు

పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలు.. ఏటా వచ్చే జాతర అన్నీ ఒకేసారి వస్తే ఎలా ఉంటుంది?.. అంతకన్నా రెట్టింపు స్థాయిలో కిక్కిరిసిన జన ప్రవాహాలు ఇప్పుడు ఆ మారుమూల ప్రాంతం వైపు వడివడిగా సాగుతున్నాయి. ఇడుపులపాయలో వేసిన తొలి అడుగు.. కోట్లాది హృదయాలను గెలుచుకుంటూ, రాష్ట్ర ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చేందుకు ఇచ్ఛాపురంలో ఆఖరి ఘట్టాన్ని ఆవిష్కరించేందుకు సిద్ధమైంది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర బుధవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వద్ద ముగియనుంది. కీలక నిర్ణయంతో రాజకీయాలను మరో మలుపు తిప్పిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పాదయాత్ర ముగింపు సన్నివేశాన్ని తిలకించేందుకు ఇచ్ఛాపురం వీధుల్లో అంతా వేయి కళ్లతో నిరీక్షిస్తున్నారు. ఉత్సాహం, ఉత్కంఠ, ఆనందం, ఆత్మీయత అందరిలోనూ కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

ఇచ్ఛాపురం, ప్రజాసంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధులు: విలువలు, విశ్వసనీయత, భరోసా, పట్టుదలను వారసత్వంగా పుణికిపుచ్చుకున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ దృఢ సంకల్పానికి ఇచ్ఛాపురం సాక్షిగా నిలువనుంది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో ఉన్న ఇచ్ఛాపురం నిజానికి ఓ చిన్న పట్టణం. అక్కడి జనాభా మహా అయితే వేలల్లోనే ఉంటుంది. కానీ రెండు రోజులుగా అక్కడ సందడే సందడి. ఇసుకేస్తే రాలనంతగా జనం.. ఎటు చూసినా పండుగ వాతావరణం.. వీధి వీధినా అంగళ్లు వెలుస్తున్నాయి. హోటళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. అక్కడకు వందల కొద్దీ వాహనాలొస్తున్నాయి. వేలాది మంది వచ్చిపోతున్నారు. 'పాదయాత్ర ముగింపు ఎక్కడ?.. పైలాన్ ఆవిష్కరణ ఎక్కడ?' ఇచ్ఛాపురం పొలిమేరల్లో కనిపించే ప్రతి వ్యక్తి నోటి నుంచి వస్తున్న ప్రశ్న ఇదీ. విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం.. ఇలా అక్కడకు ఏ డిపో నుంచి వచ్చే బస్సు అయినా కిక్కిరిసిపోతోంది. ఆటోల నిండా జనమే. ద్విచక్ర వాహనాల మీద చేరుకునే వాళ్ల సంఖ్య

మిగతా 4వ పేజీలో ▶

ఘన చరితం 3,648 కిలోమీటర్లు

పాదయాత్రే సాక్ష్యం.. కొండంత ధైర్యం

జన ప్రభంజనంతో సర్కారు బెంబేలు

అతనంటే ఒక నమ్మకం.. ఒక భరోసా

- పుల్అవుట్ III, IV, V, VIలో

జనవరి 9 వరకు పాదయాత్ర వివరాలు..

మొత్తం పాదయాత్ర జరిగిన రోజులు	341	పాదయాత్ర సాగిన మండలాలు	231
మొత్తం దూరం	3,648 కి.మీ.లు	పాదయాత్ర సాగిన మున్సిపాల్టీలు	54
పాదయాత్ర సాగిన నియోజకవర్గాలు	134	పాదయాత్ర సాగిన కార్పొరేషన్లు	8
పాదయాత్ర సాగిన మొత్తం గ్రామాలు	2,516	ఆత్మీయ సమ్మేళనాలు	55

బహిరంగ సభలు : 124





'అయోధ్య'పై రాజ్యాంగ ధర్మాసనం

ఐదుగురు జడ్జీలతో ఏర్పాటు చేసిన సుప్రీంకోర్టు
రేపటి నుంచి ప్రారంభం కానున్న విచారణ
వివిధ వర్గాల వాదనలను విననున్న ధర్మాసనం

- వివరాలు 9లో

రాహుల్‌గాంధీతో చంద్రబాబు భేటీ

- వచ్చే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కలసి ముందుకు సాగడంపై చర్చలు!
- ఏపీలో ఇరుపార్టీల మధ్య పొత్తుపైనా ప్రస్తావన..
- చర్చకొచ్చిన యూపీలో ఎస్పీ, బీఎస్పీ పొత్తు అంశం..
- శరద్ పవార్, ఫరూక్ అబ్దుల్లాతోనూ సీఎం భేటీ
- 19న మమతా బెనర్జీ ఆధ్వర్యంలో కోల్‌కతాలో జరిగే ర్యాలీకి హాజరవుతున్నానన్న చంద్రబాబు
- తదుపరి కార్యాచరణను ఆ సందర్భంగా రూపొందిస్తామని వెల్లడి

2లో

ట్రంప్, మోదీ ఫోన్ చర్చలు



భారత్‌తో అమెరికా వాణిజ్య లోటుపై చర్చించిన ఇద్దరు నేతలు

9లో

ఎన్నికల ముందు 'రాజధాని' సినిమా

అమరావతి భవనాల సెట్టింగ్‌లతో వెల్‌కమ్ గ్యాలరీ



- రేపు నిర్మాణం ప్రారంభించనున్న సింగపూర్ మంత్రి ఈశ్వరన్, సీఎం చంద్రబాబు
- వెల్‌కమ్ గ్యాలరీ నిర్మాణానికి రూ.44.50 కోట్లు
- కన్సల్టెన్సీ ఫీజు కింద ప్రైవేట్ సంస్థకు రూ.42.48 లక్షలు

2లో





అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పెథాయ్ తుపానుకు దెబ్బతిన్న పంటలు

గొలుగొండ (నర్సీపట్నం): అప్పుల బాధ తట్టుకోలేక విశాఖ జిల్లా గొలుగొండ మండలం చిన్నయ్యపాలానికి చెందిన యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మేరపురెడ్డి వరహాలు ఉరఫ్ శ్రీనువాసరావు (43) అనే రైతు వ్యవసాయ పెట్టుబడుల కోసం తీసుకున్న అప్పులు పెరిగిపోయి వాటిని తీర్చలేక సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న అతన్ని కాకినాడ ఆసుపత్రికి తీసుకువెళ్లగా మంగళవారం ఉదయం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు వరహాలు చిన్నయ్యపాలెం పరిసర ప్రాంతాల్లో సుమారు మూడు ఎకరాల భూమిలో వరి, అరటి సాగు చేస్తున్నాడు. రెండేళ్ల నుంచి పెట్టుబడులు రాక అప్పులు పెరిగిపోయాయి. గొలుగొండ ఎస్‌బీఐ శాఖలో రూ.లక్ష వరకు అప్పు ఉంది. అలాగే స్థానికంగా రూ.2.5 లక్షల మేర అధిక వడ్డీకి ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. ఈ ఏడాదైనా అప్పులు తీరుతాయని అరటి, వరి సాగు చేయగా గత నెలలో వచ్చిన పెథాయ్ తుపానుకు వరి, అరటి పంటకు తీవ్ర నష్టం వచ్చిందని తెలిపారు. దీంతో అప్పులు తీర్చేమార్గంలేక మనస్తాపంతో పొలంకోసం తీసుకువచ్చిన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృతుడి భార్య మంగళవారం గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జనసేన- లెఫ్ట్ చర్చలు షురూ

- పవన్‌తో మధు, రామకృష్ణ భేటీ
- సంక్రాంతి తర్వాత మరోసారి సమావేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జనసేన, వామపక్ష పార్టీల మధ్య ఎన్నికల పొత్తు, మూడు పార్టీల మధ్య సీట్ల పంపకంపై మంగళవారం ప్రాథమికంగా చర్చలు జరిగాయి. రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం, సీపీఐలు జనసేనతో కలిసి పోటీ చేసే అంశంపై చర్చించడానికి ఆ పార్టీల రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, రామకృష్ణలు తొలుత విజయవాడలోని జనసేన రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి ఆ పార్టీ నేత నాదెండ్ల మనోహర్‌తో సమావేశమయ్యారు. ఆ తర్వాత ముగ్గురు కలిసి బెంజిసర్కిల్ సమీపంలోని పవన్‌కల్యాణ్ నివాసానికి వెళ్లి చర్చించారు. ఇటీవల మీడియా ప్రకటనలో కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకోవడానికి జనసేన సిద్ధమని ప్రకటించినందుకు లెఫ్ట్ నేతలు పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చర్చల వివరాలను తమ పార్టీ జాతీయ నాయకత్వానికి తెలియజేస్తామని చెప్పారు. కాగా రాష్ట్రంలోని 60 అసెంబ్లీ నియోజకవర్గాలలో వామపక్ష పార్టీలు పోటీచేసే అంశాన్ని మధు, రామకృష్ణలు పవన్ వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. సంక్రాంతి తర్వాత మరోసారి సమావేశమై చర్చించాలని నేతలు నిర్ణయించినట్లు ఆయా పార్టీల వర్గాలు పేర్కొన్నాయి.


దయచేసి వినండి..

రైలు బండి.. మారిందండి!

చుక్‌చుక్ రైలు వస్తోంది..
దూరం దూరం జరగండి.. ఆగినాక ఎక్కండి..

రైలు బండి..
చిన్నారులకు చందమామతో
ఎంత అనుబంధముందో.. రైలు బండితోనూ అంతే..
ఇలా పాటలు పాడుకున్నా..
పక్కింటి పిల్లలతో కలిసి రైలాట ఆడుకున్నా..
రైలంటే.. ఎందుకో చిన్నప్పటి నుంచీ మనకు అదో ఇది..

కాలం మారింది..
రైలు బండీ మారింది..
మున్ముందు
మరింత
మారనుంది..
ఎలా? ఇదిగో ఇలా..
- సాక్షి సెంట్రల్ డెస్క్





బ్రీజ్.. ఇది భవిష్యత్తు రైలు.. దీనికి డీజిల్ అక్కర్లేదు.. కరెంటుతో పని లేదు.. అదే తయారుచేసుకుంటుంది. పైగా.. ఇప్పటి రైళ్లతో పోలిస్తే పూర్తిగా రివర్సు టైపు.. వచ్చినట్లే తెలియదు.. సౌండ్‌లెస్.. సూపర్ కదూ.. అంతేనా.. ఇది మనకు అందుబాటులోకి వస్తే.. పర్యావరణానికి చేటు చేసే డీజిల్ ఇంజిన్లను పక్కనపెట్టేయొచ్చు. ఎలక్ట్రిక్ ఇంజిన్ల కోసం బోలెడంత ఖర్చు పెట్టి.. విద్యుదీకరణ పనులు చేయాల్సిన అవసరం కూడా ఉండదు. ప్రస్తుతం బ్రిటన్‌లో ఈ కొత్తతరం లోకోమోటివ్‌కు సంబంధించిన పనులు జోరుగా జరుగుతున్నాయి. ఫ్రెంచ్ కంపెనీ అల్‌స్టం ఈ పనులను చేపడుతోంది. అన్నీ సరిగ్గా సాగితే.. 2021 నాటికి ఓ 100 హైడ్రోజన్ టెక్నాలజీ రైళ్లు పట్టాలపై పరుగులు తీయనున్నాయి.

ఎలా సాధ్యం..



ఇందులో ఉండే భారీ హైడ్రోజన్ ఇంధన ట్యాంకే అన్నిటికీ మూలం. ఇందులో హైడ్రోజన్.. గ్యాస్ రూపంలో నిల్వ ఉంటుంది. హైడ్రోజన్‌ను ఆక్సిజన్‌తో మిక్స్ చేయడం ద్వారా విద్యుత్‌ను తయారుచేస్తుంది. హైడ్రోజన్ ఇంధన సెల్ నుంచి విద్యుత్‌ను రైలులోని ట్రాక్షన్ వ్యవస్థ తీసుకుని.. రైలు నడిచేలా చేస్తుంది. అదనపు విద్యుత్‌ను రైలు కింద ఉండే లిథియం బ్యాటరీలలో స్టోర్ చేసుకోవచ్చు. ప్రమాదం వంటివి జరిగినప్పుడు హైడ్రోజన్ లీక్ కాకుండా.. పైపులన్నీ లాక్‌అయిపోయే ఏర్పాటు కూడా ఉంది. పైగా.. పర్యావరణానికి ఎంతో అనుకూలమైనవి. ఎలాంటి కాలుష్యాన్ని బయటకు వదలవు. నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తాయి. సింగిల్ ట్యాంక్ హైడ్రోజన్‌తో వెయ్యి కిలోమీటర్ల వరకూ ప్రయాణించగలవు. అత్యధిక వేగం గంటకు 140 కిలోమీటర్లు. కొత్తవి తయారుచేయడానికి ఎక్కువ వ్యయం అవుతున్నందున ప్రస్తుతం అక్కడ ఉన్న 100 ఎలక్ట్రిక్ రైళ్లనే హైడ్రోజన్ రైళ్లుగా మారుస్తున్నారు. ఈ హైడ్రోజన్ ట్రైన్ టెక్నాలజీ రైళ్లు అందుబాటులోకి వస్తే.. కాలుష్యం బాగా తగ్గడంతోపాటు ప్రయాణమూ సుఖవంతంగా ఉంటుందని బ్రిటన్ రైల్వే మంత్రి ఆండ్రూ జోన్స్ చెబుతున్నారు.

ప్రజా సంకల్పయాత్ర సువర్ణాధ్యాయం

- శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకోనున్న జగన్
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలసిల రఘురాం

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర సువర్ణాధ్యామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం అన్నారు. ఇచ్ఛాపురం మండలంలోని ప్రజాసంకల్పయాత్ర స్థూపం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ చరిత్రలో 2017, 2018, 2019 మూడు క్యాలెండర్ల కాలంలో పాదయాత్ర చేసిన వజ్రసంకల్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని అన్నారు. ప్రజాసంకల్పయాత్ర ప్రారంభం రోజు వైఎస్ విజయమ్మ మాట్లాడుతూ 'ప్రజలే తన బిడ్డకు శ్రీరామరక్షగా ఉన్నారని' అన్నారని.. అలాగే తల్లి ఆశీర్వాదం, ప్రజాబలంతో ప్రజాసంకల్పయాత్ర ముగుస్తుందని చెప్పారు. బుధవారం ఉదయం లొద్దపుట్టి వరకు సాగబోతున్న పాదయాత్ర, మధ్యాహ్నం విరామం అనంతరం ఒంటి గంట సమయంలో విజయ స్థూపం ఆవిష్కరణ, అక్కడ నుంచి వేలాదిమంది మధ్యలో పైలాన్ నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్రగా వెళ్లి పాత బస్టాండ్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. అక్కడ నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయనగరం చేరుకుని తిరుపతి పయనమవుతారని చెప్పారు. శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి స్వామి ఆశీర్వాదం తీసుకుంటారని తెలిపారు. కాగా, విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో వైఎస్ జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాత్ర ఉందని రఘురాం తెలిపారు. దాడి జరిగిన కొన్ని గంటల్లోనే ఘటన జరిగిన ప్రాంతం తమ పరిధిలోకి రాదని, తమకూ.. దాడికి ఎటువంటి సంబంధం లేదని చంద్రబాబు ప్రకటించారన్నారు. ఇప్పుడు ఆ కేసును హైకోర్టు ఎన్‌ఐఏకు అప్పగించడంతో మాట మార్చి.. తమ పరిధిలోని ఈ కేసును ఎలా అప్పగిస్తారంటూ మాట్లాడడం చూస్తుంటే.. ముమ్మాటికీ ఆయన హస్తం ఉన్నట్లు స్పష్టమవుతోందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ భూమన కరుణాకర్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాబాబు, గుంటూరు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి, కాయల వెంకటరెడ్డి, అమెరికా విభాగం సమన్వయకర్త రత్నాకర్ ఉన్నారు.

ఆధ్యాత్మిక దాడికి చంద్రబాబు కుట్ర

- మీడియాతో వైఎస్సార్‌సీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి
- మా వద్ద స్పష్టమైన సమాచారం ఉంది
- దేవుడి ముసుగులో ముఖ్యమంత్రి కుట్ర రాజకీయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి. చిత్రంలో తలశిల రఘురాం తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: దేవుడి ముసుగులో ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్త కుట్రకు తెరతీస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రీజనల్ కో–ఆర్డినేటర్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. ఆయన మంగళవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి వద్ద మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా సంకల్పయాత్ర ముగించుకొని తిరుపతిలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరుడి దర్శనానికి వెళ్లనున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆధ్యాత్మిక దాడికి చంద్రబాబు పన్నాగం పన్నుతున్నట్లు తమకు స్పష్టమైన సమాచారం ఉందన్నారు. అలిపిరి నుంచి కొండపైకి జగన్ పాదయాత్రగా వెళ్తున్న సమయంలో చంద్రబాబు కుటిల రాజకీయంతో టీడీపీ కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లా ముసుగులు వేసి, వారితో 'జై జగన్' అనే నినాదాలు చేయించనున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా తిరుమల మెట్లు, కొండపైకి దారి పొడవునా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాలను పెట్టేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నట్లు తమకు కచ్చితమైన సమాచారం ఉందన్నారు. అశ్వమేథయాగం లాంటి ప్రజా సంకల్పయాత్రను భగ్నం చేసేందుకు రాక్షస రాజు చంద్రబాబు కుయుక్తులు పన్నారని, అయినా ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన నిలిచి, యాత్రను విజయవంతం చేశారని కరుణాకర్‌రెడ్డి చెప్పారు.

మరుగుదొడ్డే వృద్ధ దంపతుల ఆవాసం

- పడుకునే వీలు లేకున్నా అదే దిక్కు
- భోజనం, నిద్ర అందులోనే
- జన్మభూమి సభల్లో అర్జీలిచ్చినా పట్టించుకోని యంత్రాంగం



మరుగుదొడ్డిలోనే భోజనం చేస్తున్న వృద్ధులు

బి.కొత్తకోట : కూలీ చేస్తే కాని కుండ కాలదు..కూలికి వెళ్లే శక్తి లేని స్థితి.. తలదాచుకునేందుకు గూడు లేని వైనం.. ఆదుకునే దిక్కులేదు..ఆలనా పాలనా చూసే బిడ్డలు లేరు.. ఇదీ.. ఓ మరుగుదొడ్డినే ఆవాసం చేసుకుని బతుకీడుస్తున్న ఓ వృద్ధ దంపతుల దీన గాథ.. పాలకులు, అధికార యంత్రాంగం సిగ్గుపడాల్సిన ఈ ఉదంతం చిత్తూరు జిల్లా, బి.కొత్తకోట మండలం గట్టు హరిజనవాడలో చోటు చేసుకుంది. గ్రామంలోని ఎం.నారాయణమ్మ (60), ఎం.వెంకటరమణ (65) దంపతులు కాపురం ఉంటున్న మిద్దె వర్షాలకు దెబ్బతినగా.. ప్రభుత్వం పక్కా గృహం మంజూరు చేస్తుందని స్థానికులు సలహా ఇవ్వడంతో ఎంతో ఆశతో ఆ ఇంటిని కూలగొట్టారు. అంతో ఇంతో కూడబెట్టుకున్న సొమ్ముతో ఇంటి పునాది వేసుకున్నారు. మిగిలిన ఇంటికి అవసరమైన నిధులు మంజూరు చేయాలంటూ కనిపించిన ప్రతి అధికారి కాళ్లావేళ్లా పడినా..ఎవరూ కనికరించలేదు. అప్పటి నుంచి వీరికి కష్టాలు మొదలయ్యాయి. ఉన్న చిన్నపాటి ఇల్లు తొలగించడంతో తలదాచుకునేందుకు నీడ లేకుండా పోయింది. దీంతో వారిని వీరిని బతిమాలుకుంటూ వారి ఇళ్లవద్ద పడుకుంటూ, ఖాళీస్థలంలో వండుకుని తింటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాను సంపూర్ణ ఓడీఎఫ్‌గా ప్రకటించడంతో గృహనిర్మాణశాఖ ఇంటిని మంజూరు చేయకపోయినా .. మండల అధికారులు వీరికి మరుగుదొడ్డి మంజూరు చేశారు. రూ.15 వేలతో పడగొట్టిన ఇంటిస్థలంలో ఓ వైపు మరుగుదొడ్డి నిర్మించుకున్నారు. ఇప్పుడా మరుగుదొడ్డే వీరికి ఇల్లుగా మారింది. మరుగుదొడ్డిలో బేసిన్ తొలగించి అందులోనే కాపురం ఉంటున్నారు. కాళ్లు చాచుకుని పడుకునే వీలులేదు. కూర్చోలేరు, నిలబడలేరు. ఆ స్థలంలోనే దంపతులు కలిసి భోజనం చేయడం, నిద్రించడం చేస్తున్నారు. కాగా మంగళవారం గట్టులో జరిగిన జన్మభూమి సభకు వచ్చిన అధికారులతో వెంకటరమణ తనగోడు చెప్పుకున్నాడు.

తోడులేని వాళ్లం

మాకు కుమార్తె మాత్రమే. మగబిడ్డలు లేరు. మమ్మల్ని చూసుకునే వారు లేరు. రోజంతా కష్టపడి కూలీ చేస్తే వచ్చే సొమ్ముతోనే బతకాలి. అనాథల్లా మరుగుదొడ్డిలో కాపురం ఉంటున్నాం. కరుణించి ఇల్లు మంజూరు చేయమని అడిగినా ఎవరికీ మాపై దయకలగలేదు.

– వెంకటరమణ, నారాయణమ్మ, గట్టు హరిజనవాడ

ఫినిష్ చేస్తామని సీఎం బెదిరిస్తున్నారు..

- గుంటూరులో టీడీపీ రౌడీలు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నాపై దాడికి దిగారు
- సీఎం, ఆయన మనుషుల నుంచి బీజేపీ నేతలకు రక్షణ కల్పించండి
- డీజీపీకి బీజేపీ నేతల ఫిర్యాదు



డీజీపీ ఆఫీసు వద్ద బీజేపీ నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కాకినాడ, గుంటూరు మరికొన్ని ప్రాంతాల్లో సీఎంతో పాటు పలువురు టీడీపీ నేతలు తమ పార్టీ నేతలను ఫినిష్ చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని, తమ శ్రేణులకు తగిన రక్షణ కల్పించాలని డీజీపీ ఆర్పీ ఠాకుర్‌ను బీజేపీ నేతలు కోరారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తురగా నాగభూషణం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యామ్‌కిషోర్‌తో పాటు పలువురు రాష్ట్ర నాయకులు మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో మంగళవారం ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4వ తేదీన కాకినాడ జన్మభూమి సభకు వచ్చిన సీఎంను ప్రజల సమస్యలపై ప్రశ్నించిన స్థానిక బీజేపీ నాయకులు, మహిళా కార్పొరేటర్‌ను బెదిరించారని పేర్కొన్నారు. 'జాగ్రత్తగా ఉండండి లేనిపోని ప్రాబ్లమ్స్ పెట్టుకోవద్దు, పెట్టుకుంటే ఫినిష్ అయిపోతారు' అంటూ సీఎం నేరుగా బెదిరించారని ఫిర్యాదులో బీజేపీ నేతలు వివరించారు. రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19 భావప్రకటన స్వేచ్ఛను కాలరాసేలా సీఎం వ్యవహరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులో టీడీపీ అండతో రౌడీలు, గుండాలు తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఇంటిపై దాడి చేసి దౌర్జన్యం చేశారన్నారు. స్థానికులు ఆ రౌడీలను ప్రతిఘటించి కన్నాను కాపాడారని వారు వివరించారు. ఈ ఘటనతో రాజ్యాంగం ప్రసాదించిన ఆర్టికల్ 21 ప్రకారం మనిషి జీవించే స్వేచ్ఛను హరించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిస్తున్నట్టు ఉందని వారు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన మనుషులు కలిసి రాష్ట్రంలోనీ బీజేపీ కీలక నేతలపై భౌతిక దాడులతో పాటు మట్టుబెట్టే చర్యలకు ఊతమిస్తున్నట్టు ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జరిగిన ఘటనలపై పోలీసు శాఖ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు తమ పార్టీ నేతలకు రక్షణ కల్పించాలని వారు కోరారు. డీజీపీ కర్నూలు క్యాంపునకు వెళ్లడంతో ఆయన కార్యాలయంలోని అధికారులకు ఈ ఫిర్యాదును అందజేశారు.

రాహుల్‌గాంధీతో చంద్రబాబు భేటీ



రాహుల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న చంద్రబాబు

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న టీడీపీ అధినేత.. రాహుల్‌ను ఆయన నివాసంలో కలిశారు. దాదాపు గంటపాటు వారిద్దరి భేటీ కొనసాగింది. రాబోయే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో కలసికట్టుగా ముందుకు పోవడంపై రాహుల్‌తో చంద్రబాబు చర్చించినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కలసి పోటీ చేసే అంశం కూడా వారిమధ్య చర్చకు వచ్చినట్టు సమాచారం. మరోవైపు కాంగ్రెస్‌ను, ఇతర పార్టీలను పరిగణనలోకి తీసుకోకుండా సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీలు పొత్తు పెట్టుకున్న అంశం చంద్రబాబు, రాహుల్‌ల భేటీలో చర్చకొచ్చినట్టు ఆ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ పార్టీని పక్కనపెట్టే ఉద్దేశంతోనే అఖిలేష్, మాయావతిలు ఈ పొత్తు కుదుర్చుకున్నారన్న భావన ఈ సందర్భంగా వ్యక్తమైనట్టు సమాచారం. బీజేపీకి వ్యతిరేకంగా కలిసి వచ్చే పార్టీలను ఏకం చేయాలనే లక్ష్యంతో జాతీయ స్థాయిలో కృషి చేస్తున్నట్టు చంద్రబాబు చెప్పుకుంటున్న తరుణంలోనే యూపీలో ఎస్పీ, బీఎస్పీలు తాముగా పొత్తు కుదుర్చుకోవడం, ఈ విషయంలో కాంగ్రెస్‌ను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం. కాగా, జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక శక్తులను కూడగట్టడంలో భాగంగా కోల్‌కతాలో ఈ నెల 19వ తేదీన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తలపెట్టిన ర్యాలీపైనా రాహుల్, చంద్రబాబుల మధ్య చర్చ జరిగింది. ఈ భేటీ అనంతరం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో చంద్రబాబును ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కలిశారు. ఆ తర్వాత ఎన్‌సీపీ నేత శరద్ పవార్‌ను, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లాలను చంద్రబాబు కలిశారు. శరద్ పవార్‌తో సమావేశానంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఈ నెల 19న కోల్‌కతాలో జరిగే ర్యాలీకి హాజరు కావాలని తాము నిర్ణయించినట్టు తెలిపారు. ర్యాలీకి వివిధ పార్టీల నేతలు హాజరవుతారని, ఆ సందర్భంగా అందరమూ కలసి జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక శక్తులను కూడగట్టడంపై ఏ విధంగా ముందుకు పోవాలనేదానిపై తదుపరి కార్యాచరణను రూపొందిస్తామని ఆయన చెప్పారు. యూపీలో కాంగ్రెస్‌ను పరిగణనలోకి తీసుకోకుండా అఖిలేష్, మాయావతిలు పొత్తు కుదుర్చుకోవడంపై ఈ సందర్భంగా చంద్రబాబును మీడియా ప్రశ్నించగా.. రాష్ట్రాల స్థాయిలో ఆయా పార్టీలు తమ అవసరాలకు అనుగుణంగా పోటీ చేసుకుంటాయని, కానీ జాతీయ స్థాయిలో కలసి పనిచేసేలా తాము ప్రయత్నిస్తామని ఆయన బదులిచ్చారు.

ఎన్నికల ముందు 'రాజధాని' సినిమా

అమరావతి భవనాల సెట్టింగ్‌లతో వెల్‌కమ్ గ్యాలరీ

- రేపు నిర్మాణం ప్రారంభించనున్న సింగపూర్ మంత్రి ఈశ్వరన్, సీఎం చంద్రబాబు
- వెల్‌కమ్ గ్యాలరీ నిర్మాణానికి రూ.44.50 కోట్లు
- కన్సల్టెన్సీ ఫీజు కింద ప్రైవేట్ సంస్థకు రూ.42.48 లక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర నూతన రాజధాని నిర్మాణం పేరుతో ఇన్నాళ్లూ తాత్కాలిక నిర్మాణాలతో కాలక్షేపం చేసిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికల ముందు మరో డ్రామాకు తెరతీసింది. ఇందుకు ఇటీవల సింగపూర్‌లో రిహార్సల్స్ చేశారు. స్టార్టప్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పేరిట సింగపూర్ ప్రైవేట్ కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం కారుచౌకగా 1,691 ఎకరాలను రాసిచ్చేసిన సంగతి తెలిసిందే. ఆ భూమిలో నాలుగున్నరేళ్లుగా ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టలేదు. తాజాగా స్టార్టప్ ఏరియా ప్రాజెక్టులో భాగంగా ఎన్నికల ముందు ప్రజలను కనికట్టు చేసే ఎత్తుగడ ప్రారంభిస్తున్నారు.

ప్రజల్లో భ్రమలు కల్పించడమే లక్ష్యం

అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో వెల్‌కమ్ గ్యాలరీ అంటూ కొత్త ఎగ్జిబిషన్‌ను తెరపైకి తెచ్చారు. ఈ వెల్‌కమ్ గ్యాలరీ నిర్మాణానికి సింగపూర్ మంత్రి ఈశ్వరన్, ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం శ్రీకారం చుట్టనున్నారు. వెల్‌కమ్ గ్యాలరీ అంటే సెట్టింగ్‌లతో రాజధాని ఊహాచిత్రాన్ని చూపించడమే తప్ప మరొకటి కాదని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఎన్నికల ముందు మూడు నెలల్లోగా ఈ సెట్టింగ్‌లతో కూడిన రాజధాని ఊహాచిత్రాన్ని రూపొందించాలని నిర్ణయించారు. దీనిద్వారా రాజధానిలో ఏదో అద్భుతం జరగబోతోందని ప్రజల్లో భ్రమలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని అధికారులు అంటున్నారు. రాజధానిలో ప్రభుత్వ భవనాల బొమ్మలు, చిత్రాలను వెల్‌కమ్ గ్యాలరీలో ప్రదర్శించనున్నారు. రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులను గాలికొదిలేసిన ప్రభుత్వం ఆ భూములతో వ్యాపారం చేసుకోవడంపై అంతులేని శ్రద్ధ చూపుతుండడం గమనార్హం. రెండు హెక్టార్లలో 4,000 చదరపు మీటర్లలో వెల్‌కమ్ గ్యాలరీని నిర్మించనున్నారు. ఇందుకోసం ఇటీవల సింగపూర్‌లో జరిగిన అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సమావేశంలో కన్సల్టెన్సీని ఎంపిక చేశారు. గ్యాలరీ డిజైన్ రూపకల్పన కోసం వీటీపీ కాస్ట్ అడ్వయిజరీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను ఎంపిక చేశారు. కన్సల్టెన్సీ ఫీజుగా ప్రాజెక్టు వ్యయంలో 0.95 శాతం ఇవ్వాలని నిర్ణయించారు. అంటే కన్సల్టెన్సీ ఫీజు కింద రూ.42.48 లక్షలు ఇస్తారు. వెల్‌కమ్ గ్యాలరీ సెట్టింగ్‌ల నిర్మాణ వ్యయం రూ.44.50 కోట్లు అవుతుందని అంచనా వేశారు.

రేపే సంయుక్త అమలు స్టీరింగ్ కమిటీ భేటీ

సింగపూర్ మంత్రి ఈశ్వరన్, చంద్రబాబు, ఇతర అధికారుల నాలుగో సంయుక్త అమలు స్టీరింగ్ కమిటీ సమావేశం గురువారం సచివాలయంలో జరగనుంది. ఏపీ–సింగపూర్ మధ్య బిజినెస్ వ్యవహారాలతోపాటు ఇన్నొవేషన్ కారిడార్, సంయుక్త ఆర్థిక ప్రణాళిక, లాజిస్టిక్ అండ్ టూరిజం రంగం, మేనేజింగ్ పబ్లిక్ ఫీడ్బ్యాక్, ఎయిర్ కనెక్టివిటీ, సింగపూర్ విద్యార్థులు అమరావతికి రావడం, ఏపీ విద్యార్థుల సింగపూర్ పర్యటన పురోగతి నివేదికలపై చర్చించనున్నారు.

జగన్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడిని అప్పగించండి

- విశాఖ పోలీసుల విచారణ ఫైళ్లను ఇప్పించండి
- కోర్టులో మెమో దాఖలు చేసిన ఎన్‌ఐఏ

సాక్షి ప్రతినిధి విశాఖపట్నం/ విశాఖ లీగల్: తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయస్థాయిలో కలకలం సృష్టించిన రాష్ట్ర ప్రతిపక్షనేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు మంగళవారం కీలక మలుపు తిరిగింది. ఇటీవల ఆ కేసుని కేంద్ర హోం శాఖ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)కి అప్పగించిన సంగతి తెలిసిందే. వెంటనే రంగంలోకి దిగిన ఎన్‌ఐఏ అధికారులు విశాఖ చేరుకుని విచారణ మొదలుపెట్టారు. సోమవారం నిందితుడు శ్రీనివాసరావు బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగిన సమయంలో విశాఖ పోలీసులు ఎన్‌ఐఏ అధికారులకు రికార్డులు ఇవ్వడానికి నిరాకరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మంగళవారం ఎన్‌ఐఏ అధికారులు విజయవాడలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీఆర్‌పీసీ సెక్షన్ 41 (డి) ప్రకారం నిందితుడిని తమకు అప్పగించాలని, అలాగే స్థానిక పోలీసులు ఇప్పటివరకూ చేపట్టిన విచారణకు సంబంధించిన అన్ని ఫైళ్లు తమకు అప్పగించాలని న్యాయస్థానాన్ని కోరారు. ప్రస్తుతం ఈ పిటిషన్ న్యాయస్థానంలో విచారణలో ఉంది. ఇలా ఉండగా విశాఖ పోలీసులు, ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు సహకరించకపోవడంతో ఇప్పటికే ఎన్‌ఐఏ అధికారులు విజయవాడలోని ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టులో ఒక పిటిషన్ వేశారు.

జగన్ కేసు సంబంధిత రికార్డులను పంపండి

సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ)కు బదిలీ అయినందున.. ఈ కేసుకు సంబంధించిన రికార్డులన్నింటిని తమకు పంపాలని విశాఖపట్నం 6వ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి (ఎంఎస్‌జె) కోర్టుని విజయవాడలోని ఎన్‌ఐఏ కోర్టు కోరింది. ఈ మేరకు ఎన్‌ఐఏ కోర్టు జడ్జి పార్థసారథి సోమవారం విశాఖపట్నం 6వ ఎంఎస్‌జె కోర్టుకి లిఖిత పూర్వక మెమో పంపారు. జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన జె.శ్రీనివాసరావుపై ఎయిర్ పోర్ట్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఎన్ ఐఏ కేసుల విచారణకు ప్రతీ రాష్ట్రంలో ఓ ప్రత్యేక కోర్టు ఉంటుంది. ఏపీలో విజయవాడలో ఆ ప్రత్యేక కోర్టు ఉంది. ఎన్‌ఐఏ నమోదు చేసిన కేసుపై ఈ కోర్టు విచారణ జరుపుతుంది. ఈ నేపథ్యంలోనే ఎన్‌ఐఏ కోర్టు జడ్జి విశాఖ కోర్టుని రికార్డులు పంపాలని కోరారు. విశాఖ కోర్టు నుంచి రికార్డ్స్ రాగానే వాటిని ఎన్‌ఐఏ అధికారులు ప్రత్యేక కోర్టు నుంచి తీసుకుంటారు.

ఇకపై కేసు విచారణ విజయవాడలోనే

విశాఖపట్నంలోని 7వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఉన్న కేసు విజయవాడకు బదిలీ అయింది. ఈ మేరకు విజయవాడలోని ఎన్‌ఐఏ ప్రత్యేక న్యాయస్థానం, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి విశాఖలోని 7వ ఎంఎంసీ కోర్టుకు ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలు విశాఖలోని కోర్టుకు మంగళవారం అందాయి. దీంతో ఇకపై కేసు విచారణ విజయవాడలో జరుగనుంది.

విద్యుత్ చార్జీలు తగ్గిస్తేనే ప్రజలకు సంతోషం

- దీర్ఘకాలిక పీపీఏలను సమీక్షించాలి
- ఏపీఈఆర్సీ అభిప్రాయ సేకరణలో విజ్ఞప్తులు
- విద్యుత్ చార్జీలు పెంచొద్దని సర్కారు నిర్ణయం



సాక్షి, అమరావతి: ఎన్నికల ముంగిట్లో 2019–20 ఆర్థిక ఏడాదికి విద్యుత్ టారిఫ్‌లను పెంచకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంగళవారం ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)కి ఇంధన శాఖ నివేదికను అందజేసింది. సగటు విద్యుత్ సరఫరా వ్యయం పెరిగినప్పటికీ చార్జీలను పెంచకుండా 24 గంటలూ నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించినట్లు ఇందన శాఖ సలహాదారు కె.రంగనాథం తెలిపారు. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్ అధ్యక్షతన 2019–20 ఆర్థిక ఏడాదికి విద్యుత్ టారిఫ్‌లపై ప్రజాభిప్రాయ సేకరణ మంగళవారం విజయవాడలో జరిగింది. దేశవ్యాప్తంగా మిగులు విద్యుత్ ఉందని, రాష్ట్రంలో కరెంటు ధరలు తగ్గించాల్సి పోయి పెంచడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. ఇది ఎన్నికల ఏడాది కాబట్టి చార్జీలను పెంచడం లేదని, ఎన్నికల తర్వాత ప్రజల నుంచి రూ.8,963 కోట్ల లోటును వసూలు చేయకుండా ప్రభుత్వమే సమకూర్చేలా ఏపీఈఆర్సీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలను తగ్గిస్తేనే ప్రజలకు నిజమైన సంతోషమన్నారు. అధిక వడ్డీరేటుకు చేసుకున్న దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను(పీపీఏ) సమీక్షించి, తగ్గించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు.

ఇదే చివరి సమావేశం: భవానీ ప్రసాద్
ఏపీఈఆర్సీ చైర్మన్‌గా తన ఐదేళ్ల కాల పరిమితి త్వరలో ముగియనుండటంతో ఇదే తన చివరి సమావేశమని జస్టిస్ భవానీ ప్రసాద్ తెలిపారు. డిస్కంల ఆర్థిక పరిస్థితి, ఇంధన శాఖ ఇచ్చిన నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని, దీనిఆధారంగా ప్రభుత్వం టారిఫ్‌లపై నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. గతేడాది రూ.6,000 కోట్లకు పైగా లోటును ప్రభుత్వమే భరించి చార్జీలను పెంచలేదు కాబట్టి ఈ ఏడాది కూడా చార్జీలను పెంచదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జూన్ నాటికి ఏపీఈఆర్సీ అమరావతిలో ఏర్పాటవుతుందన్నారు.

మోదీ అన్ని సామాజికవర్గాలకూ న్యాయం చేస్తున్నారు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ



రైలుపేట(గుంటూరు): నరేంద్ర మోదీ 2014లో ప్రధాని అయ్యాక అనేక కొత్త నిర్ణయాలతో అన్ని సామాజిక వర్గాలకూ న్యాయం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గుంటూరు కన్నావారితోటలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాల్లో కూడా పేదలు ఉన్నారని, అనేకమంది అగ్రకుల విద్యార్థులు నిరుద్యోగులుగా ఉన్నారని వెల్లడించారు. మోదీ తీసుకున్న అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ నిర్ణయంతో అగ్రవర్ణ ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచిపోతారని చెప్పారు. మానసిక రోగి చంద్రబాబుకు ప్రధాని తీసుకున్న నిర్ణయంతో మైండ్ బ్లాక్ అయిందన్నారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ అనుభవం దోచుకోవటం, దాచుకోవటమేనని విమర్శించారు. పోలవరంలో నాణ్యతను బాబు గాలికొదిలేశారన్నారు. కాంట్రాక్టర్ చేసిన పనికి ముఖ్యమంత్రి చంకలు గుద్దు కుంటున్నారని ఎద్దేవా చేశారు. పక్క వాళ్ల గొప్పతనాన్ని తన గొప్పతనంగా చెప్పుకోవటం చంద్రబాబుకు అలవాటుగా మారిందని అన్నారు. గుంటూరు జిల్లాలో తాను మంత్రిగా ఉన్న సమయంలో చేసిన పనులకే చంద్రబాబు ఇప్పుడు ప్రారంభోత్సవాలు చేస్తున్నారన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తురగా నాగభూషణం, మైనార్టీ మోర్చ జాతీయ కార్యదర్శి షేక్ బాజి, మీడియా సెల్ రాష్ట్ర కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్, గుడివాడ అంజిబాబు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 20న ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా

ఎన్నికల అధికారి ఆర్పీ సిసోడియా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఫిబ్రవరి 20వ తేదీన ప్రచురించనున్నట్టు ఎన్నికల అధికారి ఆర్పీ సిసోడియా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో శ్రీకాకుళం- విజయనగరం- విశాఖపట్నం జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం, ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఓటర్ల జాబితా ప్రచురణ తేదీని పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన డ్రాఫ్ట్ నోటిఫికేషన్, ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, ఫిబ్రవరి 17వ తేదీన అభ్యంతరాలను పరిష్కరించి, ఫిబ్రవరి 20న ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నట్టు సిసోడియా వెల్లడించారు.

లైట్ ఆటో కాంపోనెంట్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు లైట్ ఆటో కంపోనెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా సమక్షంలో లైట్ ఆటో కంపోనెంట్ ప్రయివేట్ లిమిటెడ్ ఎండీ బాల ఆనంద్ జాలాది, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ సీఈవో జాస్తి కృష్ణకిశోర్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. వాహనాల విడిభాగాలను తయారు చేసే ఈ సంస్థ చిత్తూరు లేదా నెల్లూరు జిల్లాలో రూ. 300 కోట్ల పెట్టుబడి అంచనాతో యూనిట్ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది.

శ్వేతపత్రాల్లో అవాస్తవాలుంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రాల్లో అవాస్తవాలు ఉంటే పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేయవచ్చని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు అన్నారు. వెలగపూడి తాత్కాలిక సచివాలయంలోని మీడియా బ్లాక్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ శ్వేతపత్రాల్లోని నిజాలను దృష్టి మరల్చడానికే ప్రతిపక్షం అబద్ధపు పుస్తకాలు ముద్రిస్తోందన్నారు. రాష్ట్రంలో కేటాయిస్తున్న బడ్జెట్ కంటే ఎక్కువ అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారన్నారు. జయప్రకాశ్ నారాయణ ప్రధాన కార్యదర్శిగా ఏర్పాటైన ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ విడుదల చేసిన నివేదిక పునర్విభజన చట్టం ప్రకారం ఏపీకి రూ.85 వేల కోట్ల వరకూ చెల్లించాల్సి ఉందని తెలిపిందన్నారు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టం–సంబంధిత హామీల అమలుపై గత నెల 23న విడుదల చేసిన శ్వేతపత్రంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఏపీకి రూ.90 వేల కోట్లు రావాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందన్నారు.

గ్రూప్- 1 ప్రిలిమినరీ పరీక్షను వాయిదా వేయాలి

ఏపీపీఎస్సీ చైర్మన్‌కు అభ్యర్థుల వినతి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఇటీవల ప్రకటించిన గ్రూప్– 1 పోస్టుల భర్తీకి సంబంధించి ప్రిలిమినరీ పరీక్షకు సమయం చాలా తక్కువగా ఇచ్చారని, కొంత వ్యవధిని పెంచేలా దీన్ని వాయిదా వేయాలని అభ్యర్థులు ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్‌ను కోరారు. ప్రిలిమినరీ పరీక్షను మార్చి 10న నిర్వహించనున్నట్లు కమిషన్ ప్రకటించిందన్నారు. యూపీఎస్సీ విధానాల మేరకు అంటూ కమిషన్ ఇటీవల పాఠ్య ప్రణాళికల్లో పలు మార్పులు చేసిందని, ఇందుకు రిఫరెన్స్ పుస్తకాలు ప్రకటించలేదని వారు ఉదయభాస్కర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రిలిమ్స్‌లో గతంలో మాదిరిగా కాకుండా 1: 12 లేదా 1: 15 చొప్పున అభ్యర్థులను ఎంపికచేసేలా మార్పులు చేశారని, దీంతో మరింత శ్రమపడాల్సి ఉంటుందన్నారు. గ్రూప్–2 ప్రిలిమ్స్‌కు 120 నుంచి 150 రోజుల సమయం ఇచ్చి గ్రూప్- 1కు కేవలం 68 రోజులే ఇవ్వడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. పరీక్షను వాయిదా వేసి 120 రోజుల సమయాన్ని కేటాయించాలని కోరారు.

రూ. 1.80 లక్షలకు బదులు రూ. 18 లక్షలు చెల్లింపు

జీపీఎఫ్ సిబ్బంది నిర్లక్ష్యం బట్టబయలు

మచిలీపట్నంటౌన్: ఓ ఉద్యోగికి ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపులో ఉద్యోగుల నిర్లక్ష్యం బట్టబయలైంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ఎయిడ్స్ అండ్ లెప్రసీ విభాగ సిబ్బంది నిర్వాకంతో పెద్ద పొరపాటు జరిగింది. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో డ్రైవర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం హెల్త్ అసిస్టెంట్‌గా శిక్షణ పొందేందుకు విశాఖలో ఉంటున్న భట్రాజు సూరిబాబు జీపీఎఫ్ రుణం కోసం 15 రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. ఇతనికి రూ.1.80 లక్షలు జీపీఎఫ్ రుణం మంజూరైంది. కార్యాలయానికి చెందిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అతని ఖాతాలో ఈ నెల 2న ఏకంగా రూ.18 లక్షలు జమయ్యాయి. ఇంత మొత్తం జమ కావడాన్ని చూసి సూరిబాబు ఆశ్చర్యానికి గురయ్యాడు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న సందర్భంలో సంబంధిత ఉద్యోగులు సూరిబాబుకు మంగళవారం ఫోన్ చేశారు. రూ.1,80,000 లకు రూ.18,00,000లుగా ఒక సున్న ఎక్కువ పడిందని, అందువల్ల పొరపాటు జరిగిందని, మొత్తాన్ని తిరిగి తీసుకురావాలని ఫోన్‌లో కార్యాలయ సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు కోరినట్లు సూరిబాబు 'సాక్షి'కి వివరించారు.

అంగన్‌వాడీలో కలెక్టర్ కుమార్తె

తమిళనాడులోని కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న గీతాంజలి



సహ విద్యార్థులతో చదువుతున్న కలెక్టర్ కుమార్తె గీతాంజలి

టీ.నగర్ (చెన్నై): తమిళనాడులోని తిరునెల్వేలి కలెక్టర్ ప్రభాకర్ సతీష్ కుమార్తె అంగన్‌వాడీ కేంద్రంలో విద్యనభ్యసిస్తోంది. పాళై సాయుధదళ మైదానం సమీపంలోని ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రంలో గీతాంజలిని (3) చేర్పించారు. చిన్నారి సహ విద్యార్థులతో నేలపై కూర్చుని చదువుకుంటోంది. పౌష్టికాహార శాఖ జిల్లా ప్రాజెక్టు అధికారి జయసూర్య మాట్లాడుతూ.. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో కలెక్టర్ కుమార్తె గీతాంజలితోపాటు 20 మంది విద్యార్థులకు బోధిస్తున్నట్లు తెలిపారు.

- రెవెన్యూ శాఖలో పని చేస్తున్న పార్ట్‌టైమ్ గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్‌వో) గౌరవ వేతనం రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెరిగింది. వీరినే పార్ట్‌టైమ్ సెక్రటరీలు అని అంటారు.

ప్రజా సంకల్ప యాత్ర
340వ రోజు
ఇప్పటి వరకు నడిచిన దూరం
3,638.9 కిలో మీటర్లు
340వ రోజు నడిచిన దూరం
10.7 కిలో మీటర్లు

ప్రారంభం: ఉదయం 7.30 గంటలకు జగతి
ముగింపు: అగ్రహారం

ముఖ్యాంశాలు
- శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలంలోని జగతి, కవిటి మండల కేంద్రం, తుత్తుడిపుట్టుగ క్రాస్, బొర్రపుట్టుగ క్రాస్, చెండిపుట్టుగ, రాజపురం, అగ్రహారం గ్రామాల్లో ప్రజలతో మమేకం.

నేటి పాదయాత్ర షెడ్యూల్
ప్రారంభం: ఉ.7.30 గంటలకు అగ్రహారం

ముఖ్యాంశాలు
- ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలంలోని అగ్రహారం, కొత్త కొజ్జిరియా, ఇచ్ఛాపురం మండలం అయ్యవారిపేట, లొద్దపుట్టి, పేటూరు, ఇచ్ఛాపురం పట్టణంలోని ప్రజలతో మమేకం.
- పైలాన్ ఆవిష్కరణ
- ఇచ్ఛాపురం పట్టణ పరిధిలో మధ్యాహ్నం 1.30కి పాదయాత్ర ముగింపు బహిరంగ సభ

హాయ్.. అంకుల్



ప్రజాసంకల్ప యాత్ర మరిన్ని చిత్రాల కోసం QR code స్కాన్ చేయండి
ప్రజా సంకల్ప యాత్ర మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

ముగింపునకు ముందు రోజు
పోటెత్తిన జనం

పాదయాత్ర మార్గంలో బారులు తీరిన అక్కచెల్లెమ్మలు
- వైఎస్ జగన్‌తో సెల్ఫీల కోసం గంటల తరబడి నిరీక్షణ
- పాదయాత్ర దారి వెంట యువత ఆనందంతో కేరింతలు
- ప్రతిపక్ష నేతతో కష్టాలు చెప్పుకున్న వివిధ వర్గాల ప్రజలు
- మన ప్రభుత్వం రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తానని జగన్ భరోసా


కవిటిలో వైఎస్ జగన్ వెంట నడుస్తున్న జనవాహిని

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ముగింపు దశకు చేరుకున్న తరుణంలో జనాదరణ మరింతగా పెరిగింది. తండోపతండాలుగా ప్రజలు ఆయనకు సంఘీభావం పలకడానికి వస్తున్నారు. పాదయాత్ర 340వ రోజు మంగళవారం జగతి, తుత్తుడిపుట్టుగ క్రాస్, వరపుట్టుగ క్రాస్, రాజపురం మీదుగా.. అగ్రహారం వరకూ సాగింది.

చలిని సైతం లెక్క చేయక..

ఆయన వెళ్లే దారి పొడవునా గ్రామాల ప్రజలు, చుట్టు పక్కల నుంచి వచ్చే వారితో రోడ్లన్నీ బారులు తీరాయి. అక్కచెల్లెమ్మలు ఆయన కోసం గంటల తరబడి వేచి ఉండి సెల్ఫీల కోసం ఆరాటపడ్డారు. ఉదయం ఆయన శిబిరం నుంచి రోడ్డుపైకి రావడానికి రెండు గంటల ముందే జనం అక్కడికి చేరుకోవడం మొదలెట్టారు. ఉదయం పూట చలిగా ఉన్నా.. లెక్కచేయకుండా ప్రజలు తరలివచ్చారు. తన కోసం వచ్చిన వారిని వైఎస్ జగన్ ఆప్యాయంగా పలకరిస్తూ.. వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. పాదయాత్ర ముగింపునకు ఇక ఒక్క రోజే మిగిలి ఉండటంతో రాష్ట్రం నలుమూలల నుంచి ఆయన్ను కలుసుకోవడానికి వచ్చిన అభిమానులు, పార్టీ శ్రేణుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోయింది. బుధవారం జరగనున్న పాదయాత్ర ముగింపు సభకు వచ్చిన వారు సైతం ప్రతిపక్ష నేత వద్దకు రావడంతో పాదయాత్ర సాగుతున్న ప్రాంతం జనంతో కిక్కిరిసిపోయింది. వివిధ వర్గాల ప్రజలు తమ కష్టాలు చెప్పుకొన్నారు. మరికొందరు వినతిపత్రాలిచ్చారు. జన్మభూమి కమిటీల దాష్టీకాలపై ఫిర్యాదులు చేశారు. అందరి సమస్యలను ఓపికగా విన్న జగన్.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అంతా మంచి జరుగుతుందని వారికి భరోసా ఇచ్చారు.


కవిటిలో వైఎస్ జగన్‌తో కలిసి నడుస్తున్న ఆటో డ్రైవర్లు


అగ్రహారంలో ప్రతిపక్ష నేతతో కలిసి నడుస్తున్న కాపు సంఘం నేతలు


తుత్తుడిపుట్టుగ క్రాస్ వద్ద కష్టాలు చెప్పుకొన్న ఓ అవ్వకు ధైర్యం చెబుతున్న వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు
పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి/శ్రీకాకుళం అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ముగింపునకు ఒక రోజు ముందు మంగళవారం కూడా పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి.

గూడూరు మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, పలువురు టీడీపీ నేతల చేరిక


దేవసేనమ్మను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగన్

శ్రీపొట్టిశ్రీరాములునెల్లూరు జిల్లాలోని గూడూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ.. టీడీపీకి రాజీనామాచేసి వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆమెతో పాటు పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, మండల స్థాయి నేతలు భారీగా టీడీపీలోంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. పాదయాత్ర మధ్యాహ్న శిబిరం వద్ద వారంతా ప్రతిపక్ష నేతను కలుసుకుని పార్టీలో చేరాలన్న అభీష్టాన్ని వెల్లడించడంతో వారికి జగన్.. కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కౌన్సిలర్లు గోవిందు మస్తానమ్మ, బైనా భానుప్రకాష్, పోసిన రాజేశ్వరమ్మ, షేక్ షంషీర్, కోడిపర్తి కల్పన, బండి విజయమ్మ, నేరెళ్ల సుబ్బమ్మ, ముప్పాళ్ల లక్ష్మి, బాలిబోయిన రమేష్, మనపాటి రవీంద్రబాబు, గూడూడు మండల ఎంపీపీ పిట్టి రావమ్మ, దివిపాలెం సర్పంచ్ పిట్టి దేవసేన తదితరులున్నారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పాలుబోయిన అనిల్ కుమార్‌యాదవ్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, పార్టీ గూడూరు సమన్వయకర్త మేరిగ మురళీధర్, శీకిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు పలువురు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవసేనమ్మ, ఆమె అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరడంతో గూడూరు నియోజకవర్గంలో టీడీపీ సగం ఖాళీ అయినట్లేనని చెబుతున్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితేనే బడుగు, బలహీనవర్గాలకు మేలు జరుగుతుందని భావించి తామంతా పార్టీలో చేరినట్టు చైర్‌పర్సన్ దేవసేనమ్మ మీడియాతో చెప్పారు.

బుద్దా నాగేశ్వరరావు చేరిక.. వెంకన్నకు షాక్


నాగేశ్వరరావును పార్టీలోకి ఆహ్వానిస్తూ..

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సామినేని ఉదయభాను, విజయవాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త యలమంచిలి రవిల సంయుక్త ఆధ్వర్యంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బుద్దా నాగేశ్వరరావు మంగళవారం వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరారు. ప్రతిపక్ష నేత.. ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఆయన టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నకు స్వయానా సోదరుడు. జగన్ ప్రకటించిన సంక్షేమ పథకాలతో బీసీలకు మేలు జరుగుతుందని, బుద్దా వెంకన్న ఏనాడూ బీసీలను పట్టించుకోలేదని విమర్శించారు. వైఎస్ హయాంలో బీసీలకు జరిగిన మేళ్లను ఆయన గుర్తు చేశారు. బీసీలకు ప్రత్యేకంగా సబ్‌ప్లాన్‌ను రూపొందిస్తామని జగన్ హామీ ఇచ్చారని చెప్పారు.

వైఎస్సార్ సీపీలోకి మాజీ కార్పొరేటర్


చలపతిరావును పార్టీలోకి ఆహ్వానిస్తూ..

కృష్ణా జిల్లా విజయవాడ వెస్ట్ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాస్, పార్టీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ నేతలు బొత్స అప్పలనర్సయ్య, మల్లాది విష్ణుల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ వెస్ట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ యలకల చలపతిరావు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆయనను వైఎస్ జగన్ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చలపతిరావుతో పాటు కర్నాటి శివశంకర్, మద్ది నాగరాజు, చుక్కా పోలారెడ్డి, తాతా శ్రీను తదితరులున్నారు.

నా బిడ్డకు ప్రాణం పోసిన మిమ్మల్ని మరువలేమన్నా..

అన్నా.. నా బిడ్డ లోకేశ్‌నాగమణికంఠకు ప్రాణం పోసిన మీ మేలును జీవితాంతం మరవలేం.. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న నా ఏకైక కుమారుడికి బ్రెయిన్‌ట్యూమర్ రావడంతో తీవ్ర ఆవేదన చెందా. ఈ క్రమంలో పాదయాత్రగా వస్తున్న జగనన్నను కలిసి నా బిడ్డ సమస్యను వివరించగానే స్పందించిన రాజన్న బిడ్డ.. రూ.6 లక్షల విలువైన ఆపరేషన్‌ను తిరుపతి ఆస్పత్రిలో ఉచితంగా చేయించి నా బిడ్డకు పునర్జన్మ ప్రసాదించారు.
– వైఎస్ జగన్‌ను కలిసిన తర్వాత మాట్లాడుతున్న పి.వెంకటరాంబాబు, ఎస్.సీతాపురం, దెందులూరు, పశ్చిమగోదావరి జిల్లా



ప్రాణాలు పోతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు..

ఈ ప్రాంతంలో మత్స్య సంపద అధికంగా ఉన్నా తగిన్ని సౌకర్యాల్లేవు. దీంతో ఇతర ప్రాంతాలకు వ్యాపార, జీవనోపాధి కోసం వలసపోతున్నాం. అక్కడ మేం ప్రాణాలు కోల్పోతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇటీవల సోంపేట మండలం గొల్లగండి గ్రామానికి చెందిన మడ్డు మోహనరావు చెన్నైలో మరణించినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ సమస్యల పరిష్కారానికి మీరు చర్యలు తీసుకోండి. ఈ జిల్లాలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయించి మమ్మల్ని ఆదుకోండి.
– ఎం.వెంకటేష్, ఇస్కలపాడు, సోంపేట మండలం



కిడ్నీ రోగులకు మేలు చేయండన్నా..


అన్నా.. మా ప్రాంతంలో కిడ్నీ రోగులు అధికం. చిన్నా పెద్దా తేడా లేకుండా కిడ్నీ మహమ్మారికి బలైపోతున్నారు. ఈ రోగం ఎందుకొస్తుందో అర్థం కావడం లేదు. వైద్యానికి డబ్బుల్లేక ఎంతోమంది మరణిస్తున్నారు. గడిచిన రెండేళ్లలో దాదాపు 5 వేల మంది చనిపోయారు. మీరు అధికారంలోకొచ్చాక ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోండన్నా..
– బొర్ర శ్రావ్యశ్రీ,.. ఎమ్మెస్సీ విద్యార్థిని, బొర్రపుట్టుగ, ఇచ్ఛాపురం నియోజకవర్గం



రేపు తిరుమలకు వైఎస్ జగన్
- తిరుపతి నుంచి కాలినడకన తిరుమలకు
- శ్రీవారిని దర్శించుకోనున్న ప్రతిపక్ష నేత

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర బుధవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియనుంది. అక్కడ సభ అనంతరం సాయంత్రం 6 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి విజయనగరం రైల్వేస్టేషన్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి రైల్లో చిత్తూరు జిల్లా రేణిగుంటకు బయలుదేరుతారు. గురువారం ఉదయం రేణిగుంటకు చేరుకుంటారు. అక్కడి నుంచి తిరుపతిలోని పద్మావతి అతిథి గృహానికి చేరుకున్నాక మధ్యాహ్నం ఒంటి గంటకు కాలినకడన బయలుదేరి సాయంత్రం తిరుమలకు చేరుకుంటారు. సర్వదర్శనంలో భాగంగా శ్రీవారిని దర్శించుకుని.. రాత్రి తిరుమలలోనే బస చేస్తారు. శుక్రవారం ఉదయం తిరుమల నుంచి బయలుదేరి కడప మీదుగా మధ్యాహ్నం పులివెందులకు చేరుకుంటారు.

340వ రోజు
08-01-2019, మంగళవారం,
అగ్రహారం, శ్రీకాకుళం జిల్లా



ఉద్దానంలో దారుణ పరిస్థితిని మార్చాలన్న తపన లేని ప్రభుత్వాన్ని ఏమనాలి?

పాదయాత్ర చివరి అంకానికి చేరుకుంది. 'విజయ సంకల్పం' స్థూపం వైపు అడుగులు చేరువయ్యాయి.

పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరులో పాదయాత్ర చేసేటప్పుడు వెంకట రాంబాబు అనే ఆటో డ్రైవర్ కలిశాడు. ఆయన ఒక్కగానొక్క కొడుకు మణికంఠకు బ్రెయిన్ ట్యూమర్. ఆస్పత్రులకు వెళ్తే రూ.ఆరు లక్షలు అవుతుందన్నారు.. ఆరోగ్యశ్రీ వర్తించదన్నారు. ఆ తండ్రి నిస్సహాయత చూసి జాలేసింది. పిల్లాడికి వైద్యసాయం అందేలా చేశాను. ఆపరేషన్ పూర్తయి ఆ బిడ్డ ఆరోగ్యవంతుడయ్యాడు. ఈరోజు ఆ తండ్రి కొడుకును ఎత్తుకుని వచ్చి సంతోషాన్ని పంచుకుంటుంటే మనసంతా తృప్తితో నిండిపోయింది.

ఈరోజు కవిటి మండలంలో పాదయాత్ర సాగింది. దేశంలోనే అత్యధికంగా కిడ్నీ వ్యాధికి గురయ్యే ప్రాంతమిది. కాళ్లు, మొహం, కళ్ల వాపులతో నడవడానికి సత్తువ లేని ఎందరో కిడ్నీ వ్యాధిగ్రస్తులు కలిశారు. వారిలో నాలుగైదేళ్ల చిన్నారుల నుంచి పండు ముసలివారి వరకు ఉన్నారు. వారంతా నిరుపేదలైన వ్యవసాయ కూలీలు, మత్స్యకార కుటుంబాలవారే. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి వారిది. మందులు లేక, డాక్టర్లు అందుబాటులో లేక, డయాలసిస్ సేవలు సరిగా అందక, పింఛన్లు రాక, ఆదుకునేవారే లేక జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. శ్రీహరిపురం వద్ద కలిసిన ఆ విధివంచితుల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో దయనీయ గాథ. బుధియా అనే తాత ఒక కొబ్బరి కూలీ. కిడ్నీ వ్యాధిబారిన పడి ఏ పనీ చేయలేకపోతున్నాడు. అతని బిడ్డలు వలస కూలీలు. వేలకు వేలు ఖర్చు చేసి తండ్రికి చికిత్స చేయించలేని దుస్థితి వారిది. విధిరాత ఇంతేననుకుని, దేవుడిపై భారం వేసి ఇంటిపట్టునే ఉంటున్నానని ఆ తాత చెబుతుంటే గుండె బరువెక్కింది. బొడియా జమున కుటుంబ గాథ మరింత దయనీయం. ఒకే కుటుంబంలో కిడ్నీ వ్యాధితో నలుగురిని కోల్పోయిన విషాదం. ఒక్కొక్కరి వ్యథ వింటుంటే మనసు కలత చెందింది. ఒకప్పుడు ఉద్యానవనంలా వెలుగొందిన ఉద్దానాన్ని కిడ్నీ వ్యాధి కబళించి వేస్తోందా అనిపిస్తోంది. ఇక్కడివారిని పెళ్లి చేసుకోవడానికి బయట ప్రాంతాలవారు వెనుకంజ వేస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ పనిచేయడానికి ఉద్యోగులు కూడా ముందుకు రావడం లేదట. వలస వెళ్లిపోయినవారు, ఈ ప్రాంతాన్ని వదిలేసి బయట ప్రాంతాల్లో స్థిరపడ్డవారు ఎందరో ఉన్నారట. ఉద్దానం ఇంత దారుణంగా ఉన్నప్పటికీ ఈ పరిస్థితిని మార్చాలన్న తపన కాస్తయినా లేని ప్రభుత్వాన్ని ఏమనాలి?

చుట్టా దున్నా అనే అన్న కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. 'ఈ ప్రభుత్వం మంచినీళ్లు ఇవ్వడం లేదు కానీ వద్దన్నా మద్యాన్ని మాత్రం సరఫరా చేస్తోంది. అంతంతమాత్రంగా ఉన్న కిడ్నీలు మద్యం దెబ్బకు పూర్తిగా పాడయ్యాయి' అంటూ ఆయన భార్య చుట్టా లక్ష్మి కన్నీటిపర్యంతమైంది. ప్రజల ప్రాణాలు పోతున్నా కనీస వైద్య సాయం అందించడంలో లేని శ్రద్ధ మద్యం వ్యాపారంపై ఉండటం దౌర్భాగ్యం. ప్రజల ఆరోగ్యం పాడైనా పర్లేదు.. ఆదాయం వస్తే చాలనుకునే పాలనలో ఉద్దానం వెలుగులు ఎండమావులేనేమో!

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. మీరు ఆస్పత్రులకు బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రంలో అసలే అంతంతమాత్రంగా ఉన్న ఆరోగ్యశ్రీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ సేవలే లేనప్పుడు ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షలకు పెంచుతున్నామని, ప్రైవేటు ఆస్పత్రుల్లో కాన్పులకు కూడా ఆరోగ్యశ్రీ వర్తింపచేస్తున్నామని పెద్దపెద్ద ప్రకటనలివ్వడం ప్రజలను దారుణంగా వంచించడం కాదా?

వై.ఎస్. జగన్.

అడుగులన్నీ.. ఆవైపే

▶ మొదటి పేజీ తరువాయి

లెక్కే లేదు. ఆఖరి ఘట్టం ఎలా ఉంటుందోనన్న ఉత్కంఠ వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డితో పాటు ఆయన కుమార్తె షర్మిల కూడా తమ పాదయాత్రలను ఇక్కడే ముగించారు. అక్కడికి వస్తున్న ప్రతి ఒక్కరూ ఆ మధుర స్మృతులను నెమరేసుకుంటున్నారు. వైఎస్సార్, షర్మిల పాదయాత్ర స్థూపాలను ప్రత్యేకంగా సందర్శిస్తున్నారు. ఆ సన్నివేశాలను ప్రత్యక్షంగా చూసిన స్థానికులు తమ ఊరికి వచ్చేవారికి ఆసక్తిగా చెబుతున్నారు.

అపూర్వ ఘట్టం కోసం నిరీక్షణ...

ఇచ్ఛాపురంలో గట్టిగా వంద మందికి సరిపడా వసతి దొరకడం కూడా కష్టమే. వెళ్తే ఒడిశాలోని బరంపురం వెళ్లాలి. లేదంటే శ్రీకాకుళంలో బస చేయాలి. కానీ పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి హాజరయ్యే వారు ఇవేమీ పట్టించుకోవడం లేదు. సాయంత్రం ఆరు గంటలకే వణుకు పుట్టించే చలి వాతావరణం ఉన్నా వీధుల్లోనే సంచరిస్తున్నారు. ఒక్క రోజు ఓపిక పడితే ఏమవుతుంది...? విజయనగరం నుంచి వచ్చిన కాంతారావు, మల్లికార్జున మనోగత ఇదీ. ముగింపు రోజుకు ముందే వారిద్దరూ ఇచ్ఛాపురం చేరుకున్నారు. ఆఖరు రోజు రద్దీలో రావడం కష్టమని భావించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన తిలక్, శ్యామల, సంధ్యారాణి, కృష్ణప్రసాద్‌కు ఎక్కడా వసతి దొరకలేదు. బరంపురంలో లాడ్జీలన్నీ ముందే బుక్ కావడంతో తాము వచ్చిన వాహనంలోనే ఉంటామని చెప్పారు. పాదయాత్ర ముగింపు సన్నివేశం తమకో మరపురాని తీపి గుర్తు అని పేర్కొన్నారు. ఇక ద్విచక్ర వాహనాలపై వచ్చే వారు రాత్రి పొద్దుపోయే వరకూ ఇచ్ఛాపురం వీధుల్లోనే గడుపుతున్నారు. కాసేపు పైలాన్ దగ్గర.. ఇంకాసేపు వైఎస్సార్ పాదయాత్ర స్థూపం వద్ద.. ఆ తర్వాత షర్మిల పాదయాత్ర స్థూపం దగ్గర...!

ఉత్సాహంగా యువత..

పాదయాత్రతో జగన్ జన హృదయాలను గెలుచుకున్నారనేది అందరి మాట. ఇచ్ఛాపురానికి భారీగా చేరుకుంటున్న యువత రాష్ట్రంలో నవశకం మొదలు కానుందని చెబుతున్నారు. విజయవాడకు చెందిన కల్పన బెంగళూరులో ఎంటెక్ చేస్తోంది. 'థ్రిల్‌గా ఉంది.. జగనన్న పాదయాత్ర రాజకీయాలనే మార్చబోతోందని మా ఫ్రెండ్స్ చెప్పుకుంటున్నారు. అందుకే వచ్చా. ఇక్కడ మా బాబాయి వాళ్లింట్లో దిగా. ఇదిగో ఈ సెల్‌ఫోన్‌లో అంతా చిత్రీకరించి.. మా వాళ్లందరికీ పంపుతా' అని అంటున్నప్పుడు ఆమె ముఖంలో ఉత్సాహం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఆమె ఒక్కరే కాదు.. పుణె నుంచి వచ్చిన విశ్వప్రతాప్.. ఢిల్లీలో చదువుతున్న ఏపీ విద్యార్థి రఘునందన్.. ఇలా యువత అంతా పాదయాత్ర ముగింపులో పాలుపంచుకోవాలని ఉవ్విళ్లూరుతోంది.

సెల్ఫీలు.. లైవ్‌లు

పన్నెండేళ్ల కొచ్చే పుష్కరాలు.. ఎప్పుడో వచ్చే జాతరలో జనం ఏ స్థాయిలో ఉత్సాహంగా కనిపిస్తారో.. అంతకన్నా రెట్టింపు సన్నివేశం ఇచ్ఛాపురంలో కనిపిస్తోంది. బైపాస్ రోడ్డు మీద నుంచే కనిపించే పాదయాత్ర పైలాన్‌ను వాహనాల్లోంచి చూస్తూ సంబరపడిపోతున్నారు. అంత దూరం నుంచే సెల్‌ఫోన్లు తీసి క్లిక్ మనిపిస్తున్నారు. ఇక దగ్గరకెళ్లి సెల్ఫీలు దిగేవాళ్లు లెక్కే లేదు. ఫొటోలను వెంటనే వాట్సాప్‌లో మిత్రులకు పంపుతున్నారు. ఇచ్ఛాపురంలో సంతోషాన్ని, ముగింపు ఉత్సవ సన్నాహాలను అనేక మంది లైవ్‌లో తమ సన్నిహితులు, మిత్రులకు చూపించడం అన్ని చోట్లా కనిపిస్తోంది.

తరలివస్తున్న శ్రేణులు...

వైఎస్సార్ సీపీకి చెందిన అగ్రనేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, ఇతర ముఖ్యనేతలు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు ఇప్పటికే పెద్ద ఎత్తున ఇచ్ఛాపురం చేరుకుంటున్నారు. పలు ప్రాంతాల నుంచి తరలి వస్తున్నారు.

నేటి కార్యక్రమం ఇలా..

ఇచ్ఛాపురం సమీపంలోని అగ్రహారం నుంచి వైఎస్ జగన్ బుధవారం చివరి రోజున తన పాదయాత్ర ప్రారంభిస్తారు. ఉదయం 11 గంటలకు లొద్దపుట్టి వద్ద మధ్యాహ్న భోజన విరామం శిబిరం వద్దకు చేరుకుంటారు. తరువాత మధ్యాహ్నం 1 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 1.15 గంటలకు ఇచ్ఛాపురంలోని పైలాన్ వద్దకు చేరుకుంటారు. అనంతరం పాత బస్టాండ్ వద్దకు కాలినడకన చేరుకుంటారు. 1.30 గంటలకు అక్కడ జరిగే భారీ బహిరంగ సభను ఉద్దేశించి జగన్ ప్రసంగిస్తారని పార్టీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురామ్ ఒక ప్రకటనలో తెలిపారు.

జన సంద్రం మధ్య ఎన్నికల సమరశంఖం పూరించనున్న జగన్

చరిత్ర సృష్టించిన పాదయాత్రతో జాతీయ స్థాయిలో అందరినీ ఆకట్టుకున్న వైఎస్ జగన్ ఇచ్ఛాపురం వేదికగా 2019 ఎన్నికల సమర శంఖారావాన్ని పూరించనున్నారు. ఇప్పటికే అందరినీ రాజకీయంగా, సామాజికంగా జాగృతం చేసిన వైఎస్ జగన్ ముగింపు సభలో... మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రానున్న రోజుల్లో ఎలా ఉండబోతోందో వివరిస్తూ ఇచ్ఛాపురం వేదికగా ఒక సందేశాన్ని రాష్ట్ర ప్రజలకు ఇవ్వనున్నారు. అధికార పక్షం దాష్టీకాలను అడ్డుకునేలా పార్టీ శ్రేణుల్లో స్ఫూర్తి నింపనున్నారు.

అద్భుతం.. ఆకర్షణీయం

- బాహుదా నదీతీరంలో విజయసంకల్ప స్థూపం
- సుదీర్ఘ పాదయాత్ర ముగింపు సందర్భంగా నేడు ఆవిష్కరించనున్న వైఎస్ జగన్
- 91 అడుగుల ఎత్తు, ఈఫిల్ టవర్ ఆకృతి
- పైన పార్లమెంటు తరహాలో వృత్తాకారంలో టూంబ్.. దానికి వైఎస్సార్‌సీపీ జెండా రంగులు
- టూంబ్‌పైన 10 అడుగుల ఎత్తులో పార్టీ పతాక రెపరెపలు
- దిగువున వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్ చిత్రాలు
- బేస్‌మెంట్ పైకి వెళ్లే 13 మెట్లపై 13 జిల్లాల పేర్లు



ఇచ్ఛాపురం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: దేశ రాజకీయాల్లోనే సరికొత్త చరిత్ర సృష్టించబోతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర పూర్తవుతున్న సందర్భంగా నిర్మించ తలపెట్టిన విజయసంకల్ప స్థూపం (పైలాన్) అత్యద్భుతంగా, ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. ఇచ్ఛాపురం బైపాస్ వద్ద బాహుదా నదీతీరంలో ఏర్పాటైన ఈ స్థూపం ఎప్పటికీ దర్శనీయ స్థలంగా ఉండేలా తీర్చిదిద్దారు. బుధవారం 341 రోజుల పాదయాత్ర పూర్తి చేయనున్న వైఎస్ జగన్ మధ్యాహ్నం 91 అడుగుల ఎత్తైన ఈ స్థూపాన్ని ఆవిష్కరించనున్నారు. ప్యారిస్‌లోని ఈఫిల్ టవర్‌ను తలపిస్తూ నాలుగు ఉక్కు స్తంభాలు కింది నుంచి విడిగా పైకి వెళ్లి పైన నాలుగూ కలిసేలా ఏర్పాటు చేసిన పైలాన్ కనులకు విందు చేస్తోంది. స్థూపం పై భాగాన పార్లమెంటు తరహాలో వృత్తాకారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా రంగులతో కూడిన ఒక టూంబ్‌ను ఏర్పాటు చేశారు. దానిపైన పది అడుగుల ఎత్తులో పార్టీ పతాకాన్ని రెపరెపలాడిస్తున్నారు. టూంబ్‌కు దిగువన నాలుగు దిక్కుల దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వివిధ భంగిమల్లో ఉన్న ఫొటోలను ఏర్పాటు చేశారు. ఆ దిగువన పాదయాత్రికుడు వైఎస్ జగన్ నడిచి వస్తున్న నిలువెత్తు చిత్రాలను ఉంచారు. పైలాన్ లోపలి భాగంలో చుట్టూ జగన్ తన పాదయాత్రలో ప్రజలను కలుసుకుంటూ వచ్చిన ఫొటోలను ఏర్పాటు చేశారు. స్థూపం బేస్‌మెంట్ పైకి ఎక్కేందుకు 13 మెట్లను ఏర్పాటు చేశారు. పాదయాత్రగా జగన్ నడచి వచ్చిన 13 జిల్లాల పేర్లను కింది నుంచి పైకి మెట్లపైన ఏర్పాటు చేశారు. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం దాకా జగన్ నడిచిన రూట్ మ్యాపును కూడా నిక్షిప్తం చేశారు. దిగువన చుట్టూ ఒక చిన్నపాటి లాన్ (పచ్చికబయలు) ఏర్పాటు చేశారు. ఇందులోనే ఓ స్తంభం పక్కనే స్థూపం ఆవిష్కరణకు సంబంధించిన శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఇక బయట చుట్టూ ప్రహరీ గోడపై ఓ వైపు ప్రజాసంకల్ప పాదయాత్ర 2017-2019 అని, మరోవైపు విజయసంకల్ప స్థూపం అని రాశారు.

జాతీయ రహదారికి, రైల్వే లైనుకు మధ్యలో...

ఒడిశా రాష్ట్ర సరిహద్దుల్లోకి ప్రవేశించడానికి సుమారు 30 కిలోమీటర్ల ముందు, శ్రీకాకుళం జిల్లా కేంద్రం నుంచి 130 కిలోమీటర్ల దూరంలో... ఏర్పాటైన ఈ పైలాన్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. 16వ నంబరు జాతీయ రహదారి పక్కనే నిర్మిస్తున్న పటిష్టమైన ఈ నిర్మాణానికి మరోవైపు హౌరా-చెన్నై రైల్వే లైను ఉంది. దీంతో అటు బస్సుల్లో , ఇటు రైళ్లలో ప్రయాణించే వారికి స్థూపం కనువిందు చేయనుంది. ఇడుపులపాయలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి ఇప్పటికే దర్శనీయ స్థలంగా మారింది. ఇప్పుడు వైఎస్ జగన్ విజయసంకల్ప స్థూపం కూడా అదే స్థాయిలో చరిత్రలో నిలుస్తుందని పార్టీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురామ్ తెలిపారు. తన సుదీర్ఘ పాదయాత్ర పొడవునా ప్రజలను కలుసుకున్నప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా విజయం చేకూరాలనే సంకల్పంతో వైఎస్ జగన్ ముందుకెళుతున్నారు కనుక, ఈ స్థూపానికి 'విజయసంకల్పం' అని పేరు పెట్టినట్లు రఘురామ్ వివరించారు.

తిరునాళ్ల వాతావరణం

ఈ పైలాన్.. సందర్శకుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాదయాత్ర పూర్తయ్యే రోజు దగ్గరపడిన కొద్దీ స్థూపం పనులు వేగంగా జరుగుతుండటం, ఆకర్షణీయంగా ఉండటంతో చూడ్డానికొచ్చేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వారం రోజుల నుంచైతే చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వస్తున్న వారు కొద్దిసేపు ఆగి స్థూపం చూసి వెళుతున్నారు. ఇక పార్టీ శ్రేణుల హడావుడి చెప్పనలవి కాని విధంగా ఉంది. ఉదయం నుంచీ రాత్రి పొద్దు పోయే దాకా తిరునాళ్ల వాతావరణమే కనిపిస్తోంది.

బెజవాడలో ముంబై ముఠా అరెస్టు

- 16 కేజీల బంగారు ఆభరణాలు స్వాధీనం
- బిల్లులు లేకుండా విక్రయించేందుకు యత్నం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, పరిశీలిస్తున్న నగర పోలీసు కమిషనర్ ద్వారకా తిరుమలరావు

సాక్షి, అమరావతి బ్యూరో: అక్రమ మార్గంలో బంగారాన్ని దిగుమతి చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు చెల్లించకుండా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ బంగారు దుకాణాలకు ఆభరణాలను చేరవేస్తున్న ముంబైకి చెందిన ఓ ముఠాను విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. రూ.5.05 కోట్ల విలువైన 16.617 కేజీల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ముంబైకి చెందిన జయేష్ జైన్, శిల్పేష్ జైన్ ప్రతి నెలా నగరానికి వచ్చి బంగారు ఆభరణాలు విక్రయించి వెళుతున్నారు. వీరి కదలికలపై పటిష్ట నిఘా పెట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం బీసెంట్‌రోడ్డు సమీపంలోని ఓ లాడ్జిలో వారు మకాం వేసినట్లుగా గుర్తించారు. లాడ్జిలో వారు విజయవాడకు చెందిన మనీష్ జైన్, పంకజ్ జైన్‌లకు బంగారు ఆభరణాలను విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్ కమిషనర్ ఏసీపీ రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది నిందితులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి వివరాలను విజయవాడ సిటీ పోలీసు వాట్సప్ నంబరు 7328909090కు సమాచారమిస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ ద్వారకా తిరుమలరావు చెప్పారు.

ఆదర్శ పాఠశాలలుగా ప్రభుత్వ పాఠశాలలు

రాష్ట్ర విద్యాశాఖ ఐటీ ఇన్‌చార్జ్ జేడీ నరసింహారావు



మాట్లాడుతున్న నరసింహారావు

పుట్టపర్తి అర్బన్: రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని ఓపెన్ స్కూల్స్ జేడీ, రాష్ట్ర విద్యాశాఖ ఐటీ ఇన్‌చార్జ్ నరసింహారావు తెలిపారు. మంగళవారం ఆయన అనంతపురం జిల్లా పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి మంగళకర ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌లో డీఈఓ జనార్దనాచార్యులు, ఎంఈఓ వెంకటరమణ నాయక్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 162 మోడల్ స్కూళ్లు ఉన్నాయని, త్వరలో వాటితో పాటు అన్ని సౌకర్యాలు, విద్యాభివృద్ధి చెందిన ఉన్నత పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టెక్నాలజీ వినియోగం ఎంత మేరకు జరుగుతోందో పరిశీలించడానికి జిల్లాల్లో వర్క్‌షాపులు నిర్వహించి 13 జిల్లాల ఐటీ నోడల్ ఆఫీసర్లతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఈ–హాజరు కోసం రాష్ట్రంలో 45వేలకు పైగా ట్యాబ్‌లు ఇచ్చామని, నెట్‌వర్క్ పని చేయని పాఠశాలలకు ప్రత్యేకమైన యాప్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

సంక్రాంతిలోపు జనసేన పార్టీ స్వల్పకాలిక కమిటీలు: పవన్

సాక్షి, అమరావతి: సంక్రాంతి పండుగలోపే పార్టీ స్వల్పకాలిక కమిటీలు వేసి బాధ్యతలు అప్పగిస్తామని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చెప్పారు. మంగళవారం విజయవాడ పార్టీ కార్యాలయంలో కర్నూలుజిల్లా కార్యకర్తలతో పవన్ సమావేశమయ్యారు. 175 స్థానాల్లో ఎంతమంది కొత్తవారికి అవకాశాలివ్వాలన్న అంశంపై తనకు అవగాహన ఉందన్నారు. 2019 ఎన్నికలు జనసేనకు మొదటి పోరాటమేనని, ఇది ఆఖరి పోరాటం కాదని చెప్పారు.

రైతన్నలపై నీటి పన్నుల మోత

- ఎకరానికి రూ.200 నుంచి రూ.1,000కి పెంపు
- వచ్చే ఖరీఫ్ నుంచే వసూలు
- చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు, చెరువుల కింద ఆయకట్టు కూడా పన్ను పరిధిలోకి..

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పుష్కలంగా ఉన్నప్పుడు కూడా ఆయకట్టుకు సాగు నీరందించడంలో విఫలమైన టీడీపీ ప్రభుత్వం తాజాగా నీటి పన్నును ఐదు రెట్లు పెంచేందుకు సన్నద్ధమైంది. ప్రస్తుతం ఒక పంటకు నీళ్లందిస్తే ఎకరానికి రూ.200 చొప్పున నీటి పన్నుగా వసూలు చేస్తున్నారు. వచ్చే ఖరీఫ్ నుంచి ఎకరానికి రూ.1,000 చొప్పున వసూలు చేయాలనే ప్రతిపాదనపై డిసెంబర్ 21న మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం భారీ ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టులో మాత్రమే నీటి పన్ను వసూలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఐడీసీ) పరిధిలోని ఎత్తిపోతల పథకాలు, చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు, చెరువుల కింద ఆయకట్టు రైతుల నుంచి నీటి పన్నును వసూలు చేయడం లేదు. కానీ, వచ్చే ఖరీఫ్ నుంచి భారీ నీటి పారుదల ప్రాజెక్టుల కింద ఆయకట్టుతోపాటు చిన్న, మధ్య తరహా, చెరువులు, ఏపీఎస్ఐడీసీ పరిధిలోని ఆయకట్టులో కూడా ఎకరానికి రూ.1,000 చొప్పున వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఏపీడబ్ల్యూఆర్‌డీసీ) పేరుతో బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకుంటున్న రుణాలను నీటి పన్నుల సొమ్ముతో తీర్చాలనే ప్రతిపాదనకు సీఎం నేతృత్వంలోని మంత్రివర్గం ఆమోదం తెలిపింది.



కమీషన్ల కోసం రైతుల రక్తం పీల్చేస్తారా?

ఎన్నికలు ముంచుకొస్తున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి ఇం'ధనం' సమకూర్చే యత్నాల్లో చంద్రబాబు నిమగ్నమయ్యారు. కేవలం కమీషన్ల కోసం చేపట్టిన ప్రాజెక్టుల టెండర్లను పూర్తి చేసి.. కోటరీ కాంట్రాక్టర్లకే వాటిని కట్టబెట్టి, మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చి, వాటినే ముడుపులుగా వసూలు చేసుకోవడానికి స్కెచ్ వేశారు. కోటరీ కాంట్రాక్టర్లు చేసిన పనులు, నీరు–చెట్టు కింద టీడీపీ నేతలకు బిల్లుల రూపంలో రూ.5,111 కోట్లు చెల్లించాల్సి ఉంది. నిధుల కొరత నేపథ్యంలో మొబిలైజేషన్ అడ్వాన్సులు, పెండింగ్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఏపీడబ్ల్యూఆర్‌డీసీ ద్వారా 10 వేల కోట్ల రుణం తీసుకోవడానికి సోమవారం ఉత్తర్వులు జారీ చేయించారు. ఈ అప్పును రైతుల నుంచి వసూలు చేసే నీటి పన్ను ద్వారా చెల్లించాలని నిర్ణయించారు. కమీషన్ల కోసం.. ఎన్నికల నిధులు సమకూర్చుకోవడం కోసం రైతుల రక్తం పీల్చేందుకు ప్రభుత్వ పెద్దలు సిద్ధం కావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్యాస్ కంపెనీల కార్మికుల సమ్మె



బీపీసీఎల్ గ్యాస్‌ప్లాంట్ వద్ద నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు, కార్మిక సంఘాల నాయకులు

కట్టుబడిపాలెం (జి.కొండూరు): కృష్ణా జిల్లా కట్టుబడిపాలెం సమీపంలోని ఆయిల్, గ్యాస్ కంపెనీల కార్మికులు మంగళవారం సమ్మెకు దిగారు. వందలాది లారీలు నిలిచిపోవడంతో ఆయిల్ గ్యాస్ సరఫరాకు ఆటంకం కలిగింది. బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్ పరిశ్రమలకు చెందిన 340 గ్యాస్ సరఫరా చేసే లారీలు, 390 ఆయిల్ సరఫరా చేసే లారీలను డ్రైవర్లు నిలిపివేశారు. దీంతో 1,57,500 సిలిండర్ల గ్యాస్, 5,85,000 లీటర్ల ఆయిల్ సరఫరా నిలిచిపోయింది. పరిశ్రమల యాజమాన్యాలు కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరుపుతున్నారు. ఆయిల్, గ్యాస్ పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయడంతో పాటు వారికి పనికి తగ్గ వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. కార్మిక సమ్మెలో భాగంగా లారీ డ్రైవర్లతో కలిసి ఆయన పినపాక వద్ద ఉన్న బీపీసీఎల్ గ్యాస్‌ప్లాంట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో కొన్నాళ్ల నుంచి తక్కువగా నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో పగటి వేళ ఎండ తీవ్రత పెరగనుంది. పెథాయ్ తుపాను ప్రభావంతో కొద్ది రోజులు పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా క్షీణించాయి. ఇవి సాధారణంకంటే 3 నుంచి 5 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యేవి. ఫలితంగా పగటిపూట కూడా చలి తీవ్రత కనిపించేది. క్రమంగా ఈ ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. సోమవారం నుంచి సాధారణం కంటే ఒకట్రెండు డిగ్రీలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో పలుచోట్ల 30 నుంచి 33 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరోవైపు రాత్రి ఉష్ణోగ్రతల్లో క్షీణత కొనసాగుతోంది. కోస్తాంధ్రలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు, రాయలసీమలో 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. దీంతో మునుపటితో పోల్చుకుంటే అతిశీతల గాలులు లేకపోయినా రాత్రి వేళ చలి ప్రభావం ఉంటోంది. సంక్రాంతి వరకు చలి కొనసాగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు రాష్ట్రంలో అత్యల్పంగా అనంతలో 13 (– 4) డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది.

రాష్ట్రంలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రత	ప్రాంతం	ఉష్ణోగ్రత
అనంతపురం	13	నంద్యాల	16
ఆరోగ్యవరం	14	కడప	16
తిరుపతి	15	కర్నూలు	17
విశాఖపట్నం	15	విజయవాడ	17
అమరావతి	15	కాకినాడ	18
బాపట్ల	15	మచిలీపట్నం	18
కళింగపట్నం	15	తుని	18
జంగమహేశ్వరపురం	15	కావలి	19
నందిగామ	16	నర్సాపురం	19
		ఒంగోలు	19

రామాయపట్నం పోర్టుకు
ఒక్క అనుమతీ లేదు!

అయినా పోర్టుకు నేడు చంద్రబాబు శంకుస్థాపన

- డీపీఆర్ పూర్తి కావడానికి ఇంకా 6 నెలలు పడుతుంది
- 3,500 ఎకరాల భూసేకరణ కూడా మొదలు కాలేదు
- అన్నీ సకాలంలో పూర్తి అయితే 2020 జనవరిలో పనులు మొదలు

సాక్షి, అమరావతి: కోస్టల్ రెగ్యులేషన్ జోన్ అనుమతి లేదు. పర్యావరణ అనుమతి రావాల్సి ఉంది. వీటితో పాటు కేంద్రం నుంచి ఇంకా అనేక అనుమతులు రావాల్సి ఉంది. అయినా సరే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రామాయపట్నం పోర్టుకు బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రకటన చేసింది. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏపీ పోర్ట్స్ డైరెక్టర్ కోయ ప్రవీణ్ వివరాలు తెలియజేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేసే బాధ్యతను రైట్స్ సంస్థకు అప్పజెప్పామని, ఈ సంస్థ జూన్ 30కి నివేదిక ఇస్తుందని చెప్పారు. సుమారు రూ.5,000 కోట్ల పెట్టుబడి అంచనాతో నిర్మిస్తున్న ఈ ఓడరేవుకు నిర్మాణానికి 3,500 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం రూ.400 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించి కోస్టల్ రెగ్యులేషన్ జోన్, పర్యావరణం వంటి అనేక అనుమతులు రావాల్సి ఉందని ఇవన్నీ ఈ ఏడాది చివరి నాటికి వస్తాయని చెప్పారు. ఇవన్నీ వస్తే వచ్చే ఏడాది జనవరికి పోర్టు పనులు మొదలయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే ఈలోగా రాష్ట్రంలో పారిశ్రామికంగా ఒక మంచి వాతావరణం ఉందన్న సంకేతం ఇవ్వడం కోసం ముఖ్యమంత్రి ఈ పోర్టుకు శంకుస్థాపన చేస్తున్నారని చెప్పుకొచ్చారు. రెండు రోజుల క్రితం కాకినాడ సెజ్‌లో జీఎంఆర్ పోర్టుకు శంకుస్థాపన చేసిన సీఎం ఇదే నెలలో బందరు, భావనపాడు పోర్టులకు కూడా శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు.

ఏపీఎంఐడీసీఎల్ ఏర్పాటు

రామాయపట్నం పోర్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మారిటైమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎంఐడీసీఎల్)ను ఏర్పాటు చేసింది. కాకినాడ గ్రూపు పోర్టుల పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని ఏపీఎంఐడీసీఎల్‌కు బదలాయించి, ఈ మొత్తాన్ని రామాయపట్నం పోర్టు నిర్మాణానికి వినియోగించనున్నట్లు ప్రవీణ్ తెలిపారు. కాకినాడ పరిధిలో ప్రస్తుతం కాకినాడ, రవ్వ, గంగవరం పోర్టుల ద్వారా రూ.150 కోట్ల ఆదాయం వస్తోందన్నారు. ఇలావుండగా రామాయపట్నం పోర్టును తామే నిర్మిస్తామంటూ కేంద్రం నుంచి తమకు ఎటువంటి లేఖ రాలేదని కోయ ప్రవీణ్ స్పష్టం చేశారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

ఉన్నత విద్యాశాఖ కమిషనర్ బి.ఉదయలక్ష్మి

తెనాలి అర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే పరీక్ష కేంద్రాల ఎంపిక జరిగిందని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ బి.ఉదయలక్ష్మి తెలిపారు. ఇంటర్మీడియెట్ బోర్డు ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో తెనాలిలో మంగళవారం స్వర్ణోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జంబ్లింగ్ విధానంతో పాటు, పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జూనియర్ కళాశాలల్లో నీతి ఆయోగ్ ప్రకటించిన అటల్ థింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.20 లక్షల నిధులు వచ్చాయన్నారు.



జ్యోతి ప్రదర్శన నిర్వహిస్తున్న ఉదయలక్ష్మి, రాజేంద్రప్రసాద్, రాజకుమారి, తదితరులు

అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి రాష్ట్ర స్థాయి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, తదితరులున్నారు.

సాక్షి

బుధవారం, జనవరి, 9

కొత్త చరిత్రకు శ్రీకారం

పల్లె సీమలనూ, పట్టణాలనూ, నగరాలనూ, మహా నగరాలనూ ఒరుసుకుంటూ సాగిన సుదీర్ఘ మహా జన ప్రభంజన యాత్ర పూర్తికాబోతోంది. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2017 నవంబర్ 6న ఇడుపులపాయలోని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి స్మృతివనం నుంచి ప్రారంభించిన 'ప్రజా సంకల్పయాత్ర' ఎన్నో అవాంతరాలను అధిగమించి నేడు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియబోతున్నది. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజానీకంలో ఉన్న ఆదరాభిమానాలు అందరికీ సుపరిచితమే అయినా పాదయాత్రకు ఈ స్థాయిలో జనం పోటెత్తుతారని మొదట్లో ఎవరూ ఊహించలేదు. మొదలైనప్పుడు ఉన్న ఉరవడి, ఉత్సాహం చివరికంటా కొనసాగడం ప్రతి ఒక్కరినీ అబ్బురపరిచింది. ప్రజలంతా ఎవరికి వారు పాదయాత్ర వివరాలు తెలుసుకుని ఆ దారిలో ఆయనకు స్వాగతం పలికేందుకు, వైఎస్సార్ కాంగ్రెస్ నిర్వహించే బహిరంగసభల్లో ఆయన ఏం చెబుతారో వినేందుకు తరలివచ్చిన తీరు దేశ చరిత్రలోనే అపూర్వం.

ఆయన అడుగులో అడుగేయాలని, ఆయనతో తమ గోడు చెప్పుకోవాలని, ఆయన ఇచ్చే భరోసాతో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని లక్షలమంది ప్రజలు ఆత్రంగా ఎదురు చూశారు. తనను కలుసుకోవాలని, మాట్లాడాలని ఆశపడుతున్నవారిలో కొందరు కదల్లేని స్థితిలో ఉన్నారని తెలుసుకుని జగన్‌మోహన్‌రెడ్డే స్వయంగా వారి ఇళ్లకు వెళ్లిన సందర్భాలెన్నో ఉన్నాయి. ఆయన్ను కలిసి ఏదో చెప్పాలని బలంగా కోరుకుంటున్నా చుట్టూ ఉన్న జనప్రవాహాన్ని చూసి నిస్సహాయంగా ఉండిపోయిన వృద్ధులనూ, పిల్లలనూ గమనించి తానే వారి దగ్గరకెళ్లి అక్కున చేర్చుకున్న తీరు, చిరునవ్వుతో ఆప్యాయంగా సంభాషించిన తీరు చూసి అందరూ చకితులయ్యారు. ఒకరా ఇద్దరా... పాదయాత్ర పొడవునా వందలు, వేలమంది ఆయన ముందు తమ గోడు వినిపించుకున్నారు. చంద్రబాబు పాలనలో తమకెదురవుతున్న అన్యాయాలను చెప్పుకున్నారు. పాలకుల దన్నుతో ఊరూరా ఎటువంటి అక్రమాలు అడ్డూ ఆపూ లేకుండా సాగుతున్నాయో వివరించారు. వినతిపత్రాలిచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తున్న తీరును తెలిపారు. కొందరైతే తామెదుర్కొంటున్న అనారోగ్య సమస్యలను చెప్పుకున్నారు. తమ పింఛన్లను కావాలని నిలిపివేశారని కొందరు... నివాసగృహం లేక సతమతమవుతున్నామని మరికొందరు... పెద్ద చదువులు చదివినా నిరుద్యోగం తమను పీల్చిపిప్పి చేస్తున్నదని ఇంకొందరు ఆయనకు చెప్పారు. అరకొర వేతనాలిచ్చి వెట్టి చాకిరీ చేయించుకోవడాన్ని... ఏళ్లు గడుస్తున్నా తమకు రావాల్సిన బకాయిల్ని చెల్లించకపోవడాన్ని... నోటిఫికేషన్లు ఇస్తామని, ఖాళీలు భర్తీ చేస్తామని హామీలిచ్చి మోసపుచ్చడాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చినవారున్నారు. వీరందరూ ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయినవారే. తన పరిధిలో తీర్చగలిగినవాటిని అక్కడికక్కడే పరిష్కరించటం, అధికారం సిద్ధించాక చేయగలిగేవాటి విషయంలో ఓపిక పట్టమని కోరడం, భవిష్యత్తుపై విశ్వాసాన్ని నింపడం దారి పొడవునా కనబడింది. ఆయన్ను నిరుపేదలు,రైతులు, చేతివృత్తులవారు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీలు కలిశారు. ఆత్మీయ సమావేశాల్లో వివిధ వర్గాలవారు తమకు జరుగుతున్న అన్యాయాలను తెలిపారు. సర్కారీ అపసవ్య విధానాలను వీరందరూ వివరిస్తుంటే, అందువల్ల ఏర్పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెడుతుంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఓర్పుతో విన్నారు. అవగాహన చేసుకున్నారు. పరిష్కార మార్గాలు ఆలోచించారు. సరికొత్త విధానాలకు రూపకల్పన చేశారు. పేదరికం కోరల్లోంచి బయటకు రావాలంటే కుటుంబాల్లో పిల్లలు పెద్ద చదువులు చదివి డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని... అందుకు అవసరమైన చేయూత అందేవిధంగా విధివిధానాలు రూపొందిస్తామని వాగ్దానం చేశారు. సకల వర్గాలనూ స్పృశించేలా రూపకల్పన చేసిన నవ రత్నాల్లోని అంశాలను ఆయన వివరిస్తుంటే జనం కరతాళ ధ్వనులతో బహిరంగసభలు మార్మోగాయి.

కాళ్లు బొబ్బలెక్కినా, ఎండలు మండిపోతున్నా, ఏకధాటిగా వర్షం కురుస్తున్నా, శీతగాలులు కోతపెడుతున్నా ఏ రోజూ జగన్‌మోహన్‌రెడ్డి వెరవలేదు. తన సంకల్పం నుంచి కాస్తయినా పక్కకు తప్పుకోలేదు. తాను అడుగుపెట్టిన ప్రాంతంలోని సమస్యలను అవగాహన చేసుకోవడం, వాటిని ప్రస్తావిస్తూ బహిరంగసభల్లో మాట్లాడటం, ప్రజలకు అర్థమయ్యే రీతిలో వర్తమాన రాజకీయాలను వివరించటం, వారిలో చైతన్యాన్ని నింపడం ఆయనొక యజ్ఞంలా నిర్వహించారు. ఇన్ని సభల్లో మాట్లాడినా, వేలమందితో నిత్యం సంభాషిస్తున్నా ఏనాడూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై పరుషవాక్కులు పలకలేదు. తన హుందాతనాన్ని మరవలేదు. కానీ బాబు దీనికి భిన్నం. పాదయాత్ర తొలినాళ్లలో అది విజయం సాధించడం అసాధ్యమన్న భ్రమల్లో ఆయన మునిగిపోయారు. రోజులు గడుస్తున్నకొద్దీ ఆ సంకల్పయాత్ర అంతకంతకు బలం పుంజుకోవడాన్ని గమనించి తన అధికార బలంతో అనేక రూపాల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూశారు. కానీ చివరకు చంద్రబాబే మనోస్థైర్యాన్ని కోల్పోయారు. తన పునాదులు కదులుతున్న వైనాన్ని గమనించి ప్రత్యేక హోదాతోసహా అనేక అంశాల్లో 'యూ–టర్న్'లు తీసుకుని నవ్వులపాలయ్యారు. వీటన్నిటికీ పరాకాష్ఠ విశాఖ విమానాశ్రయంలో జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన విఫల హత్యాయత్నం. మొత్తానికి పద్నాలుగు నెలలపాటు కొనసాగిన ఈ ప్రజా సంకల్పయాత్ర కోట్లాది జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. దేశ చరిత్రలో ఒక అరుదైన ఘట్టంగా, అపురూపమైన అధ్యాయంగా ఆవిష్కృతమవుతుంది. నాయకుడంటే ఎలా ఉండాలో, ఎంత పరిణతితో మాట్లాడాలో ఈ ప్రజా సంకల్పయాత్ర ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి చాటిచెప్పారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి శు.తదియ ఉ.11.55 వరకు తదుపరి చవితి, నక్షత్రం ధనిష్ఠ రా.12.34 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం... లేదు, దుర్ముహూర్తం ప.11.44 నుంచి 12.29 వరకు, అమృతఘడియలు... ప.1.03 నుంచి 2.34 వరకు.

సూర్యోదయం : 6.37
సూర్యాస్తమయం: 5.38
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

మరో రాజకీయ విప్లవానికి నాంది

వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత, ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాగించిన ప్రజా సంకల్పయాత్ర రాజకీయ, సామాజిక విప్లవానికి నాంది పలికింది. సకల సామాజిక వర్గాలూ ఈ యాత్ర పొడవునా జగన్‌మోహన్ రెడ్డి వెంట నడిచిన తీరు నిజంగా అపూర్వమని చెప్పాలి. ప్రజాభిమానం చూరగొనాలంటే వారి గుండె తలుపు తట్టాలని, వారి బాధల్ని ఓపిగ్గా విని పరిష్కార మార్గాలు ఆలోచించాలని ఈ యాత్ర ద్వారా జగన్ చాటిచెప్పారు. ప్రజాబలం ముందు ప్రభుత్వాలు సృష్టించే అవాంతరాలు దూదిపింజెల్లా తేలిపోతాయని నిరూపించారు. రాజకీయాలంటే తెరవెనక కుట్రలు, కుతంత్రాలు నడపటం అని...ప్రత్యర్థులపై బురదజల్లి వారిని దెబ్బతీయటమని అనుకున్న చంద్రబాబుకు ఈ ప్రజాసంకల్ప యాత్రతో ఊపిరాడటం లేదు.

'జగన్నాథ రథ చక్రాలను భూమార్గం పట్టిస్తాను.. భూకంపం పుట్టిస్తాను' అని ఆనాడు మహాకవి శ్రీశ్రీ ఆనాడు అన్నారు. తన ప్రజా సంకల్పయాత్రతో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అదే స్ఫూర్తిని రాజకీయాలకు అన్వయిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో పెను రాజకీయ విప్లవాన్ని తీసుకువచ్చారు. దేశ, విదేశీ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న రాష్ట్ర రాజకీయాలను భూమార్గం పట్టించి ప్రజల చెంతకు తీసుకువచ్చారు. విచ్చలవిడి అవినీతితో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్న అవినీతిపరుల గుండెల్లో భూకంపం పుట్టించారు. 2017, నవంబర్ 6న ఇడుపుల పాయలో ఆయన వేసిన అడుగు... దారిపొడుగునా అశేష జననీరాజనాలు అందుకుంటూ... 3,650 కి.మీ. ప్రస్థానంలో కోటిన్నరమంది ఆయన అడుగుల్లో అడుగు కదపగా... 2019, జనవరి 9కి ఇచ్ఛాపురం చేరేనాటికి అది ప్రజా ఉప్పెనగా రూపాంతరం చెందింది. రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తూ, సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ.. ఇచ్ఛాపురంలో అది విజయసంకల్ప స్థూపంగా ఆవిష్కృతం కాబోతోంది.

రామన్న... రాజన్న... వెరసి జగనన్న

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇప్పటివరకు ప్రజాముఖ్యమంత్రులుగా పేరొందిన వారు ఇద్దరు... ఒకరు ఎన్టీరామారావు, మరొకరు వై.ఎస్.రాజశేఖర రెడ్డి. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెడుతుంటే ఆనాడు తిరగబడ్డ తెలుగుబిడ్డగా ఎన్టీరామారావు చైతన్యరథంపై రాష్ట్రం చుట్టిముట్టి రాజకీయ విప్లవం తీసుకువచ్చారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి విచ్చలవిడి అవినీతితో రాష్ట్రం భ్రష్టుపట్టి పోతున్న వేళ 2003లో ప్రజల ఆశాకిరణంగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో పాదయాత్రకు చేశారు. ప్రజాప్రస్థానంతో పాదయాత్ర నిర్వహించి వై.ఎస్. రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికి మానవీయ ప్రభుత్వం అంటే ఏమిటో చూపించారు. విభజనానంతరం 2014లో చంద్రబాబు అధికారం చేపట్టాక ప్రజలు పెను సమస్యల్లో కూరుకుపోయారు. ముఖ్యమంత్రిగా ఆయన రాజధాని నిర్మాణం ముసుగులో విదేశీ కార్పొరేట్ సంస్థలకు రాష్ట్రాన్ని తాకట్టుపెడుతున్నారు. రాష్ట్ర ప్రగతికి సంజీవని వంటి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలను గాలికి వదిలేశారు. సంతలో పశువుల మాదిరిగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొను గోలు చేస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాశారు. విచ్చలవిడి అవినీతితో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు. భవిష్యత్ అంధకారబంధురంగా మారుతున్న సంకట స్థితిలో రాష్ట్రం కోసం, ప్రజల కోసం నేనున్నానంటూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందడుగు వేశారు. ఇడుపులపాయ వద్ద ఆయన ప్రారంభించిన ప్రజాసంకల్ప యాత్ర రాష్ట్రంలో సరికొత్త రాజకీయ శకానికి నాంది పలికింది.

రాజకీయ, సామాజిక విప్లవం

ప్రజా అజెండానే జెండాగా వై.ఎస్.జగన్ సాగించిన పాదయాత్ర రాష్ట్రంలో సరికొత్త రాజకీయ, సామాజిక విప్లవానికి నాంది పలికింది. దాదాపు కోటిన్నరమంది ఆయన అడుగులో అడుగేసి పాదయాత్రలో పాల్గొనడం ఒక అపురూపమైన అంశం. ఈ పాదయాత్రలో రైతులు, మహిళలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, మత్స్యకారులు, బ్రాహ్మణులు, నాయిబ్రాహ్మణులు, ఆర్యవైశ్యులు, కళింగ కోమట్లు, కల్లు గీత కార్మికులు, న్యాయవాదులు, డ్వాక్రా సంఘాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు... ఇలా పలువర్గాల వారితో జగన్ ఆత్మీయ



సమావేశాలు నిర్వహించారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలతోపాటు రాజకీయ అవకాశాల కల్పనకు విధాన నిర్ణయాలను ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే అమలు చేయనున్న నవరత్నాల పథకాలను వివరించారు. కృష్ణా జిల్లాకు ఎన్టీరామారావు పేరుపెడతా మని ప్రకటించడం ద్వారా సగటు ఎన్టీరామారావు అభిమాని మనసు గెలుచుకున్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో ఓ జిల్లా ఏర్పాటు చేస్తామని పశ్చిమగోదావరి జిల్లాలో జగన్ చేసిన ప్రకటనపట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇలా అన్ని వర్గాల అఖండ ఆదరణతో రాష్ట్ర రాజకీయ సమీకరణాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్టయింది. 2014 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌కు 1.30 కోట్ల ఓట్లు వచ్చాయి. టీడీపీ కంటే కేవలం 5 లక్షల ఓట్లు వెనుకబడి అధికారానికి దూరమైంది. జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన ఈ పాదయాత్ర పాత సమీకరణాలను సమూలంగా మార్చేసింది. ప్రజా సంకల్పయాత్ర పొడవునా పార్టీ నేతలు, కార్యకర్తలు కాకుండా ఇతరులు కోటిన్నర మందిని కొత్తగా జగన్‌మోహన్‌రెడ్డిని కలుసుకున్నారు. వారి సమస్యలు అవగాహన చేసుకుని పరిష్కారానికి విధానపరమైన నిర్ణయాలను ప్రకటించారు. ఈ ప్రక్రియంతా వైఎస్సార్ కాంగ్రెస్‌ను రాష్ట్రంలో మొక్కవోని శక్తిగా మార్చింది. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పెను ప్రభంజనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇటీవల పలు జాతీయ ఛానెళ్లు నిర్వహించిన సర్వేలూ అదే విషయాన్ని వెల్లడించడం రాష్ట్ర ప్రజల మనోభీష్టాన్ని వెల్లడిస్తోంది. ప్రజాజీవితంలో కొనసాగా లంటే వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరడం ఒక్కటే మార్గమని నాయకులందరూ భావించే విధంగా ప్రజాభిమానం పోటెత్తింది. పలువురు మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులుగా పనిచేసి రిటైరైనవారు దీన్ని గుర్తించే పార్టీకి చేరువయ్యారు.

టీడీపీ గుండెల్లో భూకంపం

ప్రజా ఉప్పెనగా సాగిన వై.ఎస్.జగన్ పాదయాత్ర అధికార టీడీపీ ప్రభుత్వం గుండెల్లో భూకంపం పుట్టించింది. పాదయాత్ర తీసుకువచ్చిన రాజకీయ చైతన్యం ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. జన్మభూమి సభల్లో ప్రజలు నిలదీస్తుంటే మంత్రులు, టీడీపీ ప్రజాప్రతినిధులు నీళ్లు నములుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్న సభల్లో సైతం జనాగ్రహం ఆనవాళ్లు ప్రస్ఫుటమయ్యాయి. బాబు మాట్లాడుతుంటే ప్రజల నుంచి ఏమాత్రం స్పందన కనిపించడం లేదు. జగన్‌మోహన్‌రెడ్డిపై ఆరోపణలు సంధించి ప్రజల స్పందన కోసం చూసినప్పుడు ఆయనకు తరచుగా నిరాశే ఎదురవుతోంది. దాంతో ముఖ్యమంత్రి, మంత్రులు, టీడీపీ నాయకులు మాట్లాడుతున్న తీరులో బేలతనం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పాదయాత్ర మీద, జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం మీద.. విమర్శలు, ఆరోపణలు గుప్పించినప్పుడు ప్రజల్లో పెద్దగా స్పందన ఉండక పోవడాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రజల్లో ముఖ్య మంత్రి చంద్రబాబు విశ్వాసం కోల్పోయారని చెప్పడానికి దీన్నో నిదర్శనంగా భావించాలి.

చంద్రబాబు కుతంత్రాలకు కాలం చెల్లు

జగన్ పాదయాత్రతో తమ పుట్టి మునుగుతుందని గుర్తించిన చంద్రబాబు కొత్త రాజకీయ తంత్రాలకు తెరతీశారు. నాలుగేళ్లకుపైగా అంటకాగిన బీజేపీ నుంచి వేరుపడి ప్రత్యేక హోదా కావాలంటూ సరికొత్త నాటకం మొదలుపెట్టారు. ఈ ఎత్తుగడకు ప్రజల నుంచి ఏమాత్రం సానుకూల స్పందన రాకపోవడంతో చంద్రబాబు కొత్త పొత్తులను వెతుక్కునే పనిలో పడ్డారు. ఆవిర్భావం నుంచి టీడీపీకి బద్ధశత్రువుగా ఉన్న కాంగ్రెస్‌తో జట్టుకట్టారు. తెలంగాణా ఎన్నికల్లో ఈ పొత్తును ప్రజలు తిరస్కరించడంతో ఏం చేయాలో బాబుకు తోచడం లేదు. అక్కడే అలా ఉంటే ఏపీలో పుట్టగతులు ఉండకపోవచ్చునని ఆయనకు అర్థమైంది. విశాఖపట్నం విమానాశ్రయంలో వై.ఎస్.జగన్‌పై జరిగిన విఫల హత్యాయత్నం వెనకున్న కుట్రలు, కుతంత్రాల్లో ఎవరి హస్తం ఉన్నదో, దీనికంతకూ కారకులెవరో ప్రజలకు సులభంగానే అర్థమైంది.

పవన్‌ను అడ్డంపెట్టుకుని రాజకీయ పన్నాగం

ఇలాంటి దిక్కుతోచని స్థితిలో చంద్రబాబు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కొత్త నాటకానికి శ్రీకారం చుట్టారు. జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర ప్రారంభమైన కొంతకాలానికే పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటనలు చేపట్టడం వెనుక చంద్రబాబు ఎత్తుగడ ఉంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా టీడీపీకి ప్రయోజనం కలిగించాలన్న లక్ష్యంతోనే ఆయన పర్యటనలకు రూపకల్పన చేశారు. ఇదంతా సాగిస్తూనే ఏమీ ఎరగనట్టు వైఎస్సార్ కాంగ్రెస్, జనసేన, బీజేపీ కలుస్తున్నాయంటూ చంద్రబాబు దుష్ప్రచారం మొదలుపెట్టారు. తాము ఒంటరిగానే పోటీ చేస్తామన్న జగన్ మాటనే ప్రజలు విశ్వసించడంతో ఆ ఎత్తు చిత్తయింది. ఈ నేపథ్యంలో దింపుడుకళ్లెం ఆశతో చంద్రబాబు మరో ఎత్తుగడ వేశారు. ముసుగు తొలగిస్తూ పవన్ కల్యాణ్‌కు పరోక్షంగా స్నేహహస్తం అందిస్తూ ఎన్నికల అనంతరం పొత్తుపై సంకేతాలు ఇచ్చారు. అయితే ప్రజలు అమాయకులు కాదు. చంద్రబాబు– పవన్ కల్యాణ్ తెరచాటు స్నేహంపై వారికి పూర్తి అవగాహన ఉంది. కనుకనే ఈ ఎత్తుగడలన్నీ వరుసగా బెడిసి కొడుతున్నాయి.

తీవ్ర ప్రజావ్యతిరేకతతో రాష్ట్రంలో టీడీపీ గ్రాఫ్ అంతకంతకు అమాంతంగా పడిపోతుండటం స్పష్టంగానే కనబడుతోంది. 'మళ్లీ చంద్రబాబే రావాలి' అన్న టీడీపీ నినాదాన్ని ప్రజలు తిప్పికొడుతున్నారు. 'ఈసారి జగన్‌కే అవకాశం ఇద్దాం... రాజన్న సంక్షేమ రాజ్యం తీసుకువద్దాం' అని కుండబద్దలు కొడుతున్నారు. రానున్న ఎన్నికల్లో విజయదుందుభి మోగించేలా వైఎస్సార్ కాంగ్రెస్‌కు రాష్ట్రమంతటా సానుకూల పవనాలు సృష్టించడంలో వై.ఎస్.జగన్ పాదయాత్ర విజయవంతమైందన్నది సుస్పష్టం. ప్రజా సంకల్ప యాత్రతో రాష్ట్రంలో మరో రాజకీయ విప్లవానికి బీజం పడిందన్నది నిర్వివాదాంశం.


సాక్షి ప్రత్యేక ప్రతినిధులు, అమరావతి బ్యూరో

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వారు సైతం



"లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు అనిల్ అంబానీ ప్రస్తావన తీసుకువచ్చినప్పుడు బీజేపీ సభ్యులంతా ఎందుకు విఫలమవుతున్నారో నాకు అర్థం కావడం లేదు. అగస్టా హెలికాప్టర్ల వ్యవహారంలో యూపీఏ కూడా హెచ్‌ఏఎల్‌ను కాదని అడ్డదారిలో రతన్ టాటాతో డీల్ కుదుర్చుకుంది. ఈ విషయం ప్రస్తావించి కాంగ్రెస్‌ను బీజేపీ నేతలు కట్టడి చేయొచ్చు కదా"

– సుబ్రమణ్య స్వామి, రాజ్యసభ ఎంపీ

హత్య



"పీఎస్‌యూలను హతమార్చడానికి బీజేపీ ఒక్కొక్క అడుగే వేస్తోంది. పీఎస్‌యూలకు పని ఇవ్వకుండా ఖాళీగా ఉంచడం; అడ్డదారిలో వేరే వారికి కాంట్రాక్ట్‌లు అప్పగించడం; పని చేసినా వారికి చెల్లించాల్సిన మొత్తలు చెల్లించకపోవడం; వారి సామర్థ్యంపై అనుమానాలు లేవనెత్తడం; ప్రపంచవ్యాప్తంగా వారి విశ్వసనీయతను దెబ్బ తీయడం. ఇవే హెచ్‌ఏఎల్‌కు ముగింపు పలికాయి, ఏఏకు స్వాగతం చెబుతున్నాయి"

– ప్రియాంక చతుర్వేది, కాంగ్రెస్ ప్రతినిధి

జీవితం



"కొన్ని జీవితాలంతే. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు అనుపమ్ ఖేర్ లాంటి నటుడు దొరికాడు. పాపం మన ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం తన బయోపిక్‌కు వివేక్ ఒబెరాయ్‌తో సర్దుకుపోతున్నారు. వివేక్ బదులు మోదీ పాత్రలో సల్మాన్ ఖాన్ నటించి ఉంటే ఎంతో మజా వచ్చేది"

– ఒమర్ అబ్దుల్లా
జమ్మూకశ్మీర్ మాజీ సీఎం


నైతికత



"సీబీఐ డైరెక్టర్‌గా తిరిగి నియమించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం అలోక్ వర్మ స్వల్ప నైతిక విజయమే. కానీ, ప్రజల దృష్టిలో మోదీ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ. అలోక్ వర్మను సెలవుపై పంపాలని ప్రభుత్వం అర్ధరాత్రి తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని తేలిపోయింది"

– సాగరికా ఘోష్, జర్నలిస్ట్

భయం



"అగ్రకుల పేదలకు రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని మోదీ ప్రభుత్వం తన చిట్ట చివరి పార్లమెంట్ సమావేశాలు ముగిసే సందర్భంలో ప్రతిపాదించడం విరక్తి, నిస్పృహతో కూడిన చర్య. మనం ఊహిస్తున్నదానికంటే ఎన్నికలంటే భారతీయ జనతాపార్టీ అధినాయకత్వం ఎక్కువే భయపడుతోందని దీన్నిబట్టి అర్థమవుతోంది"

– శేఖర్ గుప్తా, సీనియర్ జర్నలిస్ట్

ఇంత రాజకీయమా బాబూ?

విపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై జరిగిన దాడి కేసును కేంద్రం జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై రాజకీయ యుద్ధం ప్రారంభించిన బాబు ఈ విషయంలో కూడా అదే వైఖరిని కొనసాగిస్తున్నట్లుగా అర్థం అవుతోంది. దర్యాప్తును కేంద్ర సంస్థ పరిధిలోకి తీసుకోవడం ద్వారా రాష్ట్ర హక్కులను కేంద్రం హరిస్తోందని, జగన్‌ని సంతృప్తి పరచడానికే అంటూ విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే ఒక నిజాన్ని ఒప్పుకున్నారు. శాంతి భద్రతల వ్యవహారం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం అని. జగన్‌పై దాడికి సంబంధించిన మంచి చెడులకు బాధ్యత కూడా తాను నాయకత్వం వహించే ప్రభుత్వానిది కాదా చంద్రబాబే చెప్పాలి. జగన్‌పై జరిగిన దాడిని ఖండించి దర్యాప్తు ప్రాథమిక ఆధారాల ప్రాతిపదికన కేసుకు సంబంధించి వివరాలు సీఎం మాట్లాడి ఉంటే సమస్య పరిష్కారం జరిగి ఉండేది.


శాంతి భద్రతలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. కీలకమైన కేసులు కేంద్ర దర్యాప్తు సంస్థ ఆధ్వర్యంలో విచారణ జరగటం సాధారణ విషయం. కీలకమైన కేసులే కాదు ప్రత్యేక సందర్భంలో కూడా సీబీఐ లాంటి సంస్థలు రాష్ట్రాల వినతి మేరకు గానీ, న్యాయస్థానాల ఆదేశాల మేరకు గానీ రాష్ట్రాల పరిధిలోని అంశాలపై విచారణ జరిపిన సందర్భాలు మన రాష్ట్రంలో అనేకం ఉన్నాయి. పరిటాల రవి హత్య కేసును చంద్రబాబు నాడు సీబీఐ దర్యాప్తుకు డిమాండు చేశారు. కారణం రవి హత్యపై వారికి అధికార పార్టీపై అనుమానం ఉన్నది. నాడు రవి హత్యపై అధికార పార్టీపై అనుమానాలు ఉన్నట్లే నేడు జగన్‌పై దాడి విషయంలో కూడా వైఎస్సార్‌సీపీకి అనుమానం ఉన్నది.

ప్రతిపక్ష పార్టీ అనుమానానికి కొంత అధికార పార్టీ నేతలు వ్యవహరించిన తీరు, డీజీపీ ప్రకటనలు కూడా కారణంగా చెప్పక తప్పదు. తనకు అనుమానం వచ్చినప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థలు కావాలి. అపుడు మాత్రం రాష్ట్ర హక్కులకు భంగం కలగదు. అదే ఇతరులకు అనుమానం వచ్చినపుడు కేంద్ర దర్యాప్తు కోరితే మాత్రం అది రాష్ట్ర హక్కుల ఉల్లంఘన. రాజకీయాలు చేయవచ్చు గానీ మరీ ఇంతగానా?

ఎమ్. పురుషోత్తమ రెడ్డి
తిరుపతి

బెడిసి కొట్టిన రాజకీయ క్రీడ

సందర్భం



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో విలక్షత కన్పించింది ఒక్క తెలంగాణలోనే. తక్కిన 4 రాష్ట్రాలలో ఓటర్లు మార్పును ఆశించారు, ఆహ్వానించారు. తెలంగాణ ఓటరు మాత్రం తమకు ఆ అవసరం లేదని తేల్చిచెప్పారు. ప్రజా కూటమి పేరుతో సిద్ధాంతరాహిత్యంతో ఒక్కటై పోటీ చేసిన కాంగ్రెస్, తెలుగుదేశం, టీజెఎస్, సీపీఐలకు ఎదురైంది ఓటమి అనేకంటే ఘోర పరాభవం అనడం సముచితం. బలం లేకున్నా.. అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసి 103 చోట్ల డిపాజిట్లు కోల్పోయి బీజేపీ తన పరువు తానే తీసుకొంది. కుల పార్టీలతో కలిసి 'బహుజన లెఫ్ట్ పార్టీ'గా సీపీఎం జనం ముందుకెళ్లినా లభించింది సున్నాయే!

సంక్షేమాన్ని నమ్ముకున్న టీఆర్ఎస్ :

కేసీఆర్ పాలనలో ఎన్నదగినది ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేయడం. బడ్జెట్ నిధుల్లో 39% మేర సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు పెడుతూ దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలుస్తున్నది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మొక్కుబడిగా కాకుండా నిజాయితీగా, చిత్తశుద్ధితో తమ జీవితాల్లో గుణాత్మకమైన మార్పు తెచ్చేందుకు కృషి చేయడాన్ని వేరొకరు కాకుండా ఆయా వర్గాలు గ్రహించగలిగాయి. విశిష్ట పథకాలుగా కేసీఆర్ కిట్, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, కంటి పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ, పండుగలకు పేదలకు అభివృద్ధి కానుకల పంపిణీ, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం మొదలైన పథకాలు సామాన్యులను ప్రభావితం చేశాయి. అభివృద్ధి కార్యక్రమాల్లో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ మొదలైనవి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అన్నింటికన్నా మిన్నగా రైతు భీమా, వ్యవసాయ పెట్టుబడి రాయితీలు, సాగునీటి పథకాలు, హామీ మేరకు వ్యవసాయ రుణమాఫీ లాంటివి రైతాంగంలో ఎనలేని భరోసా కల్గించగలిగాయి. పైగా, గొర్రెల పంపిణీ, పాల పశువుల పంపిణీ, చేప పిల్లల పంపిణీ లాంటివి సామాన్యుని మనోధైర్యాన్ని పెంచాయి. కనుకనే ఎవరెన్ని విధాలుగా ప్రచారం చేసినా, వాటిని చెవికెక్కించుకోకుండా ప్రజలు తమ కృతజ్ఞతను ఓట్ల రూపంలో చాటుకున్నారు.

ప్రజా కూటమి విఫలం

తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్‌పార్టీ తొలి రోజు నుండి టీఆర్ఎస్ ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతున్న మాట నిజమే. అయితే, 2014లో ఎదురైన ఓటమి తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలు, ఆధిపత్య ధోరణులు తగ్గలేదు. దానికితోడు, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యత, ఎక్కువ పెత్తనం అప్పజెప్పడం చాలామందికి మింగుడు పడలేదు. పీసీసీ అధ్యక్షుడ్ని, రాష్ట్ర పార్టీ వ్యవహారాల బాధ్యుడ్ని తప్పించడానికి చాలా ప్రయత్నాలు జరిగాయి. వ్యక్తులపరంగా అధికార పార్టీని విమర్శించడంలో కాంగ్రెస్ నేతలు ముందున్నప్పటికీ, ఐక్యంగా పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో విజయం సాధించలేకపోయారు. మొత్తం మీద కాంగ్రెస్ పార్టీ తన సహజలక్షణాలను విడిచిపెట్టలేదు. క్షేత్రస్థాయిలో ఆ పార్టీ బలపడలేదు. ఇక, ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీతో జతకట్టడం ఆ పార్టీకి ఆత్మహత్యాసదృశమైంది. నిర్మాణం గానీ, నాయకులు గానీ లేని కోదండరామ్ పార్టీని కలుపుకోవడం కాంగ్రెస్ చేసిన మరో తప్పిదం. సీపీఐను కలుపుకోవడం వల్ల ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి కొంతమేర లాభం చేకూరింది. మొత్తం మీద 'ప్రజాకూటమి' ఏర్పాటు అన్నది సహజ రాజకీయ ప్రక్రియగా జరగలేదు. తెలంగాణ ఉద్యమం ఆసాంతం నడిచింది ఆత్మగౌరవ నినాదాంతోనే. అటువంటిది ప్రజా కూటమి గెలిస్తే ప్రత్యేకంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరిగి పెత్తనం సాగించగలడన్న భయాందోళనలు తెలంగాణ ప్రజల్లో ప్రస్ఫుటంగా కన్పించాయి. చంద్రబాబు పదేళ్ల పాలనలో 'పల్లెకన్నీరు' పెట్టింది. రైతాంగం, చేనేతలు, కులవృత్తులవారి ఆత్మహత్యలు, ఆకలి చావులతో తెలంగాణ పల్లెల్లో మృత్యుఘోష విన్పించింది. ఫలితంగానే, టీఆర్ఎస్‌కు ప్రజలు ఘన విజయాన్ని చేకూర్చి ప్రజాకూటమిని మట్టి కరిపించారు.

కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ

మరికొన్ని నెలల్లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీతోపాటు లోక్‌సభకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీలో కూడా కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీలు పొత్తుకు రంగం సిద్ధమైంది. తెలంగాణ అనుభవాన్ని దష్టిలో పెట్టుకొని.. తెలుగుదేశం పార్టీతో పొత్తు లేకుండా వెళ్దామని కొందరు కాంగ్రెస్ నేతలు ప్రతిపాదిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. అయితే, తెలుగుదేశం పార్టీతో పొత్తు కుదుర్చుకొంటే.. దండిగా పార్టీకి ఆర్థిక వనరులు సమకూరుతాయన్న ఆశ కొందరిలో బలంగా ఉంది. డబ్బుతో కొన్ని సీట్లయినా గెలవచ్చునని కొందరు కాంగ్రెస్ నేతల ఆలోచనగా కనిపిస్తోంది. 'టీ' అంటే తినడం; 'డీ' అంటే దోచుకోవడం; 'పీ' అంటే పంచుకోవడంగా టీడీపీ తయారైందని, చంద్రబాబు రాజ్యం ఇంటింటా దౌర్భాగ్యం అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తమ కార్యకర్తలకు పాఠాలు బోధించింది.'డామిట్ కథ అడ్డం తిరిగింది' అన్నట్లు ఏ పార్టీనైతే నాలుగున్నరేళ్లుగా విమర్శిస్తూ వస్తున్నారో.. ఆ పార్టీతో జాతీయస్థాయిలో, తెలంగాణలో చెట్టాపట్టాలేసుకొని తిరగడం ఏపీ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి మింగుడు పడటం లేదు. చంద్రబాబుతో పొత్తును సమర్థించుకోవడానికి చూపగల హేతుబద్ధమైన కారణం ఏదీ రాష్ట్ర కాంగ్రెస్ వద్ద లేదు.

మరోపక్క ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ధర్మ దీక్ష, జ్ఞానభేరి మొదలైన కార్యక్రమాలను ప్రజాధనంతో నిర్వహిస్తూ.. ఆ వేదికల నుండి తను ఎందుకు కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సి వచ్చిందో చెప్పడానికి విఫల యత్నం చేస్తున్నారు. తమ కలయికకు నైతికత ఆపాదించుకోవడానికి తాపత్రయ పడుతున్నారు. రాష్ట్ర విభజన సహేతుకంగా చేయని 'పాపి' కాంగ్రెస్ పార్టీ అని తిట్టిన చంద్రబాబునాయుడు ఆ 'పాపి' తోనే చేతులు కలపడాన్ని ఆంధ్ర ప్రజానీకం హర్షిస్తుందా? ఆశ్చర్యం ఏమిటంటే, తెలంగాణలో తెలుగుదేశం ఓటమికి కాంగ్రెస్ పార్టీతో చేతులు కలపడమే కారణమని సొంత మీడియాలో కథనాలు రాయించుకొని పరువు నిలబెట్టుకోవడానికి తెలుగుదేశం తాపత్రయ పడుతున్నది. మరోపక్క తెలుగుదేశం వల్ల ఓటమి ఎదురైందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ లోలోపల మధనపడుతున్నది కానీ, బాహాటంగా చెప్పడానికి ధైర్యం చేయలేకపోతోంది.

కాగా, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏను, ప్రధాని మోదీని గద్దె దించడం ప్రజాస్వామ్య అనివార్యతగా తెలుగుదేశం ప్రచారం చేస్తున్నది. అవినీతికి పాల్పడుతూ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ దేశానికి ప్రమాదకారిగా చంద్రబాబునాయుడు అభివర్ణిస్తున్నారు. ఎన్నికల అంశంగా అవినీతిని, రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం కావడాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సివస్తే.. ఆ రెంటి విషయంలో మోదీ ప్రభుత్వం కంటే చంద్రబాబు సర్కార్ అందనంత ఎత్తులో ఉంది. ఈ లెక్కన చంద్రబాబు సర్కార్‌ను ఓడించడం ప్రజాస్వామ్యరీత్యానే కాదు.. రాజ్యాంగ రీత్యా, ప్రజా ప్రయోజనాలరీత్యా అనివార్యం! తెలంగాణ ఎన్నికలో చంద్రబాబు సాగించిన రాజకీయ క్రీడ బెడిసి కొట్టింది. ఇక మిగిలిందల్లా.. ఏపీ ఎన్నికలే.

వ్యాసకర్త శాసన మండలి ప్రతిపక్ష నాయకులు, కేంద్ర మాజీ మంత్రి

ప్రచారమే లక్ష్యం.. సమస్యలపై నిర్లక్ష్యం!



- గత ఐదు విడతలుగా జన్మభూమిలో అందిన వినతులకు మోక్షమేదీ?
- అర్హులకు ఇళ్ల స్థలాలెప్పుడు?
- కొత్త పింఛన్ల కోసం పడిగాపులు
- పది లక్షల మందికి గూడూ కరువే
- బాబు మార్కు సంతోషాంధ్రప్రదేశ్ ఇదేనా!

సాక్షి, అమరావతి:

రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ప్రచారం కోసమే పది రోజుల పాటు 'జన్మభూమి – మాఊరు' కార్యక్రమానికి ఉపక్రమించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత జన్మభూమి సభల్లో ఇచ్చిన వినతులు, సమస్యలు పరిష్కరించకుండా మరోసారి మభ్యపెట్టేందుకే సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని చేపట్టారని గ్రామీణులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పలుసార్లు దరఖాస్తు చేసుకున్నా ఇళ్ల పట్టాలు, పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వకపోవడాన్ని నిలదీస్తూ జన్మభూమి తొలి రెండు రోజుల్లోనే పలు చోట్ల పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం కావడం గమనార్హం. గతంలో 5 విడతలుగా నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఏ అంశాలపై ఎన్ని వినతులు వచ్చాయి? ఎన్ని పరిష్కరించారు? మిగిలిన వాటి పరిస్థితి ఏమిటి? అనే కనీస విశ్లేషణ కూడా లేకుండా మరోసారి సిద్ధం కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమస్యలు పరిష్కరించకుండా పొగడ్తల కోసం గ్రామసభల పేరుతో డబ్బులు దుబారాగా తగలేయడం ఏమిటంటూ ప్రజలు మండిపడుతున్నారు.

ప్రతిజ్ఞ ప్రకారమైతే బాబుకే గుణపాఠం చెప్పాలి

'జన్మభూమి' ప్రారంభం సందర్భంగా సీఎం సందేశాన్ని రాష్ట్రవ్యాప్తంగా సభల్లో ప్రజలతో చదివిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. నిజంగా ఈ ప్రమాణాన్ని అమలు చేస్తే తొలుత సీఎం చంద్రబాబుకే గుణపాఠం చెప్పాల్సి ఉంటుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. 'విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, పార్లమెంట్ సాక్షిగా నాటి ప్రధాని ఇచ్చిన హామీలను సాధించేందుకు ప్రభుత్వంతో కలిసి ధర్మపోరాటం సాగిస్తా. ఏపీకి అన్యాయం చేసిన నమ్మక ద్రోహులకు ప్రజాస్వామ్యబద్ధంగా గుణపాఠం చెబుతా' అని జన్మభూమి కార్యక్రమాల్లో ప్రమాణం చేయిస్తున్నారు. అయితే 'ఏపీకి ప్రత్యేక హోదా అవసరమే లేదు.. హోదా సంజీవని కాదు.. హోదా పేరు ఎత్తితే లాఠీలతో కొట్టిస్తా.. కేసులు పెట్టి జైల్లో పెట్టిస్తా' అని బెదిరించింది చంద్రబాబేనని గుర్తు చేస్తున్నారు. ఏపీకి అన్యాయం చేసిన ఆయనకు ఏ శిక్షతో గుణపాఠం చెప్పాలని అధికార వర్గాలు సైతం ప్రశ్నిస్తున్నాయి.

దోచుకుంటూ ప్రతిజ్ఞలా?

రాష్ట్రంలో ఇనుము, సున్నపురాయి, గ్రానైట్ లాంటి ఖనిజాలే కాదు ఇసుక, మట్టిని కూడా దోచుకుంటున్నది అధికార పార్టీ నాయకులేనన్నది బహిరంగ రహస్యమే. పెద్దల అండదండలతో టీడీపీ నేతలు ఇసుక రేవులను సొంత జాగీర్లుగా మార్చుకుని రూ. 10 వేల కోట్లకుపైగా కాజేశారు. వాస్తవాలు ఇలా ఉండగా 'సహజ వనరుల సద్వినియోగంతో అభివృద్ధికి పాటుపడతా' అని ప్రతిజ్ఞ చేయించడం ప్రజలను మోసగించడం కాదా? అని ప్రశ్నిస్తున్నారు. గుంటూరు జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని హైకోర్టు తప్పుబట్టినా వాటాలు దక్కుతున్నందువల్లే సర్కారు చర్యలు తీసుకోలేదన్నది వాస్తవం కాదా? అని రాజకీయ నిపుణులు నిలదీస్తుండగా ఉన్నతాధికారులు సైతం ఇది వాస్తవమేనని అంతర్గతంగా అంగీకరిస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు సహజ వనరులను దోపిడీ చేయడంపై రిటైర్డ్ సీఎస్‌లు ఐవైఆర్ కృష్ణారావు, అజేయ కల్లం పలుమార్లు ప్రస్తావించడం గమనార్హం.

పది లక్షల మందికి గూడే లేదన్నారు కదా?

రాష్ట్రంలో 10 లక్షల మందికి సొంత ఇల్లు లేదని గత నెల 29న జరిగిన కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబే అంగీకరించారు. కర్నూలు, శ్రీకాకుళం, వైఎస్సార్ తదితర జిల్లాల్లో చిన్నారులు పౌష్టికాహార లోపంతో గిడసబారిపోతున్నారని, రక్తహీనతతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని సర్కారు గణాంకాలే తేటతెల్లం చేస్తున్నాయి. చంద్రబాబు మార్కు వృద్ధి రేటు పెరుగుదల, సంతోషాంధ్రప్రదేశ్‌కు ఇదే నిదర్శనమేమో? అని ఇటీవల ఓ కార్యక్రమంలో కలిసిన ఇద్దరు ఐఏఎస్ అధికారులు మాట్లాడుకోవడం రాష్ట్రంలో పరిస్థితికి అద్దం పడుతోంది.

ఎన్నికల్లో ఓట్ల కోసం...

ప్రజా సాధికార సర్వే వివరాలే కొలబద్దని, ఇందులో నమోదు కానివారిని సంక్షేమ పథకాల కోసం పరిగణనలోకి తీసుకోబోమని కలెక్టర్ల సదస్సుల్లో సీఎం పలుమార్లు స్పష్టం చేశారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆ డేటాతో సంబంధం లేకుండా కొత్త రేషన్ కార్డులు, స్ప్లిట్ కార్డులు మంజూరు చేస్తామని గత నెల 29న కలెక్టర్ల సదస్సులో సీఎం ప్రకటించడం గమనార్హం. సాధికార సర్వేతో సంబంధం లేకుండా 2.65 లక్షల మందిని పింఛన్‌దారుల జాబితాలో చేర్చవచ్చని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలాంటప్పుడు ఇంత కాలం వారికి ఎందుకు మంజూరు చేయలేదన్న ప్రశ్నకు ఎన్నికల నేపథ్యంలో ఇబ్బంది రాకూడదనే నిర్ణయం తీసుకున్నట్లు సీఎం పేర్కొంటున్నారు.

- ఇళ్ల స్థలాల పట్టాల కోసం మీకోసం వెబ్‌పోర్టల్ ద్వారా గతేడాది జూలై 19 వరకూ 55.30 లక్షల దరఖాస్తులు రాగా సర్కారు పలు రకాలుగా వడపోసి 5,98,118 మంది అర్హులని తేల్చింది. లక్షలాది మంది అర్హుల అర్జీలను తిరస్కరించి చెత్తబుట్టలో పడేసింది. 3.48 లక్షల అర్జీలు ఏమయ్యాయో తెలియకపోవడం గమనార్హం. కృష్ణా జిల్లాలో 1.05 లక్షలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 1.21 లక్షల మంది ఇళ్ల స్థలాల పట్టాలకు అర్హులని సర్కారు తేల్చి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఇవ్వకపోవడం గమనార్హం.
- రాష్ట్రంలో కొత్తగా పింఛన్ల కోసం 2.65 లక్షల మందిని జన్మభూమి కమిటీల ద్వారా ఎంపిక చేశారు. నెలలు గడుస్తున్నా వీరికి పింఛన్లు ఇవ్వలేదు.

ఏం జరగాలి?

రెవెన్యూ సదస్సులు, జన్మభూమి – మాఊరు... ఇలా పేర్లు ఏవైనా ప్రభుత్వ కార్యక్రమాలన్నింటి లక్ష్యం ఒకటే. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వీలైనంత వరకూ అక్కడికక్కడే పరిష్కరించాలి. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సినవైతే అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలి. ప్రత్యేక డ్రైవ్‌లా చేపట్టిన కార్యక్రమాల్లో వచ్చిన వినతులను నిర్దిష్ట వ్యవధిలోగా తీర్చాలి. సర్కారు నిజంగా ఈ దిశగా పనిచేస్తే గతంలో అందిన వినతులు పరిష్కారం అయ్యేవి. కానీ జన్మభూమిలో నాలుగేళ్లుగా పదేపదే అవే అర్జీలు సమర్పిస్తూ ప్రజలు విసిగిపోతున్నారు.

ఏం జరుగుతోంది?

టీడీపీ సర్కారు చేపట్టిన 'జన్మభూమి – మాఊరు' దీనికి పూర్తి భిన్నంగా సాగుతోంది. అధికార పార్టీ నాయకులు ఒక్కోరోజు ఒక్కో అంశంపై ఊకదంపుడు ఉపన్యాసాలతో సీఎంను పొగడటం, చేయని పనులను చేసినట్లుగా చెప్పడం ఇందులో రివాజుగా మారింది. గత ఐదు విడతల్లోనూ జరిగింది ఇదే. ఎన్నికలు దగ్గరపడటంతో ఇది ముదిరి పాకాన పడిందని అధికారులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. సర్కారు ఖర్చుతో ప్రచారం చేసుకోవడం కోసమే సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని చేపట్టారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు సమస్యలు చెప్పుకునే అవకాశం లేకుండా అధికార పార్టీ నేతలు సీఎంను పొగిడేందుకే సమయం సరిపోతోందని, గతంలో ఇచ్చిన అర్జీలన్నీ పెండింగులో ఉండగా మళ్లీ వృథా ఖర్చు మినహా ఈ సభల వల్ల ప్రయోజనం ఏమిటని రాజకీయ పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు.

ప్రతి జన్మభూమిలోనూ అర్జీ ఇచ్చా..



నా భర్త ఫర్నీచర్ షాపులో గుమస్తాగా పని చేస్తున్నారు. చిన్న ఇంటికే నెలకు రూ.2 వేలు అద్దె కట్టాల్సి వస్తోంది. ఆదాయం సరిపోక చాలా ఇబ్బంది పడుతున్నాం. పిల్లలు ఎదుగుతున్నా కనీసం గూడు కాదు కదా జాగా కూడా లేదు. ఇంటి స్థలం కోసం ప్రతి జన్మభూమి సభలోనూ అర్జీ ఇస్తున్నా. ఇల్లు మంజూరు చేస్తామంటే రూ.500 డీడీ కూడా కట్టా. కానీ ఇంతవరకు ఇవ్వలేదు.

– తమ్మినేని కామేశ్వరి, అమ్మిశెట్టి వారి వీధి, ఒంగోలు

'ఏలేరు' కుంభకోణంపై దర్యాప్తు కొనసాగించండి

- సీబీసీఐడీకి హైకోర్టు ఆదేశం
- జాప్యానికి తావు లేకుండా చార్జిషీట్ దాఖలు చేయండి
- బాధ్యులపై సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులు ఫిర్యాదు చేయాలి
- దీనిపై జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు విచారణ జరపాలి

సాక్షి, హైదరాబాద్: ఏలేరు భూ పరిహారం కుంభకోణంపై దర్యాప్తును కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ సీబీసీఐడీని హైకోర్టు ఆదేశించింది. 1996లో అనకాపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా దర్యాప్తు పూర్తి చేసి, జాప్యం లేకుండా సంబంధిత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఏలేరు కుంభకోణానికి సంబంధించి ఫిర్యాదు చేసే అధికారం ఏ స్థాయి న్యాయాధికారికి ఉంది? ఆ ఫిర్యాదుపై ఏ స్థాయి న్యాయస్థానం విచారణ జరపాలి? అనే అంశాలపై దాదాపుగా పదేళ్లుగా కొనసాగుతున్న సందిగ్ధతకు హైకోర్టు తెరదించింది. ఏలేరు కుంభకోణం బాధ్యులపై ఫిర్యాదు చేసే అధికారం విశాఖపట్నం జిల్లా అనకాపల్లి, చోడవరంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఉందని పేర్కొంది. ఈ ఫిర్యాదులపై విచారణ జరిపే అధికారం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు ఉందని వెల్లడించింది. ఏలేరు కుంభకోణానికి సంబంధించి ప్రత్యేక కోర్టు, స్పెషల్ సెల్ ఏర్పాటు చేయాలని భావిస్తే పరిపాలనాపరమైన నిర్ణయం కోసం హైకోర్టుకు విన్నవించే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వానికి కల్పించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్, న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.వి.భట్, జస్టిస్ ఎం.సీతారామమూర్తిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది.

పరిహారం చెల్లింపుల్లో అక్రమాలు: విశాఖ జిల్లాలో కాలువ తవ్వకాలకు సంబంధించి 1996లో భూ సేకరణ పరిహారం చెల్లింపుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. చనిపోయిన వ్యక్తుల పేర్లతో పరిహారం పొందడంతోపాటు ఫోర్జరీ పత్రాలు సృష్టించడం వల్ల ఖజానాకు భారీగా నష్టం వాటిల్లింది. అనకాపల్లి, చోడవరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో పనిచేస్తున్న న్యాయాధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, బ్యాంకు అధికారులు తదితరుల పాత్ర ఇందులో ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన ఈ వ్యవహారం 'ఏలేరు కుంభకోణం'గా పేరుగాంచింది.

వారందరికీ నోటీసులు జారీ చేయండి

భూ పరిహారానికి సంబంధించిన కేసులన్నింటినీ తెరిచి, అప్పట్లో పరిహారం పొందేందుకు అర్హులైన వారికి, పరిహారం పొందిన వ్యక్తులకు, వారి తరపు న్యాయవాదులకు, ప్రభుత్వానికి, ప్రభుత్వ న్యాయవాదులకు, అఫిడవిట్లు, వకాలత్‌లపై సంతకాలు చేసిన వారికి నోటీసులు జారీ చేయాలని అనకాపల్లి, చోడవరంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులను హైకోర్టు ఆదేశించింది. ఒక్కో కేసులోని వాస్తవాల ఆధారంగా సీఆర్‌పీసీ సెక్షన్ 340 ప్రకారం ప్రాథమిక విచారణ జరిపి, అవసరమైతే జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేసింది. అలాగే అనకాపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 1996లో నమోదైన కేసు ఆధారంగా దర్యాప్తు కొనసాగించి, ఎలాంటి జాప్యానికి తావు లేకుండా దర్యాప్తును పూర్తి చేయాలని సీబీసీఐడీని ఆదేశించింది. సీఆర్‌పీసీ సెక్షన్ 195లో పేర్కొన్న అంశాలను మినహాయించి మిగిలిన అంశాలపై సంబంధిత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని ధర్మాసనం తన తీర్పులో సీఐడీకి స్పష్టం చేసింది.

ఐఏఎస్ అధికారులతో ఎన్నికల సర్వే

- జన్మభూమి కార్యక్రమం ముసుగులో సర్వే బాధ్యతలు
- సీఎంవో నుంచి ప్రశ్నావళి
- జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తమ ప్రభుత్వ ప్రతిష్ట దిగజారిందని, ఈ విషయంలో ఏం చేయాలో సూచించి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఐఏఎస్ అధికారులను కోరిన సీఎం చంద్రబాబునాయుడు ఇప్పుడు మరో అడుగు ముందుకేశారు. ఏకంగా ఐఏఎస్ అధికారులతోనే ఎన్నికల సర్వే చేయిస్తున్నారు. జన్మభూమి–మాఊరు కార్యక్రమం ముసుగులో వారికి సర్వే బాధ్యతలను అప్పగించారు. రాష్ట్రంలోని 51 రెవెన్యూ డివిజన్లు ఉండగా, డివిజన్‌కు ఒకరు చొప్పున ఐఏఎస్, ఐఎఫ్ఎస్ ఆఫీసర్లను నోడల్ అధికారులుగా నియమించారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ప్రత్యేక విభాగం కూడా ఏర్పాటు చేశారు. ఏ విధంగా సర్వే నిర్వహించాలి, ప్రజల నాడీని ఎలా పసిగట్టాలి అనేదానిపై ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో) ఐఏఎస్‌లు, ఐఎఫ్ఎస్ అధికారులకు వర్తమానాలను పంపించింది. ఈ మేరకు ప్రశ్నావళిని కూడా అందజేసింది. అధికార టీడీపీ ఎమ్మెల్యేల పనితీరుతోపాటు ప్రతిపక్ష నేతల పనితీరుపై ప్రజల అభిప్రాయాలను సేకరించాలని సూచించింది. జన్మభూమి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన ఉందా లేదా తెలుసుకోవాలని సీఎంవో పేర్కొంది. ప్రతిపక్షాల గురించి ప్రజలు ఏమనుకుంటారో కూడా ఆరా తీయాలని కోరింది. జన్మభూమి కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన ఏ స్థాయిలో ఉంది, ఎంత మంది హాజరవుతున్నారు, టీడీపీ, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు, ఓటర్లు ఏమనుకుంటున్నారు, ఏ అభిప్రాయంతో ఉన్నారో పరిశీలన చేయాలని సూచించింది. ఎన్నికల సర్వే చేపట్టాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలు చూసి ఐఏఎస్ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అది సర్వీసు నిబంధనలకు విరుద్ధం

ఎమ్మెల్యేల పనితీరుపై ప్రతి 15 రోజులకోసారి సర్వేలు నిర్వహించి రహస్యంగా తనకు అందజేయాల్సిందిగా కలెక్టర్లు, అధికారులకు సీఎం చంద్రబాబు 5 నెలల క్రితం స్వయంగా సూచించిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. ఒక పార్టీకి చెందిన కార్యక్రమాలు, వ్యవహారాలపై ప్రజల నాడీని గ్రహించి చెప్పడం అంటే సర్వీసు నిబంధనలకు విరుద్ధమని కొంతమంది అధికారులు పేర్కొన్నారు. ఇప్పుడు ఏకంగా ఎన్నికల కోణంలో సర్వే నిర్వహించాలని ఆదేశించడాన్ని తప్పుపడుతున్నారు. అఖిల భారత సర్వీసు అధికారులను ఈ విధంగా పార్టీ కార్యక్రమాలకు గతంలో ఏ ప్రభుత్వాలూ వినియోగించుకోలేదని, ఇంత బరితెగించి వ్యవహరిస్తున్న ప్రభుత్వ పెద్దలను ఇప్పుడే చూస్తున్నానని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ పథకాలు టీడీపీ వారికేనా?

జన్మభూమి సభల్లో కొనసాగిన నిరసనలు, నిలదీతలు

సాక్షి, నెట్‌వర్క్: ఆరో విడత జన్మభూమి–మావూరు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభలు నిరసనలు, నిలదీతలతో హోరెత్తుతున్నాయి. ప్రభుత్వ పథకాలు టీడీపీ వారికేనా? అర్హులకు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లు ఎందుకు మంజూరు చేయడం లేదంటూ ఎక్కడికక్కడ ప్రజలు నిలదీస్తూ మంత్రులు, అధికారపార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. మంగళవారం 7వ రోజున రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

- విశాఖపట్నం జిల్లా పిఎల్‌పురం గ్రామసభలో వైఎస్సార్‌సీపీ నేత, మాజీ సీడీసీ చైర్మన్ గూటూరు శ్రీను, పార్టీ నేతలు పడాల దివాణం, మేడిశెట్టి బాబ్జి, శ్రీరంగం రామకృష్ణ తదితరులు పెథాయ్ తుపాను బాధిత రైతులకు గత నెల 20లోగా పరిహారం చెల్లిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినా ఇంతవరకు పరిహారం చెల్లించకపోవడంపై నిలదీశారు. వారిని టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని గ్రామసభ రణరంగంగా మారింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు.
- కృష్ణా జిల్లా బందరులో ప్రజాసమస్యలు విస్మరించి కేవలం ప్రభుత్వానికి అనుకూలమైన ప్రసంగాలు చేయడం ఏమిటని ప్రజలు పాలకులు, అధికారులను నిలదీశారు. నందివాడ మండలం తమిరిశ గ్రామంలో పింఛన్లు, రేషన్‌కార్డులు, పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రజలు అధికారులను నిలదీశారు.
- గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజలో నిర్వహించిన గ్రామసభలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కారం కావట్లేదని వృద్ధులు సీఎస్‌కు చెప్పుకునే ప్రయత్నం చేయగా అధికారులు అడ్డుకున్నారు.

టీడీపీలో వర్గవిభేదాలతో పోటీ జన్మభూమి..

- ప్రకాశం జిల్లాలో జన్మభూమి కార్యక్రమాల్లో టీడీపీలోని అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. సంతనూతలపాడు నియోజకవర్గంలోని గుమ్మనపాడులో ఇరువర్గాలు పోటాపోటీగా రెండు సభలు నిర్వహించాయి. ఉదయం తహశీల్దారు ఆధ్వర్యంలో జరిగిన సభలో ఎమ్మెల్సీ కరణం బలరాం, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు. వీరికి పోటీగా ఎంపీపీ అనిత ఎంపీడీఓతో కలిసి సాయంత్రం మళ్లీ సభ నిర్వహించారు. తర్లుపాడు మండలం మంగలికుంటలో పేదలకిచ్చిన 250 ఎకరాల భూములను అధికారపార్టీ నేతలు కబ్జా చేసి ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని, తక్షణం వాటిని పేదలకు కట్టబెట్టాలని గ్రామస్తులు జన్మభూమి సభను అడ్డుకున్నారు.
- శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం వెలగాడలో సంక్షేమ పథకాలు అర్హులకు అందట్లేదని స్థానికులు అధికారులు నిలదీశారు. భామిని మండలం బత్తిలి గ్రామ సభలో పాల్గొన్న మంత్రి కిమిడి కళావెంకటరావును అడ్డుకోవడానికి స్థానికులు ప్రయత్నించారు. వారిని పోలీసులు బలవంతంగా పంపించేశారు.
- రోడ్డు విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులకు అన్యాయం చేశారంటూ విజయనగరం పురపాలకసంఘం 12వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ప్రసాద రామకృష్ణను అశోక్‌నగర్ వాసులు అడ్డుకున్నారు.
- అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం ముప్పులకుంటలో ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరిని తాగునీటి సమస్యపై గ్రామస్తులు నిలదీశారు. దీంతో సహనం కోల్పోయిన ఎమ్మెల్యే తిట్ల పురాణం అందుకున్నారు.

అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం


ప్రకాష్ అంబేడ్కర్



సదస్సులో మాట్లాడుతున్న ప్రకాష్ అంబేడ్కర్, చిత్రంలో ముద్రగడ తదితరులు

అనంతపురం న్యూటౌన్: అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్ అన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. మంగళవారం అనంతపురంలో బలిజ బహుజన ఆత్మీయ సదస్సు జరిగింది. ఫ్రంట్ నిర్వాహకులు నాగరాజు, అమరనాథ్ ఆధ్వర్యంలో స్థానిక లలిత కళాపరిషత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రకాష్ అంబేడ్కర్‌తో పాటు కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం హాజరయ్యారు. ప్రకాష్ అంబేడ్కర్ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం మనువాద సిద్ధాంతాలతో చేస్తున్న రాజకీయాలు సామాన్యులకు ఇబ్బంది కలిగిస్తున్నాయన్నారు. రాజ్యాధికారం కొందరి చేతుల్లోనే ఉండడం వల్ల మెజార్టీ జనాభా కలిగిన వర్గాలు కూడా వారి కింద పనిచేయాల్సి వస్తోందని, రాజ్యాధికారం రావాలంటే పాలిత వర్గాలకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ.. కాపు రిజర్వేషన్లు బ్రిటీష్ కాలం నుంచి వస్తున్నవేనని, అయితే కొందరి స్వార్థం తమను ఓసీలుగా మార్చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ నిర్ణయం ఎన్నికల స్టంట్: యనమల



సాక్షి, అమరావతి: ఈబీసీలకు రిజర్వేషన్లని బీజేపీ చేస్తున్న హడావుడి అంతా ఎన్నికల స్టంట్ అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. అగ్రకుల పేదలకు రిజర్వేషన్లు ఆహ్వానించదగినదే అయినా కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక రాజకీయ రహస్యం దాగుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేదలకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని ప్రాథమికంగా ప్రతి ఒక్కరూ స్వాగతిస్తారని, అమలు ప్రక్రియలో అడ్డంకుల కల్పనపైనే అనుమానాలున్నాయని తెలిపారు. కులాలు, మతాల పరంగా రిజర్వేషన్లు ఉండరాదని బీజేపీ గతంలో వాదించిందని, తెలంగాణలో ముస్లింల రిజర్వేషన్లను వ్యతిరేకించిందని, అలాంటి పార్టీ ఇప్పుడు ఈబీసీలపై కపట ప్రేమ కనబరుస్తోందన్నారు. ఐదు రాష్ట్రాల్లో చిత్తుగా ఓడిపోవడం వల్లే బీజేపీ ఈ బిల్లు తెచ్చిందని విమర్శించారు. ఎన్ని రిజర్వేషన్లు తెచ్చినా రాబోయే ఎన్నికల్లో బీజేపీని ప్రజలు నమ్మరని తెలిపారు.

కాంగ్రెస్ స్వాగతిస్తుంది: రఘువీరారెడ్డి



సాక్షి, అమరావతి: అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ల నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి చెప్పారు. హైదరాబాద్‌లోని ఇందిర భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జనాభాకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఇవ్వాలని రాజ్యాంగం చెబుతోందని గుర్తుచేశారు. అయితే ఎన్నికల ముందు అది కూడా పార్లమెంట్ సమావేశాల ముగింపునకు కేవలం రెండు రోజుల సమయం మాత్రమే ఉందనగా మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం శోచనీయమన్నారు. సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మ కేసులో సుప్రీం తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని రఘువీరా వ్యాఖ్యానించారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ వ్యవస్థలను ప్రధాని మోదీ నిర్వీర్యం చేశారని విమర్శించారు.

బాబు నిజ స్వరూపాన్ని బయటపెడతాం

- జాతీయ స్థాయిలో అన్ని పార్టీలకు వివరిస్తాం
- 'అవినీతి చక్రవర్తి' పుస్తకాన్ని ఎంపీలందరికీ ఇస్తాం
- ఢిల్లీలో పుస్తకం ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజాస్వామ్య పరిరక్షణ ముసుగులో ప్రతిపక్ష పార్టీలతో కూటమి ఏర్పాటు ప్రయత్నాలు చేస్తున్న అవినీతి చక్రవర్తి అయిన చంద్రబాబు నిజస్వరూపాన్ని జాతీయ స్థాయిలో ఎండగడతామని వైఎస్సార్‌సీపీ నేతలు స్పష్టం చేశారు. గత నాలుగున్నరేళ్లలో చంద్రబాబు రాష్ట్రంలో చేసిన అవినీతి, అక్రమాలపై వైఎస్సార్‌సీపీ ప్రచురించిన 'అవినీతి చక్రవర్తి' ఆంగ్ల పుస్తకాన్ని మండలి ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రత్యేక హోదా కోసం రాజీనామాలు చేసిన ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాదరావు మంగళవారం ఢిల్లీలో విడుదల చేశారు. బాబు అవినీతిని జాతీయ స్థాయి నేతలకు, ఎంపీలకు తెలియజెప్పేలా 'అవినీతి చక్రవర్తి' పుస్తకాన్ని ఇస్తామని, అలాగే దర్యాప్తు సంస్థలకు అందజేసి విచారణ కోరతామన్నారు. ఇంకా ఏమన్నారో వారి మాటల్లోనే..

ప్రభుత్వ సహకారంతో దోపిడి: ఉమ్మారెడ్డి

ప్రభుత్వ పెద్దలు అవినీతికి పాల్పడడమే కాకుండా, కింది స్థాయిలో అవినీతిని ప్రోత్సహించి అన్ని స్థాయిల్లో దోచుకున్నారు. జాతీయ సంస్థలు కూడా ఏపీలో అవినీతిపై హెచ్చరించాయి. వాటర్‌మెన్ ఆఫ్ ఇండియా రాజేంద్ర సింగ్ కూడా ఇటీవల రాష్ట్రంలో పర్యటించి అమరావతి భూ కుంభకోణం రాఫెల్ కుంభకోణం కంటే పెద్దదని పేర్కొన్నారు.

ఎన్నికల్లో డబ్బుతో గెలవాలని చూస్తున్నారు: మేకపాటి

కాదేదీ అవినీతికి అనర్హం అన్న చందంగా చంద్రబాబు గత నాలుగున్నరేళ్ల పాలనలో 'అవినీతి చక్రవర్తి'గా ఎదిగి అక్షరాల రూ.6,17,585 కోట్ల అవినీతికి పాల్పడ్డారు. ఎమ్మెల్యేలను, ఎంపీలను కొనుగోలు చేసి ప్రజాస్వామ్యాన్నే భ్రష్టుపట్టించారు. ఈ పుస్తకాన్ని రాష్ట్రపతికి, ప్రధానికి అన్ని జాతీయ పార్టీల దృష్టికి తీసుకెళ్తాం.

అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తాం: వైవీ సుబ్బారెడ్డి

రాష్ట్రంలో అన్ని రంగాల్లో చంద్రబాబు, మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు ఏ విధంగా దోచుకున్నారన్నది పుస్తకంలో వివరించాం. వీటిపై కేంద్రం విచారణ జరపాలి. అవసరమైతే కోర్టులను ఆశ్రయిస్తాం. అలాగే ఢిల్లీ వచ్చి ప్రజాస్వామ్య పరిరక్షణ ముసుగులో ఎవరితో అయితే కూటమి కట్టాలని బాబు చూస్తున్నారో వారందరికి ఈ పుస్తకాలు అందజేసి ఆయన నిజ స్వరూపాన్ని తెలియజేస్తాం.

రూ. లక్షల కోట్లు దండుకున్నారు: విజయసాయిరెడ్డి

చంద్రబాబు అవినీతిని రాష్ట్ర బడ్జెట్‌తో పోల్చాల్సిన పనిలేదు. ఎందుకంటే రాష్ట్ర విభజన తరువాత ఏపీ అప్పు రూ.96 వేల కోట్లు ఉంటే, బాబు అధికారంలోకి వచ్చాక ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని అతిక్రమించి రూ.2 లక్షల కోట్లకుపైగా అప్పులు చేశారు. అలాగే ప్రభుత్వం గ్యారెంటీ మీద తెచ్చిన అప్పులు, నీటిపారుదల ప్రాజెక్టులను తాకట్టుపెట్టి తెచ్చిన అప్పులు, కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పులు, ఇష్టానుసారంగా మంత్రివర్గ సమావేశాల్లో కారుచౌకకు ప్రభుత్వ భూమలు కేటాయించి పారిశ్రామికవేత్తల నుంచి క్విడ్ ప్రో కో ద్వారా విదేశాల్లో డబ్బులు కూడబెట్టుకోవడం ద్వారా చంద్రబాబు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల కోట్లు దండుకున్నారు.



మంగళవారం ఢిల్లీలో 'అవినీతి చక్రవర్తి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలిలో ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి, ఎంపీలు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి, మాజీ ఎంపీలు మేకపాటి, సుబ్బారెడ్డి, వరప్రసాద్

బాబు నైజం నాలుగు 'అ'లు: వరప్రసాదరావు

అబద్ధాలు, అహంకారి, అసమర్థుడు, అవినీతి చంద్రబాబు నైజం. 600 అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజల్ని మోసం చేశారు. సీఎం స్థానంలో ఉండి అట్టడుగువర్గాల ప్రజల్ని దూషించే అహంకారి. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను సాధించుకోలేని అసమర్థుడు. నాలుగున్నరేళ్లగా సాగిస్తున్న విచ్చలవిడి అవినీతి.. ఇదీ బాబు నైజం. అన్ని రంగాలను భ్రష్టుపట్టించిన చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు.

రాష్ట్రంలో రాక్షస పాలన: వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

రాష్ట్రంలో భయంకరమైన రాక్షస పాలన సాగుతోంది. ఏపీలో జరుగుతున్న భారీ అవినీతిపై ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శులు మీడియా ముందుకొచ్చి బహిర్గతం చేశారంటే రాష్ట్రంలో ఏ స్థాయిలో అవినీతి జరుగుతోందో అర్థమవుతోంది.

హోదా కోసం పార్లమెంటు ఆవరణలో ఆందోళన

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఆవరణలో ఆందోళన కొనసాగించింది. పార్టీ ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ వెలగపల్లి వరప్రసాదరావు మంగళవారం ఉదయం పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రత్యేక హోదా కోసం నినదించారు. ఏపీకి కేంద్రం న్యాయం చేయాలని, ప్రత్యేక హోదా అమలు చేయడం ద్వారా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల కోసమే రిజర్వేషన్లు!

- కేంద్రప్రభుత్వంపై సీఎం చంద్రబాబు ధ్వజం
- కేంద్రం సహకరించకున్నా అభివృద్ధి చేస్తున్నాం
- కర్నూలు విమానాశ్రయాన్ని ప్రారంభించిన సీఎం
- కోసిగిలో జన్మభూమి సభలో ప్రసంగం



కర్నూలు విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: కేవలం ఎన్నికల కోసమే అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్లను కేంద్రప్రభుత్వం ముందుకు తీసుకొచ్చిందని సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఈ బిల్లును తాము సమర్థించబోమన్నారు. అయితే వాల్మీకులు, కాపులు, రజకులకు రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం పంపిన తీర్మానాన్ని ఆమోదిస్తే అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ల అంశాన్ని తాము సమర్థిస్తామని చెప్పారు. కర్నూలులోని ఓర్వకల్లులో 1,010 ఎకరాల్లో అభివృద్ధి చేసిన విమానాశ్రయంతోపాటు 1,000 మెగావాట్ల సోలార్ పార్కును సీఎం మంగళవారం ప్రారంభించారు. కర్నూలులో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, మూడు ఎంఎస్‌ఎంఈ పార్కుల అభివృద్ధి వంటి పలు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగిలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో పాల్గొని ప్రసంగించారు. కర్నూలు విమానాశ్రయంలోనే సివిల్ ఏవియేషన్ క్రీడలను అంటే పారా గ్లైడింగ్ వంటి వాటిని అభివృద్ధి చేసేందుకు అవగాహన ఒప్పందం (ఎంవోయు) కుదుర్చుకున్నామని తెలిపారు. కేంద్రం సహకరించకపోయినప్పటికీ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. కేంద్రం రూ.87 వేల కోట్ల సహాయం చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని మన విమానాశ్రయాలతో కేంద్రానికి ఆదాయం వస్తోందని, అయినా కర్నూలులో విమానాశ్రయ అభివృద్ధికి కేంద్రం ముందుకు రాలేదన్నారు. ప్రపంచంలోనే మూడో పెద్ద సోలార్ ప్లాంటు కర్నూలుకు వచ్చిందన్నారు. ఇది ఇంకా పెద్ద ప్రాజెక్టు అవుతుందని, ఇక్కడే దాదాపు 5 వేల మెగావాట్ల సోలార్, హైబ్రిడ్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగువేల మెగావాట్ల సామర్థ్యంతో 4 పెద్ద సోలార్ పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.16 వేల కోట్లతో 2 కోట్ల ఇళ్లకు కుళాయిల ద్వారా మంచినీటిని అందించేందుకు 'జలధార' పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడువేల గ్రామాలకు రూ.4 వేల కోట్లతో సీసీ, బీటీ రోడ్లను వేస్తామన్నారు. వాల్మీకులను అభివృద్ధి చేసేందుకు రూ.100 కోట్లను కేటాయిస్తామన్నారు.

మంత్రి అఖిలప్రియ దూరం

తన అనుచరుల ఇళ్లలో పోలీసులు సోదా చేశారంటూ గన్‌మెన్లను వెనక్కి పంపిన మంత్రి అఖిలప్రియ.. సీఎం కార్యక్రమానికి కూడా దూరంగా ఉన్నారు. మంత్రి అఖిలప్రియ జిల్లాలోనే ఉన్నప్పటికీ ఈ కార్యక్రమానికి హాజరుకాకపోవడం గమనార్హం. అక్క బాటలోనే తన గన్‌మెన్లను కూడా వెనక్కి పంపిన నంద్యాల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాత్రం సీఎం కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, మంత్రులు కాలవ శ్రీనివాసులు, లోకేష్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలు విడ్డూరం: వీర్రాజు



దేవీచౌక్ (రాజమహేంద్రవరం): జన్మభూమి సభల్లో ఆత్మాభిమానం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడటం విడ్డూరమేనని, ఆయన నిఘంటువులో ఆత్మాభిమానం అన్న మాటే లేదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్టీ రామారావు టీడీపీ స్థాపించిన సమయంలో కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశిస్తే ఎన్టీఆర్ మీదనే పోటీ చేస్తానని చంద్రబాబు ప్రతిజ్ఞలు చేశారని, టీడీపీ విజయం సాధించాక మామ నీడన చేరారని అన్నారు. బీజేపీ కార్యకర్తలను తక్కువగా అంచనా వేయవద్దని చంద్రబాబుకి హితవు పలికారు. కడపలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణం చేసే సత్తా చంద్రబాబుకు లేదని చెప్పారు. రాజ్యాంగ సవరణ ద్వారా రిజర్వేషన్లను మరో పది శాతం పెంచి, అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్లు కల్పించడానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. ఇది ఎలక్షన్ స్టంట్ కాదని, దీనిపై 1950 నుంచీ అగ్రవర్ణాల్లో చర్చ జరుగుతోందని గుర్తుచేశారు.


మంగళవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో పార్లమెంట్ భవనం

కోటా బిల్లుకు లోక్‌సభ ఆమోదం

అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. అనూహ్యంగా.. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ముగిసేందుకు రెండు రోజుల ముందు.. ఈ బిల్లును మోదీ ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చింది. సోమవారం బిల్లుకు కేబినెట్ ఆమోదం, ఆ వెంటనే మంగళవారం లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టడం, అధికార, విపక్ష సభ్యులు పాల్గొన్న చర్చ అనంతరం బిల్లు ఆమోదం పొందడం చకచకా జరిగిపోయాయి. సభ ఆమోదం కోసం ఈ బిల్లు బుధవారం రాజ్యసభ ముందుకు రానుంది. బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా.. బిల్లును తీసుకువచ్చిన సమయాన్ని, ప్రభుత్వ ఉద్దేశాన్ని మాత్రమే విపక్షాలు విమర్శించాయి. అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ కాంగ్రెస్, టీఎంసీ, టీఆర్ఎస్, బీజేడీ, ఎస్పీ, బీఎస్పీ, తదితర ప్రధాన పార్టీలు బిల్లుకు మద్దతిచ్చాయి. దాంతో 323-3 తేడాతో బిల్లు లోక్‌సభ ఆమోదం పొందింది. ఎంఐఎం, ఆలిండియా ముస్లిం లీగ్ మాత్రం ఈ బిల్లును వ్యతిరేకించాయి. అన్నా డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. ఈ బిల్లు కోసమే మంగళవారమే నిరవధికంగా వాయిదా పడాల్సిన రాజ్యసభ గడువును ఒకరోజు పొడిగించారు.

- అనుకూలంగా 323 మంది, వ్యతిరేకంగా ముగ్గురు ఓటు
- 124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు పార్టీలకు అతీతంగా మద్దతు
- బిల్లు కోర్టులో నిలబడగలదా? అని విపక్షాల అనుమానం

న్యూఢిల్లీ

విద్య, ఉద్యోగాల్లో అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించే చారిత్రక బిల్లు ఒక అడ్డంకిని అధిగమించింది. 124వ రాజ్యాంగ సవరణతో తెచ్చిన ఈ బిల్లును మంగళవారం కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి థావర్‌చంద్ గహ్లోత్ లోక్‌సభలో ప్రవేశపెట్టగా సభకు హాజరైన వారిలో మూడింట రెండింతలకు పైగా మెజారిటీతో ఆమోదం పొందింది. సుమారు నాలుగున్నర గంటల పాటు సాగిన చర్చ అనంతరం చేపట్టిన ఓటింగ్‌లో 323 మంది బిల్లుకు అనుకూలంగా, ముగ్గురు వ్యతిరేకంగా ఓటేశారు. ముంచుకొస్తున్న లోక్‌సభ ఎన్నికలు, సామాజిక సమీకరణల దృష్ట్యా ఎంతో కీలకమైన ఈ బిల్లుకు పార్టీలకు అతీతంగా మద్దతు లభించింది. బిల్లు ఆమోదం పొందిన సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సభలోనే ఉన్నారు. దేశ ప్రయోజనాల రీత్యా తీసుకొచ్చిన ఈ బిల్లు చారిత్రకమని ప్రభుత్వం పేర్కొనగా, ఎన్నికల జిమ్మిక్కని విపక్షాలు పెదవి విరిచాయి. అది న్యాయ ప్రక్రియ పరీక్షకు నిలబడగలదా అని సందేహం లేవనెత్తాయి. బిల్లులోని నిబంధనలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అన్నా డీఎంకే సభ్యులు వాకౌట్ చేయగా, ఇండియన్ ముస్లిం లీగ్, హైదరాబాద్ పార్టీ ఏఐఎంఐఎంలు బిల్లును వ్యతిరేకించాయి. ఓటింగ్ అనంతరం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. ఈ బిల్లును బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.


లోక్‌సభలో కేంద్ర మంత్రి థావర్‌చంద్ గహ్లోత్‌ను అభినందిస్తున్న సహచర ఎంపీలు

సుప్రీంకోర్టులోనూ గట్టెక్కుతుంది: గహ్లోత్

చర్చ ముగిశాక మంత్రి థావర్‌చంద్ గహ్లోత్ విపక్షాల అభ్యంతరాలకు సమాధానమిచ్చారు. ఒకవేళ బిల్లు న్యాయ సమీక్షకు వెళ్లినా, సుప్రీంకోర్టు ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విపక్షాల ఆందోళనలన్నీ నిరాధారమని, వాటి గురించి దిగులు చెందాల్సిన అవసరం లేదని అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చాక 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్'కు పాటుపడతామన్న ఎన్డీయే దార్శనికతకు అనుగుణంగానే ఈ బిల్లును రూపొందించినట్లు తెలిపారు. అగ్రవర్ణాల్లోనూ పేదలు దుర్భర జీవితం గడుపుతున్నారని, వారికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. గతంలో పలు కమిటీలు అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసినా, తమ ప్రభుత్వమే దాన్ని నిజం చేసిందని పేర్కొన్నారు.

రాష్ట్రాల ఆమోదం అక్కర్లేదు: జైట్లీ

చర్చ మధ్యలో జోక్యం చేసుకున్న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ..ఈ బిల్లును రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించాల్సిన అవసరంలేదని, రాజ్యసభలో గట్టెక్కిన తరువాత రాష్ట్రపతి సంతకం చేస్తే చట్టరూపం దాలుస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితి కుల ఆధారిత రిజర్వేషన్లకే వర్తిస్తుందని, కానీ తాజా బిల్లులో ఆర్థికంగా వెనకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించామని తెలిపారు. సుప్రీంకోర్టు సమీక్షలో ఈ బిల్లు విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆర్థిక స్థోమత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేందుకు గతంలోనూ కేంద్రం, రాష్ట్రాల స్థాయుల్లో జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయని.. నోటిఫికేషన్లు, సాధారణ చట్ట నిబంధనల ద్వారా చేయడం వల్లే అలా జరిగిందని అభిప్రాయపడ్డారు. సామాజికంగా, ఆర్థికంగా పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని అన్నారు. గతంలో కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఇలాంటి కోటాను చేర్చిందని, దానికి చాలా పార్టీలు మద్దతుపలికాయని గుర్తుచేశారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని కేంద్ర మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ కోరారు.

హడావుడిగా తెచ్చారు: విపక్షాలు

లోక్‌సభ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకునే కేంద్ర హడావుడిగా ఈ బిల్లు తెచ్చిందని, ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు చేసిన గిమ్మిక్కని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఆర్థిక స్థోమత ఆధారంగా రిజర్వేషన్లు కల్పించేందుకు గతంలో పీవీ నరసింహారావు చేసిన ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చిన సంగతిని గుర్తుచేశాయి. హడావుడిగా తీసుకొచ్చిన ఈ బిల్లులో కొన్ని లోపాలున్నాయని, వాటిని అధ్యయనం చేసేందుకు జేపీసీకి పంపాలని కాంగ్రెస్ సూచించింది. ఉద్యోగాలే లేనప్పుడు 10 శాతం కోటా ఎందుకని సీపీఎం ఎంపీ జితేంద్ర చౌదరి ప్రశ్నించారు. ఈ బిల్లును సుప్రీంకోర్టు కొట్టేస్తుందని ఐఎన్ఎల్‌డీ సభ్యుడు దుష్యంత్ చౌతాలా అన్నారు.

రాజ్యసభలో ప్రతిఘటన తప్పదా?

న్యూఢిల్లీ: అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లు లోక్‌సభలో సజావుగా గట్టెక్కినా, రాజ్యభలో మాత్రం అధికార పార్టీకి ప్రతిఘటన తప్పకపోవచ్చని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ముంగిట ఈ బిల్లును హడావుడిగా తేవాల్సిన అవసరం ఏముందని ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. కాంగ్రెస్ ఈ బిల్లుకు మద్దతిస్తున్నా ఇతర ప్రతిపక్షాలు మాత్రం అడ్డంకులు సృష్టించే అవకాశాలున్నాయి. రాజ్యసభ సెషన్‌ను ఒక రోజు పొడిగించడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన విపక్షాలు నేడు సభలో నిరసనకు దిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లుకు విపక్షాలు అడ్డంకులు సృష్టిస్తే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాగ్రహానికి గురవుతారని బీజేపీ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. రాజ్యసభలో 73 మంది సభ్యులతో బీజేపీ అతిపెద్ద పార్టీగా ఉన్నా సాధారణ మెజారిటీకి చాలా దూరంలో ఉంది.


బిల్లుపై చర్చ సందర్భంగా మోదీ, రాజ్‌నాథ్

మోదీ, షా హర్షం..

అగ్రవర్ణ పేదల బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందటం దేశ చరిత్రలో గొప్ప క్షణమని, 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' అనే తమ విధానాన్ని అది ప్రతిబింబిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. కుల, సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా ప్రతి పేదవాడు గౌరవప్రదంగా జీవించేలా చూసేందుకు కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటించారు. ఈ బిల్లు చారిత్రకమని, సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి దిశగా పడిన గొప్ప ముందడుగు అని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా పేర్కొన్నారు.

రాజ్యసభ పొడిగింపుపై విపక్షాల నిరసన

రాజ్యసభ సమావేశాలను ఒక రోజు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఏకపక్షమంటూ విపక్షాలు నిరసన చేపట్టాయి. పార్లమెంటు కాంప్లెక్స్‌లోనే నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించాయి. రాజ్యసభ అధ్యక్షుడు వెంకయ్య నాయుడుతో జరిగిన చర్చల్లోనూ.. తమను సంప్రదించకుండా సమావేశాలను పొడిగించారంటూ పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ బిల్లు సహా పలు బిల్లుల ఆమోదం కోసం మంగళవారంతో ముగియాల్సిన రాజ్యసభ సమావేశాలను బుధవారం వరకు కేంద్రం పొడిగించడం తెలిసిందే. అయితే సమావేశాలను పొడిగించే అధికారం సభ చైర్మన్‌కు ఉంటుంది.

ప్రతి ఒక్కరికీ రిజర్వేషన్!



న్యూఢిల్లీ: అగ్రవర్ణాల్లో పేదలకి విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని భావిస్తోన్న 10% కోటా పరిధిలోనికి దాదాపు భారతీయులందరూ వస్తారని ఓ పరిశీలనలో తేలింది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే భారతీయులంతా తాజాగా ప్రకటించిన 10%రిజర్వేషన్ల కోటానో, లేదా ఇతర రిజర్వేషన్ల కోటా కిందో లబ్దిపొందుతారని అంచనా వేశారు. ఐటీ శాఖ,, లేదా నేషనల్ సాంపిల్ సర్వే గణాంకాల ప్రకారం 95% మంది భారతీయ కుటుంబాలు కొత్తగా ప్రభుత్వం ఇచ్చిన 8 లక్షల ఆదాయపరిమితి లోని వారే కావడం గమనార్హం.

వార్షికాదాయం 8 లక్షలు ఎందరికుంది?

వార్షికాదాయం 8 లక్షల రూపాయలంటే నెలసరి ఆదాయం 66 వేల పైన ఉండాలి. నేషనల్ శాంపిల్ సర్వే 2011–2012 తాజా లెక్కల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేవారి నెలసరి అత్యధిక ఆదాయం 2,625. పట్టణ ప్రాంతాల్లో అయితే నెలసరి ఆదాయం 6,015 లోపు వాళ్లే ఉన్నారు. 8 లక్షల రూపాయల ఆదాయం పైబడిన వారు కేవలం 5 శాతం మాత్రమే ఉన్నారు. అలాగే 2016–17 గణాంకాల ప్రకారం 2.3 కోట్ల మంది మాత్రమే తమకు 4 లక్షల రూపాయలకన్నా అధికంగా వార్షికాదాయం ఉన్నట్టు ప్రకటించారు. ఇలా ప్రతి ఇంటిలో ఇద్దరు వ్యక్తులకు చెరి నాలుగు లక్షల లెక్కన ఆదాయం ఉన్నవారు ఉన్నారనుకుంటే, ఎనిమిది లక్షల వార్షికాదాయం దాటిన కుటుంబాలు దేశంలో కోటి మాత్రమే ఉన్నట్టు అవుతుంది. ఇది దాదాపు దేశంలోని 4 శాతానికి సమానం. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ప్రకారమే ఏడాదికి తలసరి ఆదాయం 1.25 లక్షలు అంటే ఐదుగురు సభ్యులున్న కుటుంబానికి 6.25 లక్షల రూపాయలు. అంటే ఎనిమిది లక్షల వార్షికాదాయం అనేది జాతీయ సగటుకన్నా ఎక్కువని స్పష్టమౌతోంది.

ఐదెకరాల పరిమితిలోని వారు ఎందరు?

ఇక భూ పరిమితి కూడా చాలా ఉదారంగా ఉన్నట్టు భావిస్తున్నారు. దేశంలోని 86.2 శాతం మంది 2 హెక్టార్ల లోపు భూమి ఉన్నవారే. అంటే ఐదెకరాల్లోపు వారేనని 2015–16 గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీన్ని బట్టి కూడా అత్యధికమంది ఈ కోటా పరిధిలోకి వస్తారని స్పష్టం అవుతోంది. అలాగే 1000 చదరపు అడుగుల కంటే తక్కువ వైశాల్యం కలిగిన సొంత ఇల్లు ఉన్నవారు ఎందరంటే నేషనల్ సాంపిల్ సర్వే 2012 ప్రకారం అత్యధికంగా 20 శాతం మంది భారతీయులకు మాత్రమే కేవలం 45.99 చదరపు మీటర్ల స్థలంలో ఇళ్ళున్నాయి. అంటే వీరంతా 500 చదరపు అడుగుల లోపునే ఇళ్ళుకట్టుకున్నారు. ఇది ప్రభుత్వం విధించిన పరిమితిలో సగం మాత్రమే. దీన్ని బట్టి కనీసం 80 శాతం నుంచి 90 శాతం మంది 1000 చదరపు అడుగుల స్థలంలో ఇల్లు లేనివారే ఉంటారు. వీరంతా 10 శాతం కోటాకి అర్హులవుతారు. దీన్నిబట్టి ఇప్పటికే రిజర్వేషన్లు పొందుతున్న దళితులు, ఆదివాసీలు, బీసీలు మినహా మిగిలిన వారంతా ఈ 10 శాతం రిజర్వేషన్ల కోటా పరిధిలోనికి వస్తారు. అధికారిక లెక్కల ప్రకారం దేశంలో మొత్తం ఎస్సీ, ఎస్టీలు 23 శాతం మంది ఉన్నారు. ఓబీసీలు 40–50 శాతం ఉన్నారు. మిగిలిన 27–37 శాతం మంది మాత్రమే ప్రస్తుతం ఏ కోటాలోనూ రిజర్వేషన్లు పొందని వారున్నారు. కొత్తగా పెట్టిన పదిశాతం కోటా వీరికి దక్కుతుంది.

వివిధ రాష్ట్రాల్లో రిజర్వేషన్లు

హరియాణాలో 2016 లో జాట్లు సహా ఆరు సామాజిక వర్గాల వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల బిల్లుని బీజేపీ ప్రభుత్వం ఆమోదించింది. హైకోర్టు కోటా అమలుని నిలిపేసింది. గుజరాత్‌లో అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకోసం 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీజేపీ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసింది. గుజరాత్‌లో ఇప్పటికే 49.5 శాతం రిజర్వేషన్లున్నాయి. దీంతో హైకోర్టు ఆర్డినెన్స్‌ని కొట్టివేసింది. మహారాష్ట్రలో 2018 నవంబర్‌లో మరాఠాలకు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో 16 శాతం రిజర్వేషన్లు కల్పించింది. దీంతో మహారాష్ట్రలో రిజర్వేషన్లు 68 శాతానికి పెరిగాయి.

బిల్లులో లోపాలు: విపక్షాలు

న్యూఢిల్లీ: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఎన్నికల వేళ ప్రభుత్వ రాజకీయ ఎత్తుగడ అని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈ బిల్లులో అనేక లోపాలున్నందున న్యాయ సమీక్షకు నిలబడలేదని చెప్పారు. లోక్‌సభలో బిల్లుపై చర్చ ఎవరు ఏమన్నారంటే..

■ కేవీ థామస్, కాంగ్రెస్

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు గతంలో పీవీ నరసింహారావు చేసిన ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. మోదీ ప్రభుత్వం హడావుడిగా తెచ్చిన ఈ బిల్లులో అనేక లోపాలున్నాయి. ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపాలి. ఆర్థికంగా వెనుకబడిన వారికి జనరల్ కేటగిరీలో 10% కోటా కల్పించేందుకు సోమవారం కేబినెట్ ఆమోదం తెలపగా మంగళవారం పార్లమెంట్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ చర్య ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనేక అనుమానాలకు తావిస్తోంది. వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పన్నిన ఎత్తుగడగా కనిపిస్తోంది.

■ అసదుద్దీన్ ఒవైసీ, ఏఐఎంఐఎం

రాజ్యాంగాన్ని మోసం చేసే, అంబేడ్కర్‌ను అవమానించేలా ఉన్న ఈ బిల్లును మేం వ్యతిరేకిస్తున్నాం. సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు కల్పించడమే ఈ బిల్లు ఉద్దేశం. దీంతోపాటు సామాజిక, విద్యా వెనుకబాటు తనాన్ని ఇది తొలగిస్తోంది. అయితే, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను రాజ్యాంగం గుర్తించడం లేదు. ఎలాంటి కచ్చితమైన సమాచారం, ఆధారం లేకుండా ప్రభుత్వం చేస్తున్న ఈ మొత్తం ప్రయత్నం ఒక మోసం. దీనివల్ల రాష్ట్రాలపై భారం పడుతుంది. మరాఠాలకు రిజర్వేషన్లపై ఏం జరగనుందో ప్రభుత్వం నుంచి తెలుసుకోవచ్చా? ఈ బిల్లు కూడా సుప్రీంకోర్టులోనే ఆగిపోతుంది.

■ ఎం.తంబిదురై, ఏఐఏడీఎంకే

ఆర్థిక వెనుకబాటు ఆధారంగా కాకుండా సామాజిక వెనుకబాటు ఆధారంగా రిజర్వేషన్ ఉండాలి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు పథకాలు తీసుకువచ్చింది. అయితే, అవన్నీ విఫలం కావడం వల్లే ప్రభుత్వం రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చిందా?

■ సుదీప్ బందోపాధ్యాయ, తృణమూల్ కాంగ్రెస్

ఉద్యోగాలు కల్పించటానికి బదులు యువతను తప్పుదోవ పట్టించటానికే ప్రభుత్వం ఈ బిల్లు ప్రవేశపెట్టింది. ఇది కేవలం భ్రమ..వాస్తవ రూపం దాల్చదు. హామీ ఇవ్వడమే తప్ప రిజర్వేషన్ అమలు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. అయినా, ఈ బిల్లుకు మా పార్టీ పూర్తి మద్దతు ఇస్తుంది.

■ ఆనంద్‌రావ్ అడ్సుల్, శివసేన

ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు ఆలస్యంగానైనా ఇవ్వడం మంచిదే. ఈ బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాం.

■ బి.మహ్తాబ్, బిజూ జనతాదళ్

సవరణలు ప్రతిపాదించేందుకు ప్రతిపక్షాలకు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా 'ప్రత్యేక ఎజెండా'తో ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టింది.

■ జితేంద్ర చౌధురి, సీపీఎం

జనరల్ కేటగిరీలో 10% కోటా కల్పించాలని ప్రభుత్వం యత్నిస్తోంది. అయితే, ప్రభుత్వ ఉద్యోగాలెక్కడున్నాయి? ఈ బిల్లును మరింత సమగ్రంగా మార్చేందుకు జేపీసీ లేదా స్టాండింగ్ కమిటీకి పంపాలి.

■ సుప్రియా సులే, ఎన్సీపీ

ప్రభుత్వానికే చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ చివరి సమావేశాల్లో చివరి రోజు హడావుడిగా ఎందుకు ప్రవేశపెడుతుంది? సుప్రీంకోర్టులో ఈ బిల్లు ఆగిపోతుందని స్వయంగా కేబినెట్ మంత్రి ఒకరు అనుమానం వ్యక్తం చేశారు.

■ ధర్మేంద్ర యాదవ్, ఎస్పీ

రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం ఎన్నికల గిమ్మిక్కేనని ఉన్నత కులాల వారికీ తెలుసు.

■ జై ప్రకాశ్ నారాయణ్ యాదవ్, ఆర్జేడీ

హడావుడిగా ఈ బిల్లును తీసుకురావడం అగ్ర కులాల వారిని మోసగించేందుకు తప్ప మరేమీ కాదు.

న్యాయ సమీక్షకు నిలుస్తుందా?

ఈబీసీ కోటాపై న్యాయనిపుణుల అనుమానాలు

అగ్రవర్ణ పేదలకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 10% రిజర్వేషన్ ప్రక్రియకు చట్టపరమైన అడ్డంకులు తప్పవని పలువురు ప్రముఖ న్యాయవాదులు భావిస్తున్నారు. 'ప్రభుత్వం ఏ వర్గం ప్రజలకైనా రిజర్వేషన్లు ఇవ్వవచ్చు. అయితే దీని వల్ల లబ్ధి పొందే వర్గం ప్రజలకు ప్రస్తుతం ఉద్యోగాలు, విద్యలో తగినంత ప్రాతినిధ్యం లేదనే విషయాన్ని సంఖ్యా వివరాలతో సహా రుజువు చేయాల్సి ఉంటుంది. ఏ వర్గానికి కోటా ఇవ్వదలిచినా జనాభాలో, ఉద్యోగాల్లో, విద్యా సంస్థల్లో ఆ వర్గం వాటా ఎంత ఉందనే పూర్తి వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని 1991 నాటి ఇందిరా సహానీ కేసు నుంచి అనేక కేసుల్లో ఇచ్చిన తీర్పుల్లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ అగ్రవర్ణ పేదలకు కోటా ఇవ్వడం సబబేనని చెప్పడానికి నరేంద్రమోదీ సర్కారు ఎలాంటి అధ్యయనమూ చేసినట్టు కనిపించడం లేదు' అని మాజీ అదనపు సొలిసిటర్ జనరల్ కేవీ విశ్వనాథన్ వివరించారు. విద్య, ఉద్యోగాల్లో ఆర్థికంగా వెనుకబడినవర్గాల ప్రాతినిధ్యం సరిగా లేదని నిర్ధారించేందుకు ఓ కమిటీ వేస్తే బావుంటుందని సూచించారు.




హడావుడి నిర్ణయం తగదు: వికాస్

'కొత్త కోటా కోసం రాజ్యాంగ సవరణను ఇంత హడావుడిగా చేయడం సరికాదు. ముందు విస్తృత సంప్రదింపులు, అధ్యయనం జరగాలి' అని మరో మాజీ అదనపు సొలిసిటర్ జనరల్ వికాస్‌సింగ్ అభిప్రాయపడ్డారు. జాట్ వర్గీయులను ఓబీసీల్లో చేర్చుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని 2015లో సుప్రీంకోర్టు కొట్టివేస్తూ, ఇది కాలం చెల్లిన వివరాల ఆధారంగా తీసుకున్న నిర్ణయమని తప్పుపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. '14, 15 అధికరణల కింద వివక్ష లేని సమానత్వ సూత్రాల కింద లభించే హక్కులను ప్రభావితం చేసే ఇలాంటి కీలక, సున్నితమైన నిర్ణయాన్ని పాత వివరాల ఆధారంగా తీసుకోకూడదని సుప్రీంకోర్టు ధర్మాసనం అప్పట్లో తీర్పు చెప్పింది. రాజ్యాంగంలోని 16(4) అధికరణలో ప్రస్తావించిన వెనుకబాటుతనం సామాజిక వెనుకబాటుతనం కిందకు వస్తుంది. అయితే విద్యాపరమైన, ఆర్థిక వెనుకబాటుతనం సామాజిక వెనుకబాటుతనానికి దారితీయొచ్చు. కానీ, సామాజిక వెనుకబాటుతనానికి ప్రత్యేక లక్షణాలు, కారణాలుంటాయని జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్‌తో కూడిన ధర్మాసనం అప్పట్లో తేల్చిచెప్పింది' అని వికాస్ సింగ్ చెప్పారు. అగ్రవర్ణ పేదలకు పది శాతం కోటా కల్పించాలన్న అప్పటి సర్కారు నిర్ణయాన్ని(1991 సెప్టెంబర్ 25) ఇందిరా సహానీ(మండల్ కేసు)కేసులో 9 మంది జడ్జీల సుప్రీంకోర్టు చెల్లదని తీర్పు ఇచ్చింది. ఇది 16వ అధికరణ ప్రకారం రాజ్యాంగబద్ధం కాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఓపెన్ కేటగిరీలోని పది శాతం ఖాళీలను ఆర్థిక ప్రాతిపదికపై పేదలకు కేటాయించడం అంటే ఆపైన ఉన్నవారికి పదిశాతం సీట్లు దక్కకుండా చేయడమే అవుతుంది. ఇలాంటి చర్య ఏదైనా 16వ అధికరణలో సమానావకాశాలు ఇవ్వాలనే ఒకటో నిబంధనకు విరుద్ధమని ఆ బెంచ్ ప్రకటించింది.

50% అడ్డంకి కాబోదు: జైట్లీ

జనరల్ కేటగిరీలో 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోల్లో ప్రకటించాయి. సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధించినందున మరో 10 శాతం రిజర్వేషన్ కల్పించడం కోర్టు తీర్పుకు ధిక్కరించినట్లవుతుందన్న వాదన అర్థ రహితం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ప్రకారం సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిమితి కులాల ప్రాతిపదికన ఇచ్చే రిజర్వేషన్లకు మాత్రమే వర్తిస్తుంది. అంతేతప్ప, జనరల్ కేటగిరీకి కాదు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు మార్లు నోటిఫికేషన్ల ద్వారా రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రయత్నించిన కారణంగా విఫలమయ్యాయి. ఆర్టికల్ 368 పార్ట్ 3 ప్రకారం..ప్రాథమిక హక్కుల సవరణకు రాష్ట్రాల అంగీకారం పొందాల్సిన అవసరం కూడా లేదు. ఉదాహరణకు..ప్రమోషన్లకు సంబంధించి ఆర్టికల్ 15(5)కు చేపట్టిన సవరణ పార్లమెంట్ ఆమోదం ద్వారానే జరిగింది. ఇప్పటివరకు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు మాత్రమే రాజ్యాంగం రిజర్వేషన్ కల్పిస్తోంది. ప్రస్తుత 124వ రాజ్యాంగ సవరణ–2019 ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కొన్ని నిబంధనలను చేరుస్తున్నాం. కులం, ఆర్థికత ఆధారంగా పౌరులకు సమాన అవకాశాలు కల్పించాలి. అయితే, సమానులను అసమానంగా చూడరాదు. అసమానులను కూడా సమానంగా భావించరాదు. రాజ్యాంగ మూల స్వరూపాన్ని మార్చకుండా మేం చేపట్టిన ఈ ప్రయత్నం సఫలమవుతుందని ఆశిస్తున్నాం. ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజరేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ..మాటపై నిలబడి బిల్లుకు ఆమోదం తెలపాలి. ప్రతిపక్షాలు నిరసనలు తెలపడం మాని, మనస్ఫూర్తిగా బిల్లుకు ఆమోదం ప్రకటించాలి.



అనుప్రియా పటేల్, అప్నాదళ్

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో మాదిరిగా కాకుండా ఆర్థికంగా వెనుకబడిన వారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తున్నాం. 2021లో కుల ప్రాతిపదికన జన గణన చేపట్టి స్పష్టత తీసుకువస్తాం. ప్రైవేట్ రంగానికి కూడా ఈ రిజర్వేషన్లు వర్తింప జేసే విషయాన్ని పరిశీలిస్తున్నాం.

రాం విలాస్ పాశ్వాన్, కేంద్రమంత్రి

జనరల్ కేటగిరీలో 60శాతం రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలి. తద్వారా సుప్రీంకోర్టులో సవాల్ చేసే వీలుండదు. ప్రైవేట్ రంగంలో కూడా 60శాతం రిజర్వేషన్లు కల్పించాలి. దీంతోపాటు ఆల్ ఇండియా జ్యుడిషియల్ సర్వీసెస్ ఏర్పాటు చేయాలి. దీనివల్ల పారదర్శకత పెరుగుతుంది.

కోటా బిల్లులో ఏముంది?

ఉద్దేశాలు, కారణాలను బిల్లులో వివరించిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ:

ఈ 10 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందితే 124వ రాజ్యాంగ సవరణ చట్టంగా పేర్కొంటారు.

➡ అధికరణ–15లోని నిబంధన(5) తరువాత నిబంధన (6)ను చేర్చుతారు. నిబంధన (6) ప్రకారం ఈ అధికరణలోని ఏ నిబంధన గానీ, అధికరణ–19లోని నిబంధన (1)లోని ఉప నిబంధన(జి) గానీ, అధికరణ–29లోని నిబంధన(2) గానీ రాజ్యం(ప్రభుత్వం) ఎ)ఆర్థికంగా వెనకబడిన వర్గాల(నిబంధన–4, నిబంధన–5లో ప్రస్తావించినవి కాకుండా) పురోగతికి ఏదైనా ప్రత్యేక నిబంధన రూపొందించడంలో గానీ ;

బి) ఏదైనా ఆర్థిక వెనకబాటు వర్గాల(నిబంధన–4, నిబంధన–5లో ప్రస్తావించినవి కాకుండా) పురోగతికి వీలుగా ప్రయివేటు, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ సహా విద్యా సంస్థల్లో.. ప్రస్తుత రిజర్వేషన్లకు అదనంగా గరిష్టంగా 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఏదేనీ ప్రత్యేక నిబంధన రూపొందించడంలో గానీ నిరోధించజాలదు.

➡ అధికరణ–16లోని నిబంధన (5) తరువాత నిబంధన (6) చేర్చుతారు. నిబంధన (6) ఇలా 'ప్రస్తుతం ఉనికిలో ఉన్న రిజర్వేషన్లకు అదనంగా.. ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలకు ఉద్యోగ నియామకాల్లో గరిష్టంగా పది శాతం రిజర్వేషన్ కల్పించేందుకు వీలుగా రాజ్యం(ప్రభుత్వం) ఏదైనా ప్రత్యేక నిబంధన రూపొందించడాన్ని ఈ అధికరణలోని ఏ భాగమూ నిరోధించజాలదు..'

బిల్లు ఉద్దేశాలు ; కారణాలు

ప్రస్తుతం ఆర్థికంగా వెనకబడిన వర్గాల పౌరుల్లో అధిక భాగం ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలకు దూరంగా మిగిలిపోయారు. ఆర్థిక వెనకబాటుతనం కారణంగా ఆర్థికంగా పుష్టి కలిగిన వారితో పోటీపడలేకపోతుండటమే ఇందుకు కారణం. భారత రాజ్యాంగ అధికరణ 15లోని నిబంధన (4), నిబంధన (5), అధికరణ 16లోని నిబంధన (4) ద్వారా ప్రస్తుతం ఉనికిలో ఉన్న రిజర్వేషన్ ప్రయోజనాలు.. సామాజిక వెనుకబాటు, విద్యాపరమైన వెనుకబాటు తదితర నిర్దిష్ట ప్రాతిపదిక గల వారికి తప్పితే ఈ ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు అందుబాటులో లేవు.

➡ బలహీన వర్గాలు, నిర్దిష్టంగా చెప్పాలంటే.. ఎస్సీ, ఎస్టీ ప్రజల విద్యా, ఆర్థిక ప్రయోజనాలు కాపాడేందుకు, సామాజికంగా అన్యాయానికి, ఏరకమైన దోపిడీకి వీరు గురికాకుండా రక్షించేందుకు వీలుగా ప్రత్యేక శ్రద్ధ చూపేందుకుగాను ప్రభుత్వానికి రాజ్యాంగంలోని 46వ అధికరణలోని ఆదేశిక సూత్రాలు అధికారాన్ని కల్పించాయి.

➡ అధికరణ –15లో 93వ రాజ్యాంగ సవరణ చట్టం–2005 ద్వారా నిబంధన (5)ను చేర్చారు. దీని ద్వారా సంక్రమించిన అధికారంతో ప్రభుత్వం సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన వర్గాల పౌరులకు, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు, ఉన్నత విద్యలో ప్రవేశాలకు సంబంధించి వారికి చేయూత ఇచ్చేందుకు ప్రత్యేక నిబంధన రూపొందించేందుకు వీలు కలిగింది. అదే తీరుగా అధికరణ–16లో నిబంధన (4)ను చేర్చింది. దీని ద్వారా సంక్రమించిన అధికారంతో ప్రభుత్వం ఏదేని వెనకబడిన తరగతులకు ఉద్యోగ రంగంలో తగిన ప్రాతినిధ్యం లేదని ప్రభుత్వం అభిప్రాయపడినప్పుడు, వారికి ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రత్యేక నిబంధన ఏర్పాటు చేయవచ్చు.



➡ అయినా, ఆర్థికంగా వెనకబడిన వర్గాల ప్రజలకు రిజర్వేషన్ ప్రయోజనాలు అందుకునేందుకు అర్హత లేదు. 46వ అధికరణలోని ఆదేశాలను పూర్తి చేయడానికి, ఆర్థికంగా వెనకబాటుకు గురైన వర్గాలకు ఉన్నత విద్యలో, ప్రభుత్వ ఉద్యోగాల్లో న్యాయమైన వాటా పొందేందుకు వీలుగా రాజ్యాంగ సవరణ చేయాలని నిర్ణయించడమైంది.

➡ ఆర్థికంగా వెనకబాటుకు గురైన వర్గాలకు ఉన్నత విద్యాసంస్థల (ప్రైవేటు విద్యా సంస్థలు, ఎయిడెడ్/అన్ ఎయిడెడ్ సహా, అధికరణ–30లో ప్రస్తావించినట్టుగా మైనారిటీ విద్యా సంస్థలు మినహాయించి)లో కోటా కల్పించేందుకు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ (124వ సవరణ) బిల్లు–2019 ఉపయోపడుతుంది.

➡ ఈ ప్రయోజనాలన్నీ సాధించేందుకే ఈ బిల్లు.



30వ అంతర్జాతీయ పతంగుల పండుగ సందర్భంగా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో స్టాట్యూ ఆఫ్ యూనిటీ వద్ద మంగళవారం గాలి పటాలు ఎగురవేస్తున్న భారత, విదేశీ పర్యాటకులు. జనవరి 6న ప్రారంభమైన ఈ ఉత్సవాలు జనవరి 14న ముగియనున్నాయి.

సీబీఐ చీఫ్‌గా మళ్లీ అలోక్ వర్మ

- సంస్థ డైరెక్టర్‌గా ఆయనను తిరిగి నియమించిన సుప్రీంకోర్టు
- తొలగించే, బదిలీ చేసే అధికారం కేంద్రానికి లేదని స్పష్టీకరణ
- ప్రధాన విధానపరమైన నిర్ణయాలు తీసుకోకుండా అధికారాలకు కోత
- రఫేల్ దర్యాప్తు నుంచి మోదీ తప్పించుకోలేరు: రాహుల్
- సమతూకం ఉన్న తీర్పు ఇది: అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ: సీబీఐ అంతఃకలహం కేసులో కేంద్రానికి మంగళవారం సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను పునఃనియమిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. అయితే అలోక్‌వర్మ ఎలాంటి ప్రధాన విధానపరమైన నిర్ణయాలూ తీసుకోకుండా కోర్టు నిలువరించింది. సీబీఐ చీఫ్‌ను నియమించేందుకు, తొలగించేందుకు అధికారం ఉన్న ప్రధాని నేతృత్వంలోని అత్యున్నతస్థాయి త్రిసభ్య కమిటీ అలోక్ వర్మ కేసును పరిశీలించి, ఆయనను సీబీఐ డైరెక్టర్ పదవిలో కొనసాగించాలా, వద్దా అన్నది నిర్ణయించేంత వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయంది. ఈ నెలాఖరుతో అలోక్ వర్మ పదవీకాలం ముగియనుండటంతో మరో వారంలోపు కేసుపై నిర్ణయం తీసుకోవాలని కమిటీని కోర్టు ఆదేశించింది. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ, ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాలు ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకోవడం, ఈ గొడవ తీవ్ర స్థాయికి చేరడంతో కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) సిఫారసుల ఆధారంగా గతేడాది అక్టోబర్ 23 అర్ధరాత్రి కేంద్రం వీరిద్దరినీ పదవుల నుంచి తప్పించి సెలవుపై పంపడం తెలిసిందే. ప్రభుత్వం తనను అక్రమంగా పదవి నుంచి తప్పించిందంటూ అలోక్ వర్మ వేసిన పిటిషన్‌పై విచారించిన కోర్టు తాజా తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు హర్షం వ్యక్తం చేశాయి. మరోవైపు అలోక్ వర్మకు మళ్లీ డైరెక్టర్ పదవిని ఇచ్చినప్పటికీ అధికారాలను కోర్టు కత్తిరించింది కాబట్టి ఇది సమతూకంతో ఉన్న తీర్పు అని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు.

తొలగించలేరు, బదిలీ చేయలేరు..

సీబీఐ డైరెక్టర్‌ను ఒకసారి నియమించాక ప్రభుత్వం రెండేళ్లలోపు తొలగించడం కుదరదనీ, ఒకవేళ తొలగించాలంటే నియామకం చేపట్టిన అత్యున్నత స్థాయి కమిటీనే ఆ పని చేయాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ అత్యున్నత స్థాయి కమిటీలో ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉంటారు. ఢిల్లీ ప్రత్యేక పోలీస్ సంస్థ చట్టంలోని నిబంధనల ప్రకారం ఎంపిక కమిటీ ఆమోదం లేకుండా సీబీఐ డైరెక్టర్‌ను బదిలీ చేయడానికీ వీల్లేదని కోర్టు పేర్కొంది. అలోక్‌వర్మపై సీవీసీ ఇంకా విచారణ జరుపుతున్నందున, వారంలోపు సమావేశమై ఈ కేసును పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని అత్యున్నతస్థాయి త్రిసభ్య కమిటీని కోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్కే కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్‌ల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. అయితే తీర్పును జస్టిస్ గొగోయ్ రాసి నప్పటికీ ఆయన మంగళవారం కోర్టుకు హాజరుకాలేదు. అలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తప్పించే అధికారం సీవీసీకి, కేంద్రానికి ఉందా లేదా అన్న దానిపైనే ఈ కేసులో వాదనలు జరిగాయి. పదవి నుంచి అలోక్, అస్థానా.. ఇద్దరినీ కేంద్రం తప్పించినా అలోక్ మాత్రమే కేంద్రంపై కోర్టులో కేసు వేశారు. సీబీఐ డైరెక్టర్‌పై మధ్యంతర చర్యలు తీసుకునే అధికారాన్నీ ప్రభుత్వానికి చట్టం ఇవ్వలేదనీ, సీబీఐని బయటి ప్రలోభాలు, ప్రభావాలకు దూరంగా ఉంచి స్వేచ్ఛ ఇవ్వగలిగితేనే ఆ సంస్థ ఏ భయం, ఆశ్రిత పక్షపాతం లేకుండా ప్రజా ప్రయోజనార్థం పనిచేయగలదని కోర్టు పేర్కొంది. కాబట్టి సీబీఐ డైరెక్టర్ విధుల్లో ఏ అధికారీ, సంస్థా జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేసింది. ఒకవేళ సీబీఐ డైరెక్టర్‌పై ఏమైనా చర్యలు తీసుకోవాలంటే అందుకు తగ్గ తీవ్ర కారణం, ప్రజాప్రయోజనం ఉండాలనీ, ఈ విషయాన్ని పరిశీలించే అధికారం కూడా ఎంపిక కమిటీకే ఉంటుందంది.

ప్రభుత్వానికి గుణపాఠం: ఖర్గే

లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి ఓ గుణపాఠమనీ, చెంపదెబ్బ లాంటిదన్నారు. రఫేల్ కుంభకోణంపై దర్యాప్తు ప్రారంభించనున్నారనే కారణంతోనే అలోక్ వర్మను ప్రధాని నరేంద్ర మోదీ అర్ధరాత్రి విధుల నుంచి తప్పించారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. ఈ తీర్పుతో కొంత న్యాయం జరిగిందనీ, రఫేల్‌పై విచారణ నుంచి మోదీ తప్పించుకోలేరని హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రధాని, ఆయన కార్యాలయంపై నేరారోపణ చేసినట్లుగా ఉందనీ సీపీఎం, ఆర్జేడీ, పీడీపీ, ఆప్ తదితర పార్టీలు పేర్కొన్నాయి. కాబట్టి మోదీ నైతిక బాధ్యత వహించి ప్రధాని పదవికి రాజీనామా చేయాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి డిమాండ్ చేశారు. అలోక్ వర్మకు తిరిగి పదవి ఇచ్చిన సుప్రీంకోర్టు ఆయన అధికారాలను తగ్గించింది కాబట్టి ఇది సమతూకంతో ఉన్న తీర్పు అని అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. దేశంలోనే అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ ప్రతిష్టను, విశ్వసనీయతను కాపాడేందుకు తాము అలోక్, అస్థానాలను సీవీసీ సిఫారసుల ఆధారంగానే సెలవుపై పంపామనీ, తమ నిర్ణయం పూర్తిగా సదుద్దేశంతో కూడుకున్నదేనని జైట్లీ సమర్థించుకున్నారు. ఇద్దరు అధికారులు గొడవ పడినందున తమ ప్రభుత్వ నిర్ణయం పూర్తిగా చట్టబద్ధమైనదేననీ జైట్లీ చెప్పుకొచ్చారు.

ఆ పరిస్థితి దురదృష్టకరం

అలోక్‌పై అవినీతి ఫిర్యాదును కేబినెట్ సెక్రటరీ సీవీసీకి పంపడం, ఆ తర్వాత సీబీఐ డైరెక్టర్ బాధ్యతల నుంచి అలోక్‌ను తప్పించాలంటూ సీవీసీ ఆదేశించేలా పరిస్థితులు రావడం దురదృష్టకరమని సుప్రీంకోర్టు పేర్కొంది. 'సీవీసీ చెబుతున్న దాని ప్రకారం.. అలోక్‌పై వచ్చిన ఫిర్యాదుకు సంబంధించి ఆ సంస్థ విచారణ ప్రారంభించింది. అయితే అలోక్ సీవీసీకి సహకరించడంపోయి, ఈ ఫిర్యాదును కేబినెట్ సెక్రటరీకి ఎవరు చేశారో చెప్పాలని కోరారు. అస్థానాపై ఆరోపణలు చేసేవరకు ఆయన వెళ్లారు. అస్థానాపై అవినీతి ఆరోపణలున్న అనేక కేసులను అలోక్ సీవీసీకి అందించారు. అలాగే అలోక్ వర్మపై అస్థానా ఆరోపణలు చేశారు. ఈ తీవ్ర పరిస్థితుల్లోనే అలోక్, అస్థానా ఇద్దరినీ బాధ్యతల నుంచి తప్పించడం సరైన చర్య అని సీవీసీ భావించి, సీవీసీ చట్టంలోని సెక్షన్–8, 11ల ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశించింది' అని కోర్టు తన తీర్పులో పేర్కొంది.

సీబీఐ 'ఫైట్'లైన్!

2017 అక్టోబర్: సీబీఐ స్పెషల్ డైరెక్టర్‌గా రాకేశ్ అస్థానాను నియమించడంపై సీవీసీ ముందు అలోక్ వర్మ అభ్యంతరం.

2018 జూలై 12: సీబీఐలో ప్రమోషన్లపై జరిగిన సమావేశానికి తన అనుమతి లేకుండానే తన ప్రతినిధిగా అస్థానా హాజరుకావడంపై సీవీసీకి వర్మ లేఖ.

ఆగస్టు 24: దర్యాప్తు కొనసాగుతున్న ఓ కేసులో నిందితులను కాపాడడానికి అలోక్ వర్మ, ఆయన సహాయకుడైన అదనపు డైరెక్టర్ ఎన్కే శర్మ ప్రయత్నించారని, మాంసం వ్యాపారి మొయిన్ ఖురేషీ కేసులో వర్మకు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి సతీష్ సానా 2 కోట్ల రూపాయల లంచం ఇచ్చారని ఆరోపిస్తూ సీవీసీ, కేబినెట్ సెక్రటరీకి అస్థానా లేఖ.

అక్టోబర్ 4: సానాను సీబీఐ అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, అస్థానాకు రూ.3 కోట్లు చెల్లించినట్టు సానా ఆరోపించారు.

అక్టోబర్ 15: మొయిన్ ఖురేషీ కేసులో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణపై అస్థానాపై సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు.

అక్టోబర్ 23: రాకేశ్ అస్థానా కేసులో యథాతథ స్థితి కొనసాగించాలని సీబీఐని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. మరో సీబీఐ అధికారి దేవేంద్రకుమార్‌కు ఏడు రోజుల సీబీఐ రిమాండ్‌కు కోర్టు ఆదేశం. అక్టోబర్ 15న అస్థానాపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో కుమార్ పేరు కూడా చేర్చారు.

అక్టోబర్ 24: సీవీసీ సిఫార్సుతో అలోక్, అస్థానాలను సెలవుపై పంపిస్తూ కేంద్రం నిర్ణయం.

అక్టోబర్ 26: వర్మపై జరుగుతున్న సీవీసీ దర్యాప్తు పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఏకే పట్నాయక్‌ను నియమించిన సుప్రీంకోర్టు.

నవంబర్ 12: సుప్రీంకోర్టుకు సీవీసీ విచారణ నివేదిక.

29న విద్యార్థులతో మోదీ 'పరీక్షా పే చర్చ'



న్యూఢిల్లీ: పరీక్షల సీజన్ వచ్చేస్తున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షలకు సంబంధించి ఒత్తిడిని అధిగమించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ 'పరీక్షా పే చర్చ'పేరుతో వారితో నేరుగా ముచ్చటించనున్నారు. ఈ నెల 29న ఢిల్లీలోని తల్కతోర స్టేడియంలో జరగనున్న ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు MyGov.inలో విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవల్సిందిగా కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయితే 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న వారితో పాటు గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులే ఇందుకు అర్హులని ఆ శాఖ తెలిపింది. అందులో ఎంపికైన విద్యార్థులతోనే ప్రధాని ముచ్చటిస్తారు. విద్యార్థులతోపాటుగా వారి తల్లిదండ్రులు, టీచర్లతో ఆయన మాట్లాడనున్నారు. గతేడాది జనవరి 29న మోదీ 'పరీక్షా పే చర్చ'పేరుతో దేశవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థులతో పరీక్షల్లో ఒత్తిడిని అధిగమించడం ఎలా అనే అంశంపై ముచ్చటించిన విషయం తెలిసిందే.

ఆన్‌లైన్‌లో ఔషధాలపై స్టే ఎత్తివేతకు నో



న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌లో ఔషధ అమ్మకాలపై ఉన్న స్టేను ఎత్తివేయడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. తదుపరి వాదనల వరకు స్టే కొనసాగుతుందని, విచారణను ఫిబ్రవరి 6కు వాయిదా వేసింది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమాలను రూపొందించాలని చీఫ్ జస్టిస్ రాజేంద్రమీనన్, జస్టిస్ వీకే రావుల ధర్మాసనం పేర్కొంది. ఆన్‌లైన్ మందుల కంపెనీలు వీటి ఔషధ అమ్మకాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయడం లేదని, దీనిపై ఉన్న స్టేను ఎత్తివేయాలని కోరాయి. వాటికి సంబంధించి తాము లైసెన్సు కలిగి ఉన్నామని వాదిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో 'చట్టవిరుద్ధం'గా ఔషధాలు అమ్ముతున్నారంటూ జహీర్ అహ్మద్ అనే వ్యక్తి పిల్ దాఖలు చేశారు. ఆన్‌లైన్‌లో చట్టవిరుద్ధంగా అమ్మే ఔషధాలు, అంటువ్యాధుల కు దారితీయడం, మందుల దుర్వినియోగం, తప్పుగా వాడడం వల్ల మాదక ద్రవ్యాలకు వ్యసనపరులుగా మారే అవకాశం ఉందని పిల్‌లో పేర్కొన్నారు. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్, నిపుణుల కమిటీ కూడా ఆన్‌లైన్‌లో ఔషధాల అమ్మకాలు డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్–1940 చట్టానికి విరుద్ధమని నిర్ధారించినట్లు తెలిపారు.

చైనాలో పసిపిల్లలపై సుత్తితో దాడి

బీజింగ్: పాఠశాల యాజమాన్యం ఉద్యోగం నుంచి తప్పించిందని, ఆ కోపాన్ని పసిపిల్లలపై ప్రదర్శించాడు చైనాలో ఓ ఘాతకుడు. ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు పీటీ వ్యాయామం చేయిస్తుండగా అకస్మాత్తుగా సుత్తి పట్టుకొచ్చి వరుసగా పిల్లల తలపై బాదుతూ వెళ్లాడు. ఈ ఘటనలో 20 మంది పిల్లలు గాయపడగా, అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. బీజింగ్‌లోని క్జిచెంగ్ జిల్లాలో ఉన్న నంబర్ వన్ ప్రైమరీ స్కూల్‌లో మంగళవారం ఈ దారుణం చోటుచేసుకుంది. హెలాంగ్‌జియాంగ్ ప్రావిన్స్‌కు చెందిన జియా (49) ఆ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో నిర్వహణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల మొదటివారంతో అతని కాంట్రాక్ట్ ముగిసింది. అతని ప్రవర్తన నచ్చని యాజమాన్యం కాంట్రాక్ట్ పొడిగించడానికి నిరాకరించింది. దీంతో కోపం పెంచుకున్న జియా పిల్లలపై సుత్తితో దాడికి పాల్పడ్డాడు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులపై, షాపింగ్ మాల్స్‌లో పౌరులపై దాడులు చైనాలో ఇటీవల సాధారణమయ్యాయి. గత జనవరిలో ఓ పాఠశాలలో జరిగిన కత్తి దాడిలో 12 మంది పిల్లలు గాయపడ్డారు. ఏప్రిల్‌లో షాంక్జీ ప్రావిన్స్‌లో కత్తి దాడికి 9 మంది పిల్లలు మృతి చెందారు. జూన్‌లో షాంఘైలోని ఓ పాఠశాలలో ఇద్దరు పిల్లలు కత్తి గాట్లకు ప్రాణాలు విడిచారు. అక్టోబర్‌లో చోంగ్‌కింగ్‌లో ఓ మహిళ చేసిన దాడిలో 14 మంది గాయపడ్డారు.

ఈసీ గుర్తింపు కోరుతున్న ఏడు పార్టీలు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 7 రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్(ఈసీ) నుంచి గుర్తింపు పొందాలని కోరుకుంటున్నాయని అధికారులు తెలిపారు. వీటిలో భారతీయ వికాస్ దళ్ యునైటెడ్, లోకతంత్రిక్ జన్ స్వరాజ్ పార్టీ, నేషనల్ ఆవామీ యునైటెడ్ పార్టీ, పుర్వాంచల్ నవనిర్మాణ్ పార్టీ, రాష్ట్రీయ జనశక్తి సమాజ్ పార్టీ, సకల జనుల పార్టీ, స్వతంత్ర పార్టీ ఉన్నాయని పేర్కొన్నారు. 2018 నవంబర్‌లో 22 రాజకీయ పార్టీలకు కమిషన్ గుర్తింపునిచ్చింది. ప్రస్తుతం 1900 రిజిస్టర్డ్ పార్టీలున్నాయి. అందులో 7 జాతీయ పార్టీలు, 59 రాష్ట్ర పార్టీలున్నాయి.

సౌర వ్యవస్థ ఆవల మరో గ్రహం



బోస్టన్: మన సౌర వ్యవస్థ ఆవల మరో కొత్త గ్రహాన్ని నాసా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ గ్రహం మనకు సుమారు 53 కాంతి సంవత్సరాల దూరంలో సూర్యుడి మాదిరి ప్రకాశవంతమైన ఓ మరుగుజ్జు నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తున్నట్లు గుర్తించారు. మన సౌర వ్యవస్థ ఆవల ఉన్న గ్రహాల కోసం అన్వేషణ సాగిస్తున్న టెస్ (ట్రాన్సిటింగ్ ఎక్సోప్లానెట్ సర్వే శాటిలైట్) సాయంతో ఈ గ్రహాన్ని కనుగొన్నారు. గతేడాది ఏప్రిల్‌లో ఈ శాటిలైట్ లాంచ్ చేయగా.. ఇప్పటివరకు మన సౌర వ్యవస్థ ఆవల 3 గ్రహాలను కనుగొంది. తాజా గ్రహం పేరు హెచ్‌డీ 21749బీ కాగా.. పై మెన్సె బీ, ఎల్‌హెచ్‌ఎస్ 3844బీ ఇంతకుముందు కనుగొన్న మరో 2 గ్రహాలు. ఈ 3 గ్రహాల్లోకెల్లా ప్రస్తుత గ్రహమే అధిక కక్ష్య కాలాన్ని కలిగి ఉంది. ఈ గ్రహం మరుగుజ్జు నక్షత్రం చుట్టూ పరిభ్రమించడానికి 36 రోజుల సమయం తీసుకుంటుంది. సూపర్ ఎర్త్‌గా భావించే 'పై మెన్సె'గ్రహం తన నక్షత్రం చుట్టూ పరిభ్రమించడానికి 6.3 రోజుల సమయం తీసుకుంటుండగా.. ఎల్‌హెచ్‌ఎస్ 3844బీ తన నక్షత్రం చుట్టూ పరిభ్రమించడానికి 11 గంటల సమయమే తీసుకుంటుంది. తాజా గ్రహంపై ఉష్ణోగ్రత 300 డిగ్రీల ఫారెన్‌హీట్ ఉన్నట్లు తెలిపారు. ప్రకాశవంతమైన నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాల్లోకెల్లా తక్కువ ఉష్ణోగ్రత కలిగిన గ్రహం ఇదేనని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన పోస్ట్ డాక్టరోల్ డయానా చెప్పారు. భూమి కంటే ఈ గ్రహం సైజు 3 రెట్లు ఎక్కువ కాగా.. బరువులో 23 రెట్లు ఎక్కువగా ఉందని తెలిపారు. అయితే ఈ గ్రహం నివాసయోగ్యమైనది కాకపోవచ్చని అన్నారు. మరో గ్రహానికి సంబంధించిన ఆనవాళ్లనూ పరిశోధకులు కనుగొన్నారు. ఒకవేళ దీన్నీ ధ్రువీకరించినట్లయితే టెస్ కనుగొన్న భూమి ఆకారంలో ఉన్న మొదటి గ్రహం ఇదే కానుంది.



దక్షిణ హాంకాంగ్ తీరంలో మంగళవారం మంటల్లో చిక్కుకున్న ఆయిల్ ట్యాంకర్ ఒకవైపు ఒరుగుతున్న దృశ్యం. ఈ ఘటనలో సిబ్బంది ఒకరు మృతిచెందారు.

'అయోధ్య'పై రాజ్యాంగ ధర్మాసనం


- ఐదుగురు జడ్జీలతో ఏర్పాటు చేసిన సుప్రీంకోర్టు
- రేపు ధర్మాసనం విచారణ



న్యూఢిల్లీ: రాజకీయంగా ఎంతో సున్నితమైన అయోధ్య వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వివాదంపై దాఖలైన పిటిషన్లను విచారించేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వం వహించే ఈ ధర్మాసనంలో జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ యు.యు. లలిత్, జస్టిస్ డీవై చంద్రచూడ్ సభ్యులుగా ఉంటారు. రామ జన్మభూమి– బాబ్రీ మసీదు భూవివాదం కేసులో గురువారం (ఈ నెల 10వ తేదీన) ఈ ధర్మాసనం వివిధ వర్గాల వాదనలు విననుందని సుప్రీంకోర్టు మంగళవారం తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. అయోధ్యలోని వివాదాస్పద ప్రాంతంలో ఉన్న 2.77 ఎకరాల భూమిని ఈ కేసులో కక్షిదారులుగా ఉన్న సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖారా, రామ్ లల్లా సంస్థలు సమానంగా పంచుకోవాలంటూ 2010లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో 14 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు అయోధ్య వివాదం విషయంలో వాదనలు వినేందుకు జనవరిలో ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు గత అక్టోబర్ 29న వెల్లడించింది. అయితే, అయోధ్య కేసులో అత్యవసర విచారణ జరపాల్సిన అవసరం ఉందంటూ ఇటీవల పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించగా వారి వాదనలను తోసిపుచ్చింది. తాజాగా ఏర్పాటైన ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి మినహా మిగిలిన నలుగురూ భవిష్యత్తులో సీజేఐ అయ్యే అవకాశం ఉన్న వారే కావడం గమనార్హం. అయోధ్యలో రామ మందిరం నిర్మించేందుకు వీలుగా ఆర్డినెన్స్ తేవాలంటూ పలు హిందూత్వ సంస్థలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. అయితే, సుప్రీంకోర్టులో న్యాయ ప్రక్రియ ముగిసిన తర్వాతే.. మందిర నిర్మాణంపై ఆర్డినెన్స్ తెచ్చే విషయంలో నిర్ణయం తీసుకుంటామని ప్రధాని మోదీ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

పాక్ జాతీయ స్వీటు గులాబ్ జామూన్!

అది విదేశీ స్వీటని నెటిజన్ల వాదన



పాకిస్తాన్‌లో తాజాగా ఎన్నికలు జరిగాయి. అయితే, మీరెన్నడూ కనీవినీ ఎరుగని ఎన్నికలవి. పాక్ జాతీయ స్వీటు ఎంపిక కోసం జరిగిన ఈ ఎన్నికల్లో అభ్యర్థులు మాత్రం.. గులాబ్ జామూన్, బర్ఫీ, జిలేబీ. జాతీయ స్వీటుగా గులాబ్ జామూన్‌ను నెటిజన్లు ఎన్నుకున్నారు. పాక్ ప్రభుత్వం ఆ దేశ నేషనల్ స్వీట్ ఎన్నికలో ట్విట్టర్ ద్వారా పాల్గొనాల్సిందిగా ప్రజలను కోరింది. ఈ ట్విట్టర్ పోల్‌లో ప్రజలు తమ ఓటుహక్కును ఉపయోగించుకొని గులాబ్ జామూన్‌కు పట్టం కట్టారు. 47 శాతం మంది పాక్ ప్రజలు గులాబ్‌జామ్‌కే ఓటు వేయడంతో ఆ దేశపు జాతీయ స్వీటుగా గులాబ్ జామూన్‌ని ప్రకటించారు. 34 శాతం ఓట్లతో జిలేబీ ద్వితీయ స్థానంలో, బర్ఫీ 19 శాతం ఓట్లతో మూడో స్థానంలో నిలిచాయి.

రిగ్గింగ్ జరిగింది: నేషనల్ స్వీట్‌పోల్‌లో ఓటింగ్ నిజాయితీగా సాగలేదనీ, రిగ్గింగ్ జరిగిందనీ పాక్ ప్రజలు భావిస్తున్నారు. ఎందుకంటే ప్రభుత్వం 5 లక్షల కన్నా తక్కువమంది ఫాలోవర్స్ ఉన్న అధికారిక ట్విట్టర్ నుంచే పోల్ నిర్వహించడం వారి వ్యతిరేకతకు కారణం. ట్విట్టర్ మినహా ఈ ఎన్నికల్లో ఇతర సోషల్ మీడియాకు అవకాశం లేకపోవడంపై కూడా విమర్శలు వెల్లువెత్తాయి. అసలు గులాబ్ జామూన్ పాకిస్తానీ స్వీటు కాదన్నది కొందరి వాదన. దీన్ని మొగలుల కాలంలో షాజహాన్ వంటవారు కనుగొన్నారని కొందరంటోంటే, మధ్య ఆసియా నుంచి దండెత్తిన టర్కీ ఆక్రమణదారుల ద్వారా ఈ పాక్‌లోకి వచ్చిందని కొందరు ఆరోపిస్తున్నారు. మొత్తంగా జామూన్ పాకిస్తానీ స్వీటు కాదనీ, దీనికి విదేశీ రుచులున్నాయన్నది వీరి వాదన.

యూకే వీసా మరింత ఖరీదు



లండన్: భారతీయులకు, యూరోపియన్ యూనియన్ (ఈయూ)లో సభ్యత్వం లేని దేశాలకు చెందిన పౌరులకు బ్రిటన్ వీసా మరింత ఖరీదు కానుంది. ఇమిగ్రేషన్ హెల్త్ సర్‌చార్జ్‌ను (ఐహెచ్ఎస్) బ్రిటన్ ప్రభుత్వం పెంచడంతో భారతీయులపై ఆర్థిక భారం భారీగా పడనుంది. బ్రిటన్‌లో నివాసమున్నప్పుడు వారి ఆరోగ్య సంరక్షణ కోసం నేషనల్ హెల్త్ సర్వీసు(ఎన్‌హెచ్ఎస్) పరిధిలోకి వచ్చేలా 2015 నుంచి బ్రిటన్ ప్రభుత్వం హెల్త్ సర్‌చార్జ్‌ను వసూలు చేస్తోంది. భారతీయ విద్యార్థులు, వృత్తి నిపుణులు, వారి కుటుంబ సభ్యులు వీసా కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడే సర్‌చార్జ్‌ని చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ సర్‌చార్జ్‌ని ప్రభుత్వం రెట్టింపు చేసింది. ఇన్నాళ్లూ ఈ సర్‌చార్జ్ ఏడాదికి 200 పౌండ్లు(రూ.18వేలు) ఉంటే, ఇప్పుడు దానిని 400 పౌండ్లు (రూ.36వేలు) చేసింది. కొత్త చార్జీలు జనవరి 8 నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ సర్‌చార్జీలను పెంచడమే కాదు, ఇంగ్లండ్‌కు వచ్చే విదేశీ విద్యార్థులకు అడ్డుకట్ట వేయడానికి పలు చర్యల్ని చేపట్టనుంది. కేవలం ప్రతిభ ఆధారంగానే విద్యార్థులు రావడానికి అనుమతులు మంజూరు చేస్తామని బ్రిటన్ హోంమంత్రి సాజిద్ జావేద్ వెల్లడించారు. ఈయూ నుంచి వచ్చే వారికి ఉద్యోగాలు కల్పిస్తే ఏడాదికి కనీసం 30వేల పౌండ్లు (రూ.27 లక్షలు) వేతనం ఇచ్చేలా ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. 30వేల పౌండ్ల వేతనం అన్నది చాలా ఎక్కువనీ, అలా చేస్తే నర్సుల వంటి ఉద్యోగాల కోసం ఈయూ మీదనే ఆధారపడ్డ వారికి చాలా నష్టం జరుగుతుందని నేషనల్ హెల్త్ సర్వీసు సహా పలు సంస్థల యజమానులు గగ్గోలు పెడుతున్నారు. లండన్ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రతిబంధకంగా మారతాయని లండన్ నగర మేయర్ సాదిక్ ఖాన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈయూ నుంచి బ్రిటన్ బయటకు వచ్చే బ్రెగ్జిట్ రిఫరెండం ఆమోదం పొందిన దగ్గర్నుంచి బ్రిటన్‌కు వలస వచ్చే వారి సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. 2014–15లో 3 లక్షల మందికి పైగా ఇతర దేశాల విద్యార్థులు, ఉద్యోగులు వలసవస్తే, గత ఏడాది వారి సంఖ్య 2 లక్షల 80వేలకు తగ్గిపోయింది.

పౌరసత్వ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా పశ్చిమ త్రిపురలో ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాలు

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ దేశాల నుంచి వచ్చే ముస్లిమేతర పౌరులకు భారత పౌరసత్వం ఇచ్చేందుకు ఉద్దేశించిన బిల్లును మంగళవారం లోక్‌సభ ఆమోదించింది. ఆ 3 దేశాల్లో వేధింపులు, హింసకు గురై భారత్‌కు వలసొచ్చే హిందువులు, జైనులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలకు భారత పౌరసత్వం ఇవ్వాలని ఇందులో ప్రతిపాదించారు. ఈ బిల్లుపై ఈశాన్య రాష్ట్రాలు ముఖ్యంగా అసోంలో నిరసనలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. సభ్యుల ఆందోళనల మధ్యే హోం మంత్రి రాజ్‌నాథ్..పౌరసత్వ(సవరణ) బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఆయా దేశాల్లోని ముస్లిమేతర పౌరులకు భారత్‌లో తప్ప మరోచోట స్థానం దొరకడంలేదని తెలిపారు. వలసొచ్చే పౌరుల భారాన్ని అసోంపైనే మోపమని, దేశమంతా పంచుకుంటుందని పేర్కొన్నారు. ఈ విషయంలో అసోంకు అన్ని విధాలా కేంద్రం సహకరిస్తుందని అన్నారు. నిశితంగా పరిశీలించిన తరువాత జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వాలు సిఫార్సు చేస్తేనే వారికి పౌరసత్వం కల్పిస్తామని చెప్పారు. బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలన్న విజ్ఞప్తిని కేంద్రం తోసిపుచ్చడంతో కాంగ్రెస్ వాకౌట్ చేసింది. తాజా బిల్లు ఓటుబ్యాంకు రాజకీయాల వికృత రూపమని తృణమూల్ ఎంపీ సౌగతారాయ్ ఆరోపించారు. పౌరసత్వం పొందేందుకు భారత్‌లో కనీస నివాస కాలాన్ని 12 ఏళ్ల నుంచి ఆరేళ్లకు కుదిస్తూ బిల్లులో ప్రతిపాదించారు. లబ్ధిదారులు దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా నివాసం ఏర్పర్చుకోవచ్చు. బిల్లుకు నిరసనగా ఎన్డీయే కూటమి నుంచి అసోం గణపరిషత్ తప్పుకున్న సంగతి తెలిసిందే. సీబీఐ పరిణామాలపై చర్చించాలని విపక్షం పట్టుపట్టడంతో రాజ్యసభ కార్యకలాపాలు మంగళవారం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. రాజ్యసభ కార్యకలాపాల్ని ఒకరోజు పొడిగించారు. దీంతో మంగళవారం ముగియాల్సిన సెషన్ బుధవారం కొనసాగుతుంది.


మోదీతో నార్వే ప్రధాని భేటీ



నార్వే ప్రధాని ఎర్నా సోల్బెర్గ్‌తో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరచాలనం

న్యూఢిల్లీ: సముద్ర ఆర్థిక వ్యవస్థపై సన్నిహితంగా సహకరించుకునేందుకు, స్థిరమైన ఆర్థిక లక్ష్యాలను సాధించేందుకు భారత్, నార్వేలు అంగీకరించాయి. నార్వే ప్రధాని ఎర్నా సోల్బెర్గ్ మంగళవారం ప్రధాని మోదీతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత విస్తృతం చేసుకోవాలని నిర్ణయించారు. సముద్ర ఆర్థిక వ్యవస్థపై 2 దేశాల సంప్రదింపులకు వీలు కల్పించే ఎంవోయూపై వారు సంతకాలు చేశారు. సోమవారం భారత్ చేరుకున్న సోల్బెర్గ్‌కు మంగళవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో విందు ఏర్పాటు చేశారు. అంతకు ముందు ఆమె ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. 'పరస్పర సహకారానికి అవకాశమున్న అన్ని అంశాలను పరిశీలించాం. ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త శక్తిని, దిశానిర్దేశం చేసేందుకు గల మార్గాలను చర్చించాం' అని ప్రధాని మోదీ ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలో రూ.84వేల కోట్ల (12 బిలియన్ డాలర్లు) మేర పెట్టుబడులు పెట్టేందుకు నార్వే ప్రధాని అంగీకరించారని వెల్లడించారు. దేశంలో నౌకా నిర్మాణం, నౌకాశ్రయాల అభివృద్ధి రంగాల్లో నార్వే కంపెనీలకు భారీగా అవకాశాలున్నాయన్నారు. 'ఆర్థిక వ్యవస్థ, జన సంఖ్య దృష్ట్యా భారత్ లేకుండా ప్రపంచం స్థిరమైన ఆర్థిక లక్ష్యాలను సాధించలేదు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా కీలక భూమిక పోషిస్తోంది. నార్వే వంటి చిన్న దేశాలు భారత్ వంటి పెద్ద దేశంతో కలిసి పనిచేయడం చాలా అవసరం. 2 దేశాల భాగస్వామ్యం సానుకూల ధోరణితో సాగుతోంది' అని సోల్బెర్గ్ తెలిపారు. వాతావరణ మార్పులు, ఆర్థిక అసమానతలు, శాంతి, న్యాయం వంటి 17 స్థిరమైన ఆర్థిక లక్ష్యాల(ఎస్డీజీ)ను సభ్యదేశాలకు ఐరాస నిర్దేశించింది.

ఫోన్‌లో ట్రంప్, మోదీ చర్చలు



న్యూఢిల్లీ/వాషింగ్టన్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ఫోన్‌లో సంభాషించుకున్నారు. భారత్‌తో అమెరికా వాణిజ్య లోటుపై ప్రధానంగా చర్చించిన ఇద్దరు నేతలు.. అంతర్యుద్ధంతో సతమతమవుతున్న అఫ్గానిస్తాన్ విషయంలో సహకారం పెంచుకోవాలని నిర్ణయించారు. కొత్త ఏడాది శుభాకాంక్షలు తెలుపుకున్న ఇరువురు.. 2018లో భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం అయినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. 'భారత్‌తో అమెరికా వాణిజ్య లోటును తగ్గించుకునేందుకుగల అవకాశాలపై ఇద్దరు చర్చించారు. 2 దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం 2019లో మరింత బలోపేతం కావాలని ఇద్దరు నేతలు అంగీకరించారు' అని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. అఫ్గానిస్తాన్ విషయంలో సహకారం, ఇండో–పసిఫిక్ ప్రాంత భద్రత, అభివృద్ధిలో సహకారం మరింత విస్తృతం చేసుకునేందుకు మోదీ, ట్రంప్ అంగీకరించారని కూడా వైట్ హౌస్ పేర్కొంది. 'రెండు దేశాల మంత్రుల స్థాయి 2+2 చర్చలు, అమెరికా, జపాన్, భారత్ నేతల త్రైపాక్షిక చర్చలతో సాధించిన పురోగతిని ట్రంప్, మోదీ ప్రశంసించారు' అని భారత ప్రధాని కార్యాలయం పేర్కొంది. భారత్‌తో అమెరికా వస్తు సేవల లావాదేవీలు 2017లో 126.2 బిలియన్ డాలర్ల మేరకు జరగ్గా ఇందులో అమెరికా ఎగుమతులు 49.4 బిలియన్ డాలర్లు, దిగుమతులు 76.7 బిలియన్ డాలర్లు. అంతిమంగా 2017లో భారత్‌తో అమెరికా వాణిజ్య లోటు 27.3 బిలియన్ డాలర్లుగా ఉంది.

ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర సదస్సుకు వైఎస్ జగన్‌కు ఆహ్వానం


వైఎస్ జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) 4వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 28, 29 తేదీల్లో తిరుపతిలో జరగనున్నాయి. ఈ రాష్ట్ర సదస్సుకు రావాల్సిందిగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీడబ్ల్యూజేఎఫ్ నేతలు ఆహ్వానించారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రజా సంకల్పయాత్ర సాగిస్తున్న జగన్‌ను మంగళవారం వారు కలసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కొక్యాణ వేణుగోపాలరావు, జనరల్ సెక్రటరీ సత్తారు భాస్కరరావు, కార్యదర్శి ఆకుల అమరయ్య వైఎస్ జగన్‌ను కలసినవారిలో ఉన్నారు.

24న పీఎస్‌ఎల్‌వీ సీ 44 ప్రయోగం

శ్రీహరికోట(సూళ్లూరుపేట): ఈ ఏడాది 34 ప్రయోగాలు లక్ష్యంగా పెట్టుకున్న ఇస్రో ఈనెల 24న మొదటి ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి జనవరి 24న పీఎస్‌ఎల్‌వీ సీ 44 ఉపగ్రహ వాహకనౌక ద్వారా మైక్రోశాట్–ఆర్ అనే ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనుంది. షార్ కేంద్రంలో మొదటి ప్రయోగవేదికపై పీఎస్‌ఎల్‌వీ సీ 44 రాకెట్ అనుసంధానం పనుల్లో భాగంగా ఆరు స్ట్రాపాన్ బూస్టర్లతోపాటు కోర్ అలోన్ దశను అమర్చి మొదటిదశ పనులు పూర్తి చేశారు. మరో వారంరోజుల్లోగా రెండు, మూడు దశలను కూడా పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈనెల రెండోవారంలో మైక్రోశాట్–ఆర్ ఉపగ్రహం బెంగళూరు నుంచి శ్రీహరికోటకు చేరుకోనుంది.

బస్సును ఢీకొన్న కంటైనర్ లారీ

- 30 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం

బిట్రగుంట: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని బోగోలు మండలం ముంగమూరు కూడలి వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. విశాఖపట్నం నుంచి నెల్లూరుకు వెళుతున్న హైటెక్ బస్సును చిత్తూరు నుంచి ఒడిశాలోని కుర్వా ప్రాంతానికి వెళుతున్న కంటైనర్ లారీ ఢీకొంది. రెండు వాహనాలు రోడ్డుపై బోల్తా పడ్డాయి. బస్సులో ప్రయాణిస్తున్న 25 మందికి గాయాలుకాగా, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఓ మహిళా ప్రయాణీకురాలి చేయి తెగి రోడ్డుపై పడిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనాల్లో కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరుకు తీసుకెళ్లారు. కంటైనర్ లారీ బస్సును డీజిల్ ట్యాంక్ పక్కనే బలంగా ఢీకొట్టింది. అదృష్టవశాత్తు డీజిల్ ట్యాంక్‌కు తగలకపోవడంతో పెను ప్రమాదం తప్పి, ప్రయాణీకులు గాయాలతో బయటపడ్డారు.

కాకినాడ ప్రైవేట్ సెజ్‌కు భారీ రాయితీ

- ప్రాసెసింగ్, డెవలప్‌మెంట్ చార్జీలు మినహాయింపు
- ఖజానాకు రూ.101.01 కోట్ల నష్టం
- నిబంధనలను లెక్కచేయని సీఎం చంద్రబాబు
- చార్జీలు మినహాయిస్తూ జీవో జారీ

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణాలకు రాయితీలు ఇవ్వడానికి మనసొప్పని చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు మాత్రం భారీ ఎత్తున రాయితీలు ఇచ్చేస్తోంది. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు చెబుతున్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు లెక్కచేయడం లేదు. తనకు కావాల్సిన కంపెనీలకు రాష్ట్ర ఖజానా నుంచి ఇష్టారాజ్యంగా దోచిపెడుతున్నారు. తాజాగా కాకినాడ ప్రైవేట్ సెజ్(ఎస్ఈజడ్)కు భారీ రాయితీలు ఇస్తూ చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు రూ.101.01 కోట్ల నష్టం వాటిల్లుతుందని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.



కాకినాడ సెజ్

అది నిబంధనలకు విరుద్ధం

తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో 10,400 ఎకరాల్లో పోర్టు ఆధారిత మల్టీ ప్రొడక్టు ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు కాకినాడ సెజ్ యాజమాన్యం పేర్కొంది. ప్రాసెసింగ్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీల నుంచి మినహాయింపు ఇవ్వాలని విశాఖపట్నం–కాకినాడ పెట్రోలియం, కెమికల్ అండ్ పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్(వీకేపీసీపీఐఆర్)కు దరఖాస్తు చేసుకుంది. దీనిపై వీకేపీసీపీఐఆర్ వైస్ చైర్మన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రైవేట్ సెజ్‌కు ఇలా చార్జీల మినహాయింపులు ఇవ్వడం సాధ్యం కాదని, ఇది పట్టణాభివృద్ధి సంస్థల నిబంధనలకు విరుద్ధమని ఆయన ప్రభుత్వానికి సూచించారు. పట్టణాభివృద్ధి సంస్థలకు ప్రాసెసింగ్, డెవలప్‌మెంట్ చార్జీల ద్వారానే ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. మున్సిపల్ శాఖ 2007 జూన్ 13న జారీ చేసిన జీవో 499 ప్రకారం.. పట్టణాభివృద్ధి సంస్థలకు ప్రాసెసింగ్ చార్జీల కింద చదరపు మీటర్‌కు రూ.4 చొప్పున, డెవలప్‌మెంట్ చార్జీల కింద చదరపు మీటర్‌కు రూ.20 చొప్పున డెవలపర్ చెల్లించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. కాకినాడ సెజ్ యాజమాన్యం నుంచి జీవో 499 ప్రకారం ప్రాసెసింగ్, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేశారు. చార్జీల మినహాయింపును పట్టణాభివృద్ధి సంస్థ, ఆర్థిక శాఖ కూడా వ్యతిరేకించాయి. కాకినాడ సెజ్ యాజమాన్యం ప్రాసెసింగ్, డెవలప్‌మెంట్ చార్జీల కింద రూ.101.01 కోట్లు చెల్లించాల్సిందేనని ఆర్థిక శాఖ తేల్చేసింది. అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు దీన్ని ఖాతరు చేయలేదు. కాకినాడ సెజ్‌కు చార్జీల కింద రూ.101.01 కోట్ల మినహాయింపు ఇస్తూ ఇటీవల కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కాకినాడ ప్రైవేట్ సెజ్‌కు చార్జీను రద్దు చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఆర్.కరికాల వళవన్ మంగళవారం జీవో జారీ చేశారు.

బూజుపట్టిన 'చంద్రన్న' బెల్లం

బలిజిపేట (పార్వతీపురం): 'చంద్రన్న' సంక్రాంతి సరుకుల్లో బెల్లానికి బూజుపట్టింది. విజయనగరం జిల్లా బలిజిపేట మండలం గలావల్లిలో మంగళవారం జన్మభూమి గ్రామసభలో పంపిణీ చేసేందుకు సరుకులను తీసుకురాగా దానిలో బూజుపట్టిన బెల్లం కనిపించింది. క్రిస్మస్ పండగ సందర్భంగా పంపిణీ చేసుకోవాల్సిన సరుకులనే సంక్రాంతికి కూడా పంపిణీ చేస్తుండటంతో నిల్వ ఉన్న బెల్లానికి బూజుపట్టింది. క్రిస్మస్ కోసం తెచ్చిన సరుకులు వెంటనే సంక్రాంతికి కూడా అందించేస్తే ఈ సమస్య తలెత్తేది కాదని, జన్మభూమి సభల్లో ఇవ్వాలని నిల్వ చేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

స్విమ్స్‌లో అగ్నిప్రమాదం

తిరుపతి (అలిపిరి): తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. యూరాలజీ విభాగం ఐసీయూలోని ప్రత్యేక గదిలో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగడంతో గదిలోని ఏసీ, ఇతర వస్తువులు కాలిబుడిదయ్యాయి. రోగులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో వైద్యులు ఊపిరి పీల్చుకున్నారు. షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక అధికారులు వెల్లడించారు.

రైలులో ప్రయాణించిన ఉప రాష్ట్రపతి



రేణిగుంట: భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రైలులో నెల్లూరుకు వెళ్లడం సర్వత్రా ఆసక్తిని రేపింది. ఉపరాష్ట్రపతి స్థాయి వ్యక్తికి ప్రత్యేక రవాణా సదుపాయాల వెసులుబాటు ఉంటుంది. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మంగళవారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో చిత్తూరు జిల్లా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే సిద్ధంగా ఉన్న 8బోగీలతో కూడిన ప్రత్యేక రైలులో ఎక్కి నెల్లూరుకు బయల్దేరారు. సకల సౌకర్యాలతో కూడిన సూట్ భోగీలో ఆయన ప్రయాణించారు. రైలులోని మిగిలిన ఏడు బోగీల్లో భద్రత సిబ్బంది, మెడికల్, ఫైర్, వ్యక్తిగత సిబ్బంది ఆయనతోపాటు ప్రయాణించారు. ఉప రాష్ట్రపతి ప్రయాణించే రైలుకన్నా పది నిమిషాల ముందు పైలట్ ఇంజన్ ఆర్‌పీఎఫ్ సిబ్బందితో బయల్దేరింది. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రైలు ప్రయాణం సర్వత్రా ఆసక్తి రేపింది. వెంకయ్యనాయుడు అత్త మృతి చెందిన రోజు పార్థీవదేహాన్ని సందర్శించేందుకు వచ్చిన ఆయన రేణిగుంట విమానాశ్రయం నుంచి రోడ్డుమార్గాన చేరుకున్నారు. ఈసారి రైలులో వెళ్లడం స్థానికంగా చర్చనీయాంశమైంది. భద్రతా సిబ్బంది అనుమతి ఇవ్వడంతో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతోపాటు స్థానిక మీడియా ప్రతినిధులు అదే రైలులో ప్రయాణం చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా రైలు ప్రయాణం చేసినట్లు ప్రచారం సాగుతోంది.

అర్చకుల వయోపరిమితిపై హైకోర్టుకు

- టీటీడీ పాలకమండలి నిర్ణయం
- భక్తులకు వసతి సదుపాయాల కల్పనకోసం పలు చర్యలు
- ఆగమ సలహాదారుగా ఎ.అనంతశయన దీక్షితులు నియామకానికి ఆమోదం

తిరుమల: అర్చకుల వయోపరిమితి వివాదంపై హైకోర్టును ఆశ్రయించాలని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలకమండలి నిర్ణయం తీసుకుంది. పుట్టా సుధాకర్‌యాదవ్ అధ్యక్షతన మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన టీటీడీ పాలక మండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అర్చకుల కేసులో రాష్ట్రప్రభుత్వం కూడా ఇంప్లీడ్ అయి ఉండడంతో అడ్వొకేట్ జనరల్ ద్వారానే వాదనలు వినిపించాలని తీర్మానించారు. ఇతర నిర్ణయాలివీ..

- తిరుపతిలోని అలిపిరి వద్ద భక్తులకు వసతి కల్పించేందుకు మొదటి బ్లాకులో 384 గదులను రూ.67.29 కోట్లతో నిర్మించేందుకు టెండర్లు ఖరారు.
- తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మరింత పటిష్టంగా నిఘా, భద్రతను కల్పించేందుకు 2వ దశలో 1,050 సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.15.79 కోట్ల నిధులు మంజూరు. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనం కాంప్లెక్స్‌నుంచి ఆళ్వార్ ట్యాంక్ రెస్ట్‌హౌస్ గేటు వరకు రూ.17.21 కోట్లతో క్యూలైన్ నిర్మించేందుకు టెండర్లు ఖరారు.
- తిరుమలలో స్మార్ట్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.2.63 కోట్లు మంజూరు. అలాగే తిరుపతిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్‌కు సంబంధించిన హార్డ్‌వేర్‌కోసం రూ.1.97 కోట్లు మంజూరు.
- అమరావతిలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని నిర్మించే ప్రక్రియలో భాగంగా మహారాజగోపురం, ఆర్జిత సేవామండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథమండపం, శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయం, పుష్కరిణి నిర్మించేందుకు రూ.27.29 కోట్లతో టెండర్లు ఖరారు.
- స్వర్గీయ వేదాంతం దేశికాచార్యులు స్థానంలో టీటీడీ అర్చకులు ఎ.అనంతశయన దీక్షితులను రెండేళ్ల కాలపరిమితికి ఆగమసలహాదారుగా నియమించేందుకు ఆమోదం.
- తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి సముదాయంలో ఒకరోజుకు నాన్ ఏసీ గది రూ.600, ఏసీ గది రూ.1,200, ఏసీ డార్మిటరీ ఒక వ్యక్తికి రూ.100 అద్దె, నాన్ ఏసీ డార్మిటరీ ఉచితంగా కేటాయించేందుకు ఆమోదం.
- పలమనేరులోని గోశాలలో దేశవాళీ గోవుల సంరక్షణకోసం, 'గో పర్యాటకాన్ని' అభివృద్ధి చేసేందుకు, పాడిరైతులకు శిక్షణ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు, ఇతర అభివృద్ధి పనులకు రూ.40.77 కోట్లు మంజూరుకు ఆమోదం.
- అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద రూ.2.27 కోట్లతో కల్యాణమండపం నిర్మించేందుకు టెండర్లు ఖరారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- అందుబాటులో లేని 108 వాహనం
- సకాలంలో చికిత్స అందక మహిళ మృతి
- ప.గో.లో ఘటన




కుక్కునూరు పీహెచ్‌సీ సెంటర్లో 108 వాహనం దుస్థితి గుండెపోటుతో మృతిచెందిన రావి కళావతి

కుక్కునూరు: ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైపోయింది. గుండెనొప్పితో శ్వాస తీసుకోవడం కష్టంగా మారిన మహిళను పెద్దాస్పత్రికి తరలించేందుకు 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ప్రాణాలు విడిచింది. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరుకు చెందిన రావి కళావతి(40) సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత గుండెల్లో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపింది. కుటుంబ సభ్యులు కళావతిని కుక్కునూరు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ కళావతికి ఆస్పత్రి సిబ్బంది ఆక్సిజన్ పెట్టడంతో కొంతమేర తేరుకుంది. పీహెచ్‌సీ వైద్యుడు సెలవులో ఉన్నాడని.. మరో ఆస్పత్రికి తరలించాలని అక్కడి సిబ్బంది సూచించారు.108కి ఫోన్ చేయగా వాహనం మరమ్మతులో ఉందని తెలిపారు. దీంతో కళావతిని బంధువులు అశ్వారావుపేట ఆస్పత్రికి తరలించాలని నిర్ణయించుకుని ప్రైవేటు వాహనాన్ని ఏర్పాటు చేసుకుని ఆక్సిజన్ సిలెండర్ ఇవ్వాలని పీహెచ్‌సీ సిబ్బందిని కోరారు. పీహెచ్‌సీలో ఒక్కటే సిలెండర్ ఉందని చెప్పడంతో చేసేది లేక ప్రైవేటు వాహనంలో తరలించారు. అశ్వారావుపేట వెళ్లగానే కళావతి ఆరోగ్యం మరింత క్షీణించింది. అక్కడి ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చేలోపే ఆమె మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని సోమవారం రాత్రి కుక్కునూరు తీసుకొచ్చారు.

17న కొత్తపట్నంలో జాతీయస్థాయి ఎడ్ల పోటీలు

కొత్తపట్నం: ప్రకాశం జిల్లా కొత్తపట్నంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 17న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగు పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో తొలి ఏడు స్థానాల్లో నిలిచిన జతలకు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్లకు రూ.1,10,116 నగదు బహుమతి, రెండు నుంచి ఏడు స్థానాల్లో నిలిచిన ఎడ్లకు వరుసగా రూ.85,116, రూ.60,116, రూ.40,116, రూ.30,116, రూ.20,116, రూ.15,116 ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు సెల్:9849228605 నంబరులో సంప్రదించాలని కోరారు.

తిరుమలలో మళ్లీ పుష్పగుచ్ఛాల సంస్కృతి

సినీ నటుడు బాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందించిన టీడీపీ నేతలు

సాక్షి, తిరుపతి: శ్రీవారి సన్నిధికి వచ్చే ప్రముఖులకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికే సంస్కృతిని ఇటీవల టీటీడీ నిషేధించింది. అయితే సినీనటుడు బాలకృష్ణ మంగళవారం శ్రీవారిని దర్శించుకుని వెలుపలకి రాగా పలువురు టీడీపీనేతలు, అభిమానులు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి దుశ్శాలువతో సత్కరించారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల తిరుమలకు వచ్చిన సందర్భంగా పలువురు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికేందుకు ప్రయత్నించగా టీటీడీ విజిలెన్స్ అధికారులు అడ్డుకున్నారు. తిరుమలలో పుష్పగుచ్ఛాలు ఇవ్వడం, రాజకీయాలుమాట్లాడటం నిషేధమని వారించారు. అయితే అధికార పార్టీకి చెందిన బాలకృష్ణకు మాత్రం పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్నా విజిలెన్స్ అధికారులు పట్టనట్లు వ్యవహరించారు. తిరుమల పవిత్రత టీటీడీ అధికారులకు ఇప్పుడు గుర్తుకురాదా? అంటూ తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి టీటీడీని విమర్శించారు.

రూ.10 కోట్లతో ఉడాయించాడు

- నెల్లూరు కార్పొరేట్ ఆసుపత్రి మాజీ సీఈఓ ఘరానా మోసం
- రూ.10 కోట్ల వరకు దండుకుని రెండేళ్లుగా పరారీలో..

సాక్షి, అమరావతిబ్యూరో/ పెనమలూరు: మీ పెట్టుబడికి 20 శాతం కమీషన్ లేదా మీ డబ్బుకు 10 శాతం వడ్డీ అంటూ నమ్మబలికారు. సుమారు 50 మంది నుంచి రూ.10 కోట్లు వసూలు చేసి పరారయ్యారు. అలా పరారైనవారిలో ప్రధాన నిందితుడు విజయవాడ కానూరులోని కామినేని ఆసుపత్రిలో సీఈఓగా పనిచేస్తున్నాడని తెలుసుకున్న బాధితులు నెల్లూరు నుంచి విజయవాడ చేరుకొని మంగళవారం ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. బాధితుల కథనం ప్రకారం.. నెల్లూరు మాక్స్‌క్యూర్ గ్రూప్‌నకు చెందిన సింహపురి కార్పొరేట్ ఆసుపత్రిలో రెండేళ్ల క్రితం కరణం నాగేంద్ర ప్రసాద్ సీఈవోగా పనిచేశాడు. అతని సహాయకుడిగా తాడికొండ కిషోర్ పనిచేసేవాడు. వీరు కార్పొరేట్ ఆసుపత్రులకు పరికరాలు, మందులు సరఫరా చేసే వారితో కలిసి వ్యాపారం ప్రారంభించారు. ఈ క్రమంలో డబ్బు ఎక్కువ మొత్తంలో అవసరమై తమ వద్ద లేకపోవడంతో తమ సహోద్యోగులతో పాటు పరిచయమున్న కాంట్రాక్టర్లను మభ్యపెట్టారు. తాము వ్యాపారం చేస్తున్నామని మీరు పెట్టుబడులు పెట్టి భాగస్వాములైతే ప్రతి నెలా 20 శాతం కమీషన్ ఇస్తామని, ఒకవేళ కమీషన్ వద్దనుకుంటే వంద రూపాయలకు రూ.10 వంతున వడ్డీ చెల్లిస్తామని నమ్మబలికారు. ఆరు నెలల పాటు చెప్పినట్టుగానే 20 శాతం కమీషన్ ఇచ్చారు. ప్రతి నెలా వేలల్లో ఆదాయం వస్తుండటంతో ఆశపడిన దాదాపు 50 మంది రూ.10 కోట్ల వరకు వారికి ఇచ్చారు. దీంతో వారు ఉద్యోగాలు వదిలి పరారయ్యారు. అప్పులిచ్చిన వారు నెల్లూరు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కిషోర్‌ను పట్టుకుని విచారించారు.

అంతా నాగేంద్రప్రసాద్ పథకమే..!

ఇదంతా నాగేంద్ర ప్రసాద్ వేసిన పథకమని, తాను ఆయన చెప్పిన మేరకు వసూళ్లు చేశానని కిషోర్ చెప్పాడు. దీంతో పోలీసులతో పాటు బాధితులు నాగేంద్ర ప్రసాద్ కోసం గాలింపు చేపట్టారు. చివరకు విజయవాడలోని కామినేని ఆసుపత్రిలో సీఈఓగా పనిచేస్తున్నాడని బాధితులు తెలుసుకున్నారు. మంగళవారం విజయవాడ చేరుకొని ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. నాగేంద్ర ప్రసాద్‌ను తమకు అప్పగించాలంటూ డిమాండ్ చేశారు. అయితే ప్రసాద్ రెండురోజులుగా రావడం లేదని యాజమాన్యం చెప్పడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పెనమలూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. పెనమలూరు సీఐ పెద్దిరాజు నెల్లూరు పోలీసులతో మాట్లాడగా నిందితులపై రెండు కేసులు ఉన్నాయని చెప్పినట్టు తెలుస్తోంది. తమను మోసం చేసిన నాగంద్ర ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు ప్రసన్నకుమార్‌రెడ్డి, ధనుంజయ, రామాంజరెడ్డి డిమాండ్ చేశారు.


కామినేని ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

భవనం పైనుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

- ఉపాధ్యాయులు మందలించారనే మనస్తాపంతోనే..
- కంచికచర్ల శ్రీ చైతన్య స్కూల్‌లో ఘటన
- మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో


విద్యార్థి నాగార్జున సాయిరెడ్డి మృతదేహం

కంచికచర్ల(నందిగామ): ప్రిన్సిపాల్‌తోపాటు ఇద్దరు ఉపాధ్యాయులు మందలించడంతో మనస్తాపం చెందిన విద్యార్థి స్కూల్ మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం ఉదయం కంచికచర్లలో చోటు చేసుకుంది. విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా వీరులపాడు మండలం కొణతాలపల్లి గ్రామానికి చెందిన శీలం తిరుపతిరెడ్డి, మంగమ్మ ఏకైక కుమారుడు నాగార్జున సాయిరెడ్డి (14) కంచికచర్ల జాతీయ రహదారి పక్కనగల శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. తోటి విద్యార్థుల మధ్య జరిగిన చిన్నపాటి వివాదంతో విద్యార్థి నాగార్జున సాయిరెడ్డిని ప్రిన్సిపాల్ వద్దకు క్లాస్ టీచర్ తీసుకు వెళ్లింది. ప్రిన్సిపాల్, స్కూల్ డీన్, పక్కనే ఉన్న మరో ఉపాధ్యాయుడు విద్యార్థిని రెండు దెబ్బలు కొట్టి తీవ్ర పదజాలంతో అసభ్యకరంగా మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థి నాగార్జున సాయిరెడ్డి స్కూల్ మూడో అంతస్తు పైకి వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకాడు. స్కూల్‌గేట్‌పై పడటంతో గేట్‌కు ఉన్న ఇనుపరాడ్డులు పొట్ట భాగంలో గుచ్చుకోవడంతో తీవ్రంగా గాయపడిన అతడిని సమీపంలోని పీహెచ్‌సీకి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యురాలు కె.వాసంతి ధ్రువీకరించారు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు జాతీయ రహదారిపై సాయిరెడ్డి మృతదేహాన్ని ఉంచి రాస్తారోకో చేశారు. వీరికి వైఎస్సార్‌సీపీ నేతలు, ఎస్‌ఎఫ్‌ఐ, తదితర విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయి. విద్యార్థి తల్లిదండ్రులను సబ్ కలెక్టర్ మీషాసింగ్ పరామర్శించారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలకు ఆదేశించారు. డీఈవో ఎంవీ రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు డీవైఈవో చంద్రకళ పాఠశాలను సీజ్ చేశారు.

సాక్షి స్పోర్ట్స్
బుధవారం
9-1-2019



తొలి రౌండ్‌లోనే దివిజ్‌-బోపన్న జంట ఓటమి

గత వారం స్వదేశంలో జరిగిన టాటా ఓపెన్‌ ఏటీపీ-250 టోర్నీలో టైటిల్‌ నెగ్గిన దివిజ్‌ శరణ్‌-రోహన్‌ బోపన్న జంటకు రెండో టోర్నమెంట్‌లో మాత్రం నిరాశ ఎదురైంది. సిడ్నీ ఓపెన్‌ ఏటీపీ-250 టోర్నీలో ఈ భారత జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఇవాన్‌ డోడిగ్‌ (క్రొయేషియా)-ఎడువార్డో రోజర్‌ వాసెలిన్‌ (ఫ్రాన్స్‌) ద్వయంతో జరిగిన పురుషుల డబుల్స్‌ తొలి రౌండ్‌లో బోపన్న-దివిజ్‌ జంట 2-6, 4-6తో ఓడిపోయింది. 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ రెండు ఏస్‌లు సంధించి, మూడు డబుల్‌ ఫాల్ట్‌లు చేసింది. తొలి రౌండ్‌లో ఓడినప్పటికీ భారత జంటకు 2,870 డాలర్ల (రూ. 2 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది.

సిరాజ్‌కు పిలుపు

ఆసీస్, కివీస్‌లతో వన్డే సిరీస్‌కు ఎంపిక
పేస్‌ బౌలర్‌ బుమ్రాకు విశ్రాంతి



సిడ్నీ: ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి భారత జట్టు టెస్టు సిరీస్‌ నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన పేస్‌ బౌలర్‌ జస్‌ప్రీత్‌ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చారు. ఈనెల 12 నుంచి ఆస్ట్రేలియాతో... అనంతరం 23 నుంచి న్యూజిలాండ్‌తో మొదలయ్యే మూడు వన్డేల సిరీస్‌లలో బుమ్రా బరిలోకి దిగడం లేదని బీసీసీఐ ప్రకటించింది. బుమ్రా స్థానంలో హైదరాబాద్‌ పేస్‌ బౌలర్‌ మొహమ్మద్‌ సిరాజ్‌ను తొలిసారి వన్డే జట్టులోకి ఎంపిక చేశారు. 'ఫిబ్రవరిలో భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటించనుంది. ఈ నేపథ్యంలో బుమ్రాకు తగిన విశ్రాంతి ఇవ్వాలని టీమ్‌ మేనేజ్‌మెంట్‌ భావించింది. అతని స్థానంలో సిరాజ్‌ను ఎంపిక చేశాం. న్యూజిలాండ్‌తో జరిగే టి20 సిరీస్‌కు పంజాబ్‌ బౌలర్‌ సిద్ధార్థ్‌ కౌల్‌ను కూడా జట్టులోకి తీసుకున్నాం' అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఏడాది క్రితమే టెస్టుల్లో అరంగేట్రం చేసిన 25 ఏళ్ల బుమ్రా 10 టెస్టులు ఆడి 49 వికెట్లు తీశాడు. మరోవైపు 24 ఏళ్ల సిరాజ్‌ 2017 నవంబర్‌లో రాజ్‌కోట్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన టి20 ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగు పెట్టాడు. మూడు టి20 మ్యాచ్‌లు ఆడిన అతను మూడు వికెట్లు తీశాడు.



ఆసీస్‌ దాసోహం వెనుక!

79

తాజాగా ముగిసిన టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్‌ నమోదు చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోరిది. సిడ్నీ టెస్టులో ఓపెనర్‌ మార్కస్‌ హారిస్‌ చేశాడివి. గత వందేళ్లలో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ టెస్టులతో కూడిన సిరీస్‌లలో ఓ ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్‌ చేసిన 'అతి తక్కువ అత్యధిక వ్యక్తిగత' స్కోరు ఇదే.

27.90

సిరీస్‌లో ఆస్ట్రేలియా టాప్‌-6 బ్యాట్స్‌మెన్‌ ఉమ్మడి సగటు ఇది. స్వదేశంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ టెస్టుల సిరీస్‌లో గత వందేళ్లలో ఇది వారి మూడో అత్యల్ప సగటు.

30.90

కంగారూ ముగ్గురు పేసర్ల సంయుక్త బౌలింగ్‌ సగటు ఇది. వ్యక్తిగతంగా చూస్తే ఇందులో స్టార్క్‌ సగటు (34.53) మరీ ఘోరం. సొంత గడ్డపై అతడికిది మూడో దారుణ ప్రదర్శన. హాజల్‌వుడ్‌ (30.61)ది స్వదేశంలో రెండో చెత్త గణాంకం.

1

నాలుగు టెస్టుల సిరీస్‌లో ఆసీస్‌ బౌలర్లు ఒక్కటంటే ఒక్కటే ఎల్బీడబ్ల్యూ చేయగలిగారు. మూడో టెస్టులో స్పిన్నర్‌ లయన్‌... రహానేను ఈ విధంగా ఔట్‌ చేశాడు. ముగ్గురు పేసర్లు ఒక్కరిని కూడా వికెట్ల ముందు దొరకబుచ్చుకోలేకపోయారు. దీంతో వికెట్‌ లక్ష్యంగా కాకుండా బంతులేస్తున్నారంటూ ఓ దశలో కంగారూ బౌలింగ్‌ ప్రమాణాలపై చర్చ జరిగింది.



- బ్యాట్స్‌మెన్‌ దారుణ వైఫల్యం
- పేసర్ల ప్రతాపం శూన్యం
- స్పిన్నర్‌ను దెబ్బకొట్టిన టీమిండియా

సాక్షి క్రీడా విభాగం

ఆస్ట్రేలియా నుంచి అదీ దాని సొంతగడ్డపై ఏమాత్రం ఊహించని స్థాయి ఆట ఇది. స్టీవ్‌ స్మిత్, డేవిడ్‌ వార్నర్‌ లేకపోవడంతో బ్యాటింగ్‌ బాగా బలహీనపడిందని అంతా అనుకున్నదే. అయితే, అనుభవజ్ఞులైన ఉస్మాన్‌ ఖాజా, షాన్‌ మార్ష్‌ ఆ లోటును కొంతైనా భర్తీ చేస్తారని భావించారు. ఇదేమీ జరగకపోగా, అనూహ్యంగా బౌలింగ్‌లోనూ కంగారూలు తేలిపోయారు. ప్రధాన పేసర్‌ మిషెల్‌ స్టార్క్‌ తీవ్రంగా విఫలమయ్యాడు. హాజల్‌వుడ్డూ అతడికి తోడయ్యాడు. కాస్తోకూస్తో కమిన్సే నయమనిపించాడు. సహజంగా తమ ఆటగాళ్లను వెనుకేసుకొచ్చే ఆస్ట్రేలియా సీనియర్లకూ ఈ ప్రదర్శనతో చిర్రెత్తినట్లుంది. దీంతో తక్షణమే జట్టులోంచి కొందరిని తీసేయాలంటూ సూచించారు. టెస్టు టెస్టుకూ ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్, బౌలర్ల సత్తా తగ్గిపోవడంతో భారత్‌ పని సులువైపోయింది. సిరీస్‌ కోహ్లి సేన వశమైంది.

అతడు నిలవలేదు...

'కోహ్లికి దీటుగా పరుగులు సాధిస్తాడు...' ఈ సిరీస్‌కు ముందు ఉస్మాన్‌ ఖాజాపై ఉన్న అంచనా ఇది. అక్టోబరులో దుబాయ్‌లో పాకిస్తాన్‌పై రెండో ఇన్నింగ్స్‌లో అద్భుత శతకంతో టెస్టును కాపాడిన ఖాజా ఫామ్‌ను చూస్తే ఈ అంచనాలో తప్పేం లేదనిపించింది. కానీ, వాటిని అందుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాడు. ఓపెనర్లు ఫించ్, హారిస్‌లకు అనుభవం లేనందున, జట్టులో సీనియర్‌గా, కీలకమైన వన్‌డౌన్‌ బ్యాట్స్‌మన్‌గా ఖాజా బాధ్యత రెట్టింపైంది. అయితే, అతడు 8 ఇన్నింగ్స్‌లలో ఒక్కటే అర్ధ సెంచరీతో 198 పరుగులు మాత్రమే చేశాడు. ఈ మొత్తం స్కోరును టీమిండియా వన్‌డౌన్‌ బ్యాట్స్‌మన్‌ చతేశ్వర్‌ పుజారా అటు ఇటుగా సిడ్నీ టెస్టులో (193)నే చేయడం గమనార్హం. ఇక్కడే రెండు జట్ల మధ్య తేడా తెలిసిపోతోంది. ఇక షాన్‌ మార్ష్‌ చేసినవి 183 పరుగులే. ఇందులో ఒక్క అర్ధశతకమూ లేదు. ట్రావిస్‌ హెడ్, హ్యాండ్స్‌కోంబ్, ఫించ్‌ల ఇన్నింగ్స్‌లు జట్టుకు ఏమాత్రం ఉపయోగ పడలేకపోయా యి. వీరికంటే, కొత్తవాడైనా హారిసే నయం అనిపించాడు. పైన్‌ బ్యాటింగ్‌ సామర్థ్యం అంతంతే కావడం, మిషెల్‌ మార్ష్‌ వంటి ఆల్‌రౌండర్‌ను సరిగా ఉపయోగించుకోలేకపోవడం ఆసీస్‌ వనరులను పరిమితం చేశాయి. వీరంతా రాణించి ఉంటే లోయరార్డర్‌ లోనూ ఆత్మవిశ్వాసం పెంచి ఉండేవారు. కానీ, అదేమీ జరగలేదు. మొత్తమ్మీద 8 అర్ధ శతకాలు చేసినా, ఎవరి నుంచి సెంచరీ నమోదు కాకపోవడంతో ఆసీస్‌ పోరాడగలిగే స్కోర్లూ చేయలేకపోయింది.

పదును లేక పస తగ్గింది...

బ్యాటింగ్‌లో జట్టు వైఫల్యం ఆసీస్‌ పేసర్లపైనా ప్రభావం చూపినట్లుంది. స్టార్క్‌ తీరు చూస్తే ఇది వాస్తవమేనన్నట్లుంది. గతేడాది ప్రారంభంలో డర్బన్‌ టెస్టులో 109 పరుగులకే 9 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికాను పరాజయం పాల్జేసిన స్టార్క్‌... తాజాగా భారత్‌తో ఆడిన స్టార్క్‌ ఒక్కడేనా అన్నట్లుగా సాగింది అతడి బౌలింగ్‌. పేస్‌ ఉన్నా, అందులో పదును లేకపోవడంతో అతడి బౌలింగ్‌లో భారత బ్యాట్స్‌మెన్‌ ఇబ్బంది పడలేదు. తొలి రెండు టెస్టులు ఫర్వాలేదనేలా సాగినప్పటికీ తర్వాతర్వాత మరీ పేలవంగా బౌలింగ్‌ చేశాడు. దీంతో చివరి టెస్టులో పైన్‌... స్టార్క్‌ను కాదని పార్ట్‌ టైమర్‌ ఖాజాకు బంతినిచ్చాడు. సిడ్నీ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో షార్ట్‌ బంతులతో మయాంక్, పుజారాలను ఇబ్బంది పెట్టడం, రహానేను అద్భుత బౌన్సర్‌తో ఔట్‌ చేయడం, 150 కి.మీ. వేగం నమోదు మినహా సిరీస్‌లో స్టార్క్‌ ప్రభావం శూన్యం. మొత్తమ్మీద 13 వికెట్లే పడగొట్టగలిగాడు. చిత్రంగా ఇదే టెస్టులో వందకుపైగా పరుగులిచ్చిన అతడు ఓ దశలో 25 ఓవర్లు వేసినా, అందులో ఒక్క మెయిడెనూ లేకపోయింది. 2018 పూర్తవకుండానే 200 వికెట్ల మైలురాయిని అందుకుంటాడని అంతా భావిస్తే... 2019 వచ్చినా 199 వికెట్ల వద్దే ఆగిపోయాడు. ఏమాత్రం ప్రభావం చూపకపోయినా మరో పేసర్‌ హాజల్‌వుడ్‌ను కొనసాగించి ఆసీస్‌ తప్పు చేసింది. భారత బ్యాట్స్‌మెన్‌కు ఇతడి నుంచి ఇబ్బందులు తప్పవని సిరీస్‌ ప్రారంభానికి ముందు ఊహాగానాలు వచ్చాయి. అయితే, హాజల్‌వుడ్‌ ఏ దశలోనూ ప్రమాదకారిగా కనిపించలేదు. సరికదా... పేలవ ప్రదర్శనలో స్టార్క్‌తో పోటీపడి 13 వికెట్లే తీయగలిగాడు.

సిరీస్‌లో కంగారూల తరపున కమిన్స్‌ అత్యుత్తమ బౌలింగ్‌ గణాంకాలు (6/27) నమోదు చేసినప్పటికీ అది మెల్‌బోర్న్‌ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో అవసరం లేని సందర్భంలో వచ్చినదే. ఇక అడిలైడ్, పెర్త్‌లో ఏకంగా 16 వికెట్లు నేలకూల్చిన ఆఫ్‌ స్పిన్నర్‌ లయన్‌ను మూడో టెస్టు నుంచి మన ఆటగాళ్లు అటు వ్యూహాత్మకంగా, ఇటు ఎదురుదాడితో దెబ్బకొట్టి ఆసీస్‌ బౌలింగ్‌పై పూర్తి ఆధిపత్యం చలాయించారు.

ఒక్కొక్కరికి రూ. 60 లక్షలు

భారత క్రికెటర్లకు బీసీసీఐ నజరానా

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్‌ విజయం సాధించిన కోహ్లి జట్టుకు భారత క్రికెట్‌ నియంత్రణ మండలి (బీసీసీఐ) నజరానా ప్రకటించింది. నాలుగు టెస్టుల్లో తుది జట్టులో ఆడిన 11 మంది ఆటగాళ్లకు మ్యాచ్‌కు రూ. 15 లక్షల చొప్పున (మొత్తం రూ. 60 లక్షలు) నగదు పురస్కారం అందజేస్తామని తెలిపింది. రిజర్వ్‌ ఆటగాళ్లుగా ఉన్న వారికి మ్యాచ్‌కు రూ. 7 లక్షల 50 వేల వంతున (మొత్తం రూ. 30 లక్షలు)... కోచ్‌లకు రూ. 25 లక్షల చొప్పున ఇస్తామని పేర్కొంది.

పంత్‌... అమాంతం!

- ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో 17వ ర్యాంక్‌
- 1973 తర్వాత ఓ భారత వికెట్‌ కీపర్‌కిదే అత్యుత్తమం



దుబాయ్: ఆస్ట్రేలియాపై చారిత్రక టెస్టు సిరీస్‌ విజయం భారత బ్యాట్స్‌మెన్‌ను ఐసీసీ ర్యాంకింగ్స్‌లో పైకి తీసుకొచ్చింది. మంగళవారం విడుదల చేసిన ఈ జాబితాలో అందరికంటే ఎక్కువగా వికెట్‌ కీపర్‌ బ్యాట్స్‌మన్‌ రిషభ్‌ పంత్‌ స్థానం మెరుగైంది. సిరీస్‌కు ముందువరకు 48వ ర్యాంక్‌లో ఉన్న పంత్‌... 20 క్యాచ్‌లు, 350 పరుగులు సాధించి ఇప్పుడు ఏకంగా 17వ స్థానానికి ఎగబాకాడు. తద్వారా 1973లో ఫారూఖ్‌ ఇంజినీర్‌ సాధించిన అత్యుత్తమ భారత వికెట్‌ కీపర్‌ ర్యాంక్‌ను సమం చేశాడు. ఈ విషయంలో మాజీ కెప్టెన్‌ మహేంద్ర సింగ్‌ ధోనిని సైతం వెనక్కు నెట్టాడు. ధోని టెస్టు ఉత్తమ ర్యాంక్‌ 19 కావడం విశేషం. 'మ్యాన్‌ ఆఫ్‌ ద సిరీస్‌'గా నిలిచిన పుజారా ఒక స్థానం మెరుగుపర్చుకుని మూడో ర్యాంక్‌కు చేరాడు. కోహ్లి నంబర్‌వన్‌ స్థానం చెక్కుచెదరలేదు.

పుట్టింట్లోనే టి20 పండుగ

మార్చి 23 నుంచి ఐపీఎల్‌ టోర్నమెంట్‌

లీగ్‌ మొత్తం భారత్‌లోనే నిర్వహిస్తామని బీసీసీఐ ప్రకటన



న్యూఢిల్లీ: దేశంలోని క్రికెట్‌ వీరాభిమానులకు సంతోషకర వార్త. తరలింపు ఊహాగానాలకు తెరదించుతూ ఇండియన్‌ ప్రీమియర్‌ లీగ్‌ (ఐపీఎల్‌-2019) ఈ ఏడాది పూర్తిగా భారత్‌లోనే జరుగనుంది. అత్యంత జనాకర్షక టోర్నీ 12వ ఎడిషన్‌కు మార్చి 23న తెరలేవనుంది. వినోద్‌ రాయ్, డయానా ఎడుల్జీలతో కూడిన ఇద్దరు సభ్యుల క్రికెట్‌ పాలకుల మండలి (సీఓఏ) మంగళవారం ఇక్కడ సమావేశమై బీసీసీఐ తరపున ఈ మేరకు ప్రకటించింది.

ఎన్నికలకు అడ్డు రాకుండా...

సహజంగా ఐపీఎల్‌ ఏటా ఏప్రిల్‌ మధ్యలో ప్రారంభమై మే చివరి వారంలో ముగుస్తుంది. అయితే, ఈసారి దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో లీగ్‌ను దక్షిణాఫ్రికా, యూఏఈలకు తరలిస్తారనే ఊహాగానాలు వచ్చాయి. మే 30 నుంచి వన్డే ప్రపంచ కప్‌ ప్రారంభం కానుండటం షెడ్యూల్‌పై ఒత్తిడి పెంచింది. దీంతో రెండింటికీ అడ్డురాకుండా చూసుకుంటూనే టోర్నీని స్వదేశంలోనే నిర్వహించాలని బీసీసీఐ తీర్మానించుకుంది. అందులో భాగంగానే దాదాపు 20 రోజుల ముందే లీగ్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది. 'మ్యాచ్‌ల కోసం అన్ని ప్రాథమిక వేదికలతో పాటు ప్రత్యామ్నాయ వేదికల జాబితానూ సిద్ధం చేశాం. వీవీఐపీల ఎన్నికల ప్రచారం, పోలింగ్‌ వంటి కారణాలతో ఇబ్బంది తలెత్తితే మార్పు కోసమే ఈ ఏర్పాటు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు, భద్రతా వర్గాలనూ సంప్రదించాం' అని రాయ్‌ తెలిపారు. ఖరారైన వేదికల సమాచారం, మ్యాచ్‌ల తేదీలను ప్రభుత్వ వర్గాలను సంప్రదించాక ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. ఫ్రాంచైజీలతో విస్తృతంగా చర్చించి షెడ్యూల్‌ విడుదల చేస్తామని వివరించారు.

ఫైనల్‌ మే 12-15 మధ్య...

ఊహాగానాల ప్రకారం 8 ప్రధాన... 4 లేదా 6 ప్రత్యామ్నాయ వేదికల వివరాలతో షెడ్యూల్‌ ఫిబ్రవరి తొలి వారంలో విడుదలవుతుంది. ఎన్నికల సంఘం పోలింగ్‌ తేదీలను ప్రకటించాక అవసరాన్ని బట్టి వీటిలో మార్పు చేర్పులు చేస్తుంది. ఎప్పటిలాగే డిఫెండింగ్‌ చాంపియన్‌ సొంత మైదానంలో ప్రారంభ, ముగింపు మ్యాచ్‌లు ఉంటాయి. దీని ప్రకారం ఈసారి తొలి మ్యాచ్‌ చెన్నైలో జరుగనుంది. మే 12 నుంచి 15వ తేదీ మధ్య ఫైనల్‌ జరిగే అవకాశం ఉంది. అయితే, ఇది కూడా పోలింగ్‌ తేదీలపై ఆధారపడి ఉంటుంది. దీనికి తగ్గట్లుగా సిద్ధంగా ఉండమని రాష్ట్రాల క్రికెట్‌ సంఘాలు, ఫ్రాంచైజీలకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

మార్పు తప్పింది...

సాధారణ ఎన్నికల కారణంగానే 2009లో లీగ్‌ను పూర్తిగా దక్షిణాఫ్రికాలో నిర్వహించారు. 2014లో సగ భాగం యూఏఈలో జరిగింది. ఇప్పుడు కూడా పలు ప్రత్యామ్నాయ ప్రణాళికలు ఆలోచించారు. చివరకు ఇక్కడే నిర్వహించేందుకు మొగ్గుచూపారు.

విదేశీ ఆటగాళ్ల అందుబాటెంతో?

వన్డే ప్రపంచ కప్‌ మే 30 నుంచి ప్రారంభం కానుంది. మరోవైపు ఐపీఎల్‌ ప్రపంచకప్‌కు 15 రోజుల ముందే ముగుస్తుంది. తమ జట్లను ప్రపంచ కప్‌నకు సంసిద్ధం చేయాలని ఆయా దేశాలు భావిస్తాయి. ఇప్పటికే న్యూజిలాండ్, అఫ్గానిస్తాన్‌ మినహా మిగతా దేశాలన్నీ లీగ్‌ నుంచి ముందుగానే రావాలని తమ ఆటగాళ్లకు సూచనలిచ్చాయి. ఈ నేపథ్యంలో టోర్నీ చివరకు వచ్చేసరికి విదేశీ ఆటగాళ్ల అందుబాటు ఎంతవరకు ఉంటుందో అనే అనుమానం నెలకొంది.

హడలెత్తించిన గిరినాథ్‌

- 29 పరుగులకు 6 వికెట్లు తీసిన ఆంధ్ర బౌలర్‌
- మధ్యప్రదేశ్‌ 91 ఆలౌట్‌



ఇండోర్: యువ మీడియం పేసర్‌ పారెడ్డి గిరినాథ్‌ రెడ్డి హడలెత్తించడంతో మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్‌ 'బి' లీగ్‌ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు కోలుకుంది. 10.5 ఓవర్లలో నాలుగు మెయిడిన్‌లు వేసి కేవలం 29 పరుగులిచ్చి 6 వికెట్లు తీసిన గిరినాథ్‌ రెడ్డి మధ్యప్రదేశ్‌ జట్టును 91 పరుగులకే కుప్పకూల్చడంలో కీలకపాత్ర పోషించాడు. నమన్‌ ఓజా (30; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రజత్‌ పాటిదార్‌ (19; 3 ఫోర్లు), శుభం శర్మ (16; 2 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. విజయ్‌ కుమార్‌ రెండు వికెట్లు తీయగా... మనీశ్, శశికాంత్‌ ఒక్కోవికెట్‌ పడగొట్టారు. 41 పరుగుల తొలి ఇన్నింగ్స్‌ ఆధిక్యం పొందిన ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడింది. ఆట ముగిసే సమయానికి 7 వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆంధ్ర ఓవరాల్‌ ఆధిక్యం 239 పరుగులకు చేరింది. ఓపెనర్లు ప్రశాంత్‌ (44; 5 ఫోర్లు), జ్ఞానేశ్వర్‌ (43; 5 ఫోర్లు) తొలి వికెట్‌కు 73 పరుగులు జోడించారు. కరణ్‌ షిండే (45 బ్యాటింగ్; 8 ఫోర్లు), శశికాంత్‌ (8 బ్యాటింగ్‌) క్రీజులో ఉన్నారు.

అంకిత, రామ్‌ శుభారంభం

ఆస్ట్రేలియన్‌ ఓపెన్‌ క్వాలిఫయింగ్‌ టోర్నీ





మెల్‌బోర్న్: టెన్నిస్‌ సీజన్‌ తొలి గ్రాండ్‌స్లామ్‌ టోర్నమెంట్‌ ఆస్ట్రేలియన్‌ ఓపెన్‌ క్వాలిఫయింగ్‌ టోర్నమెంట్‌ పురుషుల సింగిల్స్‌లో రామ్‌కుమార్‌ రామనాథన్‌ రెండో రౌండ్‌కు చేరాడు. మహిళల సింగిల్స్‌లో అంకిత రైనా శుభారంభం చేయగా... కర్మన్‌కౌర్‌ థండి తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. సెర్గియో గిటెరెజ్‌ (స్పెయిన్‌)తో జరిగిన మ్యాచ్‌లో రామ్‌కుమార్‌ 6-3, 6-2తో గెలుపొందాడు. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్‌ ఐదు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్‌ చేశాడు. అంకిత 6-2, 6-2తో మిర్టెల్లి జార్జెస్‌ (ఫ్రాన్స్‌)ను ఓడించింది. 62 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్‌ చేసింది. కర్మన్‌ కౌర్‌ 0-6, 5-7తో జెన్నిఫర్‌ బ్రాడీ (అమెరికా) చేతిలో ఓడిపోయింది. కర్మన్‌ ఐదు డబుల్‌ ఫాల్ట్‌లు, 33 అనవసర తప్పిదాలు చేయడం గమనార్హం.

శతక్కొట్టిన రాస్‌ టేలర్, నికోల్స్‌

మూడో వన్డేలోనూ న్యూజిలాండ్‌ విజయం • శ్రీలంకపై 3-0తో సిరీస్‌ క్లీన్‌ స్వీప్‌

నెల్సన్‌ (న్యూజిలాండ్): మరోసారి ఆల్‌రౌండ్‌ ప్రదర్శనతో ఆకట్టుకున్న న్యూజిలాండ్‌... శ్రీలంకతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్‌ చేసింది. మంగళవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో న్యూజిలాండ్‌ 115 పరుగుల తేడాతో ప్రత్యర్థిని చిత్తుగా ఓడించింది. టాస్‌ గెలిచి లంక ఫీల్డింగ్‌ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లకు 364 పరుగులు చేసింది. రాస్‌ టేలర్‌ (131 బంతుల్లో 137; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు), హెన్రీ నికోల్స్‌ (80 బంతుల్లో 124 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) శ్రీలంక బౌలర్ల భరతం పట్టి సెంచరీలు సాధించారు. కెప్టెన్‌ విలియమ్సన్‌ (65 బంతుల్లో 55; 6 ఫోర్లు, సిక్స్‌) అర్ధ సెంచరీ చేశాడు. టేలర్‌ మూడో వికెట్‌కు విలియమ్సన్‌తో 116 పరుగులు... నాలుగో వికెట్‌కు నికోల్స్‌తో 154 పరుగులు జోడించాడు. రాస్‌ టేలర్‌ కెరీర్‌లో ఇది 20వ వన్డే సెంచరీ. శ్రీలంక కెప్టెన్‌ లసిత్‌ మలింగ 10 ఓవర్లలో 93 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. 365 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక 41.4 ఓవర్లలో 249 పరుగులకు ఆలౌటైంది. తిసారా పెరీరా (63 బంతుల్లో 80; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా సహచరుల నుంచి సహకారం కరువైంది. న్యూజిలాండ్‌ బౌలర్లలో ఫెర్గూసన్‌ (4/40), ఇష్‌ సోధి (3/40) రాణించారు. ఇరు జట్ల మధ్య ఏకైక టి20 శుక్రవారం జరుగుతుంది.


టేలర్


నికోల్స్‌

- మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన జట్టుగా న్యూజిలాండ్‌ గుర్తింపు పొందింది. ఈ సిరీస్‌లో న్యూజిలాండ్‌ మొత్తం 1054 పరుగులు (371/7; 319/7; 364/4) సాధించడం విశేషం. ఇప్పటివరకు ఈ రికార్డు భారత్‌ (2017లో ఇంగ్లండ్‌పై 1053 పరుగులు; 356/7; 381/6; 316/9;) పేరిట ఉండేది.

బెంగళూరుకు కీలక గెలుపు

బెంగళూరు: ప్రీమియర్‌ బ్యాడ్మింటన్‌ లీగ్‌లో మంగళవారం జరిగిన లీగ్‌ మ్యాచ్‌లో బెంగళూరు రాప్టర్స్‌ 5-0తో ముంబై రాకెట్స్‌పై నెగ్గి సెమీస్‌కు చేరువైంది. బెంగళూరుకు 'ట్రంప్‌' అయిన మహిళల సింగిల్స్‌లో తి ట్రంగ్‌ వు 15-4, 11-15, 15-7తో శ్రేయాన్షి (ముంబై)పై గెలుపొందగా, పురుషుల డబుల్స్‌లో అహ్‌సాన్‌-సెటియవాన్‌ (బెంగళూరు) ద్వయం 15-11, 15-11తో కిమ్‌ జీ జంగ్‌-లీ యంగ్‌ డే జంటపై నెగ్గింది. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్‌ (బెంగళూరు) 15-14, 15-13తో అంటొన్సెన్‌పై గెలువగా, ముంబై 'ట్రంప్‌'మ్యాచ్‌లో సమీర్‌ వర్మ 15-12, 5-15, 13-15తో సాయిప్రణీత్‌ (బెంగళూరు) చేతిలో ఓటమి చవిచూశాడు. మిక్స్‌డ్‌ డబుల్స్‌లో ఎలిస్‌-స్మిత్‌ (బెంగళూరు) జంట 14-15, 13-15తో కిమ్‌ జీ జంగ్‌-బెర్నాడెత్‌ జోడీ చేతిలో ఓడింది. నేడు హైదరాబాద్‌ హంటర్స్‌తో ఢిల్లీ డాషర్స్‌... అవధ్‌ వారియర్స్‌తో నార్త్‌ ఈస్టర్న్‌ వారియర్స్‌ ఆడతాయి.

క్వార్టర్స్‌లో పేస్‌ జోడీ

న్యూఢిల్లీ: వియత్నాం ఓపెన్‌ ఏటీపీ చాలెంజర్‌ టెన్నిస్‌ టోర్నమెంట్‌లో లియాండర్‌ పేస్‌ (భారత్)-మిగుయెల్‌ వరేలా (మెక్సికో) జంట క్వార్టర్‌ ఫైనల్లోకి దూసుకెళ్లింది. వియత్నాంలోని డా నాంగ్‌ పట్టణంలో మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్‌ తొలి రౌండ్‌లో టాప్‌ సీడ్‌ పేస్‌-వరేలా ద్వయం 6-3, 7-5తో శ్రీరామ్‌ బాలాజీ-అర్జున్‌ ఖడే (భారత్) జోడీపై విజయం సాధించింది. ఇదే టోర్నీ పురుషుల సింగిల్స్‌ తొలి రౌండ్‌లో సుమీత్‌ నాగల్‌ (భారత్) 7-6 (7/0), 7-6 (8/6)తో శ్రీరామ్‌ బాలాజీ (భారత్)పై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు.

సాక్షి బిజినెస్
బుధవారం 9-1-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
131 ▲	30 ▲
35,981	10,802

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	6,862	▲	38
డోజోన్స్	23,707	▲	176
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,862	▲	51
డాక్స్	10,804	▲	56
షాంఘై	2,526	▼	7
నికాయ్	20,204	▲	165

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	69.02	70.84
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.88	91.03
€	యూరో	ఎస్‌బీఐ	78.72	81.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.02	65.62
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	48.96	51.00
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.07	52.47
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.03	20.45
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.15	10.09

ఐఎంఎఫ్ బాధ్యతలు స్వీకరించిన గీతా గోపీనాథ్

చీఫ్ ఎకనమిస్ట్‌గా నియమితులైన తొలి మహిళ



వాషింగ్టన్: అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చీఫ్ ఎకనమిస్టుగా ప్రముఖ ప్రవాస భారతీయ ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ (47) బాధ్యతలు చేపట్టారు. ఆమె ఈ పదవిలో నియమితులైన తొలి మహిళ కావడం విశేషం. అమెరికా పౌరసత్వం ఉన్న గీతా గోపీనాథ్.. హార్వర్డ్ వర్సిటీలో ఇంటర్నేషనల్ స్టడీస్ అండ్ ఎకనమిక్స్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. డిసెంబర్ 31న పదవీ విరమణ చేసిన ఐఎంఎఫ్ రీసెర్చ్ విభాగం ఎకనమిక్ కౌన్సిలర్, డైరెక్టర్ మారిస్ ఆబ్స్‌ఫెల్డ్ స్థానంలో ఆమె నియమితులయ్యారు. గతేడాది అక్టోబర్ 1న గీతా గోపీనాథ్ నియామకాన్ని ఐఎంఎఫ్ ఎండీ క్రిస్టీన్ లగార్డ్ ప్రకటించారు. గీతా గోపీనాథ్ ప్రపంచంలోనే అత్యుత్తమమైన ఆర్థికవేత్తల్లో ఒకరని లగార్డ్ కితాబిచ్చారు. బహుళజాతి సంస్థలు పెను సవాళ్లు ఎదుర్కొంటుండటం, ప్రపంచ దేశాలు గ్లోబలైజేషన్‌ను పక్కనపెట్టి దేశీయ అంశాలకే ప్రాధాన్యమిస్తుండటం వంటి ధోరణులు పెరుగుతున్న తరుణంలో ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్టుగా గీతా గోపీనాథ్ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.


ప్రపంచ దేశాలు గ్లోబలైజేషన్ నుంచి వెనక్కి తగ్గుతుండటాన్ని నివారించడం ఐఎంఎఫ్ ముందున్న పలు ప్రధాన సవాళ్లలో ఒకటని ది హార్వర్డ్ గెజిట్‌కిచ్చిన ఇంటర్వ్యూలో గీత తెలిపారు. 'గ్లోబలైజేషన్‌లో భాగంగా గడిచిన 50–60 ఏళ్లలో ప్రపంచ దేశాలు టారిఫ్‌లు తగ్గించుకోవడం, వాణిజ్యం పెంచుకోవడం వంటివి చేశాయి. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా గ్లోబలైజేషన్ నుంచి ప్రస్తుతం వెనక్కి తగ్గుతున్నాయి. చైనా తదితర దేశాలపై అమెరికా టారిఫ్‌లు విధించడం, ఆయా దేశాలు కూడా అదే రీతిలో స్పందించడం కొన్ని నెలలుగా చూస్తున్నాం. దీంతో వాణిజ్య విధానాలపై అనిశ్చితి పెరుగుతోంది. ప్రపంచ దేశాల మధ్య వాణిజ్యం పెరగడం వల్ల అంతర్జాతీయంగా పేదరికం తగ్గినా.. దాని ప్రభావంతో అసమానతలు పెరిగిపోయాయన్న ఆందోళన ఉంది. ఇలాంటి సందేహాలను నివృత్తి చేసేందుకు తగు చర్యల అవసరం' అని ఆమె పేర్కొన్నారు. అమెరికా వడ్డీ రేట్లను పెంచుతుండటం వల్ల వర్ధమాన దేశాలపై పడుతున్న ప్రభావాలు, వాణిజ్యంలో డాలర్ ఆధిపత్య ప్రభావాలు మొదలైన వాటిపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు.

ఇన్ అవుట్

ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ కిమ్ రాజీనామా

ఇంకా మిగిలి ఉన్న పదవీకాలం మూడేళ్లు ● ప్రైవేట్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలో చేరిక

వాషింగ్టన్: ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ పదవికి జిమ్ యోంగ్ కిమ్ రాజీనామా చేశారు. పదవీకాలం ఇంకా మూడేళ్లుండగానే ఆయన అర్ధంతరంగా తప్పుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రైవేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలో చేరే ఉద్దేశంతో ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ పదవికి కిమ్(58) రాజీనామా చేశారు. ఫిబ్రవరి 1 నుంచి ఇది అమల్లోకి వస్తుంది. కొత్త చీఫ్ నియమితులయ్యేదాకా వరల్డ్ బ్యాంక్ సీఈవో క్రిస్టలీనా జార్జియేవా తాత్కాలిక ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. కిమ్ ఆరేళ్లుగా ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ పదవిలో కొనసాగుతున్నారు. 2017లో రెండో దఫా ప్రెసిడెంట్‌గా ఎన్నికైన కిమ్ పదవీకాలం వాస్తవానికి 2022 నాటికి ముగియాల్సి ఉంది. వాతావరణ మార్పులు, కరువు, కాందిశీకుల సమస్యలు మొదలైనవి



అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ దేశాల పేదల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రపంచ బ్యాంక్‌పై ఉందని ఒక ప్రకటనలో కిమ్ పేర్కొన్నారు. వృత్తి రీత్యా వైద్యుడైన కిమ్.. దక్షిణ కొరియా దేశానికి చెందినవారు. ముందుగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌లో అడ్వైజర్‌గా చేరి, ఆ తర్వాత వరల్డ్ బ్యాంక్‌లో అంచెలంచెలుగా ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగారు.

కొత్త చీఫ్ నియామకం అంశం.. ప్రపంచ బ్యాంక్‌లోని ఇతర సభ్య దేశాలు, అమెరికా మధ్య రగడకు దారి తీసే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. సాధారణంగా ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్‌ను అమెరికా నామినేట్ చేస్తే, దానిలో భాగమైన అంతర్జాతీయ ద్రవ్య నిధి చీఫ్‌ను యూరప్ దేశాలు నామినేట్ చేస్తూ వస్తున్నాయి. మిగతా ప్రాంతాల వర్ధమాన దేశాలకు కూడా ఈ ప్రక్రియలో భాగం ఉండాలన్న డిమాండ్ నెలకొనడంతో 2012లో కిమ్‌ను ఎంపిక చేయడం ద్వారా పాత సంప్రదాయానికి అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఫుల్‌స్టాప్ పెట్టారు. కానీ ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ప్రపంచ రాజకీయాల్లో అమెరికా ప్రాధాన్యాన్ని మరింతగా పెంచే ప్రయత్నాల్లో ఉండటం, దీనికి మిగతా దేశాల నుంచి వ్యతిరేకత వస్తుండటం తదితర పరిణామాల నేపథ్యంలో ప్రపంచ బ్యాంక్ కొత్త చీఫ్ నియామకంపై వివాదానికి దారితీయొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అదరగొట్టే అవకాశాలు తక్కువే?

సాక్షి, బిజినెస్ విభాగం

- క్యూ3 ఫలితాలు సాధారణంగానే ఉండొచ్చు
- ఆదాయం, లాభాల్లో వృద్ధి సింగిల్ డిజిట్‌గానే!
- ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, బ్యాంకింగ్ ఫలితాలు బాగుండొచ్చు
- మిగిలిన రంగాల ఫలితాలు అంతంత మాత్రమే
- 10న టీసీఎస్, 11న ఇన్ఫీతో బోణీ
- మార్చి క్వార్టర్‌లో బాగుండొచ్చని విశ్లేషకుల అంచనా

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికాని(క్యూ3)కి సంబంధించి కార్పొరేట్ కంపెనీల ఫలితాలు ఈ వారం నుంచే మొదలవుతున్నాయి. 10న టీసీఎస్, 11న ఇన్ఫోసిస్‌తో క్యూ3 సీజన్ ఆరంభం కానుంది. ఈ నేపథ్యంలో ఫలితాలు ఎలా ఉంటాయనే అంశంపై విశ్లేషకుల అంచనాలు దాదాపుగా ఒకే రీతిన ఉన్నాయి. అంతా కూడా... నిఫ్టీ–50 కంపెనీల క్యూ3 ఆదాయాల్లో మోస్తరు వృద్ధిని నమోదు చేయవచ్చనే అంచనా వేస్తున్నారు. కొన్ని రంగాలు నిదానించడం, అంతక్రితం ఏడాది ఇదే కాలంలో అధిక వృద్ధి నమోదు కావడం ఇందుకు కారణాలుగా ఉండొచ్చని చెబుతున్నారు. తయారీ వ్యయాల తగ్గుదల కారణంగా మార్చి త్రైమాసికంలో వృద్ధి వేగాన్ని అందుకోవచ్చని భావిస్తున్నారు.

మోస్తరుగానే...

ఆదాయాలు ఎనిమిది త్రైమాసికాల కనిష్ట స్థాయిలో 7.5 శాతం చొప్పున వృద్ధి చెందొచ్చన్నది మెజారిటీ విశ్లేషకుల అంచనా. 2017 డిసెంబర్ త్రైమాసికంలో నమోదైన వృద్ధి 13 శాతంగా ఉంది. ఇక నికర లాభాలు వరుసగా మూడో త్రైమాసికంలోనూ ఒకే అంకె స్థాయిలో ఉంటాయని, 6.7 శాతంగా ఉండొచ్చని భావిస్తున్నారు. ఆటోమొబైల్స్, సిమెంట్, ఆయిల్, గ్యాస్, ఫార్మాస్యూటికల్స్, టెలికం రంగ కంపెనీల ఫలితాలు పరిమితంగానే ఉంటాయని అంచనా వేస్తున్నారు. ప్రైవేటు రంగ బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ రంగ కంపెనీలు మెరుగైన ఫలితాలు ఇస్తాయన్న అంచనాలు విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయి. ''2018 డిసెంబర్ క్వార్టర్లో పారిశ్రామిక లోహాల ధరలు తక్కువగా ఉన్నాయి. చమురు ధరలు కూడా తగ్గాయి. దీంతో చమురు, మెటల్స్ ముడి పదార్థాలుగా వినియోగించే కంపెనీలకు ప్రయోజనం. రూపాయి కూడా 9 శాతం పడిపోయింది. ఇది దిగుమతిదారులపై, విదేశీ మారకంలో రుణాలు తీసుకునే వారిపై భారాన్ని మోపుతుంది'' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ దీపక్ జసాని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి తిరిగి పుంజుకుంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. నిఫ్టీ–50 ఈపీఎస్ డిసెంబర్ క్వార్టర్లో 18–28% మధ్య పెరగొచ్చని మార్కెట్ వర్గాల అంచనా. మరోవైపు, క్యూ3లో దేశీ కార్పొరేట్ల ఆదాయాలు, లాభాల వృద్ధి తగ్గొచ్చని రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ ఒక నివేదికలో పేర్కొంది. కమోడిటీల ఆధారిత రంగాల ఆదాయాలు గణనీయంగా పెరగొచ్చని సీనియర్ డైరెక్టర్ ప్రసాద్ కొపార్కర్ తెలిపారు. వీటిలో నేచురల్ గ్యాస్ (37 శాతం), ఉక్కు ఉత్పత్తులు (27%), సిమెంటు (10) శాతం మేర వృద్ధి సాధించొచ్చని క్రిసిల్ తెలిపింది. ఇక ఇన్‌ఫ్రాకు సంబంధించిన నిర్మాణ తదితర రంగాల వృద్ధి 12 శాతం స్థాయిలో ఉండొచ్చని అంచనా. వివిధ రంగాలవారీగా విశ్లేషకుల అంచనాలు పరిశీలిస్తే..



ఆటోమొబైల్స్

ఆటోమొబైల్ కంపెనీల ఫలితాలు ఆకట్టుకునే విధంగా ఉండకపోవచ్చు. ఎందుకంటే మెజారిటీ కంపెనీల విక్రయాలు తగ్గడం, లేదా ఒకే అంకె వృద్ధికి పరిమితం కావడాన్ని చూస్తూనే ఉన్నాం. పండుగల సీజన్‌లో డిమాండ్ లేకపోవడం, డీలర్ల దగ్గర నిల్వలు పెరిగిపోవడం వంటివి ఆటోమొబైల్ కంపెనీల మార్జిన్లపై ఒత్తిడి పెంచేవే. ఆటో కంపెనీల ఆదాయాల వృద్ధి సుమారు 4 శాతానికి పరిమితం కావొచ్చని క్రిసిల్ అంచనా.

బ్యాంకింగ్

మొండి బకాయిల కోసం బ్యాంకులు చేసే ప్రొవిజన్లు తగ్గొచ్చు. బ్యాంకుల్లో కొత్తగా మరిన్ని మొండిబాకీలు నమోదు కావడం తగ్గుముఖం పడుతోంది. దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్‌పై తక్కువ ఈల్డ్ వల్ల ట్రెజరీ ఆదాయం అధికంగా వస్తుందని, ఇది బ్యాంకుల లాభాలను పెంచేదిగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

క్యాపిటల్ గూడ్స్

ప్రభుత్వం నుంచి ఆర్డర్లు నిలకడగా ఉండడం ఈ రంగంలోని కంపెనీలు అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికం ఫలితాలకు కలసిరానుంది. అంతకుముందు కొన్ని త్రైమాసికాలుగా ప్రాజెక్టుల విషయంలో నత్తనడక కొనసాగింది. అయితే, ఇటీవలి కాలంలో ప్రభుత్వం చేపట్టిన పాలసీ చర్యలు, సంస్కరణలతో వాటి నిర్మాణం వేగాన్ని పుంజుకుంటోంది. ఈ రంగంలో అగ్రగామి కంపెనీ ఎల్ అండ్ టీ డిసెంబర్ త్రైమాసికంలో అంచనాల కంటే తక్కువ ఆర్డర్లనే సంపాదించింది. దీంతో ఈ కంపెనీ చేసే వ్యాఖ్యలను పరిశీలించాల్సి ఉంది.

సిమెంట్

దేశవ్యాప్తంగా సిమెంట్ ధరలు డిసెంబర్‌లో బ్యాగుపై 2 శాతం వరకు తగ్గి రూ.308 స్థాయికి పరిమితం అయ్యాయి. పలు ప్రాంతాల్లో సిమెంట్‌కు డిమాండ్ పెరిగినప్పటికీ పోటీ కారణంగా ధరలు పెంచే పరిస్థితి లేకపోయింది. పెద్ద కంపెనీలైన ఏసీసీ, అంబుజా సిమెంట్, దాల్మియా భారత్, శ్రీసిమెంట్ కంపెనీలు 10–15 శాతం మధ్యలో అమ్మకాల వృద్ధిని నమోదు చేయవచ్చని, కానీ ఆదాయ వృద్ధి మాత్రం 3–9 శాతానికే పరిమితం అవుతుందని అంచనా వేస్తున్నారు.

ఎఫ్‌ఎంసీజీ

పండుగల సమయంలో అధిక విక్రయాలు, జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రభావం ఈ రంగ కంపెనీలపై కనిపించనుంది. గత కొన్ని క్వార్టర్లుగా గ్రామీణ డిమాండ్ వృద్ధికి దన్నుగా నిలిచింది. డిసెంబర్ క్వార్టర్లో మాత్రం ఇది ఒక మోస్తరుగా ఉండొచ్చని భావిస్తున్నారు. అధిక ముడి ఉత్పత్తి వ్యయాల రూపంలో మార్జిన్లపై ప్రభావం ఉంటుంది. అయితే, జీఎస్టీ రేట్ల తగ్గింపు కొంత ఉపశమనం కలిగించేది. ఎఫ్‌ఎంసీజీ రంగం 8 శాతం వృద్ధి నమోదు చేయొచ్చని అంచనా.

మెటల్స్

ఈ ఏడాది అక్టోబర్– డిసెంబర్ త్రైమాసికంలో చాలా వరకు కమోడిటీల ధరలు క్షీణించాయి. స్టీల్ ధరలు 15 శాతం వరకు తగ్గడం జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్ కంపెనీలకు ప్రతికూలంగా పరిణమించనుంది. అల్యూమినియం ధరలు తగ్గడం హిందాల్కో, వేదాంత కంపెనీలపై ప్రభావం చూపించనుంది. వేదాంత లిమిటెడ్‌కు చమురు ఉత్పత్తి కూడా ఉంది. చమురు ధరల తగ్గుదల ప్రభావం కూడా ఈ కంపెనీపై పడనుంది.

ఫార్మా

అమెరికా, దేశీయ మార్కెట్లలో సమస్యల నేపథ్యంలో ఫార్మా కంపెనీలు మెప్పించే ఫలితాలను ప్రకటించే అవకాశం లేదని విశ్లేషకుల అంచనా. అమెరికా మార్కెట్లో ధరల పతనానికి బ్రేక్ పడటం ఎగుమతి చేసే ఫార్మా కంపెనీలకు ఊరట కలిగించే విషయం. గత క్వార్టర్‌లో రూపాయి 11 శాతం క్షీణించిన దరిమిలా ఫార్మా 10 శాతం, ఐటీ రంగం 21 శాతం మేర వృద్ధి నమోదు చేయొచ్చని క్రిసిల్ అంచనా వేస్తోంది.

రూ.999కే ఎయిర్‌ఏషియా టికెట్



న్యూఢిల్లీ: పండుగ సీజన్ సందర్భంగా ఎయిర్ ఏషియా ప్రయాణికులకు బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. దేశీ రూట్లలో కేవలం రూ.999 లకే విమాన టికెట్‌ను అందిస్తోంది. జనవరి 21 నుంచి 31 వరకు జరిగే ఒకవైపు ప్రయాణాలపై ఆఫర్ వర్తిస్తుండగా.. ఇందుకు సంబంధించిన బుకింగ్స్‌ను జనవరి 7 నుంచి 20 వరకు అనుమతిస్తున్నట్లు తెలిపింది. మొత్తం 19 గమ్యస్థానాలకు డిస్కౌంట్ అమల్లో ఉంది. ఈ జాబితాలో బెంగళూరు, న్యూఢిల్లీ, కోల్‌కతా, ముంబై, కొచ్చి, గోవా, జైపూర్, చండీగఢ్, పుణె, గౌహతి, ఇంఫాల్, విశాఖపట్నం, హైదరాబాద్, శ్రీనగర్, బాగ్డోగ్ర, రాంచీ, భువనేశ్వర్, ఇండోర్, చెన్నైలు ఉన్నట్లు వెల్లడించింది. అంతర్జాతీయ రూట్లలో రూ.2,999లకే ప్రారంభ ధరను నిర్ణయించింది. కౌలాలంపూర్, బ్యాంకాక్, క్రాబి, సిడ్నీ, ఆక్లాండ్, మెల్బోర్న్, సింగపూర్, బాలి ప్రాంతాలకు ఈ ఆఫర్ ప్రకటించింది.

బ్యాంకింగ్‌పై బంద్ ప్రభావం పాక్షికం



న్యూఢిల్లీ: ట్రేడ్ యూనియన్లు నిర్వహిస్తున్న రెండు రోజుల బంద్‌తో మంగళవారం బ్యాంకింగ్ కార్యకలాపాలపై పాక్షికంగా ప్రభావం పడింది. ఒక వర్గం ఉద్యోగులు విధులకు హాజరు కాలేదు. ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ), బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఈఎఫ్‌ఐ) ప్రాబల్యం ఉన్న బ్యాంకుల్లో బంద్ ప్రభావం కనిపించింది. అయితే, బ్యాంకింగ్ రంగంలోని మిగతా ఏడు యూనియన్లు బంద్‌లో పాల్గొనకపోవడంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పాటు ప్రైవేట్ రంగ బ్యాంకుల కార్యకలాపాలు యథాప్రకారం కొనసాగాయి. ఏఐబీఈఏ, బీఈఎఫ్‌ఐల్లో సభ్యత్వమున్న ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటుండటంతో వాటి ప్రాబల్యమున్న పలు బ్యాంకు శాఖల్లో డిపాజిట్లు, విత్‌డ్రాయల్, చెక్కుల క్లియరెన్సులు మొదలైన కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు పాటిస్తోందని ఆరోపిస్తూ 10 కార్మిక సంఘాలు రెండు రోజుల పాటు (మంగళ, బుధ వారాల్లో) బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాలను వ్యతిరేకిస్తూ, జీతభత్యాల పెంపు డిమాండ్ చేస్తూ బ్యాంకు ఉద్యోగుల సంఘాలు గత నెల 21న, 26న సమ్మెకు దిగాయి.

ఎన్‌ఎండీసీ షేర్ల బైబ్యాక్‌కు కేంద్రం ఓకే



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇనుప ఖనిజ మైనింగ్ కంపెనీ ఎన్‌ఎండీసీ.. రూ.1,000 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేయనుంది. ఆర్థిక శాఖ మంగళవారం దీనికి ఆమోదం తెలిపింది. బైబ్యాక్ విధి విధానాలు, తేదీలను ఎన్‌ఎండీసీ డైరెక్టర్ల బోర్డ్ నిర్ణయించనుంది. బైబ్యాక్ కారణంగా ఎన్‌ఎండీసీలో 72.43% వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వానికి ప్రయోజనం కలుగుతుంది. డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్య సాధన కోసం షేర్లను బైబ్యాక్ చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం ఒత్తిడిచేస్తోంది. దీంట్లో భాగంగా ఇప్పటికే 9కు పైగా ప్రభుత్వ రంగ కంపెనీలు షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించాయి. ఈ జాబితాలో ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా, ఐఓసీ, ఎన్‌హెచ్‌పీసీ, భెల్, నాల్కో, కొచ్చిన్ షిప్‌యార్డ్, ఎన్‌ఎల్‌సీ, కేఐఓసీఎల్‌లు ఉన్నాయి. ఈ కంపెనీల షేర్ల బైబ్యాక్ కారణంగా ప్రభుత్వ ఖజానాకు రూ.9,000 కోట్లు సమకూరుతాయని అంచనా. కాగా, బీఎస్‌ఈలో ఎన్‌ఎండీసీ షేర్ 0.1 శాతం తగ్గి రూ.95 వద్ద ముగిసింది.

ఇన్ఫోసిస్‌కు మరో సీనియర్ అధికారి గుడ్‌బై



బెంగళూరు: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో సీనియర్ స్థాయి అధికారుల రాజీనామాల పరంపర కొనసాగుతోంది. తాజాగా సంస్థ గ్లోబల్ హెడ్ (ఎనర్జీ, యుటిలిటీస్, రిసోర్సెస్, సర్వీసెస్ విభాగం) సుదీప్ సింగ్ రాజీనామా చేశారు. సింగ్ సారథ్యంలో ఈ విభాగం ఆదాయం 100 మిలియన్ డాలర్ల నుంచి 750 మిలియన్ డాలర్లకు చేరింది. సుదీప్ రాజీనామాపై స్పందించేందుకు ఇన్ఫీ నిరాకరించింది. కన్సల్టింగ్ విభాగం గ్లోబల్ హెడ్ కెన్ టూంబ్స్ గతేడాది అక్టోబర్‌లో వైదొలిగారు. అంతకు ముందు ఆగస్టులో మరో కీలకమైన అధికారి ఎం.డీ.రంగనాథ్ కూడా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ పదవి నుంచి తప్పుకున్నారు.

ఆర్‌బీఐ మిగులు నిధి ఏంచేద్దాం?

జలాన్ నేతృత్వంలోని కమిటీ తొలి భేటీ ● ఏప్రిల్‌లో నివేదిక సమర్పించే అవకాశం

న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిధుల నిర్వహణపై మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ (ఎకనమిక్ కమిటీ ఫ్రేమ్‌వర్క్) మంగళవారం మొట్టమొదటిసారి సమావేశమయ్యింది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆర్‌బీఐ వద్ద మిగులు నిల్వలు ఏ స్థాయిలో ఉండాలి? అంతకన్నా ఎక్కువగా ఉండే నిధులను ఎలా బదలాయించాలి? ఏ పరిమాణంలో కేంద్రానికి డివిడెండ్ చెల్లించాలి? వంటి అంశాలను నిర్ణయించడానికి గత నెల చివర్లో ఈ కమిటీ ఏర్పాటయిన సంగతి తెలిసిందే. కమిటీ సమావేశమయిన 90 రోజుల్లో నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల మాజీ కార్యదర్శి, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ రాకేష్ మోహన్ ఈ కమిటీకి వైస్ చైర్మన్‌గా ఉన్నారు. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ గార్గ్, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎన్‌ఎస్ విశ్వనాథన్‌తో పాటు భరత్ దోషి, సుధీర్ మన్కడ్ ఈ కమిటీలో సభ్యులు. ఆర్‌బీఐ వద్ద జూన్ నాటికి రూ.9.43 లక్షల కోట్ల అదనపు నిల్వలున్నాయి. నగదు, బంగారం రీవాల్యుయేషన్ (రూ.6.91 లక్షల కోట్లు), కంటెంజెన్సీ ఫండ్ (రూ.2.32 లక్షల కోట్లు) ద్వారా ఈ నిధులు సమకూరాయి.



నేపథ్యం ఇదీ...

పన్ను వసూళ్లు తగ్గిన నేపథ్యంలో–భారత్ ద్రవ్య లోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కట్టుతప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమై మార్చి 2019తో ముగిసే ఆర్థిక సంవత్సరంలో నవంబర్ నెలకు వచ్చేసరికే ద్రవ్యలోటు బడ్జెట్ నిర్దేశాలను(3.3%) దాటిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంలో ద్రవ్య లోటు కొరత రూ. లక్ష కోట్ల వరకూ ఉండవచ్చని అంచనా. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ మిగులు నిల్వల్లో అధిక మొత్తాన్ని కేంద్రం కోరుతోందని వచ్చిన వార్తలు సంచలనం సృష్టించాయి. ఈ వార్తల నేపథ్యంలో–డిసెంబర్ 10న వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ప్రకటించారు. ఈ నిధుల నిర్వహణను పరిశీలించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని అంతకుముందు నవంబర్ 19న జరిగిన ఆర్‌బీఐ బోర్డ్ సమావేశం నిర్ణయించింది. దీనికనుగుణంగా బిమల్ జలాన్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటయ్యింది.

గతంలో కమిటీలు ఇలా...

గతంలోనూ ఆర్‌బీఐ నిల్వలపై మూడు కమిటీలు ఏర్పాటయ్యాయి. వి.సుబ్రమణ్యం (1997), ఉషా థోరట్ (2004), వైహెచ్ మాలేగామ్ (2013) ఈ కమిటీలకు నేతృత్వం వహించారు. మొత్తం రుణాల్లో 12 శాతం వరకూ ఆర్‌బీఐ నిల్వల రూపంలో ఉండాలని సుబ్రమణ్యం కమిటీ సిఫారసు చేస్తే, ఉషా థోరట్ కమిటీ దీనిని 18 శాతంగా పేర్కొంది. ఆర్‌బీఐ థోరట్ కమిటీ సిఫారసును తోసిపుచ్చింది. సుబ్రమణ్యం కమిటీ సిఫారుల మేరకు నడుచుకోవాలని నిర్ణయం తీసుకుంది. కాగా లాభాల్లో తగిన మొత్తాన్ని ఏటా కంటింజెన్సీ నిల్వలకు బదలాయించాలని మాలేగామ్ కమిటీ సిఫారసు చేసింది.

కేంద్రం కోరుకుంటోంది ఎంత?

ప్రస్తుతం స్థూల రుణాల్లో 28 శాతం నిష్పత్తిలో ఆర్‌బీఐ వద్ద మిగులు నిల్వలు ఉన్నాయి. అయితే అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం 14 శాతం నిధులు సరిపోతాయని ఆర్థిక మంత్రిత్వశాఖ భావిస్తున్నట్లు సమాచారం.

డిజిటల్ చెల్లింపులు పెంచేది ఎలా?

నందన్ నీలేకని నేతృత్వంలో కమిటీ



ముంబై: దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ పురోగతిపై కసరత్తు ప్రారంభమైంది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు, ఆధార్ రూపశిల్పి నందన్ నిలేకని నేతృత్వంలో అత్యున్నత స్థాయి కమిటీని ఆర్‌బీఐ మంగళవారం ఏర్పాటు చేసింది. తొలి సమావేశం తరువాత 90 రోజుల్లో కమిటీ తన నివేదికను సమర్పించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ పేర్కొంది. దేశంలో ప్రస్తుత డిజిటల్ చెల్లింపుల పరిస్థితి? ఆర్థిక వ్యవస్థలో ఇందుకు సంబంధించి లోపాలేంటి? వాటిని ఎలా అధిగమించాలి? డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ విస్త రణకు అనుసరించాల్సిన మార్గాలు? ప్రజల్లో ఈ వ్యవస్థపై విశ్వాసాన్ని ఎలా పెంపొందించాలి? అన్న అంశాలపై నిపుణుల కమిటీ దృష్టి పెడుతుంది. కమిటీలో ఆర్‌బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ హెచ్‌ఆర్ ఖాన్,విజయాబ్యాంక్ మాజీ ఎండీ, సీఈఓ కిషోర్ శాన్సీ, ఐటీ శాఖలో కార్యదర్శిగా పనిచేసిన అరుణ శర్మ, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ చీఫ్ ఆఫీసర్ సంజయ్ జైన్ సభ్యులుగా ఉంటారు. 'ఆర్‌బీఐతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. భారత్, భారతీయుల కోసం చెల్లింపుల వ్యవస్థ పునరుత్తేజానికి ఆర్‌బీఐ, కమిటీలు కృషి చేస్తాయి' అని నీలేకని ట్వీట్ చేశారు.

టోకెనైజేషన్‌పై ఆర్‌బీఐ మార్గదర్శకాలు

ముంబై: సురక్షితమైన కార్డు లావాదేవీల నిర్వహణ కోసం ఉద్దేశించిన టోకెనైజేషన్‌కి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ మంగళవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. వీటి ప్రకారం ఆథరైజ్డ్ కార్డ్ నెట్‌వర్క్ మాత్రమే టోకెనైజేషన్, డీ–టోకెనైజేషన్ కార్యకలాపాలు నిర్వహించవచ్చు. ఈ సేవల కోసం కస్టమరు ప్రత్యేకంగా చార్జీలు చెల్లించనక్కర్లేదు. ప్రస్తుతం మొబైల్ ఫోన్స్, ట్యాబ్లెట్స్‌కి మాత్రమే ఈ సదుపాయం పరిమితమవుతుందని, ఈ అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మిగతా డివైజ్‌లకు వర్తింపచేయనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఆర్థిక లావాదేవీల్లో అసలైన డెబిట్, క్రెడిట్ కార్డుల స్థానంలో ప్రత్యేక కోడ్ (టోకెన్) ఉపయోగించే విధానాన్ని టోకెనైజేషన్‌గా వ్యవహరిస్తారు. పాయింట్ ఆఫ్ సేల్స్ టెర్మినల్స్ (పీవోఎస్), క్విక్ రెస్పాన్స్ (క్యూఆర్) కోడ్ తరహా కాంటాక్ట్‌లెస్ చెల్లింపులకు ఇది ఉపయోగపడుతుంది. నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ (ఎన్‌ఎఫ్‌సీ), మ్యాగ్నెటిక్ సెక్యూర్ ట్రాన్స్‌మిషన్ (ఎంఎస్‌టీ) ఆధారిత కాంటాక్ట్‌లెస్ లావాదేవీలు, ఇన్–యాప్ పేమెంట్స్, క్యూఆర్ కోడ్ మొదలైన మాధ్యమాల్లో టోకెనైజ్డ్ కార్డు లావాదేవీలు నిర్వహించవచ్చని ఆర్‌బీఐ పేర్కొంది.

10,800 పాయింట్లపైకి నిఫ్టీ

- సానుకూలంగా అంతర్జాతీయ సంకేతాలు
- చివరి రెండు గంటల్లో జోరుగా కొనుగోళ్లు
- మూడో రోజూ మార్కెట్ ముందుకే...
- 131 పాయింట్లు ఎగసి 35,981కు సెన్సెక్స్
- 30 పాయింట్లు పెరిగి 10,802కు నిఫ్టీ



బ్యాంక్ షేర్ల జోరుతో మంగళవారం స్టాక్ మార్కెట్ వరుసగా మూడవరోజూ లాభాల్లో ముగిసింది. ట్రేడింగ్ ఆద్యంతం ఒడిదుడుకులమయంగా సాగినప్పటికీ, చివరి రెండు గంటల్లో కొనుగోళ్లు జోరుగా సాగడంతో స్టాక్ సూచీలు లాభపడ్డాయి. నిఫ్టీ కీలకమైన 10,800 పాయింట్లపైకి ఎగబాకింది. వాణిజ్య ఉద్రిక్తతల నివారణ నిమిత్తం జరుగుతున్న చర్చల ఫలితంగా అమెరికా- చైనాల మధ్య ఒక ఒప్పందం కుదరగలదన్న అంచనాల కారణంగా ప్రపంచ మార్కెట్లు పెరగడం కలసి వచ్చింది. కంపెనీల మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగా ఉంటాయనే అంచనాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల కొనసాగడం సానుకూల ప్రభావం చూపింది. బీఎస్ఈ సెన్సెక్స్ 131 పాయింట్లు పెరిగి 35,981 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 30 పాయింట్లు పెరిగి 10,802 పాయింట్ల వద్ద ముగిశాయి. బ్యాంక్, వాహన, లోహ షేర్లు పెరిగాయి. స్టాక్ మార్కెట్ వరుసగా మూడో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభపడింది. ఈ మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 466 పాయింట్లు పెరిగింది.

నష్టాల్లోంచి లాభాల్లోకి...

ముడి చమురు ధరలు పెరగడంతో రూపాయి బలహీనపడింది. దీంతో ఇటీవల పెరిగిన కొన్ని షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో రోజులో ఎక్కువ భాగం స్టాక్ సూచీలు నష్టాల్లోనే ట్రేడయ్యాయి. ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల మొండి బకాయిలు తగ్గాయని, నిధుల సమస్యలేదని, మొత్తం మీద బ్యాంకింగ్ రంగం సంతృప్తికరంగా ఉందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం వెల్లడించడంతో బ్యాంక్ షేర్లు జోరుగా పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనాలను 6.7 శాతం నుంచి 7.2 శాతానికి ప్రభుత్వం సవరించడం కూడా సానుకూల ప్రభావం చూపించింది.

283 పాయింట్ల రేంజ్ సెన్సెక్స్...

సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. రూపాయి బలహీనత కారణంగా నష్టాల్లోకి జారిపోయింది. ఆ తర్వాత లాభ, నష్టాల మధ్య దోబూచులాడింది. చివరి రెండు గంటల్లో కొనుగోళ్లు కొనసాగడంతో లాభాలూ కొనసాగాయి. ఒక దశలో 96 పాయింట్ల వరకూ నష్టపోయిన సెన్సెక్స్ మరో దశలో 187 పాయింట్ల వరకూ పెరిగింది. మొత్తం మీద రోజంతా 283 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. కాగా క్యూ3 ఫలితాలు బాగా ఉంటాయనే అంచనాలతో గత కొన్ని రోజులుగా ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ పెరుగుతోంది. బుధవారం ఈ షేర్ జీవిత కాల గరిష్ట స్థాయి, రూ.381.60 ను తాకింది. చివరకు 3.4 శాతం లాభంతో రూ.380 వద్ద ముగిసింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,498
ఎన్ఎస్ఈ	26,091
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	7,28,441
ఎఫ్ఐఐ	- 554
డీఐఐ	698

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
SUNPHARMA	448.75	4.17
ICICIBANK	379.3	3.15
SBIN	305.5	3.1
TATAMOTORS	179.95	2.62
YESBANK	191.8	2.48
AXISBANK	652.15	2.31
IBULHSGFIN	809.5	1.96
GRASIM	835.7	1.83
BAJAJ-AUTO	2,694.85	1.37
JSWSTEEL	293.45	1.24

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
ZEEL	449.1	-2.99
UPL	751	-1.67
KOTAKBANK	1,228.00	-1.49
BPCL	350.65	-1.38
HINDPETRO	247	-1.12
NTPC	147	-1.08
GAIL	353.35	-1.05
HINDALCO	206.4	-1.03
M&M	723	-0.9
BAJFINANCE	2,531.00	-0.89

ఈ ఏడాది చివరకు నిఫ్టీ @ 11,300

బ్యాంక్ ఆఫ్ అమెరికా- మెరిల్ లించ్

ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ దాదాపు వెయ్యి పాయింట్లకు పైగా క్షీణించగలదని అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ, బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లించ్ అంచనా వేసింది. మన స్టాక్ మార్కెట్ విలువ అధికంగా ఉందని, అందుకని ఈ ఏడాది మొదటి అర్థభాగంలో రెండంకెల శాతం మేర స్టాక్ సూచీలు క్షీణిస్తాయని పేర్కొంది. ఎన్నికల అనంతరం స్థిరమైన ప్రభుత్వం ఏర్పడితే మార్కెట్ పెరుగుతుందని వివరించింది. ఈ ఏడాది చివరి నాటికి నిఫ్టీ 11,300 పాయింట్ల వద్దకు(మంగళవారం నిఫ్టీ ముగింపు 10,802 పాయింట్లతో పోల్చితే ఇది 4.6 శాతం వృద్ధి) చేరగలుగుతుందని అంచనా వేస్తోంది.

రూపాయికి చమురు భయం

ఒకేరోజు 53 పైసలు పతనం • 70.21కి బలహీనం

ముంబై: క్రూడ్ ధరల పెరుగుదల భయానికి రూపాయి పతనమయ్యింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో మంగళవారం ఒకేరోజు 53 పైసలు పతనమై 70.21 వద్ద ముగిసింది. సోమవారం రూపాయి ముగింపు 69.68. ట్రేడింగ్ మొదట్లోనే రూపాయి బలహీనంగా 69.83 వద్ద ప్రారంభమైంది. ఒకదశలో 70.23ను కూడా తాకింది.

ముఖ్యాంశాలు చూస్తే...

- క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగితే, భారత్ ప్రధానంగా దిగుమతి చేసుకునే క్రూడ్ బిల్లు దేశానికి అదనపు భారం అవుతుంది. ఇది దేశ కరెంట్ అకౌంట్ లోటుపై (క్యాడ్- దేశానికి వచ్చీ-పోయే విదేశీ మారకద్రవ్యం మధ్య నికర వ్యత్యాసం) ప్రతికూల ప్రభావం చూపుతుంది.



- ఆయా అంశాల నేపథ్యంలో దిగుమతిదారుల నుంచి అమెరికా కరెన్సీకి డిమాండ్ రావడం రూపాయి సెంటిమెంట్‌ను బలహీనపరిచింది. యన్ (జపాన్), పౌండ్ (బ్రిటన్), యూరో (యూరప్) కరెన్సీలపై అమెరికా డాలర్ బలోపేతం కావడం కూడా రూపాయి పతనానికి కారణమయ్యింది.
- రెండు రోజుల ట్రేడింగ్ వరుల లాభాల తర్వాత రూపాయి బలహీనత ఇదే తొలిసారి. గడచిన రెండు రోజుల్లో రూపాయి 52 పైసలు బలపడింది.
- అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. క్రూడ్ ధరలు అంతర్జాతీయంగా అనూహ్యంగా 30 డాలర్ల వరకూ పడిపోతూ వచ్చిన నేపథ్యంలో... క్రమంగా కోలుకుంది. ఈ వార్త రాసే సమయం రాత్రి 9 గంటలకు అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో రూపాయి విలువ 70.16 వద్ద ట్రేడవుతుండగా, డాలర్ ఇండెక్స్ 95.55 వద్ద ట్రేడవుతోంది.
- ఇక ఇదే సమయానికి భారత్ ప్రధానంగా దిగుమతి చేసుకునే బ్రెంట్ క్రూడ్ ధర బేరల్‌కు 58.50 వద్ద ట్రేడవుతుండగా (డిసెంబర్ చివరి వారంలో 52 వారాల కనిష్ట స్థాయి 49.93 డాలర్లు). ఇక నైమెక్స్ క్రూడ్ ధర రెండు వారాల క్రితం 42.36కాగా, ఈ వార్తరాసే సమయానికి 49.50 వద్ద ట్రేడవుతోంది.

సెలెక్ట్ మొబైల్స్ 'సి-సేఫ్'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మల్టీ బ్రాండ్ రిటైల్ మొబైల్స్ విక్రయంలో ఉన్న సెలెక్ట్ మొబైల్స్ 'సి-సేఫ్' పేరుతో కొత్త సేవలను ప్రారంభించింది. సెలెక్ట్ స్టోర్లలో కొన్న మొబైల్స్ భద్రతను దృష్టిలో పెట్టుకుని కంపెనీ నాలుగు రకాల ఉత్పాదనలను అందుబాటులోకి తెచ్చింది. కస్టమర్ సి-సేఫ్ సిల్వర్ కార్డును ఎంచుకుంటే మొబైల్‌పై ఒక ఏడాది ఎక్స్‌టెండెడ్ వారంటీ ఇస్తారు. రూ.199లతో పీపీ30 గోల్డ్ కార్డు కొనుగోలు చేస్తే 30 రోజుల్లో ఫోన్ స్క్రీన్ పగిలితే కొత్తది వేస్తారు. డ్యామేజీ ప్రొటెక్షన్ కోసం ఉద్దేశించిన పీపీ180 కార్డు ఆరు నెలలు పనిచేస్తుంది. అలాగే ప్లాటినం కార్డులో భాగంగా ఆరు నెలల డ్యామేజీ ప్రొటెక్షన్ ఉంటుంది. ఒక ఏడాది పాటు ఎక్స్‌టెండెడ్ వారంటీ కూడా ఇస్తామని సెలెక్ట్ మొబైల్స్ సీఎండీ వై.గురు మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. కొనుగోలు చేసే మొబైల్ ఆధారంగా చార్జీ ఉంటుందని వెల్లడించారు. వినియోగదార్లు సి-సేఫ్ యాప్ ద్వారా క్లెయిమ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.



సి-సేఫ్ వివరాలు వెల్లడిస్తున్న గురు

ఐటీ సేవలు 10% వృద్ధి..!

హైదరాబాద్: దేశీ ఐటీ, ఐటీ ఆధారిత సేవల ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8–10 శాతం మేర వృద్ధి రేటును నమోదుచేయవచ్చని ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఈసీఎస్) అంచనావేసింది. ఆర్‌బీఐ నుంచి పూర్తి సమాచారం అందే వరకు కచ్చితమైన మొత్తాన్ని లెక్కించడం కష్టమని కౌన్సిల్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డీ కే సరీన్ అన్నారు. అయితే, పేర్కొన్న మేరకు వృద్ధి అంచనా ఉందన్నాయన. సోలార్ ఎలక్ట్రానిక్స్, యూపీఎస్ వ్యవస్థ, ఎలక్ట్రానిక్ ఎనర్జీ మీటర్ల అభివృద్ధి నేపథ్యంలో ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ ఎగుమతులు సైతం 7–8 శాతం వృద్ధి నమోదుచేయవచ్చని తెలిపారు.

బులియన్ రూ.లలో

హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	31,890 ▼	70
బంగారం (22 క్యారెట్లు)	30,370 ▼	70
వెండి (కిలో)	42,100 ▼	500
విజయవాడ		
బంగారం(24 క్యారెట్లు)	32,850	0
బంగారం (22 క్యారెట్లు)	30,150	0
వెండి (కిలో)	40,000	0
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	32,830 ▼	80
బంగారం (22 క్యారెట్లు)	30,370 ▼	70
వెండి (కిలో)	40,000 ▼	300

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ఇన్ఫోసిస్ షేర్ల బైబ్యాక్‌పై ఈ నెల 11న నిర్ణయం

అదే రోజు క్యూ3 ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనపై ఈ నెల 11న బోర్డు చర్చించనుంది. దీంతో పాటు ప్రత్యేక డివిడెండ్, ఇతర ప్రతిపాదనలపై కూడా ఈ బోర్డ్ సమావేశంలో చర్చ జరుగుతుందని ఇన్ఫోసిస్ తెలిపింది. ఆ రోజునే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను కూడా వెల్లడిస్తామని పేర్కొంది. వాటాదారులకు రూ.13,000 కోట్లు చెల్లించనున్నట్లు గత ఏడాది ఏప్రిల్‌లోనే ఈ కంపెనీ వెల్లడించింది. దీంట్లో భాగంగానే గత ఏడాది జూన్‌లో ఒక్కో షేర్‌కు రూ.10 ప్రత్యేక డివిడెండ్ చొప్పున మొత్తం రూ.2,600 కోట్లు చెల్లించింది. మిగిలిన రూ.10,400 కోట్ల నిధులను వాటాదారులకు ఎలా చెల్లించాలనేది తర్వాతి కాలంలో డైరెక్టర్ల బోర్డ్ నిర్ణయిస్తుందని గతంలోనే ఇన్ఫోసిస్ తెలిపింది. ఫ్రీ క్యాష్ ఫ్లోస్‌లో 70 శాతం వరకూ నిధులను వాటాదారులకు చెల్లించాలన్న తమ విధానాన్ని కొనసాగిస్తామని అప్పుడే ఈ కంపెనీ వెల్లడించింది.



ప్రీమియం ఏడాదికే... కవరేజీ రెండేళ్లు!

హైదరాబాద్: ఎడెల్‌వీజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఓ వినూత్నమైన యాడ్ ఆన్ ఫీచర్ 'హెల్త్ 241'ని ప్రవేశపెట్టింది. కంపెనీ నుంచి కొత్తగా వైద్య బీమా పాలసీ తీసుకునే వారు, ఈ యాడ్ ఆన్‌ను జోడించుకోవచ్చు. దీని వల్ల మొదటి ఏడాది పాలసీ కాల వ్యవధిలో ఎటువంటి క్లెయిమ్ లేకపోతే మరుసటి ఏడాది రెన్యువల్‌కు ప్రీమియం చెల్లించక్కర్లేదు. రెండో ఏడాది పూర్తి ఉచితంగా వైద్య బీమా కవరేజీ లభిస్తుందని కంపెనీ తెలిపింది. దేశంలో ఈ తరహా సదుపాయాన్ని తీసుకొచ్చిన తొలి బీమా సంస్థ ఇదే. ''మన దేశంలో బీమాను ఇప్పటికీ అదనపు వ్యయంగానే చూస్తున్నారు. యుక్త వయసులో ఉన్న వారు తాము ఆరోగ్యవంతులమని, క్లెయిమ్ అవసరం పడదు కనుక బీమా పాలసీ అక్కర్లేదనే భావనలో ఉన్నారు. ఈ తరహా కస్టమర్లకు హెల్త్ 241 యాడ్ ఆన్ విలువను అందిస్తుంది. మొదటి ఏడాదిలో ఎటువంటి క్లెయిమ్ లేకపోతే, రెండో ఏడాది కూడా మాతోనే కొనసాగుతారు''అని ఎడెల్‌వీజ్ జనరల్ ఇన్సూరెన్స్ సీఈవో అనూప్ తెలిపారు. ఇక రీస్టోరేషన్, క్లెయిమ్ లేకపోతే తదుపరి ఏడాది బీమా మొత్తాన్ని 100 శాతం వరకు పెంచుకునే ఆప్షన్లు కూడా ఉన్నాయి.



నేటి బోర్డ్ మీటింగ్స్

ఇండస్‌ఇండ్ బ్యాంక్,
బజాజ్ కార్ప్, డెల్టా కార్ప్

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు	సోమవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	49.74	$48.52
బ్రెంట్	58.65	$57.33

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 09-01-2019

వరంగల్	455–00
విజయవాడ	453–00

రూ. వంద కోట్ల భూముల నైవేద్యం!


కాజ టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారి ఆనుకుని నిర్మిస్తున్న ఉండవల్లి కన్‌స్ట్రక్షన్స్ బహుళ అంతస్తుల భవనాలు

దేవాదాయశాఖ భూములను లీజు పేరుతో కాజేసి కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఫలహారం

- రాజధానికి చేరువలో పంట కాలువలనూ పూడ్చేసి నిర్మాణాలు చేపడుతున్న ఉండవల్లి కన్‌స్ట్రక్షన్స్
- భారీ వర్షం కురిస్తే పొలాలతో పాటు గ్రామం కూడా మునిగే ప్రమాదం
- మంత్రి బినామీ నిర్వాకంపై జన్మభూమిలో కలెక్టర్, సీఎస్‌కు గ్రామస్తుల ఫిర్యాదు


దేవాదాయశాఖ భూముల్లో నిర్మించిన షెడ్లు

కాజ (మంగళగిరి): రాజధాని అమరావతికి చేరువలోని అత్యంత విలువైన భూములు అవి... ప్రస్తుతం అక్కడ మార్కెట్ ధర ఎకరం రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లు దాకా పలుకుతోంది. అలాంటి చోట దేవాదాయశాఖకు చెందిన భూములను సాగు పేరుతో వేలంలో కారుచౌకగా పొందిన టీడీపీ నేత సోదరుడు ఒకరు వీటిని అక్రమంగా ఓ నిర్మాణ కంపెనీకి లీజుకు కట్టబెట్టేశారు. సమీపంలోని పంట కాలువలను కూడా పూడ్చేస్తూ నిర్మాణాలు చేపట్టడంతో పొలాలతోపాటు గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై స్థానికులు మంగళవారం జన్మభూమి కార్యక్రమం సందర్భంగా మరోసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న రూ.వంద కోట్లకుపైగా విలువైన భూములపై కన్నేసిన ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ దేవాదాయశాఖ భూములు, పంట కాలువలను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.

అప్పనంగా ఏడు ఎకరాలు..

కాజ టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డును ఆనుకుని 139/ఏ సర్వే నంబర్‌లో ఉన్న దేవాదాయ శాఖకు చెందిన 1.60 ఎకరాల శివాలయం భూములకు అధికారులు ఏటా వేలం పాట నిర్వహిస్తారు. సాగు పేరుతో రూ.30 వేలకు వేలంలో వీటిని దక్కించుకున్న టీడీపీ నేత పల్లపోలు శ్రీనివాసరావు సోదరుడు మూర్తిరాజు ఉండవల్లి కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఏటా రూ. 6 లక్షల చొప్పున లీజుకు కట్టబెట్టేశారు. దీంతో అక్కడ ఇష్టానుసారంగా షెడ్లు నిర్మిస్తున్నారు. అంతటితో ఆగకుండా దేవాదాయ శాఖ భూమి పక్కనే ఉన్న 1.40 ఎకరాల్లో కూడా పంట కాలువను సైతం పూడ్చి షెడ్లు నిర్మించడం గమనార్హం. కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు చేపట్టిన ప్రాంతంలో మరో నాలుగు ఎకరాల్లో కూడా పంట కాలువలను పూడ్చి నిర్మాణాలు చేపట్టారు. ఉండవల్లి కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణాలు చేపట్టిన ప్రాంతంలో ప్రస్తుతం మార్కెట్ ధర ఎకరం రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లు దాకా పలుకుతోంది. కన్‌స్ట్రక్షన్ కంపెనీ పంట కాలువలను పూడ్చడంతో పెథాయ్ తుపాను సమయంలో పొలాల్లో నీరు బయటకు వెళ్లే దారిలేక మునిగిపోయాయి. దీంతో రైతులు మోటార్లు ఏర్పాటు చేసుకుని నీటిని చెరువులోకి తరలించాల్సి వచ్చింది.

కంపెనీ వెనుక ప్రభుత్వ పెద్దలు?

పంట పొలాల్లో చేరిన నీరు బయటకు వెళ్లేందుకు అమర్చిన తూములను సైతం కన్‌స్ట్రక్షన్ కంపెనీ పూడ్చడంపై అభ్యంతరం వ్యక్తం చేయగా 'మీ భూములు కూడా కంపెనీకి ఇవ్వాల్సి వస్తుంది. కంపెనీ వెనుక ప్రభుత్వ పెద్దలున్నారు. అనవసరంగా భూములు పోగొట్టుకోవద్దు' అంటూ బెదిరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో మంగళవారం జన్మభూమి మాఊరు కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ, కలెక్టర్ కోన శశిధర్‌లకు భూ ఆక్రమణలపై రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి వెంటనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. వేలంలో భూములు దక్కించుకున్న పల్లపోలు మూర్తిరాజు నిబంధనలు అతిక్రమించి పొలాన్ని కన్‌స్ట్రక్షన్ కంపెనీకి లీజుకు ఇవ్వడంపై నోటీసులు జారీ చేయడంతోపాటు కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు శివాలయం ఆలయ ఈవో కృపాల్‌రెడ్డి తెలిపారు.

ఉత్తరాంధ్ర మంత్రికి కంపెనీలో వాటా?

ఏలూరుకు చెందిన టీడీపీ నేత ఉండవల్లి రాము ఉండవల్లి కన్‌స్ట్రక్షన్స్ పేరిట కాజ గ్రామం 139/ఏ సర్వే నంబర్‌లో భూములు కొనుగోలు చేశారు. కన్‌స్ట్రక్షన్ ప్రారంభం అయ్యాక అదే సర్వే నంబర్‌లోని దేవాదాయ భూములు, పంట కాలువలను ఆక్రమించి నిర్మాణాలు ప్రారంభించారు. పంట కాలువలను పూడ్చడం వల్ల పొలాలతో పాటు గ్రామం కూడా మునిగిపోయే ప్రమాదముందంటూ స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకుండా అనుమతులు మంజూరు చేశారు. ఉత్తరాంధ్రకు చెందిన ఓ మంత్రికి ఈ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో వాటాలు ఉండటంతో సీఆర్‌డీఏ అధికారులు పరిశీలన లేకుండా అనుమతులు మంజూరు చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కంపెనీ ప్రతినిధులు బెదిరించారు


మా పొలంలో నుంచి వర్షం నీరు వెళ్లే తూములను కన్‌స్ట్రక్షన్ కంపెనీ పూడ్చి వేసింది. దీనిపై కంపెనీ ప్రతినిధులను ప్రశ్నిస్తే తమ వెనుక ప్రభుత్వ పెద్దలు ఉన్నారని బెదిరిస్తున్నారు. వెంటనే కాలువల్లో పూడిక తొలగించి పొలాలతో పాటు గ్రామాన్ని కాపాడాలి. – మాణిక్యాల నరసింహారావు (రైతు)

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..


ఉండవల్లి కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆక్రమణలపై గతంలోనే కలెక్టర్, సీఎస్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఆ కంపెనీ టీడీపీ నేతలది కావడం, మంత్రికి వాటాలు ఉండడంతో అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పంట కాలువలను పూడ్చడం వల్ల గ్రామానికి ముప్పు పొంచి ఉంది. – అప్పికట్ల శ్రీహరి నాయుడు

రూ.254 కోట్లు ఎవరికిచ్చారు?

- ఎవరి ఖాతాలోకీ ఒక్కరూపాయి కూడా రాలేదు
- ప్రభుత్వ తీరుపై అనుమానాలు ఉన్నందున సేవల బంద్ కొనసాగుతుంది
- ఏపీ ప్రైవేటు ఆస్పత్రుల సంఘం (ఆశా) స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: 'రాష్ట్రప్రభుత్వం రూ.254 కోట్ల బకాయిలు చెల్లించినట్టు ఈ నెల 7న ఒక ప్రకటన ఇచ్చింది..అంత డబ్బు ఇస్తే ఆస్పత్రులకు కనీసం 10 శాతమైనా రావాలి కదా, కానీ ఏ ఆస్పత్రికీ డబ్బులు రాలేదు, అంటే డబ్బులు ఇవ్వకుండా ఇచ్చినట్టు చెబుతున్నారు' అంటూ ఏపీ ప్రైవేటు ఆస్పత్రుల సంఘం (ఆశా) మండిపడింది. బకాయిలు చెల్లించనందుకు నిరసనగా గడిచిన ఎనిమిది రోజులుగా ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ), ఉద్యోగుల వైద్యం సేవలు నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం విజయవాడలో వివిధ జిల్లాలకు చెందిన ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాల ప్రతినిధుల సమావేశం జరిగింది. చికిత్స పూర్తి కాగానే 50 శాతం చెల్లింపులు తక్షణమే చేస్తామని చెప్పినప్రభుత్వం, అందులో ఇప్పటికే చేసిన 80 వేల క్లెయిముల విషయం చెప్పకుండా ఇప్పటినుంచి అన్నట్టు చెప్పిందని, నిధులు విడుదల చేశామని చెప్పినా ఇంతవరకూ ఎవరికీ రాలేదని, ఇలా పలు అనుమానాలు ఉన్నందున సేవలు పునరుద్ధరించకూడదని ఆస్పత్రుల ప్రతినిధులు నిర్ణయించారు. ఉద్యోగుల వైద్యసేవ ఉంది కదా అని అప్పులు చేసి ఆస్పత్రుల పెట్టామని, కానీ ఇప్పటివరకూ పైసా ఇవ్వకపోవడంతో ఆస్పత్రులు మూసుకునే పరిస్థితి ఏర్పడిందని, పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. జన్మభూమి పూర్తయిన వెంటనే వైద్యశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చర్చలకు పిలిచారని, ఆ చర్చల్లో అటో ఇటో తేల్చుకుని, ఆ తర్వాత ఎమర్జెన్సీ సేవలు కూడా నిలిపివేయాలనే ఆలోచనకు వచ్చినట్టు ఆస్పత్రుల సంఘం తెలిపింది.

నదుల అనుసంధానంపై నివేదిక ఇవ్వండి

కేంద్ర పర్యావరణ శాఖను ఆదేశించిన ఎన్జీటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం చేపడుతున్న నదుల అనుసంధానం, పలు ప్రాజెక్టుల నిర్మాణం వల్ల గోదావరి డెల్టాలో 10 లక్షల మంది రైతులు నష్టపోతున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై నివేదిక ఇవ్వాలని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖకు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలు ఇచ్చింది. మాజీ మంత్రి వట్టి వసంతకుమార్, త్రినాథరెడ్డి దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ట్రిబ్యునల్ మంగళవారం విచారించింది. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం కోసం చేపట్టిన ఎత్తిపోతల పథకాల వల్ల రైతులు నష్టపోతున్నారని పిటిషనర్లు ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లారు. నదుల అనుసంధానం పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా జరుగుతోందా? లేదా? అన్నదానిపై నివేదిక ఇవ్వాలని బెంచ్ ఆదేశాలిచ్చింది. ఈ విషయమై పిటిషనర్లు పర్యావరణ శాఖ, ఏపీ కాలుష్య నియంత్ర మండలికి లేఖలు రాయాలని సూచించింది. తదుపరి విచారణను వచ్చే నెల 22కు వాయిదా వేసింది.

రేషన్ డీలర్ల నెత్తిన పిడుగు

సమ్మె చేస్తే పోస్టు రద్దు చేస్తామంటూ ప్రభుత్వ ప్రకటన

సాక్షి, అమరావతి: రేషన్ డీలర్ల నెత్తిన ప్రభుత్వం పిడుగు వేసింది. వచ్చే ఆరు నెలల పాటు సమ్మె చేయడానికి వీలులేకుండా మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎవ్వరైనా ఉత్తర్వులను ఉల్లంఘించి ఆందోళనకు దిగితే డీలర్ పోస్టును రద్దు చేస్తామంటూ హెచ్చరించింది. ప్రజా పంపిణీ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసేందుకు వీలుగా డీలర్లు ఎవ్వరూ ఆరు నెలల పాటు సమ్మె చేయకూడదని పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి బి.రాజశేఖర్ పేరిట నోటిఫికేషన్ జారీ చేశారు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం రేషన్ డీలర్లకు క్వింటాల్ బియ్యానికి రూ. 87 ప్రకారం కమీషన్ చెల్లించాలి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేస్తోంది. అయితే ఈ–పాస్ మిషన్ల మరమ్మతు పేరిట ప్రభుత్వం ఒక్కో క్వింటాల్‌కు రూ.17 కోత విధించి ప్రస్తుతం కేవలం రూ.70 మాత్రమే చెల్లిస్తున్నారు. 2015 నవంబర్ నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను ఆహార భద్రతా చట్టం పరిధిలోకి తెచ్చింది. అప్పటి నుండి డీలర్లకు ఆహార భద్రతా చట్టం ప్రకారం కమీషన్ పెంచాల్సి ఉన్నా 2016 సెప్టెంబర్ తర్వాత నిర్ణయం తీసుకున్నారు. 10 నెలల కమీషన్ బకాయిలతో పాటు మధ్యాహ్న భోజన పథకం, అంగన్ వాడీ సెంటర్లకు సరుకులు సరఫరా చేసేందుకు డీలర్లకు కమీషన్ ఇవ్వాల్సి ఉన్నా ఏళ్ల పాటు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచారు. బకాయిలు మొత్తం చెల్లించాలని లేకపోతే రేషన్ పంపిణీ నిలిపివేస్తామంటూ రాష్ట్రంలోని 29 వేల మంది డీలర్లు పెద్ద ఎత్తున ఆందోళనలు, రిలే దీక్షలు చేశారు. ప్రభుత్వం అప్రమత్తమై రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరిస్తామని, పెండింగ్‌లో ఉన్న కమీషన్ మొత్తాన్ని చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను డీలర్లు విరమించుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు డిమాండ్లపై ఎలాంటి కదలిక లేకపోవడంతో తిరిగి ఆందోళన చేస్తారేమోనని ఊహించి సమ్మె చేస్తే వేటు వేసేలా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడాన్ని రేషన్ డీలర్లు జీర్ణించుకోలేక పోతున్నారు.

ఆ రిపోర్టుల్లో ఉన్నవి వార్తా కథనాలే: ఐవైఆర్

సాక్షి, అమరావతి: 'విభజన చట్టంలో పేర్కొన్న హామీలు– ప్రస్తుత స్థితి' అన్నదానిపై లోక్‌సత్తా నేత జయప్రకాశ్ నారాయణ నేతృత్వంలోని నిజనిర్ధారణ కమిటీ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ఘాటుగా విమర్శించారు. వివిధ రంగాల్లోని ప్రముఖులందరూ ఏకపక్షంగా వాస్తవాలకు భిన్నంగా ప్రజాభిప్రాయాన్ని మలచాలని ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. వార్తా పత్రికల్లో వచ్చిన అంశాల ఆధారంగా నిజనిర్ధారణ కమిటీ నివేదిక తయారు చేసిందంటూ మంగళవారం ట్వీట్ చేశారు. పవన్‌కల్యాణ్ ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీ నివేదిక ఇచ్చి ఏడాది పూర్తవుతోందని, కేంద్ర ప్రభుత్వ వైఖరి తెలియకుండా ఇంత మొత్తం కేంద్రం నుంచి రావాల్సిందిగా పేర్కొనలేమంటూ ఆ కమిటీ చర్చల్లో తాను స్పష్టంచేసినట్లు పేర్కొన్నారు.

12న ముస్లిం సాధికారత రాష్ట్ర సదస్సు

ముస్లిం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మునీర్ అహ్మద్

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ముస్లిం సాధికారత రాష్ట్ర స్థాయి సదస్సు ఈనెల 12వ తేదీన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు ముస్లిం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మునీర్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనాభా దామాషా ప్రకారం ముస్లింలకు చట్టసభల్లో స్థానం కల్పించాలని, జస్టిస్ రంగనాథ మిశ్రా కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, ముస్లిం మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత తదితర అంశాలపై సదస్సులో చర్చిస్తామన్నారు.

'ఇగ్నో' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, విశాఖపట్నం: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో)లో 2019 ఏడాదికి డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు విశాఖ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ ఎస్.రాజారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేయాలని కోరారు. విశాఖ ప్రాంతీయ కేంద్రం పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలతోపాటు యానాంలో నివసించే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. డిగ్రీ పాసైనవారికి మేనేజ్‌మెంట్ డిప్లొమాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాల కోసం ((httpr://onineadmirrion.ifnou.ac.in/admirrion)) వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు. విశాఖలో ఇగ్నో ప్రాంతీయ కేంద్రం, ఉషోదయ జంక్షన్ (ఎంవీపీ కాలనీ), డాక్టర్ ఎల్ బుల్లయ్య కాలేజ్ (0891–2746293), ఐడియల్ కాలేజ్ (0884–2358515), రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (0883–2433002), అమలాపురం ఎస్‌కేబీఆర్ కాలేజ్ (9849373773), గాజువాకలో ఎంవీఆర్ కాలేజ్ (0891–2512891), విజయనగరం ఎంఆర్ పీజీ కాలేజ్ (9440999986), రాజాంలో ఎస్‌జీసీఎస్ఆర్ కాలేజ్ (9491816025), భీమవరంలో డీఎన్ఆర్ కాలేజ్ (9866624444) కేంద్రాలను సంప్రదించవచ్చన్నారు. ((rcvisakhapatnam@ifnou.ac.in)) మెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

'జుమ్మా'కు కన్నడ పురస్కారం



సాక్షి, అమరావతి బ్యూరో: ప్రముఖ కథకుడు వేంపల్లె షరీఫ్ రాసిన కథల పుస్తకం 'జుమ్మా'కు కన్నడలో మరో పురస్కారం లభించింది. కన్నడలోకి అనువాదమైన ఉత్తమ కథల పుస్తకంగా 'జుమ్మా'ను ప్రతిష్టాత్మకమైన కువెంపు భాషా భారతి ప్రాధికార సంస్థ ఎంపిక చేసింది. రూ.25 వేల నగదు బహుమతి ఉన్న ఈ పురస్కారాన్ని త్వరలో బెంగళూరులో జరగనున్న కార్యక్రమంలో ప్రదానం చేస్తారు. 2012లో జుమ్మా పుస్తకానికిగాను వేంపల్లె షరీఫ్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. 2017లో కర్ణాటక హొస్‌పేటకు చెందిన ప్రముఖ అనువాదకుడు సృజన్ ఈ కథలను కన్నడలోకి అనువాదం చేశారు. 2018లో కర్ణాటక ప్రభుత్వం 'జుమ్మా'ను ఉత్తమ పుస్తకంగా గుర్తించి కన్నడ భాషా పరిషత్ పురస్కారాన్ని ప్రకటించింది. ఇప్పుడు కువెంపు కన్నడ భాషా భారతి ప్రాధికార పురస్కారం లభించడంపై రచయిత వేంపల్లె షరీఫ్ ఆనందం వ్యక్తం చేశారు. రాయలసీమ గ్రామీణ ముస్లింల జీవితాలను నేపథ్యంగా తీసుకుని ఈ కథలను రాశాను కాబట్టి ఈ గౌరవం వారికే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ బుధవారం
9-1-2019



తమిళంలో జోరుగా
– సినిమా పేజీలో

బ్యాక్ టు బి.సి.

బిఫోర్ సెల్‌ఫోన్



సంగీత

సంగీత.. ఫ్యాషన్ డిజైనర్. ఎంతమంది లేరూ! సంగీత.. మోడల్ కూడా. వెరీ కామన్ థింగ్. అయితే డిజైనింగ్, మోడలింగ్ కాదు ఆమె ప్రత్యేకత. అవి రెండూ టైమ్ ఉన్నప్పుడు చేస్తుంటారు సంగీత. టైమ్ అంతా పెట్టి చేస్తున్నది వేరే ఉంది. అదీ డిజైనింగే, అదీ మోడలింగే! అవును. సంగీత ఓ కొత్త తరం పిల్లల్ని డిజైన్ చేస్తున్నారు. ఆ పిల్లల్ని ఈ స్మార్ట్‌ఫోన్ ప్రపంచానికి రోల్ మోడల్స్‌గా అందిస్తున్నారు. అందుకు ఆమె ఎంచుకున్న దారి.. ఆటలు! పబ్జీలు, పొకెమాన్‌ల ఆన్‌లైన్ ఆటలు కాదు. పచ్చీస్, బారాగట్టా వంటి బీసీ (బిఫోర్ సెల్‌ఫోన్) ఆటలు!

అది ప్రైమరీ స్కూలు. పిల్లలకు అక్షరాలు దిద్దిస్తోంది టీచర్. ఓ తొమ్మిదేళ్ల బాలుడికి అక్షరాలు చక్కగా కుదరడం లేదు. తన ప్రి–స్కూల్ కోర్సులో భాగంగా అన్ని క్లాసులనూ పర్యవేక్షించడానికి అప్పుడే ఆ క్లాస్ రూమ్‌లోకి వచ్చిన సంగీతా రాజేశ్ కంట పడిందా పిల్లవాడి చేతిరాత. పలక మీద ఇంగ్లిష్‌లో 'ఏ' అక్షరాన్ని రాయమన్నారామె. ఆ పిల్లవాడు రాశాడు. అయితే దానిని అక్షరం అనడానికి ఆమె మనసొప్పుకోలేదు. కుదురుగా కూర్చుని అక్షరాలన్నింటినీ చక్కగా రాసి చూపించమన్నారు సంగీతారాజేశ్. ''అప్పుడా పిల్లవాడు ఇచ్చిన సమాధానంతో నా బుర్ర తిరిగిపోయింది'' అన్నారామె. ''అక్షరాలను గుర్తు పట్టడం వస్తే చాలు కదా మేడమ్, అందంగా, గుండ్రంగా రాయకపోతే ఏమవుతుంది? ఏది రాయాలన్నా కీ బోర్డు మీదనే టైప్ చేస్తాను కదా'' అన్నాడా కుర్రాడు!

మెదడు పరుగులే.. కాళ్ల పరుగుల్లేవు!

వీడియో గేమ్‌ల తరాన్ని దాటేశాం. ఈ తరం చేతిలో స్మార్ట్‌ఫోన్ ఆటవస్తువైపోయింది. ఆటలన్నీ అందులోనే. ఆ ఆటలు ఆడేటప్పుడు వాళ్ల మెదడు పాదరసం కంటే వేగంగా పనిచేస్తుంటుంది. పిల్లలు హైపర్ యాక్టివ్ అయిపోతున్నారు. ప్రతి చిన్న విషయానికీ అసహనమే. లిఫ్ట్ పై అంతస్తు నుంచి కిందికి వచ్చే వరకు కూడా నిరీక్షించలేకపోతున్నారు. కంప్యూటర్ సెకన్లలో రెస్పాండ్ కాకపోతే మౌస్‌ను టపటపా కొడుతున్నారు. క్యూలో తమ వంతు వచ్చే వరకు డిసిప్లిన్‌తో నిలబడటానికీ విసుగే. ఇలాగే పిల్లలు పెరిగి పెద్దయితే సమాజంలో ఇమడలేరు. ఇలాంటి పిల్లలతో తయారయ్యే సమాజంలో మనుషుల మధ్య పరస్పర సంబంధాలు ఆరోగ్యకరంగా ఉండవు. వీటన్నింటికీ విరుగుడు వాళ్లను కూర్చోబెట్టి ఆటలాడించడమేనంటారు సంగీత.

పులీమేక ఆటల్లో జీవితం ఉంటుంది

''అవుట్‌డోర్ గేమ్స్ శారీరక చురుకుదనాన్ని, మానసిక ఆనందాన్ని ఇస్తాయి. ఇన్‌డోర్ గేమ్స్ పిల్లల్లో పరిణతిని తెస్తాయి. లైఫ్‌స్కిల్స్ నేర్పిస్తాయి. ఒక టాస్క్ కంప్లీట్ అయ్యే వరకు దాని మీద నుంచి దృష్టిని పక్కకు పోనివ్వని విధంగా ఏకాగ్రతను అలవరుస్తాయి. వ్యక్తిత్వ వికాసం, నిగ్రహశక్తి, సిచ్యుయేషన్ మేనేజ్‌మెంట్ వంటివి ప్రత్యేకంగా నేర్పించాల్సిన అవసరం ఉండదు. అవన్నీ మన ఆటల్లో నిబిడీకృతమై ఉన్నాయి. అందుకే పచ్చీస్, వామన గుంటలు, విమానం (యుద్ధంలో మెళకువలు), పరమపదసోపాన పటం (వైకుంఠపాళీ), పులి– మేక, చదరంగం, బారాగట్టా వంటి ఆటలను అలవాటు చేస్తే పిల్లల్లో మెదడు స్థిమితంగా ఆలోచించడం



పిల్లలకు ఆటల పాఠాలు

మొదలు పెడుతుందనిపించింది. ఇప్పుడు పిల్లలు ఎదుర్కొంటున్న అటెన్షన్ డెఫిషియెన్సీకి కూడా అసలైన మందు మన ఇన్‌డోర్ గేమ్స్‌లో ఉంది'' అన్నారామె. సంగీత ప్రి స్కూల్ ఎడ్యుకేషన్‌లో కోర్సు చేశారు. ప్రి స్కూల్స్‌కి కరికులమ్ డిజైన్ చేసిన అనుభవం కూడా ఉందామెకి. ఆమె స్వయంగా 'స్మైల్' పేరుతో స్పెషల్ చిల్డ్రన్‌కి స్కూల్ నడుపుతున్నారు.

పిల్లలు స్కూల్‌కి.. తను 'ప్రి–స్కూల్'కి

తమిళనాడు, మదురై దగ్గర దిండిగల్‌లో పుట్టి పెరిగిన సంగీత డిగ్రీ వరకు అక్కడే చదివారు. పెళ్లి అనంతరం హైదరాబాద్ వచ్చారు. ''పెళ్లయిన తర్వాత పీజీ చేశాను. తొమ్మిదేళ్లపాటు ఇద్దరు పిల్లలతో గృహిణిగా ఉన్నాను. నా పిల్లలను స్కూలుకి పంపించాల్సి వచ్చినప్పుడు ప్రి స్కూల్ ఎడ్యుకేషన్ మీద నా దృష్టి పడింది. నా కెరీర్‌ని స్కూల్‌లో డెవలప్ చేసుకుంటే పిల్లలతోపాటు వెళ్లి రావచ్చు అనుకున్నాను. ప్రి స్కూల్ కోర్సు చేశాను, కొన్ని కార్పొరేట్ స్కూళ్లతో కలిసి పని చేశాను. ఆ అనుభవంతో సొంతంగా స్కూలు పెట్టాను. స్పెషల్ కిడ్స్‌కి అవసరమైనట్లు డిజైన్ చేశానా స్కూల్‌ని. నార్మల్ కిడ్స్ కోసం ఒక సెక్షన్ ఉండేది. అప్పట్లో దుబాయ్ నుంచి ఒక తల్లి తన పిల్లవాడి కోసం అక్కడ మంచి స్కూల్ లేదని మా దగ్గరకు వచ్చింది. ఇప్పుడా అబ్బాయి మా దగ్గరే ఎయిత్ క్లాస్ చదువుతున్నాడు. ఆ అబ్బాయితో మొదలైన స్కూల్ ఇప్పుడు 45 మంది పిల్లలతో నడుస్తోంది. స్కూల్‌ని విస్తరించాలనే ఉద్దేశంతో ఐఎస్‌బీ కోర్సు చేశాను. కోర్సు చేసిన తర్వాత స్పెషల్ కిడ్స్ కోసం డిజైన్ చేసిన స్కూల్‌ని వ్యాపారపరంగా ఫ్రాంచైజీలు ఇవ్వడానికి నాకు మనసు రాలేదు. ఫ్రాంచైజీ తీసుకున్న వాళ్లు నేను నడిపినట్లు నడపకపోతే ఆ పిల్లల భవిష్యత్తు మరింత గందరగోళమవుతుంది. అందుకే స్కూలును నా ఆత్మసంతృప్తి కోసమే నడపాలి, వ్యాపారం చేయకూడదనే నిర్ణయానికి వచ్చేశాను'' అన్నారు.

ఆడించడానికి బొమ్మలు చేయించారు

''ఒక సమస్య నా దృష్టిలో పడితే దానికి పరిష్కారం కోసం ఆలోచించడం నాకలవాటు. అది నాకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుస్తుందా లేదా అనేది తర్వాతి మాట. ముందా పని చేసేస్తాను. అలా మొదలైందే ఈ ఆటబొమ్మల పునః పరిచయం. మన సంప్రదాయ ఆటవస్తువులను పిల్లలకు పరిచయం చేయాలంటే ఆటవస్తువులను తయారు చేయించాలి. వాటికోసం హైదరాబాద్‌లో వడ్రంగులు సరిగ్గా దొరకలేదు. దాంతో తమిళనాడు, కర్ణాటకలోని పల్లెలకు వెళ్లి అక్కడి వడ్రంగుల చేత ఆటవస్తువులను తయారు చేయిస్తున్నాను. పిల్లలకు ఆడటం నేర్పించడానికి స్కూళ్లలో చిన్న చిన్న పోటీలు పెడుతున్నాం. నా అనుభవంలో తెలుసుకున్నదేమిటంటే.. ఈ ఆటలు కొన ఊపిరితో ఉన్నాయి. కొన్ని ఇళ్లలో పిల్లలకు అలవాటు చేస్తున్నారు. అయితే అది నూటికి పది మందిలోపే. తొంభై శాతం పిల్లలకు మేము పెడుతున్న వర్క్‌షాపులతోనే పరిచయమవుతున్నాయి ఈ ఆటలు. మా ఆటవస్తువుల అమ్మకం కోసమే అయితే ఎగ్జిబిషన్‌లో స్టాల్ పెట్టవచ్చు. నా ఉద్దేశం పిల్లలకు ఆడటం నేర్పించడం. అందుకే స్కూళ్లకు వెళ్లి పిల్లలకు ఆట నేర్పించే పని కూడా మేమే చేస్తున్నాం.

పరీక్షలకూ ఆటల ప్రిపరేషన్!

ఆటలు నిజాయితీగా ఆడితే తోటి పిల్లలందరూ స్నేహితులవుతారు, మోసపూరితంగా ఆడే వాళ్లను దూరం పెడతారు. మోసం చేసే వాళ్లు తమను తాము తెలివైన వాళ్లమనే భ్రమలో ఉంటారు, కానీ అది ఎక్కువ కాలం నిలవదనే వాస్తవాన్ని ఆటల్లోనే తెలుసుకుంటారు. ఒక పిల్లాడు తాను గెలవడం కోసం ఒక అబద్ధం చెబితే, అది అబద్ధం అని తెలిసినప్పుడు మిగిలిన పిల్లలందరూ ఆ పిల్లవాడిని దొంగను చూసినట్లు చూస్తారు. అది ఆ ఒక్కడికే కాకుండా అప్పుడు ఆటలో ఉన్న వాళ్లందరూ తెలుసుకుంటారు. అలాగే ఈ ఆటలు చదివిస్తాయి కూడా. కొన్ని ఆటలు పూర్తవడానికి రెండు–మూడు గంటల టైమ్ పడుతుంది. అంతసేపూ ఏకాగ్రతతో కూర్చోవడం అలవాటవుతుంది పిల్లలకు. పెద్ద తరగతులకు వెళ్లిన తర్వాత పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలంటే ఒక టాపిక్ మీద అంత టైమ్ ఉండగలగడం వస్తుంది ఈ ఆటలతో. 'మా వాడికి తెలివి ఉందండీ. చాలా చురుగ్గా ఉంటాడు. కానీ కుదురుగా కూర్చోవడమే కష్టం. ఒక గంట కూర్చోపెట్టలేకపోతున్నాం' అని బాధపడే తల్లిదండ్రులందరికీ ఈ ఆటలు చక్కటి పరిష్కారం'' అన్నారు సంగీత.

– వాకా మంజులారెడ్డి
ఫొటో : శివ మల్లాల

మా అమ్మ కోప్పడుతుంటుంది

''స్కూలు, ఆటవస్తువుల పునః పరిచయం వంటివన్నీ నా ఆత్మసంతృప్తి కోసం చేస్తున్నాను. నేను ఉపాధి పొందడానికి ఏం చేస్తే బాగుంటుందని ఆలోచించినప్పుడు ఫ్యాషన్ డిజైనింగ్ వైపు మళ్లింది నా ఆలోచన. అందులో దిగిన తర్వాత అదొక బిజినెస్ సైన్స్, చాలా సెన్సిబుల్‌గా మార్కెట్ చేయాలని తెలిసింది. డిజైనింగ్‌లో క్రియేటివిటీతోపాటు చాలా శాస్త్రబద్ధంగా చేయగలుగుతున్నాను. కానీ మార్కెట్ దగ్గర విఫలమయ్యాను. నా ఇంట్రెస్ట్‌లన్నీ కలగలుపుతూ ఒక పీస్ చేయగలుగుతున్నాను. దానిని అంత ధరకు అమ్మడం ఎలాగో నేర్చుకోవాలిప్పుడు. నేను డిజైన్ చేసిన చీరను ప్రదర్శించడానికి మోడల్స్‌కి డబ్బిచ్చే బడ్జెట్ లేదు నాకు. అందుకే నేనే స్వయంగా ప్రదర్శిస్తూ ఫేస్‌బుక్ పోస్ట్ చేస్తున్నాను. కాళహస్తిలో కలంకారీ కళాకారుల కష్టాన్ని నా ఫోన్‌లో షూట్ చేసి వీడియోలు పోస్ట్ చేశాను. ఒక చీర అందంగా తయారు కావాలంటే కోట నుంచి సాదా చీర, కాళహస్తిలో పెన్‌కలంకారీ డిజైన్ వేయడం, రంగులు అద్దడం, మగ్గం మీద పని, టైలర్ అప్లిక్ వర్క్ చేయడం వంటి దశలన్నీ చూపించాను. పదివేల రూపాయల చీర వెనుక ఎంతమంది శ్రమ ఉందో తెలియచేయడంలో, ఆ చీర కొంటే పరోక్షంగా ఎంత మంది ఉపాధి పొందుతారో తెలియచేయడంలో సక్సెస్ అయ్యాను. చీరల గురించి పాఠాలు చెప్పడం మాని వ్యాపారం చేయడం నేర్చుకోమని మా అమ్మ కోప్పడుతుంటుంది'' అన్నారు సంగీత తన 'సంగీత ఫ్యాషన్ స్టూడియో' గురించి చెబుతూ.

– సంగీతా రాజేశ్

మరాఠీ మీట్

రమ్మని.. రావద్దని

డెహ్రాడూన్‌లో ప్రశాంత జీవనం గడుపుతున్న నయన్‌తారకు ఇంతవరకు జరిగినదంతా చికాకు పరిచే విషయమే. 'అవార్డ్ వాపసీ' ఉద్యమాన్ని నడిపిన ఈ తొంభై ఏళ్ల రచయిత్రి.. గడప బయటి నుంచి బయటికే లిటరరీ ఇన్విటేషన్‌ని కూడా వాపస్ చేసి ఉండవలసింది.

● మాధవ్ శింగరాజు

నయన్‌తార సెహగల్ 'పాత నేరస్తురాలు'. అయితే ముఖ్య అతిథిగా ఆమెకు పంపిన ఆహ్వానాన్ని వెనక్కి తీసుకునేందుకు 'అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళన' నిర్వహణ కమిటీ చెప్పిన కారణం పూర్తిగా వేరు. మరాఠీ సమ్మేళనానికి ఒక ఆంగ్ల భాషా రచయిత్రిని పిలవడం ఏమిటన్న అభ్యంతరాలు రావడంతో ఆహ్వానాన్ని రద్దు చేసినట్లు సమ్మేళనం వర్కింగ్ ప్రెసిడెంట్ రమాకాంత్ కోల్టే సంజాయిషీ ఇచ్చారు. రాజ్‌థాకరే కూడా అపాలజీ చెప్పారు. 'మహారాష్ట్ర నవ నిర్మాణ సమితి' అధినేత ఆయన. అయితే రాజ్‌థాకరే అపాలజీ చెప్పింది నయన్‌తారకు కాదు. సమ్మేళన నిర్వాహకులకు! ''నయన్‌తారను ముఖ్య అతిథిగా పిలిచి, ఆమె చేత సాహిత్య సమ్మేళనాన్ని ప్రారంభింపజేయడాన్ని మావాళ్లు వ్యతిరేకించారు. అనవసరమైన వివాదాలను తప్పించడం కోసం.. మీ నిర్ణయానికి విరుద్ధంగా ఉన్న మావాళ్ల అభిప్రాయాన్ని మీ దృష్టికి తీసుకురాక తప్పడం లేదు'' అని ఆయన మృదువైన భాషలో వివరణ ఇచ్చారు. వాస్తవానికి సంజాయిషీ గానీ, వివరణగానీ ఇవ్వనవసరం లేనంత నిర్ణయాధికారం కలిగివున్న వాళ్లు కోల్టే, రాజ్‌థాకరే. అయినా ఇచ్చారు. మొదట నయన్‌తారను పిలవడమే తప్పు. పిలిచి, రావద్దనడం రెండో తప్పు. పిలుస్తున్నప్పుడు వాళ్లకు తప్పు అని తెలియదు. ముఖ్య అతిథిగా ఆమె ఏం మాట్లాడబోతున్నారో తెలిశాక తప్పు చేశామని వారికి అర్థమయింది. నియమం ప్రకారం సమ్మేళనంలో ప్రసంగించబోయేవారు తమ ప్రసంగ పత్రాలను మూడు రోజుల ముందుగానే కమిటీకి సమర్పించవలసి ఉంటుంది. నయన్‌తార అలా సమర్పించినప్పుడు మరాఠీలోకి తర్జుమా అయిన ఆమె ప్రసంగాన్ని చదివి, నిర్వాహకులు చేష్టలుడిగిపోయారు. మరాఠీ సాహితీ సమ్మేళనంలో ఆమె మోదీని విమర్శించడానికే ఎక్కువ సమయం తీసుకున్నట్లు ప్రసంగ పాఠంలో బహిర్గతం అయింది. మహారాష్ట్రలోని యవత్‌మల్‌లో ఈ నెల 11న మొదలౌతున్న మూడు రోజుల అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళన ప్రారంభోత్సవ కార్యక్రమానికి మహారాష్ట్ర బీజేపీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ కూడా హాజరవుతున్నారు. డయాస్ మీద ఆయన ఆ పక్కన కూర్చొని ఉంటే, నయన్‌తార ఈ పక్కన నిలబడి మోదీని, హిందుత్వను విమర్శిస్తూ మాట్లాడితే ఇబ్బంది ఫడ్నవిస్‌కే. పైగా నయన్‌తార మీద 'పాత కేసులు' చాలానే ఉన్నాయి. దేశంలో పెరుగుతున్న హిందుత్వ అసహనానికి నిరసనగా 2015లో ప్రభుత్వానికి అవార్డులు తిరిగి ఇచ్చేసిన కళాకారులకు స్ఫూర్తిప్రదాత నయన్‌తార. ఆమె తన సాహిత్య అకాడమీ అవార్డును వెనక్కు తిరిగి ఇచ్చేయడంతో మిగతావాళ్లు ఆమెను అనుసరించారు. మోదీ వచ్చాక దేశంలో ముస్లింలపై దాడులు పెరిగాయని బహిరంగంగానే విమర్శించిన తొలి రచయిత్రి కూడా నయన్‌తారనే. భావోద్వేగాల చెయ్యి పట్టుకుని వెళ్లిపోకుండా, భావోద్వేగాలనే తమ చూపుడు వేలితో నియంత్రించే వివేచనాపరులైన నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారే, ఎం.ఎం. కల్బుర్గీ, గౌరీ లంకేశ్‌ల హత్యలను నయన్‌తార లాంటి ఒక నికార్సయిన రచయిత్రి ఖండించడం కూడా సహజంగానే ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టింది. అలాంటి మనిషిని తీసుకొచ్చి డయాస్ ఎక్కించడం అంటే కొరివితో సొంత ప్రభుత్వం తల గోకినట్టే ఫడ్నవిస్‌కి. మరెందుకు నిర్వహణ కమిటీ మొదట నయన్‌తారకు ఆహ్వానం పంపినట్లు?



● నయన్‌తార సెహగల్


ప్రస్తుతం జరగబోతున్నది 92వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనం. నయన్‌తార సెహగల్ వయసు 91. సమ్మేళనం, సెహగల్ ఒక ఈడువాళ్లు. అయితే ఒక భాష వాళ్లు కాదు. నయన్‌తార పుట్టింది అలహాబాద్‌లో. ఆమె ఆలోచనలు పుట్టేది ఆంగ్లంలో. రాసేదీ ఆటోమేటిక్‌గా ఇంగ్లిష్‌లోనే. పుట్టుకతో ఒకవేళ ఆమె హిందీ మాట్లాడగలరనుకున్నా, ఆ భాషతో మళ్లీ మరాఠీలకు పేచీ. సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన నవల 'రిచ్ లైక్ అజ్' (1986) సహా నయన్‌తార రాసిన పదీపన్నెండు కూడా ఇంగ్లిష్ నవలలు. అదంతా కూడా జవహర్‌లాల్ నెహ్రూ చెల్లెలు విజయలక్ష్మీ పండిట్ కూతురు కావడం వల్ల కూడా అబ్బిన ఆంగ్ల భాషా పరిజ్ఞానం అయి ఉండొచ్చు. విజయలక్ష్మీ పండిట్ అప్పట్లో లండన్‌కు అతి ముఖ్యమైన దౌత్యవేత్త. అరవైలలో మహారాష్ట్రకు విజయలక్ష్మి గవర్నర్‌గా ఉండడం ఒక్కటే బహుశా నయన్‌తారకు మరాఠీలతో ఉన్న సంబంధం. ఇప్పుడు మరాఠీ సాహిత్య సమ్మేళనానికి ఆమెకు ఆహ్వానం వచ్చినా అందుకు ప్రత్యేక కారణాలేమీ లేవు. ఒక పెద్ద రచయిత్రి. సాహిత్యంలో పేరున్న రైటర్. అంతవరకే. మోదీ మీద నేడు ఆమెకున్న కోపం, గతంలో ఇందిరాగాంధీ మీద కూడా ఉన్నదే. ఇందిర విధించిన ఎమర్జెన్సీని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు.

నయన్‌తార వ్యక్తులను కాకుండా వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపుతుంటారు. అలా ఎత్తి చూపడం సాహితీ ధర్మం అని కూడా భావిస్తారు. ఇది తెలిసి కూడా ఆమెను ఆహ్వానించడం సాహితీ సమ్మేళనకర్తల తప్పయితే, తనను పిలుస్తున్న వారెవరో తెలిసి కూడా ఆహ్వానాన్ని అంగీకరించడం ఆమె తప్పనే అనుకోవాలి. డెహ్రాడూన్‌లో ప్రశాంత జీవనం గడుపుతున్న నయన్‌తారకు ఇంతవరకు జరిగినదంతా చికాకు పరిచే విషయమే. 'అవార్డ్ వాపసీ' ఉద్యమాన్ని నడిపిన నయన్‌తార గడప బయటే లిటరరీ ఇన్విటేషన్‌ని వాపస్ చేసి ఉండాల్సింది.

చెట్టు నీడ

తగిన సమయం

పూర్వం సౌభరి అనే పేరుగల మహర్షి ఉండేవారు. ఆయన మహా తపశ్శాలి. ఓ రోజున ఆయన ఎప్పటిలాగే నదికి వెళ్లి, సూర్యునికి ఎదురుగా నిలబడి దోసిలి నిండా నీళ్లు తీసుకున్నాడు. మంత్ర పూర్వకంగా సూర్యునికి అర్ఘ్యం సమర్పించబోతుండగా ఆయన చేతిలో అయిదారు చేపలు కనిపించాయి. అవన్నీ ఒకదానితో ఒకటి ఎంతో ప్రేమగా ఉన్నాయి. వాటిని చూడగానే మహర్షికి సంసార జీవితం మీదకు ధ్యాస మళ్లింది. 'ఎందుకు నేను ఇంతకాలం తపస్సు చేస్తున్నాను. ఎవరి కోసం చేస్తున్నాను. నన్ను ఆదరించేవారెవరు. నా అంతిమ ఘడియలలో నన్ను ప్రేమతో సాగనంపేవారెవరున్నారు. అల్పజీవులైనప్పటికీ ఈ చేపలు ఎంత హాయిగా కుటుంబ జీవనం గడుపుతున్నాయి! వాటితో పోల్చుకుంటే నేను జీవితంలో చాలా కోల్పోయాను. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. వెంటనే వివాహం చేసుకుంటే బాగుంటుంది' అనుకుంటూ ఆ దేశపు రాజు వద్దకెళ్లి, తనకు పెళ్లి చేసుకోవాలని ఉందన్న కోరికను వెళ్లబుచ్చాడు. అంతటి మహాయోగి తనంత తానుగా వచ్చి అడిగితే ఎలా కాదనగలం అనుకుని తన కుమార్తెలనే ఇచ్చి వివాహం చేశాడు. వారితో కొంతకాలం పాటు అన్ని సౌఖ్యాలనూ అనుభవించాడు సౌభరి. ఆ తర్వాత అర్థమైంది ఆయనకు ఈ జీవితంలో ఏమున్నదో! నిద్రలేవడం, వండుకోవడం, తినడం, వినోదాలతో కాలక్షేపం చేయడం, నిద్రపోవడం... ఇంతకు మించి ఏమీ కనిపించడం లేదని భార్యలతో అన్నాడు. వారు కూడా ఆయన అభిప్రాయాన్ని గ్రహించి, గౌరవించారు.



తాము కూడా యోగమార్గానికి, ఆధ్యాత్మిక మార్గానికి మళ్లి, తర్వాత మోక్షం పొందాలని ఉందని తెలియజేశారు. ఆ తర్వాత అందరూ కలసి ఆధ్యాత్మిక మార్గంలో పయనించి, ముక్తి పొందారు. పిన్న వయసులో వైరాగ్యాన్ని, వేదాంతాన్ని అలవరచుకోవడం ఎంత హాస్యాస్పదమో, వృద్ధాప్యంలో కూడా యవ్వనంలో ఉన్నట్లు ప్రవర్తించడం అంతటి హేయం. అంటే ఏ వయసులో ఆ ధర్మాన్ని పాటించాలని సౌభరి మహర్షి కథ ద్వారా వ్యాసుడు మనకు తెలియజేశాడు. కొందరు ఎంత సంపాదించినా, ఇంకాస్త సంపాదిస్తేనో లేదా ఇల్లు, గృహోపకరణాలు అన్నీ అమర్చుకుంటేనే కానీ పెళ్లి చేసుకోవడం సరికాదు అన్నట్లుగా ప్రవర్తిస్తూనో కాలయాపన అయ్యాక చివరికి బాధపడుతుండడం మనం చూస్తున్నదే.

– డి.వి.ఆర్.



బ్యూటిప్స్

- క్యారెట్, నారింజ రసం, పంచదార తీసుకుని మూడింటినీ కలిపి మెత్తని పేస్ట్ చేసుకోవాలి. జిడ్డు చర్మం ఉన్న వారు ఈ పేస్ట్‌ని ముఖానికి అప్లై చేసుకుంటే ఫలితం ఉంటుంది.
- మెడ చుట్టూ చర్మం నల్లగా ఉన్నవారు... క్యారెట్ పేస్ట్‌లో నిమ్మరసం, పంచదార పొడి వేసి బాగా కలుపుకోవాలి. ముందుగా మెడ చుట్టూ నల్లగా ఉన్న చర్మంపై నూనె రాసి తయారుచేసుకున్న మిశ్రమాన్ని అప్లై చేసి మసాజ్ చేయాలి.
- కోడిగుడ్డులోని పచ్చ సొనలో కొన్ని చుక్కల బాదం నూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తరవాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల పొడిబారిన చర్మం నిగారిస్తుంది.

పాశుర ప్రభాతం 25వ రోజు

భగవంతునికి భక్తులంటే వల్లమాలిన ప్రేమ, అభిమానం. ఆశ్రిత వ్యామోహం గలవాడనే నిందను లోకంలో అనుభవిస్తూ అంతర్యామిగా ఉన్న తనని తెలుసుకోవాలని తాపత్రయపడే విభుడు దేవుడు.

**"ఒరుత్తిమగనాయ్ పిరన్దు, ఓరిరవిల్
ఒరుత్తిమగనాయ్ ఒళిత్తు వళర,
తరిక్కిలానాగిత్తాన్ తీఙ్గునినైన్ద
కరుత్తై ప్పిళైప్పిత్తు కఞ్జన్ వయిత్తిల్
నెరుప్పెన్న నిన్ర నెడుమాలే! ఉన్నై
అరుత్తిత్తు వన్దోమ్, పఱై తరుదియాగిల్,
తిరుత్తక్క శెల్వముమ్ - శేవగముమ్ యామ్పాడి
వరుత్తముమ్ తీర్న్దుమగిళ్న్దేలో రెమ్బావాయ్."**



భావం: దేవకీదేవి చేసిన ఫలమేమో కోరుకున్న భగవంతుడే పుత్రునిగా జన్మించి తరింపజేశాడు. యశోదమ్మ చేసుకున్న వైభవం శ్రీకృష్ణుని లీలామృతాన్ని పెంచినందుకు కట్టబెట్టినాడు. దుష్టస్వభావియైన కంసుని సంహరించి చెడుకు లోకంలో స్థానముండదని నిరూపించిన మహానుభావుడు భగవంతుడు. తనను ఆశ్రయించిన వారిని అనునయించి కాపాడుకునే గుణం గల ఆశ్రితమందారా! నీ చరణములే నమ్మితిని. పర అనే వాద్యాన్నివ్వు. నీ కీర్తిని స్తుతిస్తూ హాయిగా బ్రతికేస్తాం.

మీ అమ్మలా కావద్దు!

బిందు కూతురికి నో అడ్మిషన్

ఎదురీత



అయ్యప్పను దర్శించుకుని వస్తున్న బిందు (వెనుక), కనకదుర్గ .. (ఫైల్ ఫొటో)

బిందు తెలుసుకదా. జనవరి 1న శబరిమల అయ్యప్పను దర్శించుకుని వచ్చిన ఇద్దరు మహిళల్లో ఒకరు. (ఇంకొకరు కనకదుర్గ). దళిత్ యాక్టివిస్ట్. నిజానికి ఆమె అక్టోబర్ నెలలోనే శబరిమల వెళ్లేందుకు ప్రయత్నించారు. కాని నిరసనకారులు అడ్డుకోవడంతో వెనక్కి తిరిగారు. ఆ నిరసన ఆమెకు దైవదర్శనం కానివ్వకుండా అడ్డుకోవడం వరకే ఆగలేదు. బిందు ఇంటిదాకా, ఇంకా చెప్పాలంటే కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టేవరకూ వెంటాడింది. తొలిసారి దర్శనానికి వెళ్లి విఫలమై వచ్చినప్పటి నుంచే బిందు సంప్రదాయవాదుల వేధింపులను ఎదుర్కొంటూ ఉన్నారు. బిందు కుటుంబం కోళికోడ్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసముంటోంది. ఆ ఇంటి యజమాని ముందస్తు సమాచారం, తగిన సమయం ఇవ్వకుండా అప్పటికప్పుడు ఇల్లు ఖాళీ చేయించారు. చేసేదిలేక ఫ్రెండ్ ఇంట్లో తలదాచుకుంటుంటే అక్కడా వేధింపులు తప్పలేదు. అక్కడినుంచీ ఆమె వెళ్లిపోయేలా చేశారు. బిందుకు పదకొండేళ్ల కూతురు ఉంది. ఆ అమ్మాయి ప్రస్తుతం అగాలీ ఒకేషనల్ హయ్యర్ సెకండరీ స్కూల్లో చదువుతోంది. వచ్చే యేడాది కోసం కూతురిని విద్యావనమ్ హయ్యర్ సెకండరీ స్కూల్లో చేర్పించాలనుకున్నారు బిందు. దాని తాలూకు ఇంటర్వ్యూ, పేరెంట్స్ మీటింగ్‌నూ పూర్తి చేశారు. అమ్మాయికి అడ్మిషన్ ఇస్తున్నాం అని కూడా స్కూల్ యాజమాన్యం కూడా చెప్పింది. మొన్న సోమవారం.. అంటే జనవరి ఎనిమిదో తారీఖున అడ్మిషన్‌కు సంబంధించిన ఫార్మాలిటీస్ పూర్తిచేసుకోవాల్సి ఉంది. బిందు స్కూల్‌కి వెళ్లారు.




బిందు

''నా కూతురితో స్కూల్లోకి అడుగుపెట్టాను. అక్కడ దాదాపు అరవై మంది గుమిగూడి ఉన్నారు. వాళ్లంతా స్థానికులు, మగ వాళ్లు. మమ్మల్ని ఏమీ అనలేదు. ప్రిన్సిపల్ రూమ్‌లోకి వెళ్తుంటే కూడా ఏమీ అడ్డుకోలేదు. తీరా లోపలికి వెళ్లాక చూస్తే.. ప్రిన్సిపలే వింతగా ప్రవర్తించారు. ''నేను మీలాగా యాక్టివిస్ట్‌ని కాను. కాని ఎడ్యుకేషనల్ యాక్టివిస్ట్‌ని'' అంటూ సందర్భంలేకుండా మాట్లాడారు. నేను వెళ్లింది మా అమ్మాయి అడ్మిషన్ ఫార్మాలిటీస్ కంప్లీట్ చేయడం కోసం. ఆ ఊసెత్తకుండా ప్రిన్సిపల్ ఏవేవో మాట్లాడుతుంటే ఆశ్చర్యం వేసింది. చివరకు ''మీ అమ్మాయికి అడ్మిషన్ ఇచ్చి ఈ స్కూల్ వాతావరణాన్ని పాడు చేయదలచుకోలేదు మేము'' అంటూ అసలు సంగతి చెప్పారు. గది నుంచి స్కూల్ ఆవరణలోకి వస్తుంటే ఓ టీచర్ చెప్పారు అక్కడున్న అరవై మంది మగవాళ్లను చూపిస్తూ ''మీ అమ్మాయికి అడ్మిషన్ ఇవ్వద్దని వీళ్లంతా ప్రొటెస్ట్ చేయడానికి వచ్చారు'' అని. పాత స్కూల్లో కూడా టీచర్స్ మా అమ్మాయితో ''నువ్వు మీ అమ్మలా కావద్దు''అంటున్నారట. మా అమ్మాయి క్లాస్‌లోని కొంతమంది పిల్లల తల్లిదండ్రులు మా అమ్మాయితో మాట్లాడొద్దని, డిస్టెన్స్ మెయిన్‌టైన్ చేయమని వాళ్ల పిల్లలకు చెప్తున్నారట. ఈ అవమానంతో మా అమ్మాయి ఇప్పుడా స్కూల్‌కి వెళ్లడానికే ఇష్టపడట్లేదు'' అని చెప్పారు బిందు.

సాక్షి
ఫ్యామిలీ సినిమా
విజయవాడ ॥ బుధవారం
9-1-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్...! మా ఫ్రెండ్ ఒక అబ్బాయిని లవ్ చేసింది. ఇద్దరూ త్రీ ఇయర్స్ లవ్ చేసుకున్నారు కానీ, వాళ్లిద్దరి నేపథ్యాలు వేరు కావడంతో అమ్మాయి ఇంట్లో ఒప్పుకోలేదు. దాంతో విడిపోయారు. వాళ్లు కలిసి పెళ్లి చేసుకోవడానికి ఏదైనా మంచి సలహా ఇవ్వండి సార్?

– పల్లవి

ఇద్దరూ మేజర్స్ అయితే వాళ్లను ఎవరూ ఆపలేరు.

'మేజర్స్ అంటే ఏంటి సార్? అది కూడా చెప్పండి. సగం చెబుతారు. సగం మింగుతారు. పల్లవి నేను చెబుతాను. అమ్మాయి ఎయిటీన్ ఇయర్స్... అబ్బాయి ట్వంటీ వన్ ఇయర్స్ దాటితే... ఇద్దరూ మేజర్స్. ఏ పోలీస్ స్టేషన్‌కి పోయి వాళ్లిద్దరూ ప్రాబ్లమ్ చెప్పుకున్నా సొల్యూషన్ దొరుకుతుంది. కరెక్టా సార్?'

రాంగ్!!

'ఏంటి సార్? అది కరెక్ట్ కాదా? దేశంలో ఉన్న రూల్ కంటే మీ రూల్ కరెక్టా సార్?'

నా రూల్ నాకు ఉత్తరం రాసిన వాళ్లకు వర్తిస్తుంది. ప్రాబ్లమ్ నాకు చెప్పారు కాబట్టి నేను చెప్పేదే కరెక్ట్ నీలూ!

'అయితే చెప్పండి ఏమి చెయ్యాలి?'

వయసు ఒక్కటే సరిపోదు పల్లవీ! జీవితంలో కలిసి జీవించే మెచ్యూరిటీ ఉండాలి. పెద్దల సలహా, సంప్రదింపులు లేకుండా అంత పెద్ద నిర్ణయం చెయ్యకూడదు. ఒకవేళ అలాంటి నిర్ణయం తీసుకుంటే.. ఒకరికొకరు ఉంటారో లేదో తెలియదు కానీ.. కష్టం వస్తే ఏకాకులైపోతారు. ఎవరూ సాయం చెయ్యరు. ప్రపంచం అంత మంచిది కాదు. కుటుంబాలను దూరం చేసుకుని పారిపోవడం చాలా కష్టాలకు కారణం అవుతుంది. వాళ్లిద్దరినీ... మొదట పెద్దలను కన్విన్స్ చేసుకోమను. అవసరమైతే సమాజంలోని ఇతర పెద్దలను సంప్రదించి పేరెంట్స్‌తో మాట్లాడటం మంచిది.

lovedoctorram@sakshi.com

పోటీ ఎందుకు అనిపించింది!


రామ్‌చరణ్

''ప్రతి సినిమా ఒక మంచి సినిమా అవుతుందనే స్టార్ట్ చేస్తాం. ఒక సక్సెస్‌ఫుల్ సినిమాలోని క్యారెక్టర్ గురించే ఆలోచిస్తే అందరి డైరెక్టర్స్‌తో సినిమాలు చేయలేం. 1980లో చూస్తే నాన్నగారు అన్ని జానర్స్‌ను రెండేళ్లలో చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆర్టిస్టుగా నేనూ అలా అన్నీ చేయాలనుకుంటాను. కన్విక్షన్ ఉన్న డైరెక్టర్స్‌తో సెన్సిబుల్ సినిమాలు చేయడం కూడా ఇష్టమే. బోయపాటి గారు మంచి కన్విక్షన్ ఉన్న డైరెక్టర్. 'వినయ విధేయ రామ' సెట్స్‌లో నేను బాగా ఎంజాయ్ చేశాను'' అని రామ్‌చరణ్ అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా రూపొందిన చిత్రం 'వినయ విధేయ రామ'. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా రామ్‌చరణ్ చెప్పిన సంగతులు...

> 'సైరా: నరసింహారెడ్డి' విషయంలో అన్నీ కరెక్ట్‌గా జరుగుతున్నాయని చెప్పడం లేదు. పెద్ద సినిమాలు చేసేటప్పుడు కొన్నిసార్లు డేట్స్ కావొచ్చు, ప్రొడక్షన్‌లో కావొచ్చు... ఇలా చాలా కారణాలు ఉంటాయి. 'రంగస్థలం' సినిమా సెట్‌ను రీ డెకరేట్ చేసి 'సైరా'కు వాడుకుందాం అనుకున్నాం. ల్యాండ్ ఓనర్‌కు ఏదో ప్రాబ్లమ్ ఉండి ఆపారు అంతే. అనుకున్న బడ్జెట్‌తో జరుగుతోంది. ఓవరాల్‌గా బాగానే జరుగుతోంది. చెప్పుకోదగ్గ సమస్య లేదు. రెండు నెలల్లో షూటింగ్ పూర్తవుతుంది. రీ షూట్స్ జరగడంలేదు. రీ షూట్స్ చేసేంత డబ్బు లేదు. దసరాకు రిలీజ్ కావొచ్చు. 200 కోట్లకు పైగా బడ్జెట్ ఉంటుంది. చేయాల్సిన టైమ్ లోనే చేస్తున్నాం.

- నలుగురు అన్నదమ్ముల కథే ఈ 'వినయ విధేయరామ'. ప్రతి వ్యక్తి క్యారెక్టర్లో వినయం, విధ్వంసం ఉంటాయి. ఈ సినిమాలో నా క్యారెక్టర్ కూడా అంతే. సంక్రాంతికి తగ్గట్లే 'వినయ విధేయ రామ' టైటిల్ ఉంది. కథకు కూడా దగ్గరగా ఉండే టైటిల్ ఇది. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా ఇది. 'గ్యాంగ్‌లీడర్' సినిమాతో ఈ సినిమాకు పోలికలు ఉన్నాయి అంటున్నారు కానీ నాకు అలా అనిపించలేదు. ఈ సినిమాలోని పరిస్థితులు, స్క్రీన్‌ప్లే డిఫరెంట్‌గా ఉంటాయి. ఎప్పటినుంచో 'గ్యాంగ్ లీడర్' లాంటి సినిమా చేయాలనుకుంటున్నాను. కానీ అది ఈ సినిమా కాదని నా అభిప్రాయం.
- 'రంగస్థలం' తర్వాత 15 రోజుల లోపలే ఈ సినిమా స్టార్ట్ చేశాం. ఇంకాస్త టైమ్ ఉంటే నాకు పర్సనల్‌గా ఇంకా బాగుండేది అనిపించింది. టైమ్ లేకపోయినా 'రంగస్థలం'లోని చిట్టిబాబు క్యారెక్టర్ నుంచి ఈ సినిమాలోని రామ్ క్యారెక్టర్‌లో బాగానే ఒదిగిపోయాను.
- బోయపాటిగారి సినిమాలను చూస్తే లవ్‌స్టోరీ, ఫ్యామిలీ డ్రామా ఉంటుంది. ఆయనకు ఒక బ్రాండ్ ఇమేజ్ వచ్చిందంటేనే అది ఆయనకు ఉన్న స్ట్రెంత్ వల్లే. ఈ సినిమాలో యాక్షన్ బ్యాలెన్స్‌గా ఉంటుందనే అనుకుంటున్నాను.
- సిల్వెస్టర్ స్టాలోన్ వంటి గొప్ప నటుల సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయనలా ఈ సినిమాలో నాకు రాంబో లుక్ అనేసరికి కాస్త ఉత్సాహంగా అనిపించింది. ఈ లుక్ గురించి బోయపాటి గారు రెండేళ్ల క్రితమే చెప్పారు. 'వినయ విధేయ రామ'కు బాడీ బిల్డింగ్ అవసరం అయ్యింది. అందుకే కొంతకాలం డైట్ ఫాలో అయ్యాను. 'సైరా' నిర్మాణంలో ఉపాసన పాత్ర ఏం లేదు. నా డైట్ విషయంలో మాత్రం ఉంది. ఈ మధ్య వైఫ్స్ అందరూ అదే చేస్తున్నారు (నవ్వుతూ). నేను ఎక్కువగా డైట్ చేయను. నార్మల్‌గా నేను ఇంట్లో బాగానే తింటాను.
- నా పేరుతో డైలాగ్ చేప్పే ముందు, ఆ తర్వాత పెద్ద సీన్స్ ఉన్నాయి. ఆ కాంబినేషన్లో నాకు పెద్ద సమస్యగా అనిపించలేదు. నాన్నగారు(చిరంజీవి) బోయపాటిని పిలిచి ఓ జోక్ వేశారు. ఎవరి పర్మిషన్ తీసుకుని ఈ పేరు పెట్టారు అని (నవ్వుతూ). నాన్నగారు ఈ సినిమా ఈవెంట్లో ఆ డైలాగ్‌ను నాకన్నా పదిరెట్లు బాగా చెప్పారనిపించింది. షాకింగ్‌గా అనిపించింది.
- ప్రతి సినిమా 'రంగస్థలం' లానే రావాలంటే కష్టం అవుతుంది. కథ విన్నప్పుడు ఆడియన్‌గా నాకు ఆసక్తికరంగా అనిపించాలి. దర్శకుడు క్లారిటీగా ఉన్నారనిపిస్తే తప్పకుండా చేస్తాను. 'రంగస్థలం'లాంటి మంచి సినిమా చేసినప్పుడు ఆర్టిస్టుగా నా కాన్ఫిడెన్స్‌లో మార్పు వచ్చింది. కానీ అది మరింత పెద్దగా అని చెప్పలేను.
- గతేడాది సమ్మర్లో రిలీజైన 'రంగస్థలం, భరత్ అనే నేను, నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమాల కలెక్షన్స్ విషయంలో చిన్న డిస్ట్రబెన్సెస్ వచ్చాయి. అది అవసరమా? అనిపించింది. హ్యాపీగా అందరం మంచి సినిమాలు చేశాం. నిర్మాతలకు మంచి డబ్బులు వచ్చాయి. ఈ కలెక్షన్స్ విషయంలో పోటీ ఎందుకు? అనిపించింది. పోటీ ఉంటే క్యారెక్టర్స్ విషయంలో ఉండాలి. సినిమాలు ఇంకా బాగా చేయాలనే విషయంలో పోటీ ఉండాలి. నిర్మాతలకు డబ్బులు వచ్చాయి. డిస్ట్రిబ్యూటర్స్ హ్యాపీగా ఉన్నారు. మధ్యలో అభిమానులు ఎందుకు ఇలా కొట్టుకుంటున్నారో అర్థం కావడం లేదు. నిర్మాతగా కన్నా ఫ్యాన్స్ ఈగర్‌గా ఉంటారు. నా వైపు నుంచి నేను చెప్పాను. కలెక్షన్స్ విషయంలో అంత ప్రెజర్ లేదు అని. రేపు నిర్మాతలు పెట్టుకుంటే అది వారి ఇష్టం. ఎందుకంటే ఇది వారి సినిమా.
- నాలో మార్పు వచ్చింది అంటున్నారు. అయితే నాకు పెద్ద మార్పేం అనిపించడంలేదు. సందర్భాన్ని బట్టి రియాక్ట్ అవుతుంటాను. మహేశ్, తారక్ వంటి వాళ్లతో నేను బాగా కలిసిపోతాను. సోషల్ మీడియా వచ్చింది కాబట్టి ఇప్పుడు ఆ విషయం బయటకు తెలుస్తోంది. నాన్నగారు కూడా చెన్నైలో ఉన్నప్పుడే అందర్నీ కలిసేవారు. అదే ఫాలో అవుతున్నాను.
- నా స్టాఫ్‌ను బాగా చూసుకుంటే నాకు బెస్ట్ అవుట్‌పుట్ ఇస్తారని నా ఆలోచన. అందుకే నా టీమ్‌కి బహుమతులు ఇవ్వాలనుకుంటాను. నిర్మాతగా, యాక్టర్‌గా ఉంటడం వల్ల చిన్న స్ట్రెస్ ఉంటుంది. ఈ సినిమా, 'సైరా' రిలీజ్ తర్వాత 'ఆర్‌ఆర్‌ఆర్'కు 150పర్సెంట్ ఎఫర్ట్ పెట్టాలనుకుంటున్నాను.
- దానయ్యగారు గట్స్ ఉన్న నిర్మాత. త్రివిక్రమ్‌గారితో దానయ్య గారి నిర్మాణంలో నాన్నగారు ఓ సినిమా చేస్తారు. ఈ సినిమా కంటే ముందు కొరటాల శివగారితో సినిమా చేస్తారు నాన్నగారు. నేనూ శివగారు చేయాల్సింది. కానీ 'ఆర్‌ఆర్‌ఆర్' వల్ల నాన్నగారితో శివగారు చేస్తున్నారు. లేటైనా శివగారితో నా సినిమా ఉంటుంది.
- రాజమౌళిగారు 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రాజెక్ట్ గురించి చెప్పినప్పుడు 'ఇలాంటి ఆలోచన కూడా వస్తుందా?'ని నేను, ఎన్టీఆర్ షాకయ్యాం. నేను సైలెంట్‌గా ఉన్నాను. తారక్ బాగా ఎగ్జైటయ్యాడు. ఈ సినిమా గ్రాఫిక్స్ కోసం యు.ఎస్. వెళ్లాం.
- కొణిదెల ప్రొడక్షన్స్‌లో వేరే వారితో సినిమాలు చేయాలనుకోవడం లేదు. నాన్నగారి కోసమే అనుకుంటున్నాను. తెలుగు ఇండస్ట్రీలో నేను మా నాన్నగారికి ఇచ్చే రెమ్యూనరేషన్ ఎవ్వరూ ఇవ్వలేరని చెప్పగలను. ఈ సినిమా ప్రీ–రిలీజ్ ఈవెంట్‌లో టీఆర్‌ఎస్ నేత కేటీఆర్ 'మీలో రాజకీయ నాయకుడికి ఉండవలసిన లక్షణాలు ఉన్నాయని కితాబు ఇచ్చారు కదా! అలాంటి ఆలోచన మీకేమైనా ఉందా?' అని చరణ్‌ని అడిగితే, ''ఆయన యాక్టింగ్ చేయకూడదు. నేను పాలిటిక్స్ చేయకూడదు'' అన్నారు.

డ్యాన్స్ మజ్ను డ్యాన్స్


అఖిల్

పెళ్లికి ముందు సంగీత్‌లో సూపర్‌గా డ్యాన్స్ చేస్తున్నారు అఖిల్. మరి.. ఎవరి పెళ్లి అనేది ఈ నెల 25న థియేటర్స్‌లో తెలుస్తుంది. అఖిల్ హీరోగా 'తొలిప్రేమ' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీఎస్‌ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న సినిమా 'మిస్టర్ మజ్ను'. ఇందులో నిధీ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాలోని ఓ పాట చిత్రీకరణ విదేశాల్లో జరుగుతోందని సమాచారం. ''సంగీత్ సెలబ్రేషన్స్‌లో డ్యాన్స్ మొదలైంది. ఇంకా రెండు రోజులు సాగుతుందీ డ్యాన్స్'' అని పేర్కొన్నారు అఖిల్. ఈ సినిమాను ఈ నెల 25న విడుదల చేయాలనుకుంటున్నారు.

తమిళంలో జోరుగా...


రాశీ ఖన్నా

అందాల సుందరి రాశీఖన్నా హీరో శింబూకి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి చెన్నై కోడంబాక్కమ్ వర్గాలు. ప్రముఖ దర్శకులు మణిరత్నం తెరకెక్కించిన 'చెక్క చివంద వానమ్' చిత్రం తర్వాత వరుసగా సినిమాలు సైన్ చేస్తున్నారు శింబు. తాజాగా సుందర్ సి. దర్శకత్వంలో ఆయన నటించిన 'వందా రాజావాదాన్ వరువేన్' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా తర్వాత వెంకట్ ప్రభు దర్శకత్వంలో 'మానాడు' చిత్రంలో నటించనున్నారు శింబు. త్వరలో ఈ సినిమా షూటింగ్ మొదలుకానుంది. ఇందులో శింబు సరసన రాశీ ఖన్నాను కథానాయికగా తీసుకున్నారట. 'ఇమైక్క నొడిగళ్'తో తమిళంలోకి అడుగుపెట్టి, ఇటీవల కథానాయికగా 'అడంగా మారు'తో మంచి విజయం అందుకున్నారు రాశీ ఖన్నా. మరోవైపు 'టెంపర్'కి రీమేక్‌గా విశాల్ సరసన ఆమె నటించిన 'అయోగ్య' రిలీజ్‌కి రెడీగా ఉంది. కార్తీక్ జి.క్రిష్ దర్శకత్వంలో 'సైతాన్ కా బచ్చా' అనే మరో తమిళ చిత్రంలో నటిస్తున్నారు రాశీ. ఇప్పుడు శింబు 'మానాడు' సినిమా ఆఫర్. ఈ చిత్రం కోసం 28 రోజులు బ్యాంకాక్‌లో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారట శింబు. ఫిబ్రవరి 3న శింబు పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించనున్నారని టాక్.

అమ్మాయి స్వార్థం


శంతన్

ప్రముఖ దర్శకుడు భాగ్యరాజ్ తనయుడు శంతన్ భాగ్యరాజ్ హీరోగా రూపొందిన తమిళ చిత్రం 'ముప్పరిమానమ్'. సృష్టి డాంగే కథానాయిక. ఆది రూపన్ దర్శకుడు. తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని భువన్ కుమార్ అల్లం 'లవ్ గేమ్' పేరుతో తెలుగులోకి అనువదించారు. ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఆడియో, ట్రైలర్‌ని విడుదల చేశారు. భువన్ కుమార్ మాట్లాడుతూ– ''గతంలో 'సారథి' అనే స్ట్రయిట్ సినిమా నిర్మించాను. ప్రస్తుత ట్రెండ్‌కి కనెక్ట్ అయ్యే కాన్సెప్ట్‌తో రూపొందిన చిత్రం 'లవ్ గేమ్'. ఒక అమ్మాయి తన స్వార్థం కోసం ఇద్దరి అబ్బాయిలతో ఎలా గేమ్ ఆడిందనేది కథ. 'వెన్నెలకంటి' గారు మంచి సంభాషణలు అందించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం ప్రధాన ఆకర్షణ'' అన్నారు.

కొత్త హీరో... కొత్త డైరెక్టర్


వర్ష, శివ కందుకూరి

'పెళ్ళి చూపులు, మెంటల్ మదిలో' వంటి చిత్రాలని నిర్మించడంతో పాటు జాతీయ, ఫిల్మ్ ఫేర్ అవార్డులని సొంతం చేసుకున్న నిర్మాత రాజ్ కందుకూరి. ఇప్పుడు ఆయన తన కుమారుడు శివ కందుకూరిని హీరోగా పరిచయం చేస్తున్నారు. అమెరికాలో చదువు పూర్తి చేసుకుని ఈ మధ్యే ఇండియాకి వచ్చారు శివ. ధర్మపథ క్రియేషన్స్‌పై రూపొందనున్న ఈ చిత్రంతో శేష సింధురావ్ అనే లేడీ డైరెక్టర్‌ని సినిమా రంగానికి పరిచయం చేస్తున్నారు రాజ్ కందుకూరి. దర్శకులు సుకుమార్, క్రిష్‌ల వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు శేష సింధురావ్. ఈ చిత్రానికి గోపీ సుందర్ సంగీతం అందిస్తున్నారు. తమిళంలో ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన '96' చిత్రం ఫేమ్ వర్ష ఇందులో కథానాయికగా నటిస్తున్నారు. 'మహానటి' చిత్రానికి స్క్రీన్‌ప్లే, మాటలు అందించిన పద్మావతి విశ్వేశ్వర్ ఈ చిత్రానికి దర్శకురాలితో కలిసి కథ, స్క్రీన్ ప్లే, మాటలు అందించారు. ఈ చిత్రానికి సమర్పణ: దగ్గుబాటి సురేశ్ బాబు, 'మధుర' శ్రీధర్, కెమెరా: వేద వర్మ.

గెట్ వెల్ సూన్


రాకేశ్ రోషన్, హృతిక్ రోషన్

తండ్రి రాకేశ్ రోషన్ (బాలీవుడ్ ప్రముఖ దర్శక–నిర్మాత) గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు హీరో హృతిక్ రోషన్ మంగళవారం తెలిపారు. ''మంగళవారం ఉదయం నాన్నగారిని నాతో ఫొటో దిగమని అడిగాను. ఆపరేషన్ రోజు కూడా వర్కౌట్స్ చేయడానికి ఆయన జిమ్‌కు వచ్చారు. నాకు తెలిసిన స్ట్రాంగ్ పర్సన్ మా నాన్నగారు. తొలి దశలో ఉన్న గొంతు క్యాన్సర్‌తో ఆయన కొన్ని రోజులుగా పోరాడుతున్నారు. మా కుటుంబంలో ఆయనలాంటి లీడర్ ఉండటాన్ని అదృష్టంగా భావిస్తున్నాం. లవ్ యు డాడీ'' అని హృతిక్ పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు బాలీవుడ్ సినీ సెలబ్రిటీలతో పాటు రాకేశ్ రోషన్ అభిమానులు ''గెట్ వెల్ సూన్'' అని స్పందించారు. ఈ సంగతి ఇలా ఉంచితే... 'క్రిష్' ఫ్రాంచైజీలో హృతిక్ హీరోగా రాకేశ్ రోషన్ దర్శకత్వంలో 'క్రిష్ 4' సినిమాను అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. మరి.. రాకేశ్ కోలుకున్న తర్వాత ఈ సినిమా ఆరంభిస్తారా లేక వేరే దర్శకుడితో మొదలుపెడతారా? అన్నది చూడాలి.

సాక్షి
రాష్ట్రీయం
ప్రజాసంకల్ప యాత్ర
ముగింపు ప్రత్యేకం
III విజయవాడ ॥ బుధవారం ॥ 9-1-2019

ఘన చరితం

జనం మధ్యే నివాసం.. జనంతోనే సహవాసం.. జనం కష్టాలు తెలుసుకోవడమే లక్ష్యం.. జనం కన్నీళ్లు తుడవడమే కర్తవ్యం.. ఒక్క రోజు కాదు.. రెండు రోజులు కాదు.. ఏడాదికిపైగా ప్రజలతో మమేకమైన చారిత్రక ఘట్టమిది. ఏకంగా 3,648 కిలోమీటర్లు సాగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, విపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్పమిది. మండుటెండైతేనేం.. జోరువానైతేనేం.. ఎముకలు కొరికే చలైతేనేం.. లెక్క చేయలేదు.. తాడిత, పీడిత, బడుగు, బలహీన వర్గాల జనావళి గుండె గొంతుక వినాలన్న ఆయన కోరికను పరిపుష్టం చేసుకున్నారు.. జన హృదయాల్లోంచి వెల్లువలా వచ్చిన కష్టాల ప్రవాహాన్ని ఒడిసి పట్టుకుని నేనున్నానంటూ భరోసా ఇచ్చారు.. నాలుగున్నరేళ్లుగా అనునిత్యం కష్ట నష్టాలతో అలసిన గుండెల్లో ధైర్యం నింపారు.. కొద్ది రోజుల్లో మంచి జరగనుందనే నమ్మకాన్ని కలిగించారు. అన్ని సమస్యలకూ పరిష్కార మార్గాన్ని అన్వేషించడమే ఆయన ఆశయం. ఈ ఆశయం మహోన్నతం.

ప్రజాసంకల్ప యాత్ర సాగిందిలా..

- ఇడుపులపాయలో మొదలు.. ఇచ్ఛాపురంలో ముగింపు
- అలుపు, సొలుపు లేకుండా అప్రతిహతంగా సాగిన యాత్ర
- ఉప్పెనలా జనకెరటాలు.. ప్రతీ సభా ఓ ప్రభంజనమే
- జనం మదిలో ఎదురులేని నేతగా గుర్తింపు
- ప్రత్యక్షంగా కోటి మందితో మమేకం
- అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలతో ఇంట్లో మనిషిగా కలిసిపోయిన వైనం
- సర్కారు వైఫల్యాలపై నడిరోడ్డులో నిలదీత
- అన్ని వర్గాల ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్న వైఎస్ జగన్





ప్రజాసేవలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా చిరునవ్వుతో ఎదుర్కొంటూ.. గుండె నిబ్బరాన్ని కోల్పోవడం రాజనీతిజ్ఞత కాదు.. నమ్మిన సిద్ధాంతానికి అనుగుణంగా తొణుకుబెణుకు లేకుండా ముందుకు సాగడమే నేర్చుకున్నా. - డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి

సాక్షి, అమరావతి

ఐదేళ్లకు పైగా రాష్ట్రాన్ని జన రంజకంగా శాసించిన ఓ పెను సంచలనం (డాక్టర్ వైఎస్సార్) అనూహ్యంగా ఆగిపోయింది. ప్రజల మనోభావాల పేరిట రాష్ట్రం అస్తవ్యస్తమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు ముక్కలైంది. అవశేష ఆంధ్రప్రదేశ్‌లో అధికారాన్ని చేపట్టిన పాలకులు జన జీవితంతో చెలగాటం ఆడడం మొదలుపెట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వేళ.. 'మానవుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం'.. అంటూ ఓ యువకెరటం జయకేతనాన్ని చేపట్టి ప్రజా సంకల్పయాత్రను చేపట్టింది. పేదవాడి కడుపునింపి.. తిండి, బట్ట, గూడు కల్పించాలన్న ఉదాత్తమైన ఆశయంతో.. చుట్టూ శేషాచలం కొండలు, మధ్యలో లోయ, ఆహ్లాదకరమైన వాతావరణంలో.. డాక్టర్ వైఎస్సార్‌కు అత్యంత ఇష్టమైన ఇడుపులపాయ ఎస్టేట్ నుంచి కదిలిన యాత్రికుడు ఈనెల 9న ఇచ్ఛాపురంలో తన పాదముద్రలకు విరామం ఇవ్వనున్నాడు. ఆ యాత్రికుడే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర శాసనసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు. తొలి అడుగుతో ప్రారంభమైన యాత్ర మహా యాత్రగా ఎలా మారిందో అదేస్థాయిలో సభలు, సమావేశాలు జరిగాయి. ఇడుపులపాయ వద్ద ఏ స్థాయిలో జరిగిందో అంతకుమించి ప్రతిచోటా సభలు జరిగాయి.

ఇడుపులపాయ నుంచి మొదలై..

నవంబర్ 6, 2017..

చరిత్రాత్మక ప్రజాసంకల్ప యాత్రకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన రోజది. ప్రకృతి ఆశీర్వదిస్తున్నట్టు ఓ పక్క చిరుజల్లులు, మరోపక్క మాతృమూర్తి విజయమ్మ ఆశీస్సులు, అక్కచెల్లెమ్మల ఆత్మీయానురాగాలు, అశేష జనవాహిని మధ్య డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పించి ప్రజా సంకల్పయాత్ర మొదలు పెట్టింది మొదలు ఈనాటి వరకు వెనుదిరిగి చూడలేదు. వడలో, కడు జడిలో, పెను చలిలో, చివరకు విచ్చుకత్తులు కుత్తుకను తెగనరికేందుకు ప్రయత్నించినా అలుపు, సొలుపు లేకుండా అప్రతిహతంగా సాగిన యాత్ర ముగింపు దశకు వచ్చింది. నాడు ప్రారంభ సభ ఇడుపులపాయలో జరిగితే నేడు ముగింపు సభ ఇచ్ఛాపురంలో జరగనుంది. ప్రజల మనిషిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతటి కీర్తి గడించారో.. ఆయన కుమారునిగా జగన్ అంతే గుర్తింపు తెచ్చుకున్నారు. తనను నమ్ముకున్న వారికి, తాను నమ్మిన వారికి జగన్ అభయ ప్రదాతగా నిలిచారు. అందువల్లే ఆయన సభలకు అడుగడుగునా జనం పోటెత్తారు. నీరాజనాలు పలికారు. మాట తప్పడం మడమ తిప్పడం తన రక్తంలోనే లేదని గర్వంగా చెప్పుకోవడమే కాకుండా అఖిలాంధ్ర ప్రజానీకానికి ఆయన అన్నగా నిలిచారు. అక్కచెల్లెమ్మలకు తోబుట్టువయ్యారు. అన్నదమ్ములకు ఆత్మబంధువయ్యారు.

ఏ సభకు ఆ సభే సాటి

జగన్‌మోహన్‌రెడ్డి 134 నియోజకవర్గాలలో పర్యటిస్తే 124 బహిరంగ సభలలో ప్రసంగించారు. ఒక సభ బాగా జరిగింది మరొకటి బాగా జరగలేదనడానికి వీల్లేదు. దేనికదే సాటి. ప్రతీ సభా ఒక ప్రత్యేకతను చాటింది. సభకు గంట ముందు పెద్దగా అలికిడి లేని సభా ప్రాంతాలు జగన్ రాకకు సరిగ్గా అరగంటకు ముందు ఇసుకవేస్తే రాలనట్టుగా తయారయ్యేవి. కట్టలు తెగిన నదీ ప్రవాహం మాదిరి జనం పోటెత్తేవారు. మేడలు, మిద్దెలు, చెట్టు చేమలు జనంతో నిండిపోయేవి. సభ జరిగిన తర్వాత ఆయా ప్రాంగణాలన్నీ తెగిపోయిన చెప్పులు, చిరిగిపోయిన చొక్కాలు, చిందరవందరగా కాగితాలు, బెలూన్లతో నిండిపోయేవి. కాలాలతో నిమిత్తం లేకుండా సభలు జరిగిన తీరు ప్రముఖుల ప్రశంసలు, మన్ననలు పొందాయి. జడివాన కురుస్తున్నా తూర్పు గోదావరి, విశాఖ జిల్లాలలో పర్యటన, బహిరంగ సభలు ఆగలేదు. కుండపోతగా వర్షం పడుతున్నా యలమంచిలి, నర్సీపట్నంలో ప్రజలు జగన్ మాట్లాడేవరకు పోబోమని భీష్మించిన తీరు ఇప్పటికీ ఆ ప్రాంతాలలో చెప్పుకుంటుంటారు. ఎండలు మాడ్చేస్తున్నా, తుపాన్లతో ఊళ్లకు ఊళ్లను ఖాళీ చేస్తున్నా తాను మాత్రం తన సంకల్పాన్ని మరువక రేపటి గురించి ఆలోచించారే తప్ప తనకు ఏమవుతుందోనని భయపడలేదు.

అక్కున చేర్చుకున్న జనం

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడిగా జగన్‌కు ఉన్న పేరు ప్రతిష్టలు వేరు.. ప్రజాసంకల్ప యాత్ర ద్వారా జగన్ ఎదిగిన తీరు వేరు. ప్రజలలో విశ్వాసాన్ని ప్రోదిచేసిన ఆయన ప్రతిభ అనన్యం. గతానికి భిన్నంగా ఆయన పొందిన గుర్తింపు అద్భుతం. ఎదురులేని నేతగా జనం మదిలో నిలిచిపోయారు. తండ్రిని మించిన తనయుడయ్యారు. ప్రజలు ఆయన్ను ప్రేమించి అక్కున చేర్చుకున్నారు. ప్రేమాభిమానాలు చూపారు. అనురాగ ఆత్మీయతలను పంచారు. తాను ప్రసంగించిన సభల్లో చెప్పిన అంశాలు ప్రత్యేకించి నవరత్నాలు ప్రజల్ని ఆలోచింపజేశాయి. వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, అవ్వాతాతల పింఛన్లు, వై?ఎస్సార్ చేయూత వంటి అంశాలను ఆయన జనంలోకి చొచ్చుకుపోయేలా చేయగలిగారు. జనం కోసం జనం మధ్య జనంతోనే అనే వాటికి సాక్షర రూపంగా నిలవగలిగారు. ఫలితంగా మహానేత వైఎస్సార్‌ను చూసిన కళ్లు జగన్‌ను చూడడం అలవర్చుకున్నాయి. సుదీర్ఘ యాత్రతో ఆయన అందరి వాడయ్యారు.

జనవారధుల్లా కృష్ణా, గోదావరి వంతెనలు

ప్రజా సంకల్పయాత్ర గుంటూరు జిల్లా దాటి కృష్ణమ్మ అంచులకు చేరినప్పుడు నదీతీరాన జన కెరటం ఎగిసిపడింది. కనకదుర్గమ్మ వారధి ప్రజల పదఘట్టనలతో ఊగిపోయిన తీరు, ఆ తర్వాత ఇంద్రకీలాద్రి దిగువన సభ జరిగిన వైనం బెజవాడ చరిత్రలో మరువలేనిది. ఇదేననుకుంటే దానికి మించి ఉభయ గోదావరి జిల్లాల వారధి అయిన గోదావరి వంతెన జనప్రభంజనమైంది. ఉభయ గోదావరి జిల్లాలలో జరిగిన ప్రతీ సభా దేనికదే సాటి అయింది. ఈ సభలకు కులాలు, మతాలు అడ్డుకాలేదు. చిన్నాపెద్దా తేడా లేకుండాపోయాయి. ప్రతి గుండే జగన్నినాదంతో ప్రతిధ్వనించింది.

రొటీన్‌కు భిన్నంగా ప్రసంగం

రాష్ట్ర రాజకీయ యవనికపై వైఎస్ జగన్ తనదైన ముద్ర వేసుకున్నారు. ఆప్యాయతకు, అనురాగానికి, స్నేహానికీ, రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి ప్రతీకగా నిలిచారు. జరిగిన ప్రతి సభలో తనదైన ముద్ర వేసుకున్నారు. అందరిలా మైకు పట్టుకోగానే సోదరీ సోదరులారా అనే దానికి బదులు ఒక చేత్తో మైకు పట్టుకుని మరో చేత్తో టక్ టక్ టక్‌మని మైక్‌తో శబ్దం చేస్తూ.. ఏ ఊరులో సభ జరుగుతుందో ఆ ఊరి పేరు చెప్పడం జగన్ శైలి. ఆ ఊరితో సామీప్యతను, అనుబంధాన్ని తెలియజేసేందుకు ఇది ఉపయోగపడుతుందని గట్టిగా విశ్వసించే జగన్ ఆ పని చేసేవారు. సభ ముగింపులో ఆయన చేసే వినతి ప్రజల్ని ఆకట్టుకునేది. మీ బిడ్డగా వస్తున్న జగన్‌కు అండగా నిలవండి, ఆశీర్వదించండి, తోడుగా ఉండండని ఆయన చేసే వినతి ఎంతో వినయ వినమ్రతలను వ్యక్తం చేసేలా ఉండేది. మరోవైపు.. జగన్ మైకు పట్టుకున్నది మొదలు ముగించే వరకూ సభా ప్రాంగణాలు జగన్నినాదంతో మార్మోగేవి. కాబోయే సీఎం అంటూ యువత కేరింతలు కొట్టేది. అడుగడుగో మా పెద్దకొడుకు అని అవ్వాతాతలు మురిసిపోయేవారు. అన్నా, జగనన్నా, మేమంతా నీ వెంటే అంటూ అక్కచెల్లెమ్మలు జేజేలు పలికేవారు.



జగన్ అనే నేను..

విషయాలపట్ల స్పష్టత, ముక్కుసూటితనంతో ప్రజల మదిని గెలిచారు. హామీలివ్వడం ఎవ్వరైనా చేస్తారు. వాటిని అమలుచేసినప్పుడే ఆ వ్యక్తి జీవితానికి సార్థకత లభిస్తుంది. సమకాలీన రాజకీయ చరిత్రలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ పనిచేశారు. తాను చేసిన హామీలను అమలు చేసి చిరస్మరణీయునిగా నిలిచారు. సరిగ్గా జగన్ కూడా అదే బాటలో నడుస్తున్నారు. నాన్నగారు ఒక అడుగు ముందుకు వేస్తే.. ఆయన కొడుకుగా నేను రెండడుగులు వేస్తానని సగర్వంగా చెబుతూ వచ్చారు. ప్రజా జీవనంలో ఉన్నప్పుడు నిజాయితీ, విశ్వసనీయత ఉండాలని పదేపదే ఉద్బోధించారు. తాను అధికారంలోకి వస్తే.. అది ఫీజు రీయింబర్స్‌మెంట్ అయినా, ఆరోగ్యశ్రీ అయినా, పేదలకు ఇళ్ల నిర్మాణమైనా, మరేదైనా సరే అమలుచేస్తానని చెప్పినప్పుడు, 'జగన్ అనే నేను..' అనే పదాన్ని ఉపయోగించారు. జగన్ నోటి నుంచి ఆ మాట వచ్చినప్పుడల్లా హర్షధ్వానాలతో సభా ప్రాంగణాలు హోరెత్తేవి.

ఆకట్టుకున్న పిట్టకథలు

ఏదైనా ప్రసంగం ఆకట్టుకోవాలంటే స్థానిక సామెతలు, పిట్టకథలు, పోలికలు అత్యంత అవశ్యం. వేయి పదాల్లో చెప్పలేని విషయాన్ని ఒక్క ఫొటోతో చెప్పినట్లే ఒక్క సామెతతో వంద విషయాలను చెప్పవచ్చు. రెయిన్‌గన్లతో కరువును జయించాను అని చంద్రబాబు పదేపదే చెప్పే విషయాన్ని పిట్టలదొర కథతో పోల్చి చెప్పిన తీరు సభికుల్ని విశేషంగా ఆకట్టుకుంది. కట్టె తుపాకీ పేలుతుందా? అనే అర్థం వచ్చేలా ప్రత్యక్ష సాక్షులతో విషయం చెప్పించారు. జగన్ చెప్పిన కొండచిలువ, రైతు కథ.. చంద్రబాబు చెప్పే అబద్ధాలకు, మోసాలకు అద్దంపట్టాయి. తిత్లీ తుపానుపై గోరంత సాయంచేసి కొండంత ప్రచారం చేసుకున్న వైనాన్ని శవాలపై చిల్లర ఏరుకునే సామెతతో పోల్చిన తీరు కూడా సభికుల ప్రశంసలందుకుంది. బీజేపీ, చంద్రబాబు కలిసి నాలుగేళ్లు చిలకా గోరింకల్లా కాపురం చేయడంపై జగన్ చేసిన వ్యాఖ్యలు ప్రజల హర్షామోదాలు పొందాయి. పురాణాలు, ఇతిహాసాల నుంచి తీసుకున్న అనేక అంశాలను ప్రస్తుత పరిస్థితులకు అన్వయిస్తూ చెప్పిన కథలు, సామెతలు జగన్ సభల్లో హైలెట్‌గా చెప్పవచ్చు.

మరుగున పడిన అంశాలెన్నో కావాలిప్పుడు

చరిత్ర మరుగున పడి కనిపించని ఎన్నో విషయాలను జగన్ తెరపైకి తెచ్చారు. బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు ఈ సభలను వారి గొంతుకగా చేశారు. చట్టసభల్లో ప్రాతినిధ్యంలేని వివిధ వర్గాలకు చోటు కల్పిస్తానన్నారు. విస్మరించిన శ్రేణులను గుర్తిస్తానన్నారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు నడిబజార్లో ఖూనీ చేస్తున్న తీరుతో మనస్సు నొచ్చుకుని పాదయాత్ర చేపట్టిన జగన్.. ఆ బజార్లనే బహిరంగ వేదికలుగా మలిచారు. ప్రజల ప్రాతినిధ్యం ఉండేలా పీపుల్స్ అసెంబ్లీలను సృష్టించారు. అసెంబ్లీలో మాదిరి అడుగడుగునా ఆటంకాలు, మైక్ కట్లు లేకుండా తాను చెప్పాలనుకున్నది సూటిగా ప్రజలకే చెప్పి ఏది న్యాయమో, మరేది అన్యాయమో తరచి చూడండంటూ నిర్ణయాన్ని ప్రజలకే వదిలేశారు.

'వడలో, కడు జడిలో
పెను చలిలో తెగనవసి కుములు
మీ బాధలు, మీ గాథలు
అవగాహన నాకవుతాయి!" - శ్రీశ్రీ

ప్రజా సంకల్పయాత్ర 3,648 కి.మీ

ప్రేమ.. ఆప్యాయత.. భరోసా













'నాకు డబ్బు మీద వ్యామోహం లేదు. చరిత్ర సృష్టించాలన్నదే నా లక్ష్యం. ఒకసారి ముఖ్యమంత్రి స్థానంలోకొస్తే ప్రజలకు ఎంతో మంచి చేయాలన్న ఆశయం ఉంది. ఆ మంచి ఎలాంటిదంటే.. నేను చనిపోయిన తర్వాత కూడా ప్రతి ఇంట్లో నాన్న ఫొటో పక్కన నా ఫొటో ఉండాలన్నదే నా తాపత్రయం'.. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నోటి నుంచి వచ్చిన ఈ ఒక్క మాట యావత్ ఆంధ్ర రాష్ట్ర ప్రజల గుండెల్ని సూటిగా తాకింది. నాయకుడంటే ఇలా ఉండాలన్న జనాభిప్రాయం ఇప్పుడు రాష్ట్రం నలుమూలలా వ్యక్తమవుతోంది. ఏ మూలనో చిన్న అనుమానం ఉన్న వారు కూడా ఈ వ్యాఖ్యతో ఆయనపై నిశ్చితాభిప్రాయానికి వచ్చేశారు. అసలు సిసలైన నాయకుడంటే జగనే అని ఘంటాపథంగా చెబుతున్నారు.



ఒకే మాట ఒకే బాట

సాక్షి, అమరావతి : పద్నాలుగు నెలలకు పైగా ప్రజాక్షేత్రంలో ఉన్న వైఎస్ జగన్ అనుక్షణం జనం కష్టసుఖాలే ఆలకించారు. తాడిత పీడిత గుండె గొంతుకై అవినీతి సర్కారును జనబాహుళ్యంలోనే ఎండగట్టారు. ఇందుకూ ఓ నేపథ్యముంది.. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాజ్యాంగ వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. ప్రజావాణి విన్పించే చట్టసభలను మంద బలంతో అధికార పార్టీ హస్తగతం చేసుకుంది. జనం కష్టాలు వినిపించేందుకు ప్రయత్నించిన ప్రతిపక్షం గొంతును అసెంబ్లీ సాక్షిగా నొక్కేసింది. గుండె చెదిరిన సామాన్యుడు నిస్సహాయ స్థితికి చేరాడు. దీంతో దగాపడ్డ వారిని వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు, సర్కార్ అవినీతిని ఎండగట్టేందుకు వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర పేరుతో ప్రజాక్షేత్రంలోకి వెళ్లారు. జనం కన్నీళ్లను దోసిటపట్టిన జననేత ప్రతీ గుండెను హత్తుకున్నారు.

కసి.. కదలిక.. పరిష్కారం!

వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో 2017 నవంబరు 6న పాదయాత్ర మొదలైనప్పుడు జగన్‌లో ఓ కసి కనిపించింది. 'ప్రతీ గడపకూ వెళ్లాలనుంది.. జనం గుండె చప్పుడు వినాలనుంది.. కసిగా ఉన్నాను. ప్రజల కోసమే బతకాలన్న ఆవేశంతో ఉన్నాను' అని జగన్ చెప్పారు. పద్నాలుగు నెలల సుదీర్ఘ పాదయాత్ర అనంతరం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం చేరువలోకొచ్చిన జననేతలో స్పష్టమైన, పరిపూర్ణమైన మార్పు కన్పిస్తోంది. సమస్యలు వినేందుకే వస్తున్నానని చెప్పిన నేత.. ఇప్పుడు ఆ సమస్యల పరిష్కారం కోసం ఏం చెయ్యాలనుకుంటున్నారో చెప్పారు. తరలివచ్చిన ప్రజావెల్లువ సాక్షిగా కన్నీళ్లు తుడిచే పథకాలను ప్రకటించారు. దగాపడ్డ రైతన్నకు ఎక్కడికక్కడే భరోసా ఇస్తూ తానొస్తే ఎలా ఆదుకుంటానో చెప్పారు. పెట్టుబడి సాయం ఎలా ఇస్తానో వివరించారు. అప్పులపాలైన అక్కాచెల్లెమ్మల ఆవేదన విన్న జగన్.. జనం సాక్షిగా భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. సంక్షేమం అందని పేదవాడి గురించే ఏడాది క్రితం జగన్ మాట్లాడేవారు. ఉపాధిలేక ఊరొదిలే యువత ఆవేదనే విపక్ష నేత వాణిలో చూశాం. పాదయాత్రలో ఆ సమస్యకు ఆయన పరిష్కారం చెప్పారు. అధికారంలోకొస్తే ఏటా పోస్టుల భర్తీచేస్తానని, పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలిచ్చేలా చట్టం తెస్తానన్నారు. ఇల్లులేని పేదల సొంతింటి స్వప్నం జగన్ నోటి వెంట వచ్చింది. అభాగ్యుల ఆర్తి తెలుసుకున్న తర్వాత ఆయనిప్పుడు ఆరోగ్యశ్రీని ఎంత విజయవంతంగా అమలుచేయవచ్చో స్పష్టత ఇస్తున్నారు. ప్రతీ సమస్యపై స్పష్టమైన అవగాహనతో సర్కారును నిలదీసే నైజం ఏడాది క్రితం వైఎస్ జగన్‌ది. ఇప్పుడు అధికారంలో కొస్తే ఆ సమస్యలను ఎలా పరిష్కరించాలో స్పష్టంగా చెప్పగలిగే వ్యక్తి జగన్.

విలువలే ప్రాణం.. విశ్వసనీయతే ఆయుధం

'జగన్ ఎన్నో హామీలిచ్చారు. అవన్నీ సాధ్యమా? ఈ మాట అధికారపక్షం కూడా అనలేకపోతోంది'.. పాదయాత్రను నిశితంగా గమనించిన రిటైర్డ్ సీనియర్ అధికారి అనంతరామారావు అన్న మాటలివి. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ అనేకమంది దగ్గర ఇదే ప్రస్తావన తెస్తే వాళ్లు చెప్పిందొకటే.. 'వాళ్ళ నాన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన ప్రతీ మాట నిలబెట్టుకున్నాడు. హామీ ఇవ్వకుండానే ఎన్నో చేశాడు. ఆ రక్తం పంచుకు పుట్టిన బిడ్డపై ఆ మాత్రం నమ్మకముంది'.. అన్న జవాబే వచ్చింది. ఆరంభం నుంచీ ఒంటరిపోరే చేస్తున్న జగన్.. కష్టాలెన్నొచ్చినా రాజకీయ ప్రస్థానంలో విశ్వసనీయతకే ప్రాధాన్యమిచ్చారు. అవకాశవాద రాజకీయాలకు ఎక్కడా తావివ్వలేదు. ప్రత్యేక హోదా ఇస్తామని రాసిచ్చే పార్టీకే కేంద్రంలో మద్దతిస్తామని స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరితోనూ పొత్తే ఉండదన్నారు. మాటకు కట్టుబడే జగన్ నైజం ప్రజలను బాగా ఆకర్షించిందని రాజకీయ వర్గాలూ విశ్లేషిస్తున్నాయి.

చెదరని గుండె.. చలించే మనస్సు

విశాఖ విమానాశ్రయంలో హత్యకు కుట్ర జరిగినా జగన్ నిబ్బరంగా ఉండటాన్ని ప్రజలు గమనించారు. దాన్నో అవకాశంగా తీసుకుని హడావిడి చేసే రాజకీయ స్వభావం లేకపోవడాన్ని జనం హర్షించారు. రక్తసిక్తమైన దుస్తుల్లోనూ మొక్కవోని గుండె ధైర్యంతో పార్టీ కేడర్‌ను ఆవేశానికి గురికాకుండా చేయడం జగన్‌లో చెప్పుకోదగ్గ లక్షణమనేది ప్రజల నుంచి వినిపిస్తున్న మాట. నాలుగున్నరేళ్ల ఈ ప్రతిపక్ష నాయకుడికి అధికార పార్టీ నేతల ఈసడింపులు, దుర్భాషలు, రెచ్చగొట్టే చర్యలు అనేకం ఎదురయ్యాయి. కానీ, ఎక్కడా తొణకలేదు. పాదయాత్రలో జనం మరింత దగ్గరవ్వడానికి ఇదీ ఓ కారణమనేది రాజకీయ వర్గాల నిశ్చితాభిప్రాయం. ప్రజలు ఈ లక్షణాలన్నీ పాదయాత్ర ద్వారా దగ్గర్నుంచి చూడగలిగారు. 'అభిమన్యుడు పద్మవ్యూహాన్ని ఛేదించలేకపోయాడేమోగానీ.. జగన్ మాత్రం చంద్రబాబు కుయుక్తులను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లార'ని ఓ ఐఏఎస్ అధికారి అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ సహా విపక్ష గొంతు నొక్కిన తీరు.. అప్రజాస్వామ్యంగా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన అధికార పార్టీ నైజాన్ని ప్రతీ వ్యక్తి చర్చించే రీతిలో జగన్ జనంలోకి తీసుకెళ్లారు. విమర్శలకు ప్రతివిమర్శలే పరిష్కారమనే ప్రస్తుత రాజకీయ వాతావరణంలో స్థితప్రజ్ఞతతో ఓ నేత జననేతగా గుర్తింపు తెచ్చుకుంటాడని జగన్ నిరూపించారు. గిట్టుబాటు ధరల్లేక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతు పక్షాన ఆయన జరిపిన పోరాటాన్ని.. ప్రత్యేక హోదా కోసం ఎంతకైనా తెగించే మనస్తత్వాన్ని ఈ సందర్భంగా ఉదహరిస్తున్నారు. ఇవన్నీ ప్రజల్లో ఆయనను మంచి నేతగా గుర్తింపు తీసుకొచ్చాయని చెబుతున్నారు.

- నిఖార్సయిన నేత.. నిలువెత్తు నిబద్ధత
- కన్నీళ్లు తెలిసిన నేత.. పరిష్కారం చూపే పరిణతి
- కసితో మొదలై.. కన్నీళ్లు తుడిచే శక్తయి..
- విలువల మాట.. విశ్వసనీయతే బాట
- పాదయాత్ర తర్వాత జనవాక్కు ఇదే..

వ్యక్తి.. శక్తి.. వ్యవస్థ



జగనే తమ నాయకుడని బలంగా చెబుతున్న జనం ఆయన రాజకీయ విస్తరణను.. ప్రజలపట్ల ఆయనకున్న నిబద్ధతను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. 'ఓ వ్యక్తిగా రాజకీయాల్లోకొచ్చాడు.. వ్యక్తిత్వంతోనే పార్టీని శక్తిగా మార్చాడు.. పాదయాత్ర ద్వారా ఓ వ్యవస్థనే ఏర్పాటుచేశాడు. జగన్ అంటేనే జనమన్న నమ్మకం కల్గించాడు. ఏడాదికిపైగా ఎండలో మాడిపోతూనే ప్రజలను నవ్వుతూ పలకరించాడు. వర్షంలో తడిసి ముద్దవుతూనే పేదల బతుకు చిత్రాన్ని దగ్గరుండి పరిశీలించాడు. వణికించే చలిలోనూ ప్రజల గుండె చప్పుడు వినేందుకు వడివడిగా అడుగులేశాడు. జనం లోగిళ్ల ముందే జగన్ సంక్రాంతి చేసుకున్నాడు. ప్రజల ఆనందపు వెలుగుల్లోనే దీపావళి జరుపుకున్నాడు. తెలుగు ప్రజల ఆత్మీయతల మధ్యే తెలుగు సంవత్సర వేడుకల్లో పాల్గొన్నాడు. ఇలా పండగేదైనా అన్నీ ప్రజాక్షేత్రంలోనే. ఇవన్నీ జగన్ తమ నాయకుడనే భావాన్ని ప్రజల్లో మరింతగా ముందుకు తీసుకెళ్లాయి. జగన్ పుట్టినరోజు ప్రజల సమక్షంలో నిరాడంబరంగా జరిగింది. అందుకే జనం.. రావాలి జగన్–కావాలి జగన్ అని అంటున్నారు.

అలసటే ఎరుగని నేత


జగన్‌తో నారాయణ

సాక్షి, అమరావతి : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సార్ దగ్గర పనిచేయడం, వేల కిలోమీటర్ల పాదయాత్రలో ఆయన వెన్నంటే ఉండడం, నేను పూర్వజన్మలో చేసుకున్న సుకృతమే. ఆయనలో ఉన్నంత సహనం, దయాగుణం నేనెక్కడా చూడలేదు. పాదయాత్రలో కానీ ఇతర కార్యక్రమాల్లో కానీ ఎన్ని వేలమంది వచ్చి కలుస్తున్నా.. ఎన్ని కార్యక్రమాల్లో బిజీగా ఉన్నా ఏనాడూ అలసట, చిరాకు, కోపం అనేది ఆయనలో ఎప్పుడూ కనిపించలేదు. పైపెచ్చు నేను ఎప్పుడైనా మా స్టాఫ్‌పట్ల కొంచెం చిరాకు పడితే సార్ ఊరుకునే వారు కాదు. 'అలా కోపం మంచిది కాదు.. ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి. ప్రశాంతంగా ఉంటే అన్నీ చక్కగా, సాఫీగా జరుగుతాయి'.. అని చెబుతుండే వారు. ఇంటిదగ్గర ఉన్నా.. పాదయాత్రలో ఉన్నా రాత్రి పదకొండు గంటలకు పడుకుని ఉదయం నాలుగు.. నాలుగున్నరకల్లా నిద్రలేవడం సార్‌కు అలవాటు. సమయపాలనలో చాలా ఖచ్చితంగా ఉంటారు. క్రమశిక్షణ పాటిస్తారు.

వ్యాయామం.. మిత ఆహారం

ఉదయం లేచాక టీ తాగి ఒక గంటపాటు వ్యాయామం చేస్తారు. అనంతరం స్నానంచేసి వచ్చాక అరగంటపాటు ప్రార్థన చేస్తారు. తర్వాత ఒక గ్లాసు పళ్లరసం తీసుకుంటారు. అంతే.. టిఫిన్ వంటివి ఏవీ చేయరు. ఆ వెంటనే పాదయాత్ర ప్రారంభిస్తారు. మధ్యాహ్నం శిబిరం వచ్చేవరకు ఏమీ పుచ్చుకోకుండానే నడుస్తారు. ఆ తర్వాత ఆపిల్ లేదా వేరే ఏదైనా పండు ఒకటి తీసుకుని మజ్జిగ తాగుతారు. అనంతరం అరగంటసేపు విశ్రాంతి తీసుకుంటారు. ఆ తరువాత పార్టీ వారితో మాట్లాడి మళ్లీ పాదయాత్రకు రెడీ అవుతారు. ప్రజా సమస్యల గురించి నిత్యం పార్టీ నాయకులు, ఇతరులతో చర్చిస్తూ ఉంటారు. ఏదైనా ఒక విషయం మీద లోతుగా సమాచారం మొత్తం తెప్పించి చదివేవారు. ఏవైనా సందేహాలుంటే మళ్లీ మాతో ఫోన్లు చేయించి వారితో మాట్లాడేవారు. రాత్రి శిబిరానికి చేరుకునే వరకూ మళ్లీ ఎలాంటి ఆహారమూ తీసుకోరు. ఒక్కోసారి మధ్యాహ్నం పూట కూడా ఆగకుండా ఏకధాటిగా రాత్రి శిబిరం వరకు నడుస్తారు. ఇక రాత్రి ఆహారం కింద కేవలం రెండు రకాల కాయగూరలతో చేసిన కర్రీ, ఒక పుల్కా, తీసుకుంటారు. మాంసాహారం అసలు ముట్టుకోరు.

సొంత మనిషిలా చూసుకుంటారు

గతంలో పోలవరం ప్రాజెక్టు వద్దకు పాదయాత్రగా వెళ్లినప్పుడు నేనూ ఆయనతో పాటు నడిచాను. కానీ, ఈసారి వద్దన్నారు. వయసు మీదపడ్డాక ఇప్పుడెందుకు నడుస్తావ్ అని అన్నారు. పాదయాత్ర జరుగుతున్న సందర్భంలో రెండుసార్లు నేను అస్వస్థతకు గురైతే వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. ఇందులో ఒకసారి హైదరాబాద్‌కు విమానంలో పంపించారు. 'నారాయణ నాకు కావల్సిన వ్యక్తి.. ఆయనకు ఏ ఇబ్బంది రాకూడదు. అన్నీ దగ్గరుండి చూసుకోండి' అని ఆస్పత్రి వారికి చెప్పి మరీ వైద్యం చేయించారు. ఇంత జాగ్రత్తగా ఆయన తన సహాయకులను చూసుకుంటారు. దాదాపుగా 36 ఏళ్లుగా ఆ కుటుంబంలోనే నేను పనిచేస్తున్నాను. పదహారేళ్లుగా జగన్ సార్‌తో ఉంటున్నాను. నన్ను ఏనాడూ ఒక ఉద్యోగిగా చూడలేదు. ఇంటిలోని సొంత మనిషిగా చూసుకుంటున్నారు.

ఆ పాదయాత్ర మిస్సయినా..

గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సార్ దగ్గర పనిచేస్తూ ఆయన పాదయాత్ర ప్రారంభమయ్యే సమయానికి జగన్ సార్ దగ్గరకు వచ్చేశాను. అప్పుడు పాల్గొనలేకపోయినా ఈ పాదయాత్రలో నేను సార్‌తో పాటు ఉండడం ఎంతో ఆనందంగా ఉంది. కానీ, ఈరోజే (మంగళవారం) ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాను. ఇప్పుడు యాత్ర ముగింపు సమయంలో నేను లేకపోవడం చాలా బాధగా ఉంది. విశాఖలో సార్‌పై కత్తితో దాడి జరిగినప్పుడు నేను చాలా భయపడ్డా.

– నారాయణ (వైఎస్ జగన్ వ్యక్తిగత సహాయకుడు)





పేదోడికి ధీమా.. అందరికీ భరోసా

అన్ని వర్గాలకు అనువైన హామీలు

ప్రజల కష్టాలను కళ్లారా చూసి ఈ హామీలు ఇచ్చాను. వీటిని నేరవేర్చలేక పోతే తప్పకుంటాను.
– వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: 'చేయగలిగినవే చేస్తాను.. చేసేవే చెబుతాను' ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సందర్భంలోనూ అనేమాటిది. ఏడాదికిపైగా సాగిన ప్రజాసంకల్ప యాత్రలో ఆయన ప్రజల కష్టాలెన్నో తెలుసుకున్నారు. వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించే ప్రయత్నం చేశారు. జనామోదం పొందిన నవరత్నాలను ప్రతి గడపకు తీసుకెళ్లి ప్రజల్లో భవిష్యత్ పట్ల ఆశను కల్పించారు. వైఎస్ జగన్ అధికారంలోకి వస్తే తమ బతుకులు మారతాయనే భరోసానిచ్చారు. ఆయన అధికారంలోకొస్తే నవరత్నాల రూపంలో ప్రతి ఇంటికీ ఏడాదికి రూ.లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు ప్రయోజనం కలుగుతుందనే నమ్మకం వచ్చింది. టీడీపీ నాలుగున్నరేళ్ల పాలనలో బక్కచిక్కి శల్యమైన రైతుల కన్నీటి కథలు.. నిరుద్యోగుల వెతలు... అక్కచెల్లెమ్మల కన్నీటి గాథలు ప్రతిపక్ష నేతను కదిలించాయి. బతుకు భరోసా లేని అవ్వాతాతలు, ఆరోగ్యశ్రీ వర్తించక ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న అనేకమంది వైఎస్ జగన్‌ను కలుసుకుని తమ గోడు వెల్లబోసుకున్నారు. కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులు ఒకరేమిటి మార్పు కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఒక్కరూ ప్రతిపక్ష నేత అడుగులో అడుగులేశారు.

అధ:పాతాళంలో అభివృద్ధి

రాష్ట్రం ఈ నాలుగున్నరేళ్లలో అభివృద్ధిలో అధ:పాతాళంలో నిలిచింది. ఏ ఒక్క వర్గమూ టీడీపీ పాలనలో సంతోషంగా లేదు. రాజధానికని ఏడాదికి మూడు పంటలు పండే భూములను రైతుల నుంచి బలవంతంగా లాక్కోవడం దగ్గర నుంచి రైతు రుణాల మాఫీ వరకు, విద్యార్థులకు ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం నుంచి నిరుద్యోగులకు భృతి అందివ్వకపోవడం వరకు ఎక్కడా ఆయా వర్గాల అభివృద్ధి జాడే లేదు. రాజధానిలో సింగపూర్ నిర్మాణాలని ఒకసారి, జపాన్ నిర్మాణాలని మరోసారి ప్రజలను మోసం చేయడం, వారికి రోజుకో సినిమా చూపడం తప్ప శాశ్వత భవనాలకు ఒక్క ఇటుకా పడలేదు. డ్వాక్రా రుణాలను మాఫీ చేయకుండా మహిళలను నిండా ముంచారు. అలాగే వాడవాడలా బెల్టుషాపులకు గేట్లు ఎత్తి కుటుంబాలను చిన్నాభిన్నం చేశారు. ఇలా ఎవరికీ సంతోషం లేకుండా, అభివృద్ధి అనేది లేకుండా టీడీపీ పాలన సాగింది.

అభివృద్ధికి అసలైన నిర్వచనం ఇచ్చిన ప్రతిపక్ష నేత

టీడీపీ పాలనలో అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిన అన్ని వర్గాలను ఆదుకోవడానికి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్న పథకాలు వారికి భవిష్యత్ పట్ల భరోసాను కల్పించాయి. చిన్నారులను బడికి పంపించే తల్లుల కోసం ప్రకటించిన అమ్మఒడి పథకంతో చిన్నారులంతా బడిబాట పడతారు. అదేవిధంగా చదువుకునేవారికి ఎంత ఫీజైనా చెల్లిస్తామంటూ ప్రకటించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం విద్యార్థుల ఉన్నతవిద్య ఆశలను సాకారం చేస్తుంది. ఉన్నత విద్య పూర్తి చేసుకోగానే ప్రతి ఏటా ఉద్యోగాల క్యాలెండర్ ప్రకటించడంతోపాటు ఎప్పటికప్పుడు ఖాళీ పోస్టులను భర్తీ చేయడం వల్ల నిరుద్యోగ సమస్యను రాష్ట్రంలో పూర్తిగా నిర్మూలించవచ్చు. పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు ఇవ్వడం వల్ల వలసలు తగ్గిపోతాయి. ఇక తాగునీరు అందక, పంటలు పండక, గిట్టుబాటు ధరలు లభించక తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్న రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కాంతిరేఖగా నిలుస్తుంది. డ్వాక్రా అక్కచెల్లెమ్మల కోసం ప్రకటించిన వైఎస్సార్ ఆసరా ద్వారా మహిళల అభివృద్ధి సాధ్యమవుతుంది. అధికారంలోకి రావడానికి కాకుండా ప్రజాసంకల్పయాత్రలో ఎంతోమంది బాధితుల సమస్యలు విన్నాక.. వారి బాధలు చూశాక.. ఎంతో అధ్యయనం చేశాక ఆయా వర్గాల అభివృద్ధికి ఈ పథకాలను ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ఈ హామీలు నెరవేర్చలేకపోతే ఏకంగా పదవి నుంచే తప్పుకుంటానని వైఎస్ జగన్ చెప్పడం ఈ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేసి చూపాలనే దృఢసంకల్పానికి నిదర్శనం.


నవరత్నాలతో పాటు వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో మరికొన్ని..

- మూతపడ్డ సహకార చక్కెర కర్మాగారాలను తెరిపిస్తారు.
- అధికారంలోకి రాగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం.
- ముస్లిం మైనార్టీలను ఆదుకునేందుకు సబ్‌ప్లాన్ ఏర్పాటు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, భూముల పంపిణీ.
- దాదాపు అన్ని సామాజికవర్గాలకు ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటు.
- ఏటా మెగా డీఎస్సీ నిర్వహణతోపాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టుల భర్తీ
- ప్రతి ఏటా ఉద్యోగాల భర్తీకి క్యాలెండర్
- ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటు. పది మందికి ఉద్యోగాలు.
- ప్రైవేటు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చట్టం.
- దుల్హన్ పథకం కింద ఇచ్చే రూ.50 వేల మొత్తం రూ.లక్షకు పెంపు.
- ఇమామ్‌లకు ప్రతినెలా రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేలు గౌరవ వేతనం.
- గ్రానైట్ పరిశ్రమను ఆదుకునేలా విద్యుత్ ఛార్జీలను యూనిట్‌కు రూ.7.35 నుంచి రూ.3.75కు తగ్గింపు.
- నాయీబ్రాహ్మణులకు 250 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్. ప్రధాన ఆలయాల్లో కనీస వేతనంపై పనిచేసే అవకాశంతోపాటు ఎమ్మెల్సీ స్థానం.
- గిరిజనులకు.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు.
- మత్స్యకారులు బోట్లకు వాడే డీజిల్‌పై 50 శాతం సబ్సిడీ, వేట సమయంలో చనిపోతే మూడు నెలల్లో రూ. 10 లక్షలు అందేలా చర్యలు, ప్రత్యేక కార్పొరేషన్.





	వైఎస్సార్ ఇడుపులపాయ	కర్నూలు చాగలమర్రి	అనంతపురం గుంతకల్లు నియోజకవర్గం	చిత్తూరు జిల్లా ఎద్దులవారికోట	నెల్లూరు పుంతాల	ప్రకాశం కొత్తపేట	గుంటూరు సుబ్బారావుపురం	కృష్ణా, కనకదుర్గమ్మ వారధి	ప.గో. పెదవుద్దగాది	తూ.గో. రోడ్డు కం రైల్వే వంతెన	విశాఖ గన్నవరం మెట్ట	విజయనగరం కొత్తవలస	శ్రీకాకుళం కెల్ల
నడిచిన రోజులు	341	7	18	20	23	20	21	26	24	27	50	32	36	37 (నేటితో)
నడిచిన దూరం(కి.మీ)	3,648	93.8	263	279.4	291.4	266.5	278.1	281	239	316.9	412	277.1	311.5	338.3
నియోజకవర్గాలు	134	5	7	9	10	9	9	12	12	13	17	12	9	10
మండలాలు	231	6	14	15	18	14	18	16	18	24	32	16	18	22
గ్రామాలు	2,516	41	107	155	256	165	172	218	192	210	304	180	224	292
బహిరంగ సభలు	124	5	8	10	8	9	9	11	10	11	15	9	9	10
ఆత్మీయ సదస్సులు	55	3	6	4	9	6	2	3	5	5	2	2	2	6
పట్టణాలు+ నగరాలు	62	2	1	3	1	2	5	9	6	8	10	4	5	6



పాదయాత్రతో మారిన ప్రజా నాడి

సాక్షి, అమరావతి: ప్రజల కష్టనష్టాలు తెలుసుకుంటూ.. వారిలో ధైర్యం నింపుతూ.. భవిష్యత్‌పై భరోసా ఇస్తూ వేలాది కిలోమీటర్ల మేర వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సాగించిన ప్రజా సంకల్ప యాత్రతో జనం నాడి మారిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తమ గోడు వినేందుకు వచ్చిన జగన్ వెంట నిరుపేదలు, అణగారిన వర్గాలు, సామాన్య, మధ్యతరగతి ప్రజలతో పాటు యువత, ఉద్యోగులు ఇలా ఒకరేమిటి.. అన్ని వర్గాలు పాదం కదపడమే ఇందుకు నిదర్శనమని వారు చెబుతున్నారు. జగన్ అడుగుపెట్టిన ప్రతి ప్రాంతానికి తండోపతండాలుగా తరలివచ్చి తమ అభిమానం చాటుకోవడాన్ని వారు ఉదహరిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి జగన్‌తోనే సాధ్యమని వారు భావిస్తుండటం వల్లే ఈ ప్రజాదారణని పేర్కొంటున్నారు. వైఎస్సార్ అస్తమయం, రాష్ట్ర విభజన తర్వాత సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న ప్రజలకు జగన్ ఆశాదీపంలా కనిపించారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీని ఎదిరించి బయటకు వచ్చి వైఎస్సార్‌సీపీని స్థాపించినప్పుడు.. కాంగ్రెస్, టీడీపీలు కుమ్మక్కై అక్రమ కేసులు బనాయించి జైలు పాలుచేసినప్పుడు కూడా జనం ఆయన్ని వదల్లేదన్నారు. అయితే అనుభవంతో పాటు రుణమాఫీ వంటి 600 హామీలతో గత ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చారని.. లేకపోతే 2014లోనే జగన్ సీఎం అయ్యేవారని గుర్తు చేస్తున్నారు. ఈ నాలుగున్నరేళ్లలో చంద్రబాబు ఒక్క హామీ సరిగ్గా నెరవేర్చకపోగా.. అవినీతి, అక్రమాలు పెరిగిపోవడం, జన్మభూమి కమిటీల లంచావతారం.. టీడీపీ నేతల అరాచకాలతో ప్రజల్లో చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెరిగిందని వివరించారు. ఈ సమయంలో జగన్ పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ.. వాటిపై సభల్లో ప్రభుత్వాన్ని నిలదీయడం ద్వారా అశేష అభిమానాన్ని చూరగొన్నారని వివరించారు. పాదయాత్రలో ఉన్నప్పటికీ తన పార్టీ నాయకులకు, కేడర్‌కు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ పోరాటాలు చేయించడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేస్తున్నారు. ఇవన్నీ గమనిస్తున్న ప్రజలకు ఒక స్పష్టత వచ్చిందని.. వచ్చే ఎన్నికల్లో ఈ దుర్మార్గపు ప్రభుత్వానికి చరమ గీతం పాడాలనే నిర్ణయానికి వారు వచ్చారన్నారు. ధన బలం, కండబలం, అధికార బలంతో పాటు పోల్ మేనేజ్‌మెంట్ ద్వారా తిమ్మిని బమ్మిని చేయొచ్చనుకుంటున్న టీడీపీ నేతల ఆటలు సాగే పరిస్థితి కనపడం లేదని అభిప్రాయపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొంటున్నారు.

ప్రజా సంకల్పయాత్ర 3,648 కి.మీ

ప్రేమ.. ఆప్యాయత.. భరోసా























'నాకు డబ్బు మీద వ్యామోహం లేదు. చరిత్ర సృష్టించాలన్నదే నా లక్ష్యం. ఒకసారి ముఖ్యమంత్రి స్థానంలోకొస్తే ప్రజలకు ఎంతో మంచి చేయాలన్న ఆశయం ఉంది. ఆ మంచి ఎలాంటిదంటే.. నేను చనిపోయిన తర్వాత కూడా ప్రతి ఇంట్లో నాన్న ఫొటో పక్కన నా ఫొటో ఉండాలన్నదే నా తాపత్రయం'.. ..ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నోటి నుంచి వచ్చిన ఈ ఒక్క మాట యావత్ ఆంధ్ర రాష్ట్ర ప్రజల గుండెల్ని సూటిగా తాకింది. నాయకుడంటే ఇలా ఉండాలన్న జనాభిప్రాయం ఇప్పుడు రాష్ట్రం నలుమూలలా వ్యక్తమవుతోంది. ఏ మూలనో చిన్న అనుమానం ఉన్న వారు కూడా ఈ వ్యాఖ్యతో ఆయనపై నిశ్చితాభిప్రాయానికి వచ్చేశారు. అసలు సిసలైన నాయకుడంటే జగనే అని ఘంటాపథంగా చెబుతున్నారు.

ఒకే మాట ఒకే బాట





సాక్షి, అమరావతి : పద్నాలుగు నెలలకు పైగా ప్రజాక్షేత్రంలో ఉన్న వైఎస్ జగన్ అనుక్షణం జనం కష్టసుఖాలే ఆలకించారు. తాడిత పీడిత గుండె గొంతుకై అవినీతి సర్కారును జనబాహుళ్యంలోనే ఎండగట్టారు. ఇందుకూ ఓ నేపథ్యముంది.. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాజ్యాంగ వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. ప్రజావాణి విన్పించే చట్టసభలను మంద బలంతో అధికార పార్టీ హస్తగతం చేసుకుంది. జనం కష్టాలు వినిపించేందుకు ప్రయత్నించిన ప్రతిపక్షం గొంతును అసెంబ్లీ సాక్షిగా నొక్కేసింది. గుండె చెదిరిన సామాన్యుడు నిస్సహాయ స్థితికి చేరాడు. దీంతో దగాపడ్డ వారిని వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు, సర్కార్ అవినీతిని ఎండగట్టేందుకు వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర పేరుతో ప్రజాక్షేత్రంలోకి వెళ్లారు. జనం కన్నీళ్లను దోసిటపట్టిన జననేత ప్రతీ గుండెను హత్తుకున్నారు.

కసి.. కదలిక.. పరిష్కారం!

వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో 2017 నవంబరు 6న పాదయాత్ర మొదలైనప్పుడు జగన్‌లో ఓ కసి కనిపించింది. 'ప్రతీ గడపకూ వెళ్లాలనుంది.. జనం గుండె చప్పుడు వినాలనుంది.. కసిగా ఉన్నాను. ప్రజల కోసమే బతకాలన్న ఆవేశంతో ఉన్నాను' అని జగన్ చెప్పారు. పద్నాలుగు నెలల సుదీర్ఘ పాదయాత్ర అనంతరం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం చేరువలోకొచ్చిన జననేతలో స్పష్టమైన, పరిపూర్ణమైన మార్పు కన్పిస్తోంది. సమస్యలు వినేందుకే వస్తున్నానని చెప్పిన నేత.. ఇప్పుడు ఆ సమస్యల పరిష్కారం కోసం ఏం చెయ్యాలనుకుంటున్నారో చెప్పారు. తరలివచ్చిన ప్రజావెల్లువ సాక్షిగా కన్నీళ్లు తుడిచే పథకాలను ప్రకటించారు. దగాపడ్డ రైతన్నకు ఎక్కడికక్కడే భరోసా ఇస్తూ తానొస్తే ఎలా ఆదుకుంటానో చెప్పారు. పెట్టుబడి సాయం ఎలా ఇస్తానో వివరించారు. అప్పులపాలైన అక్కాచెల్లెమ్మల ఆవేదన విన్న జగన్.. జనం సాక్షిగా భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. సంక్షేమం అందని పేదవాడి గురించే ఏడాది క్రితం జగన్ మాట్లాడేవారు. ఉపాధిలేక ఊరొదిలే యువత ఆవేదనే విపక్ష నేత వాణిలో చూశాం. పాదయాత్రలో ఆ సమస్యకు ఆయన పరిష్కారం చెప్పారు. అధికారంలోకొస్తే ఏటా పోస్టుల భర్తీచేస్తానని, పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలిచ్చేలా చట్టం తెస్తానన్నారు. ఇల్లులేని పేదల సొంతింటి స్వప్నం జగన్ నోటి వెంట వచ్చింది. అభాగ్యుల ఆర్తి తెలుసుకున్న తర్వాత ఆయనిప్పుడు ఆరోగ్యశ్రీని ఎంత విజయవంతంగా అమలుచేయవచ్చో స్పష్టత ఇస్తున్నారు. ప్రతీ సమస్యపై స్పష్టమైన అవగాహనతో సర్కారును నిలదీసే నైజం ఏడాది క్రితం వైఎస్ జగన్‌ది. ఇప్పుడు అధికారంలోకొస్తే ఆ సమస్యలను ఎలా పరిష్కరించాలో స్పష్టంగా చెప్పగలిగే వ్యక్తి జగన్.

విలువలే ప్రాణం.. విశ్వసనీయతే ఆయుధం

'జగన్ ఎన్నో హామీలిచ్చారు. అవన్నీ సాధ్యమా? ఈ మాట అధికారపక్షం కూడా అనలేకపోతోంది'.. పాదయాత్రను నిశితంగా గమనించిన రిటైర్డ్ సీనియర్ అధికారి అనంతరామారావు అన్న మాటలివి. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ అనేకమంది దగ్గర ఇదే ప్రస్తావన తెస్తే వాళ్లు చెప్పిందొకటే.. 'వాళ్ళ నాన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన ప్రతీ మాట నిలబెట్టుకున్నాడు. హామీ ఇవ్వకుండానే ఎన్నో చేశాడు. ఆ రక్తం పంచుకు పుట్టిన బిడ్డపై ఆ మాత్రం నమ్మకముంది'.. అన్న జవాబే వచ్చింది. ఆరంభం నుంచీ ఒంటరిపోరే చేస్తున్న జగన్.. కష్టాలెన్నొచ్చినా రాజకీయ ప్రస్థానంలో విశ్వసనీయతకే ప్రాధాన్యమిచ్చారు. అవకాశవాద రాజకీయాలకు ఎక్కడా తావివ్వలేదు. ప్రత్యేక హోదా ఇస్తామని రాసిచ్చే పార్టీకే కేంద్రంలో మద్దతిస్తామని స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరితోనూ పొత్తే ఉండదన్నారు. మాటకు కట్టుబడే జగన్ నైజం ప్రజలను బాగా ఆకర్షించిందని రాజకీయ వర్గాలూ విశ్లేషిస్తున్నాయి.

చెదరని గుండె.. చలించే మనస్సు

విశాఖ విమానాశ్రయంలో హత్యకు కుట్ర జరిగినా జగన్ నిబ్బరంగా ఉండటాన్ని ప్రజలు గమనించారు. దాన్నో అవకాశంగా తీసుకుని హడావిడి చేసే రాజకీయ స్వభావం లేకపోవడాన్ని జనం హర్షించారు. రక్తసిక్తమైన దుస్తుల్లోనూ మొక్కవోని గుండె ధైర్యంతో పార్టీ కేడర్‌ను ఆవేశానికి గురికాకుండా చేయడం జగన్‌లో చెప్పుకోదగ్గ లక్షణమనేది ప్రజల నుంచి వినిపిస్తున్న మాట. నాలుగున్నరేళ్ల ఈ ప్రతిపక్ష నాయకుడికి అధికార పార్టీ నేతల ఈసడింపులు, దుర్భాషలు, రెచ్చగొట్టే చర్యలు అనేకం ఎదురయ్యాయి. కానీ, ఎక్కడా తొణకలేదు. పాదయాత్రలో జనం మరింత దగ్గరవ్వడానికి ఇదీ ఓ కారణమనేది రాజకీయ వర్గాల నిశ్చితాభిప్రాయం. ప్రజలు ఈ లక్షణాలన్నీ పాదయాత్ర ద్వారా దగ్గర్నుంచి చూడగలిగారు. 'అభిమన్యుడు పద్మవ్యూహాన్ని ఛేదించలేకపోయాడే మోగానీ.. జగన్ మాత్రం చంద్రబాబు కుయుక్తులను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లార'ని ఓ ఐఏఎస్ అధికారి అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ సహా విపక్ష గొంతు నొక్కిన తీరు.. అప్రజాస్వామ్యంగా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన అధికార పార్టీ నైజాన్ని ప్రతీ వ్యక్తి చర్చించే రీతిలో జగన్ జనంలోకి తీసుకెళ్లారు. విమర్శలకు ప్రతివిమర్శలే పరిష్కారమనే ప్రస్తుత రాజకీయ వాతావరణంలో స్థితప్రజ్ఞతతో ఓ నేత జననేతగా గుర్తింపు తెచ్చుకుంటాడని జగన్ నిరూపించారు. గిట్టుబాటు ధరల్లేక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతు పక్షాన ఆయన జరిపిన పోరాటాన్ని.. ప్రత్యేక హోదా కోసం ఎంతకైనా తెగించే మనస్తత్వాన్ని ఈ సందర్భంగా ఉదహరిస్తున్నారు. ఇవన్నీ ప్రజల్లో ఆయనను మంచి నేతగా గుర్తింపు తీసుకొచ్చాయని చెబుతున్నారు.

- నిఖార్సయిన నేత.. నిలువెత్తు నిబద్ధత
- కన్నీళ్లు తెలిసిన నేత.. పరిష్కారం చూపే పరిణతి
- కసితో మొదలై.. కన్నీళ్లు తుడిచే శక్తయి..
- విలువల మాట.. విశ్వసనీయతే బాట
- పాదయాత్ర తర్వాత జనవాక్కు ఇదే..

వ్యక్తి.. శక్తి.. వ్యవస్థ



జగనే తమ నాయకుడని బలంగా చెబుతున్న జనం ఆయన రాజకీయ విస్తరణను.. ప్రజలపట్ల ఆయనకున్న నిబద్ధతను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. 'ఓ వ్యక్తిగా రాజకీయాల్లోకొచ్చాడు.. వ్యక్తిత్వంతోనే పార్టీని శక్తిగా మార్చాడు.. పాదయాత్ర ద్వారా ఓ వ్యవస్థనే ఏర్పాటుచేశాడు. జగన్ అంటేనే జనమన్న నమ్మకం కల్గించాడు. ఏడాదికిపైగా ఎండలో మాడిపోతూనే ప్రజలను నవ్వుతూ పలకరించాడు. వర్షంలో తడిసి ముద్దవుతూనే పేదల బతుకు చిత్రాన్ని దగ్గరుండి పరిశీలించాడు. వణికించే చలిలోనూ ప్రజల గుండె చప్పుడు వినేందుకు వడివడిగా అడుగులేశాడు. జనం లోగిళ్ల ముందే జగన్ సంక్రాంతి చేసుకున్నాడు. ప్రజల ఆనందపు వెలుగుల్లోనే దీపావళి జరుపుకున్నాడు. తెలుగు ప్రజల ఆత్మీయతల మధ్యే తెలుగు సంవత్సర వేడుకల్లో పాల్గొన్నాడు. ఇలా పండగేదైనా అన్నీ ప్రజాక్షేత్రంలోనే. ఇవన్నీ జగన్ తమ నాయకుడనే భావాన్ని ప్రజల్లో మరింతగా ముందుకు తీసుకెళ్లాయి. జగన్ పుట్టినరోజు ప్రజల సమక్షంలో నిరాడంబరంగా జరిగింది. అందుకే జనం.. రావాలి జగన్–కావాలి జగన్ అని అంటున్నారు.

అలసటే ఎరుగని నేత



జగన్‌తో నారాయణ

సాక్షి, అమరావతి : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సార్ దగ్గర పనిచేయడం, వేల కిలోమీటర్ల పాదయాత్రలో ఆయన వెన్నంటే ఉండడం, నేను పూర్వజన్మలో చేసుకున్న సుకృతమే. ఆయనలో ఉన్నంత సహనం, దయాగుణం నేనెక్కడా చూడలేదు. పాదయాత్రలో కానీ ఇతర కార్యక్రమాల్లో కానీ ఎన్ని వేలమంది వచ్చి కలుస్తున్నా.. ఎన్ని కార్యక్రమాల్లో బిజీగా ఉన్నా ఏనాడూ అలసట, చిరాకు, కోపం అనేది ఆయనలో ఎప్పుడూ కనిపించలేదు. పైపెచ్చు నేను ఎప్పుడైనా మా స్టాఫ్‌పట్ల కొంచెం చిరాకు పడితే సార్ ఊరుకునే వారు కాదు. 'అలా కోపం మంచిది కాదు.. ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి. ప్రశాంతంగా ఉంటే అన్నీ చక్కగా, సాఫీగా జరుగుతాయి'.. అని చెబుతుండే వారు. ఇంటిదగ్గర ఉన్నా.. పాదయాత్రలో ఉన్నా రాత్రి పదకొండు గంటలకు పడుకుని ఉదయం నాలుగు.. నాలుగున్నరకల్లా నిద్రలేవడం సార్‌కు అలవాటు. సమయపాలనలో చాలా ఖచ్చితంగా ఉంటారు. క్రమశిక్షణ పాటిస్తారు.

వ్యాయామం.. మిత ఆహారం

ఉదయం లేచాక టీ తాగి ఒక గంటపాటు వ్యాయామం చేస్తారు. అనంతరం స్నానంచేసి వచ్చాక అరగంటపాటు ప్రార్థన చేస్తారు. తర్వాత ఒక గ్లాసు పళ్లరసం తీసుకుంటారు. అంతే.. టిఫిన్ వంటివి ఏవీ చేయరు. ఆ వెంటనే పాదయాత్ర ప్రారంభిస్తారు. మధ్యాహ్నం శిబిరం వచ్చేవరకు ఏమీ పుచ్చుకోకుండానే నడుస్తారు. ఆ తర్వాత ఆపిల్ లేదా వేరే ఏదైనా పండు ఒకటి తీసుకుని మజ్జిగ తాగుతారు. అనంతరం అరగంటసేపు విశ్రాంతి తీసుకుంటారు. ఆ తరువాత పార్టీ వారితో మాట్లాడి మళ్లీ పాదయాత్రకు రెడీ అవుతారు. ప్రజా సమస్యల గురించి నిత్యం పార్టీ నాయకులు, ఇతరులతో చర్చిస్తూ ఉంటారు. ఏదైనా ఒక విషయం మీద లోతుగా సమాచారం మొత్తం తెప్పించి చదివేవారు. ఏవైనా సందేహాలుంటే మళ్లీ మాతో ఫోన్లు చేయించి వారితో మాట్లాడేవారు. రాత్రి శిబిరానికి చేరుకునే వరకూ మళ్లీ ఎలాంటి ఆహారమూ తీసుకోరు. ఒక్కోసారి మధ్యాహ్నం పూట కూడా ఆగకుండా ఏకధాటిగా రాత్రి శిబిరం వరకు నడుస్తారు. ఇక రాత్రి ఆహారం కింద కేవలం రెండు రకాల కాయగూరలతో చేసిన కర్రీ, ఒక పుల్కా, తీసుకుంటారు. మాంసాహారం అసలు ముట్టుకోరు.

సొంత మనిషిలా చూసుకుంటారు

గతంలో పోలవరం ప్రాజెక్టు వద్దకు పాదయాత్రగా వెళ్లినప్పుడు నేనూ ఆయనతో పాటు నడిచాను. కానీ, ఈసారి వద్దన్నారు. వయసు మీదపడ్డాక ఇప్పుడెందుకు నడుస్తావ్ అని అన్నారు. పాదయాత్ర జరుగుతున్న సందర్భంలో రెండుసార్లు నేను అస్వస్థతకు గురైతే వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. ఇందులో ఒకసారి హైదరాబాద్‌కు విమానంలో పంపించారు. 'నారాయణ నాకు కావల్సిన వ్యక్తి.. ఆయనకు ఏ ఇబ్బంది రాకూడదు. అన్నీ దగ్గరుండి చూసుకోండి' అని ఆస్పత్రి వారికి చెప్పి మరీ వైద్యం చేయించారు. ఇంత జాగ్రత్తగా ఆయన తన సహాయకులను చూసుకుంటారు. దాదాపుగా 36 ఏళ్లుగా ఆ కుటుంబంలోనే నేను పనిచేస్తున్నాను. పదహారేళ్లుగా జగన్ సార్‌తో ఉంటున్నాను. నన్ను ఏనాడూ ఒక ఉద్యోగిగా చూడలేదు. ఇంటిలోని సొంత మనిషిగా చూసుకుంటున్నారు.

ఆ పాదయాత్ర మిస్సయినా..

గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సార్ దగ్గర పనిచేస్తూ ఆయన పాదయాత్ర ప్రారంభమయ్యే సమయానికి జగన్ సార్ దగ్గరకు వచ్చేశాను. అప్పుడు పాల్గొనలేకపోయినా ఈ పాదయాత్రలో నేను సార్‌తో పాటు ఉండడం ఎంతో ఆనందంగా ఉంది. కానీ, ఈరోజే (మంగళవారం) ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాను. ఇప్పుడు యాత్ర ముగింపు సమయంలో నేను లేకపోవడం చాలా బాధగా ఉంది. విశాఖలో సార్‌పై కత్తితో దాడి జరిగినప్పుడు నేను చాలా భయపడ్డా.

– నారాయణ (వైఎస్ జగన్ వ్యక్తిగత సహాయకుడు)







పేదోడికి ధీమా.. అందరికీ భరోసా

అన్ని వర్గాలకు అనువైన హామీలు

ప్రజల కష్టాలను కళ్లారా చూసి ఈ హామీలు ఇచ్చాను. వీటిని నేరవేర్చలేక పోతే తప్పకుంటాను.
– వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'చేయగలిగినవే చేస్తాను.. చేసేవే చెబుతాను' ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సందర్భంలోనూ అనేమాటిది. ఏడాదికిపైగా సాగిన ప్రజాసంకల్ప యాత్రలో ఆయన ప్రజల కష్టాలెన్నో తెలుసుకున్నారు. వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించే ప్రయత్నం చేశారు. జనామోదం పొందిన నవరత్నాలను ప్రతి గడపకు తీసుకెళ్లి ప్రజల్లో భవిష్యత్ పట్ల ఆశను కల్పించారు. వైఎస్ జగన్ అధికారంలోకి వస్తే తమ బతుకులు మారతాయనే భరోసానిచ్చారు. ఆయన అధికారంలోకొస్తే నవరత్నాల రూపంలో ప్రతి ఇంటికీ ఏడాదికి రూ.లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు ప్రయోజనం కలుగుతుందనే నమ్మకం వచ్చింది. టీడీపీ నాలుగున్నరేళ్ల పాలనలో బక్కచిక్కి శల్యమైన రైతుల కన్నీటి కథలు.. నిరుద్యోగుల వెతలు... అక్కచెల్లెమ్మల కన్నీటి గాథలు ప్రతిపక్ష నేతను కదిలించాయి. బతుకు భరోసా లేని అవ్వాతాతలు, ఆరోగ్యశ్రీ వర్తించక ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న అనేకమంది వైఎస్ జగన్‌ను కలుసుకుని తమ గోడు వెల్లబోసుకున్నారు. కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులు ఒకరేమిటి మార్పు కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఒక్కరూ ప్రతిపక్ష నేత అడుగులో అడుగులేశారు.

అథ:పాతాళంలో అభివృద్ధి

రాష్ట్రం ఈ నాలుగున్నరేళ్లలో అభివృద్ధిలో అథ:పాతాళంలో నిలిచింది. ఏ ఒక్క వర్గమూ టీడీపీ పాలనలో సంతోషంగా లేదు. రాజధానికని ఏడాదికి మూడు పంటలు పండే భూములను రైతుల నుంచి బలవంతంగా లాక్కోవడం దగ్గర నుంచి రైతు రుణాల మాఫీ వరకు, విద్యార్థులకు ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం నుంచి నిరుద్యోగులకు భృతి అందివ్వకపోవడం వరకు ఎక్కడా ఆయా వర్గాల అభివృద్ధి జాడే లేదు. రాజధానిలో సింగపూర్ నిర్మాణాలని ఒకసారి, జపాన్ నిర్మాణాలని మరోసారి ప్రజలను మోసం చేయడం, వారికి రోజుకో సినిమా చూపడం తప్ప శాశ్వత భవనాలకు ఒక్క ఇటుకా పడలేదు. డ్వాక్రా రుణాలను మాఫీ చేయకుండా మహిళలను నిండా ముంచారు. అలాగే వాడవాడలా బెల్టుషాపులకు గేట్లు ఎత్తి కుటుంబాలను చిన్నాభిన్నం చేశారు. ఇలా ఎవరికీ సంతోషం లేకుండా, అభివృద్ధి అనేది లేకుండా టీడీపీ పాలన సాగింది.

అభివృద్ధికి అసలైన నిర్వచనం ఇచ్చిన ప్రతిపక్ష నేత

టీడీపీ పాలనలో అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిన అన్ని వర్గాలను ఆదుకోవడానికి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్న పథకాలు వారికి భవిష్యత్ పట్ల భరోసాను కల్పించాయి. చిన్నారులను బడికి పంపించే తల్లుల కోసం ప్రకటించిన అమ్మఒడి పథకంతో చిన్నారులంతా బడిబాట పడతారు. అదేవిధంగా చదువుకునేవారికి ఎంత ఫీజైనా చెల్లిస్తామంటూ ప్రకటించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం విద్యార్థుల ఉన్నతవిద్య ఆశలను సాకారం చేస్తుంది. ఉన్నత విద్య పూర్తి చేసుకోగానే ప్రతి ఏటా ఉద్యోగాల క్యాలెండర్ ప్రకటించడంతోపాటు ఎప్పటికప్పుడు ఖాళీ పోస్టులను భర్తీ చేయడం వల్ల నిరుద్యోగ సమస్యను రాష్ట్రంలో పూర్తిగా నిర్మూలించవచ్చు. పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు ఇవ్వడం వల్ల వలసలు తగ్గిపోతాయి. ఇక తాగునీరు అందక, పంటలు పండక, గిట్టుబాటు ధరలు లభించక తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్న రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కాంతిరేఖగా నిలుస్తుంది. డ్వాక్రా అక్కచెల్లెమ్మల కోసం ప్రకటించిన వైఎస్సార్ ఆసరా ద్వారా మహిళల అభివృద్ధి సాధ్యమవుతుంది. అధికారంలోకి రావడానికి కాకుండా ప్రజాసంకల్పయాత్రలో ఎంతోమంది బాధితుల సమస్యలు విన్నాక.. వారి బాధలు చూశాక.. ఎంతో అధ్యయనం చేశాక ఆయా వర్గాల అభివృద్ధికి ఈ పథకాలను ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ఈ హామీలు నెరవేర్చలేకపోతే ఏకంగా పదవి నుంచే తప్పుకుంటానని వైఎస్ జగన్ చెప్పడం ఈ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేసి చూపాలనే దృఢసంకల్పానికి నిదర్శనం.

నవరత్నాలతో పాటు వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో మరికొన్ని..

- మూతపడ్డ సహకార చక్కెర కర్మాగారాలను తెరిపిస్తారు.
- అధికారంలోకి రాగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం.
- ముస్లిం మైనార్టీలను ఆదుకునేందుకు సబ్‌ప్లాన్ ఏర్పాటు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, భూముల పంపిణీ.
- దాదాపు అన్ని సామాజికవర్గాలకు ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటు.
- ఏటా మెగా డీఎస్సీ నిర్వహణతోపాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టుల భర్తీ
- ప్రతి ఏటా ఉద్యోగాల భర్తీకి క్యాలెండర్
- ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటు. పది మందికి ఉద్యోగాలు.
- ప్రైవేటు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చట్టం.
- దుల్హన్ పథకం కింద ఇచ్చే రూ.50 వేల మొత్తం రూ.లక్షకు పెంపు.
- ఇమామ్‌లకు ప్రతినెలా రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేలు గౌరవ వేతనం.
- గ్రానైట్ పరిశ్రమను ఆదుకునేలా విద్యుత్ ఛార్జీలను యూనిట్‌కు రూ.7.35 నుంచి రూ.3.75కు తగ్గింపు.
- నాయీబ్రాహ్మణులకు 250 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్. ప్రధాన ఆలయాల్లో కనీస వేతనంపై పనిచేసే అవకాశంతోపాటు ఎమ్మెల్సీ స్థానం.
- గిరిజనులకు.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు.
- మత్స్యకారులు బోట్లకు వాడే డీజిల్‌పై 50 శాతం సబ్సిడీ, వేట సమయంలో చనిపోతే మూడు నెలల్లో రూ. 10 లక్షలు అందేలా చర్యలు, ప్రత్యేక కార్పొరేషన్.

పాదయాత్రతో మారిన ప్రజా నాడి

సాక్షి, అమరావతి: ప్రజల కష్టనష్టాలు తెలుసుకుంటూ.. వారిలో ధైర్యం నింపుతూ.. భవిష్యత్‌పై భరోసా ఇస్తూ వేలాది కిలోమీటర్ల మేర వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సాగించిన ప్రజా సంకల్ప యాత్రతో జనం నాడి మారిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తమ గోడు వినేందుకు వచ్చిన జగన్ వెంట నిరుపేదలు, అణగారిన వర్గాలు, సామాన్య, మధ్య తరగతి ప్రజలతో పాటు యువత, ఉద్యోగులు ఇలా ఒకరేమిటి.. అన్ని వర్గాలు పాదం కదపడమే ఇందుకు నిదర్శనమని వారు చెబుతున్నారు. జగన్ అడుగుపెట్టిన ప్రతి ప్రాంతానికి తండోపతండాలుగా తరలివచ్చి తమ అభిమానం చాటుకోవడాన్ని వారు ఉదహరిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి జగన్‌తోనే సాధ్యమని వారు భావిస్తుండటం వల్లే ఈ ప్రజాదారణని పేర్కొంటున్నారు. వైఎస్సార్ అస్తమయం, రాష్ట్ర విభజన తర్వాత సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న ప్రజలకు జగన్ ఆశాదీపంలా కనిపించారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీని ఎదిరించి బయటకు వచ్చి వైఎస్సార్‌సీపీని స్థాపించినప్పుడు.. కాంగ్రెస్, టీడీపీలు కుమ్మక్కై అక్రమ కేసులు బనాయించి జైలు పాలుచేసినప్పుడు కూడా జనం ఆయన్ని వదల్లేదన్నారు. అయితే అనుభవంతో పాటు రుణమాఫీ వంటి 600 హామీలతో గత ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చారని.. లేకపోతే 2014లోనే జగన్ సీఎం అయ్యేవారని గుర్తు చేస్తున్నారు. ఈ నాలుగున్నరేళ్లలో చంద్రబాబు ఒక్క హామీ సరిగ్గా నెరవేర్చకపోగా.. అవినీతి, అక్రమాలు పెరిగిపోవడం, జన్మభూమి కమిటీల లంచావతారం.. టీడీపీ నేతల అరాచకాలతో ప్రజల్లో చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెరిగిందని వివరించారు. ఈ సమయంలో జగన్ పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ.. వాటిపై సభల్లో ప్రభుత్వాన్ని నిలదీయడం ద్వారా అశేష అభిమానాన్ని చూరగొన్నారని వివరించారు. పాదయాత్రలో ఉన్నప్పటికీ తన పార్టీ నాయకులకు, కేడర్‌కు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ పోరాటాలు చేయించడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేస్తున్నారు. ఇవన్నీ గమనిస్తున్న ప్రజలకు ఒక స్పష్టత వచ్చిందని.. వచ్చే ఎన్నికల్లో ఈ దుర్మార్గపు ప్రభుత్వానికి చరమ గీతం పాడాలనే నిర్ణయానికి వారు వచ్చారన్నారు. ధన బలం, కండబలం, అధికార బలంతో పాటు పోల్ మేనేజ్‌మెంట్ ద్వారా తిమ్మిని బమ్మిని చేయొచ్చనుకుంటున్న టీడీపీ నేతల ఆటలు సాగే పరిస్థితి కనపడం లేదని అభిప్రాయపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొంటున్నారు.

పాదయాత్ర మొదలు

	మొత్తం	వైఎస్సార్ ఇడుపులపాయ	కర్నూలు చాగలమర్రి	అనంతపురం గుంతకల్లు నియోజకవర్గం	చిత్తూరు జిల్లా, ఎద్దులవారికోట	నెల్లూరు పునబాక	ప్రకాశం కొత్తపేట	గుంటూరు స్టువర్టుపురం	కృష్ణా, కనక దుర్గమ్మ వారధి	ప.గో. పెదయడ్లగాడి	తూ.గో రోడ్డు కం రైల్వే వంతెన	విశాఖ గన్నవరం మెట్ట	విజయనగరం కొత్తవలస	శ్రీకాకుళం కెల్ల
నడిచిన రోజులు	341	7	18	20	23	20	21	26	24	27	50	32	36	37 (నేటితో)
నడిచిన దూరం(కి. మీ)	3,648	93.8	263	279.4	291.4	266.5	278.1	281	239	316.9	412	277.1	311.5	338.3
నియోజకవర్గాలు	134	5	7	9	10	9	9	12	12	13	17	12	9	10
మండలాలు	231	6	14	15	18	14	18	16	18	24	32	16	18	22
గ్రామాలు	2,516	41	107	155	256	165	172	218	192	210	304	180	224	292
బహిరంగ సభలు	124	5	8	10	8	9	9	11	10	11	15	9	9	10
ఆత్మీయ సదస్సులు	55	3	6	4	9	6	2	3	5	5	2	2	2	6
పట్టణాలు+ నగరాలు	62	2	1	3	1	2	5	9	6	8	10	4	5	6

అతనంటే ఒక నమ్మకం..

ఒక భరోసా

సార్.. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి ఏడాదిన్నర దాటింది. ఫీజు కడితే తప్ప పరీక్ష రాయనీయబోమని అంటున్నారు. రీయింబర్స్‌మెంట్ వస్తుందని నమ్మి కళాశాలల్లో చేరితే ఇప్పుడు మా మెడపై కత్తి పెట్టి డబ్బు కడతారా? చస్తారా? అంటున్నారు. మీరే ఏదైనా చేసి ఆదుకోండి సార్. ఇలా ఒకటా.. రెండా.. లక్షలు.. ఏమిటివీ అను కుంటున్నారా? ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బాధితులు చెప్పుకున్న సమస్యలు. నాలుగున్నరేళ్లుగా సమస్యలతో అల్లాడుతున్న ప్రజలకు వైఎస్ జగన్ ఒకే ఒక్క ఆశాకిరణంగా కనిపించారు.

ఊరవతల నీరింకిన చెరువులు, దారిపక్క చెట్టు కింద తడారిన గొంతుకలు, ఎండిన డొక్కలు, ముగ్గుబుట్ట వంటి తలలు, అన్నార్తులు, అభాగ్యులు, ఎటుచూసినా బతుకు బండి సాగని దైన్యం.. ఆదుకునే నాథుడే లేడు. అయినవాళ్లకు ఆకుల్లో కానివాళ్లకు మూకుళ్లలో.. మీరు మా వాళ్లు కాదంటూ పాలక పార్టీ వాళ్ల తిరస్కరణ.. గుండె లోతుల్లో మెలిపెడుతున్న వ్యథ.. వీటినన్నింటినీ ఎవరికో ఒకరికి చెబితే గానీ ఊరట లభించదు. అదిగో.. అలాంటి తాడిత, పీడితులకు వేగుచుక్క.. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి 2017, నవంబర్ 6న ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించిన వైఎస్ జగన్ రాష్ట్రంలోని 13 జిల్లాలను చుట్టివచ్చారు. కోట్లాది మంది ప్రజలకు భరోసా కల్పించారు. అనేక సమస్యలతో కష్టాల్లో ఉన్న ప్రజలు తమ బాగోగులు తెలుసుకోవడానికి తమ వద్దకే వచ్చిన రాజన్న బిడ్డను చూసి ఉద్వేగభరితులయ్యారు.. ఆయనకు తమ ఈతి బాధలు చెప్పుకున్నారు.. తమ ఇక్కట్లను ఆయన దృష్టికి తెచ్చారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ క్రమంలో అప్పటికప్పుడు చేయదగిన వాటిని ప్రతిపక్ష నేత అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాల్సిన వాటిని ఆయా జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకువచ్చేలా లేఖలు రాశారు. విధానపరమైన వాటిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపేలా ఏర్పాటు చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తన సహాయం కోరివచ్చినవారికి కాదనకుండా ఆర్థిక, హార్దిక సహకారం అందించారు. మాటలు రాని పిల్లలకు కాక్లియర్ ఆపరేషన్లు చేయించి మాటలు తెప్పించారు. బ్రెయిన్ సర్జరీ అవసరమైనవారికి మార్గం చూపించారు.

ప్రతి ఫిర్యాదు నమోదు

ప్రజాసంకల్ప యాత్రలో ప్రజలు తనకు చెప్పుకున్న ప్రతి సమస్యను, ఫిర్యాదును ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ తన వ్యక్తిగత సహాయకుల ద్వారా కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయించారు. మొత్తం 340 రోజుల పాదయాత్రలో ఆయనకు కొన్ని లక్షల వినతులు, ఫిర్యాదులు, విజ్ఞాపనలు అందాయి. వీటిని ఏ రోజుకా రోజు రికార్డు చేయించారు. అంతే కాకుండా వాటిని సమస్యల వారీగా వర్గీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల్లో ఎక్కువ భాగం పంటలకు గిట్టుబాటు ధరలు, రుణమాఫీ, విద్య, వైద్యం, ఆరోగ్యశ్రీ, పెన్షన్లు, రేషన్ కార్డులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, సీపీఎస్ రద్దు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, నిరుద్యోగ భృతి, ఉపాధి, ఉద్యోగాల కల్పన, భూ సమస్యలు– వివాదాలు, భూ కబ్జాలు, జన్మభూమి కమిటీల ఆగడాలు తదితరాలు ఉన్నాయి. వీటిల్లో తక్షణమే పరిష్కరించాల్సిన వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని రికార్డు చేసి తమ ప్రభుత్వం వచ్చాక పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

ఉలిక్కిపడ్డ ప్రభుత్వం

అవినీతి, ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి, అన్యాయం, మోసానికి మారుపేరుగా మారి మొద్దుబారిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్ర ఉలిక్కిపడేలా చేసింది. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలతో జనం తమపై ఎక్కడ తిరగబడతారోనని భయపడి సరిగ్గా ఎన్నికలకు కొద్ది నెలల ముందు తూతూమంత్రంగా కొన్ని చర్యలు చేపట్టింది.

– సాక్షి, అమరావతి

వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ

చంద్రబాబు మాదిరిగా నాకు కాసులంటే కక్కుర్తి లేదు. ఆయన మాదిరిగా నేను కేసులకు భయపడే ప్రసక్తే లేదు. నాకున్నది ఒక్కటే కసి... నేను చనిపోయిన తరువాత కూడా ప్రతి పేదవాడి గుండెల్లో బతకాలన్న కసి. ప్రజల కుటుంబాల్లో ఆప్యాయతలు పెంచాలన్నదే నా కసి. ఆ కసి నాలో ఉంది కాబట్టి ప్రజలకు, ఈ రాష్ట్రానికి మంచి చేస్తాను.

– ప్రతిపక్ష నేత వైఎస్ జగన్






అనంతపురం జిల్లా కదిరి


చిత్తూరు జిల్లా సదుం


గుంటూరు జిల్లా నరసరావుపేట


విశాఖ నగరం కంచరపాలెం


ప.గో. జిల్లా ఏలూరు


శ్రీకాకుళం జిల్లా పాలకొండ


విజయవాడ కనకదుర్గ వారధిపై


నాగావళి వంతెనపై


వంశధార నది వంతెనపై

జన ప్రభంజనంతో సర్కారు

బెంబేలు

- ప్రజాసంకల్ప యాత్రను అడ్డుకునేందుకు ఆది నుంచి ప్రభుత్వం కుట్రలు
- ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ సభలు టీవీల్లో కనపడకుండా కరెంటు కోతలు
- పాదయాత్ర మార్గాల్లో ఆంక్షలు
- అవేవీ పారకపోవడంతో చివరకు హత్యాయత్నం
- ప్రజా, దైవబలంతో త్రుటిలో తప్పించుకున్న వైఎస్ జగన్

బిందువు బిందువు సింధువు అయినట్లు.. ఇంతింతై.. వటుడింతై అన్నట్లు.. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పాదయాత్ర ప్రభంజనంగా మారి రికార్డు పుటల్లోకి ఎక్కింది. ఊళ్లకు ఊళ్లే పాదయాత్ర ప్రాంతానికి తరలి వస్తుండటం, చిన్నారులు మొదలు వయో వృద్ధుల వరకు వైఎస్ జగన్‌ను కలవాలని, కరచాలనం చేయాలని పోటీపడ్డారు. ఈ ఆదరణ చూసి సర్కారు పెద్దలకు కన్ను కుట్టింది. ఎన్నెన్నో కుయుక్తులు చేశారు. జనం రాకుండా అడ్డుకోవాలని చూశారు. ఏవీ సఫలం కాకపోవడంతో ఏకంగా అంతమొందించడానికి వ్యూహం పన్నారు. ఇదీ బెడిసి కొట్టడంతో నోటికి పని చెప్పారు. వీటన్నింటినీ అధిగమించిన జగన్ కోట్లాది మంది హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: సమైక్యాంధ్ర చరిత్రను తిరగరాసిన ఘన చరిత్ర.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర. ఇక 2014 తర్వాత విభజనాంధ్రప్రదేశ్‌ను అవినీతి, అక్రమాలు, అరాచకాలతో అవశేషాంధ్రగా మార్చేస్తున్న దారుణ పరిస్థితుల్లో తల్లడిల్లిన ప్రజల గుండెచప్పుడై.. రాష్ట్ర దిశ, దశ మార్చాలన్న సంకల్పంతో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రది మరో చరిత్ర. నాడు మహానేత వైఎస్ పాదయాత్ర కళ్ల ముందు మెదిలి.. ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్ చేపట్టే పాదయాత్ర ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకున్న టీడీపీ పెద్దల కళ్లు బైర్లు కమ్మాయి. అంతే.. అసలు జగన్‌ను జనంలోకి వెళ్లకుండా చేయాలని కుయుక్తులు పన్నారు.. కుట్రలకు దిగారు. కానీ ఏ క్షణంలోనూ వైఎస్ జగన్ చలించ లేదు. అందుకే ఎక్కడికక్కడ పాదయాత్రలో జనం సముద్రంలా పోటెత్తారు. జనతరంగం ప్రతిచోటా ఉవ్వెత్తున ఎగిసింది.



సరైన భద్రత కల్పించకుండా..

ఇక పాదయాత్రలో ప్రతిపక్ష నేత స్థాయికి కల్పించాల్సిన సరైన భద్రతను ఇవ్వలేదు. స్వచ్ఛందంగా వెల్లువెత్తుతున్న ప్రజలను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. పాదయాత్ర దృశ్యాలు, వైఎస్ జగన్ ప్రసంగాలు టీవీల్లో కనపడకుండా, వినపడకుండా సరిగ్గా యాత్ర జరిగే ఊళ్లలో అప్రకటిత కరెంటు కోతలు విధించారు. కుట్రలు, కుతంత్రాలు, ఆంక్షలు, అవాంతరాలను తుత్తునియలు చేస్తూ అన్నింటినీ చిరునవ్వుతో అధిగమించి లక్ష్యసాధన దిశగా ముందుకు సాగారు. ఇడుపులపాయలో జనజాతరలా మొదలై.. రాయలసీమ జిల్లాలను దాటి... కోస్తాంధ్ర జిల్లాల్లోకి అడుగుపెట్టేసరికి సంకల్పయాత్ర జన ఉప్పెనలా మారిపోయింది. జిల్లా.. జిల్లా దాటుతూ ఉంటే యాత్ర మహోజ్వల రూపం దాల్చుతూ వచ్చింది. పాదయాత్రతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాల ముఖచిత్రమే మారిపోయింది. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ జనంలోనే ఉంటూ రాజకీయం మొత్తం తన చుట్టూ తిరిగేలా చేశారు. అత్యంత ప్రభావవంతమైన, శక్తిమంతమైన నాయకుడిగా ఆవిర్భవించడాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు ప్రభుత్వం ఆయనను అంతమొందించే కుట్రకు తెరతీసింది.

గుంటూరు జిల్లాలో ముందుగా రెక్కీలు

పాదయాత్రతో రోజురోజుకీ తమ కంట్లో నలుసులా మారిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ను అంతమొందించడానికి కుట్ర చేశారు. ఈ క్రమంలో ముందు గుంటూరు జిల్లాలో.. ఆ తర్వాత పశ్చిమగోదావరి జిల్లాలో రెక్కీలు కూడా నిర్వహించారు. ఏకంగా కేంద్ర రక్షణశాఖ అధీనంలోని తూర్పు నావికాదళం పర్యవేక్షణలో ఉన్న విశాఖ విమానాశ్రయంలో చంపడానికి భారీ కుట్ర పన్నారు. అక్కడేం జరిగినా కేంద్రం మీదకు నెట్టేయాలని ప్లాన్ చేశారు. ఇందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. దీనిలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం ఠానేలంకకు చెందిన జె.శ్రీనివాసరావును పాత్రధారిగా ఎంచుకున్నారు. నేర చరిత్ర ఉన్న అతడికి ఎయిర్‌పోర్ట్‌లో టీడీపీ నేత, సీఎం చంద్రబాబు కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన హర్షవర్ధన్ చౌదరికి చెందిన ఫ్యూజన్‌ఫుడ్స్ రెస్టారెంట్‌లో 'పని' కల్పించారు. సదరు శ్రీనివాసరావు ఆ రెస్టారెంట్‌లోనే కత్తులను భద్రపరుచుకుని హత్యాయత్నం చేసిన రోజు ఉదయం వాటికి పదును కూడా పెట్టాడు. ఇక ఎయిర్‌పోర్ట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో)ను కూడా తమ వలలో వేసుకున్నారు. పదేళ్లుగా రెస్టారెంట్ పేరుతో అక్కడే పాతుకుపోయిన హర్షవర్ధన్ చౌదరి.. చంద్రబాబు, లోకేష్‌ల పేర్లు చెప్పి విశాఖ ఎయిర్‌పోర్ట్‌ను, యంత్రాంగాన్ని ప్రభావితం చేసే శక్తిగా మారిపోయాడు. అందుకే సరిగ్గా వైఎస్ జగన్ పాదయాత్రలో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు వచ్చే నాటికి ఎయిర్‌పోర్ట్‌లోని వీవీఐపీ లాంజ్‌లో సీసీ కెమెరాలు పనిచేయడం ఆగిపోయాయి. అక్టోబర్ 25న వైఎస్ జగన్‌కు రెస్టారెంట్ నుంచి కాఫీ తెచ్చే పేరిట శ్రీనివాసరావు చొరబడి కత్తి దూసి హత్యాయత్నానికి తెగబడ్డాడు. అయితే ప్రజల ఆశీస్సులు బలంగా ఉన్న ప్రతిపక్ష నేత తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఆ తర్వాత సీఎం చంద్రబాబు, డీజీపీతో సహా మంత్రులు, టీడీపీ నేతలు తెరపైకి వచ్చి శ్రీనివాసరావు వైఎస్ జగన్ అభిమాని అని, ఏదో ప్రచారం కోసం దాడి చేశాడని చాలా తేలిగ్గా తీసిపారేశారు. కుట్రధారులను తప్పించి కేసును పూర్తిగా నిర్వీర్యం చేసేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర హోంశాఖ పరిధిలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసు విచారణ చేపట్టాక విశాఖ పోలీసులు అడుగడుగునా సహాయ నిరాకరణ చేస్తుండటం ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకేనని అర్థం చేసుకోవచ్చు. ఇవేవీ జగన్‌కు ప్రజాదరణను అడ్డుకోలేకపోయాయి.





ప్రజా ప్రస్థానం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2003 ఏప్రిల్ 9వ తేదీన రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో పాదయాత్ర ప్రారంభించి అదే ఏడాది జూలై 15వ తేదీన శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురంలో ముగించారు. ఆయన 98 రోజుల వ్యవధిలో 11 జిల్లాల మీదుగా 1,464 కిలోమీటర్లు నడిచారు.













మరో ప్రజా ప్రస్థానం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమంగా కేసులు బనాయించి జైల్లో పెట్టిన తరుణంలో తెలుగు ప్రజల కష్ట సుఖాలు తెలుసుకోవడానికి ఆయన సోదరి షర్మిల చరిత్రాత్మకమైన రీతిలో 3,112 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. ఇంత సుదీర్ఘ కాలం పాటు నడక సాగించిన తొలి మహిళగా గణతి కెక్కారు. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నుంచి 2012 అక్టోబర్ 18న ఆమె యాత్ర ప్రారంభించి.. 2013 ఆగస్టు 4న శ్రీకాకుళంలోని ఇచ్ఛాపురంవద్ద ముగించారు. ఆమె మొత్తం 230 రోజుల పాటు యాత్ర చేశారు.










సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ బుధవారం ॥ 9-1-2019

నవరత్నాలు - 8

ఆకాశంలో కలల సౌధం



- పేదల సొంతింటి కల నెరవేర్చడంలో టీడీపీ సర్కారు విఫలం
- రాష్ట్రంలో సొంతిల్లు లేని కుటుంబాలు 30.31 లక్షలు
- దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో 13 జిల్లాల్లో 44.80 లక్షల ఇళ్లు మంజూరు
- బాబు హయాంలో అధికారంలోకి రాగానే 25 లక్షల ఇళ్లు నిర్మిస్తామని వైఎస్ జగన్ హామీ
- ప్రతిపక్ష నేత భరోసాతో పేదల్లో చిగురిస్తున్న సొంతింటి ఆశలు

వంట, స్నానాల గదితో కూడిన చిన్నపాటి రెండు గదుల ఇల్లు.. జీవిత చరమాంకంలోకి వచ్చే సరికి కనీసం ఎలాగైనా ఈ కలను సాకారం చేసుకోవాలనేది సగటు పేదవాడి ఆశ. ఈ కలల సౌధం కోసం కళ్లలో వత్తులు వేసుకుని సామాన్యుడు ఎదురు చూస్తున్నాడు.. అదింకా ఆకాశంలోనే ఉంది. ఎప్పుడు కిందికి దిగివస్తుందో ఏమో! అదిగో.. ఇదిగో అంటూ నాలుగున్నరేళ్లుగా పాలకులు ఊరించి ఉసూరు మనిపించారే తప్ప ఆ కలను సాకారం చేయలేదు. మళ్లీ రాజన్న రాజ్యమొస్తే తప్ప ఆ కల నెరవేరేలా లేదనేది సామాన్యుడి మాట.

– సాక్షి, అమరావతి/సాక్షి, నెట్‌వర్క్

కనిపించేది మొండి గోడలే..

ఆంధ్రప్రదేశ్‌ను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం.. ఐదేళ్లలో పేదలకు 19 లక్షల ఇళ్లు నిర్మిస్తాం.. ఇదీ ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ. అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాటు ఒక్క ఇల్లు కూడా పూర్తిచేయని ప్రభుత్వం ఈ ఏడాదిన్నరగా హడావుడి చేస్తున్నా పేదల లక్ష్యం నెరవేరడం లేదు. నాలుగున్నరేళ్లలో 5.61 లక్షల ఇళ్లు నిర్మించామని ప్రభుత్వం లెక్కలు చెబుతోంది. యూనిట్ ధర రూ.1.50 లక్షలుగా నిర్ణయించినా లబ్ధిదారులకు బిల్లులు సరిగా మంజూరు చేయకపోవడంతో 5.61 లక్షల ఇళ్లలో సగం అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ఇది గమనించి.. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు యూనిట్ ధర మరో రూ.50 వేలు పెంచుతున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఇళ్లు లేని పేదలకు కొత్తగా ఇళ్లు నిర్మిస్తామంటూ ఆశ చూపి.. ఉన్న గుడిసెలు, మట్టి మిద్దెలను తొలగించారు. నాలుగేళ్లు దాటినా వారికి సొంతింటి కల నెరవేరడం లేదు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సింగపూర్, మలేషియా, చైనా, బీజింగ్ తదితర దేశాల్లో చేపడుతున్న టెక్నాలజీని ఉపయోగించి ఇళ్ల నిర్మాణం చేపట్టి పేదల కల సాకారం చేస్తామని సీఎం చంద్రబాబు పెద్ద పెద్ద మాటలు చెప్పినా.. ఆచరణలో అమలు కావడం లేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇందిరమ్మ పథకం కింద రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 44.80 లక్షల ఇళ్లు మంజూరు చేసి.. 31.24 లక్షల ఇళ్లను పూర్తిచేశారు. మిగిలిన 13.56 లక్షల ఇళ్లకు టీడీపీ ప్రభుత్వం బిల్లులు నిలిపి వేయడంతో ఇంటి నిర్మాణాలు పూర్తిగా ఆగిపోయి ప్రస్తుతం అవి మొండి గోడలుగా దర్శనమిస్తున్నాయి. ఈ ప్రభుత్వంలో ఇల్లు కావాలనుకునే వారు.. మొదట జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగి వారికి అంతో ఇంతో సమర్పించుకోవాల్సిన పరిస్థితి. గృహ నిర్మాణాల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా నిర్మాణాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఇటీవల నిర్వహించిన పల్స్ సర్వేలో రాష్ట్రంలో ఇంకా 30.31 లక్షల మంది పేదలు గుడిసెల్లోనే నివాసం ఉంటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది.

ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ..

నా భర్త మాదన్న 13 ఏళ్ల కిందట మృతి చెందాడు. మాకు ఎనిమిది మంది ఆడపిల్లలు, ఒకరి వివాహం చేయగా మిగిలిన ఏడుగురితో కలిసి ఓ చిన్న గుడిసెలో జీవనం సాగిస్తున్నాం. కూలి పనులు చేసు కుంటూ పొట్టపోసుకుంటున్నాం. ఇంటి కోసం పలుమార్లు అర్జీలు పెట్టుకున్నాం. జన్మభూమి, గ్రామదర్శిని తదితర కార్యక్రమాల్లో అధికారులకు పలు మార్లు దరఖాస్తులు ఇచ్చినా ఇల్లు మంజూరు కాలేదు. తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా వినతిపత్రాలిచ్చాం. అయినా ఫలితం లేదు. చేసేదేం లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ గుడిసెలోనే బతుకులు వెళ్లదీస్తున్నాం.

– హరిజన దస్తగిరమ్మ, ఎల్.నగరం, కర్నూలు జిల్లా

సొంతిల్లు లేని కుటుంబాలు

జిల్లా	కుటుంబాలు
శ్రీకాకుళం	1,53,716
విజయనగరం	1,23,076
విశాఖపట్నం	1,91,358
తూర్పుగోదావరి	4,85,219
పశ్చిమ గోదావరి	3,75,220
కృష్ణా	3,19,586
గుంటూరు	3,08,722
ప్రకాశం	2,10,370
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా	1,59,744
చిత్తూరు	1,51,472
వైఎస్సార్	1,25,571
అనంతపురం	2,03,817
కర్నూలు	2,23,418

ప్రభుత్వం చెబుతున్న లెక్క ఇదీ..

ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో 2015–16లో 62,584 ఇళ్లు, 2016–17లో 47,851, 2017–18లో 2,76,763, 2018–19లో 1,73,833 ఇళ్లు నిర్మించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఇందులో సగం ఇళ్లు కూడా పూర్తి కాలేదు. బిల్లుల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం చేస్తుండటంతో ప్రభుత్వ తీరుపై పేదలు మండిపడుతున్నారు.

వైఎస్సార్ హయాంలో..

వైఎస్సార్ హయాంలో రాజకీయాలకు అతీతంగా దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదవాడికీ ఇళ్లు మంజూరు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన చేపట్టిన పాదయాత్ర ద్వారా పేదల ఇబ్బందులను కళ్లారా చూసి అడిగిన వారందరికీ ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేశారు. గతంలో ఉన్న ప్రభుత్వాలు పేదల గురించి ఆలోచించకపోవడంతో రోజూ ఎక్కడో ఒక ప్రాంతంలో ఇంటి పట్టా, ఇళ్ల కోసం కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిత్యం ఆందోళనలు జరిగేవి. వైఎస్ అధికారంలోకొచ్చాక అడిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు, గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఆయన హయాంలో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 44.80 లక్షల ఇళ్లు మంజూరు చేయగా.. 31.24 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసిన ఘనత ఆయనకే దక్కుతుంది.




పేదలంటే కనికరం లేని ప్రభుత్వమిది

మా ఆయన హనుమంతు ఏడాది కిందట మృతి చెందాడు. ఆయన జీవించి ఉన్న సమయంలో ఇంటి కోసం పలుమార్లు దరఖాస్తుచేశాడు. ఆయన మృతి చెందినా ఇంత వరకు ఇల్లు మాత్రం మంజూరు కాలేదు. సొంత ఇల్లు లేకపోవడంతో పెద్దల నాటి నుంచి వచ్చిన ఈ పూరి గుడిసెలోనే నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులతో కాలం వెళ్లదీస్తున్నాం. ఇక్కడ కూలి పనులు దొరక్కపోతే కడప జిల్లాకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నాం. ఇంటి కోసం మేము కూడా అధికారులు, నాయకుల చుట్టూ తిరిగినా ఎవరూ కనికరించడం లేదు. చిన్న గుడిసెలోనే ఏడుగురం సర్దుకుపోతున్నాం. పేదలంటే ఈ ప్రభుత్వానికి కనికరం లేదు.

– కులుమాల రంగమ్మ, కోతికొండ గ్రామం, తుగ్గలి మండలం, కర్నూలు జిల్లా

వైఎస్ జగన్ భరోసాతో పేదల్లో ఆనందం



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్లీనరీలో గూడు లేని పేదల కోసం 25 లక్షల ఇళ్లు నిర్మిస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో పేద కుటుంబాల్లో ఆశలు రేకెత్తాయి. 'గ్రామాలకు వెళ్లి అందరికీ చెప్పండి.. అన్నొస్తున్నాడని, ప్రతి పేదవాడికీ ఇల్లు కట్టిస్తామని చెప్పండి'.. అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను గ్రామాలకు పంపి భరోసా ఇచ్చేలా ఆదేశించారు. దీంతో ఇన్నాళ్లూ గుడిసెల్లో నివాసం ఉంటున్న పేదల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. మంజూరుచేసే ఇళ్లు కూడా చంద్రబాబు పాలనలాగా జన్మభూమి కమిటీల ద్వారా ఇవ్వబోమని, వైఎస్సార్ మాదిరి.. కులం, మతం, పార్టీ చూడకుండా శాచురేషన్ పద్ధతిలో ఇస్తామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడాన్ని పేదలు స్వాగతిస్తున్నారు. గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు లేని ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ప్రయోజనం.. ఇల్లు ఇచ్చే రోజునే ఆయా ఇళ్లల్లోని అక్కచెల్లెమ్మల పేరుతో రిజిస్ట్రేషన్, ఎప్పుడైనా డబ్బు అవసరమైతే ఆ ఇంటి మీద బ్యాంకుల్లో రుణం వచ్చేట్టుగా మాట్లాడుతాం.. అన్న ప్రతిపక్ష నేత భరోసాతో పేదలు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. 'పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం పేరిట ప్రభుత్వం పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతూ పేదలపై లక్షలాది రూపాయల భారం మోపుతోంది. ఒక్కో లబ్ధిదారుడిపై రూ.3.50 లక్షల మేర అప్పు మోపుతోంది. పేదవాడు ప్రతి నెలా రూ.3 వేలు, 4 వేల దాకా 20 ఏళ్లపాటు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇల్లు ఇస్తే తీసుకోండి. మన ప్రభుత్వం రాగానే ఈ ప్రభుత్వం మోపిన అప్పును రద్దు చేస్తాం' అని వైఎస్ జగన్ పేదలకు భరోసా ఇచ్చారు. దీంతో పట్టణాల్లోని నిరుపేదల సంతోషానికి అవధుల్లేకుండా పోయింది.

రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి

చివరి మజిలీలో ఏడిపించెన్



నవరత్నాలు - 9

దుర్భర జీవితం గడుపుతున్నా..



నాకు 75 ఏళ్లు. నా భర్త 40 ఏళ్ల కిందట ఓ ప్రమాదంలో మృతిచెందాడు. నా ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లయ్యాయి. ప్రభుత్వం ఇస్తున్న రూ.1,000 పింఛన్ ఎటూ చాలడం లేదు. పెరిగిన ధరలు, అనారోగ్య సమస్యలకు వాడుతున్న మందులకు పింఛన్ నగదు సరిపోక దుర్భర కష్టాలు అనుభవిస్తున్నాను. అయితే పాదయాత్ర చేస్తున్న జగన్.. మా లాంటి వృద్ధుల పింఛన్‌ను రూ.2,000కు పెంచుతానని ప్రకటించడంతో చాలా సంతోషమేసింది. పక్కా ఇళ్లు కూడా కట్టిస్తానని చెప్పడంతో నాకు ఈ ఇరుకు ఇంటికి బదులు మంచి ఆసరా దొరుకుతుందని నమ్ముతున్నాను. ఆయన ముఖ్యమంత్రి అయి మా లాంటి పేదల కష్టాలు తీర్చాలని కోరుకుంటున్నాను.

– వాసంశెట్టి సుబ్బాయమ్మ, అంగర గ్రామం, కపిలేశ్వరపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా

ఆశలన్నీ రాజన్న బిడ్డమీదే..



నిరుపేద రజక కుటుంబంలో పుట్టిన నేను సమస్యలతో సహవాసం చేస్తున్నాను. భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. నాకు నిలువ నీడ లేదు. 50 ఏళ్ల వయసున్న నన్ను కాళ్ల వాపు, థైరాయిడ్, అధిక బరువు, బీపీ సమస్యలు బాధిస్తున్నాయి. ఇంటి పనులు కూడా చేసుకోలేకపోతున్నాను. చాలీచాలని రూ.1,000 వితంతు పింఛనే నాకు ఆధారం. మందుల ఖర్చులు పెరగడంతో డబ్బులు సరిపోక దుర్భర జీవితం గడుపుతున్నాను. అయితే వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాలతో నాలో ఆశలు చిగురిస్తున్నాయి. రూ.2,000 పింఛన్, ఇంటి సదుపాయం పథకాలతో నా జీవితానికి భరోసా దొరుకుతుందని ఎదురు చూస్తున్నాను. పాదయాత్రగా మా ఊరు వచ్చిన వైఎస్ జగన్‌ను కలిసి నా కష్టాలు చెప్పుకున్నాను. అప్పుడు రాజన్న బిడ్డ నాకు ధైర్యం చెప్పారు.. భరోసా ఇచ్చారు. ఆ బిడ్డ చూపిన ఆప్యాయత ఎప్పటికీ మరువలేను. ఆశలన్నీ రాజన్న బిడ్డమీదే పెట్టుకుని బతుకుతున్నాను.

– బైనపాలెం పుష్ప, తాటిపాకమఠం, రాజోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా

- జన్మభూమి కమిటీల దయ ఉంటేనే పింఛన్ మంజూరు
- లంచాలు, రాజకీయ వివక్షతో కక్షగడుతున్న టీడీపీ శ్రేణులు
- పెరిగిన ధరలతో ఖర్చులకు సరిపోని రూ.1,000 పింఛన్
- వైఎస్ జగన్ నవరత్నాలతో అవ్వాతాతల మోముల్లో ఆనందం
- పింఛన్ వయసు 65 నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తానని భరోసా
- వృద్ధాప్య, వితంతు పింఛన్‌ను రూ.2,000కు పెంచుతామని హామీ
- వికలాంగులకు రూ.3,000 పింఛన్

సాక్షి, అమరావతి :

అన్ని అర్హతలుండీ సామాజిక భద్రత పింఛన్‌ల కోసం లక్షలాది మంది కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. అర్హత ఉన్న లక్షలాది మంది వృద్ధులు పింఛన్ కోసం మండల, పంచాయతీ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. రాష్ట్ర విభజన అనంతరం చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక.. గతంలో ఆయన తొమ్మిదేళ్ల పాలనలో ఉన్న పాత పద్ధతి పునరావృతమవుతోంది. ఎవరైనా పింఛన్‌దారుడు మరణిస్తేనే ఆ స్థానంలో మరొకరికి పింఛన్ మంజూరు చేస్తున్న పరిస్థితి. రాష్ట్రంలో లక్షలాది మంది పింఛన్ల కోసం ఎదురుచూస్తుండగా.. ప్రభుత్వం మంజూరు చేసే పరిస్థితి కనిపించడం లేదు.

వైఎస్ హయాంలో అందరికీ పింఛన్లు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక్క ఏడాది వ్యవధిలోనే దాదాపు 23 లక్షల మంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు కొత్తగా పింఛన్లు ఇచ్చిన చరిత్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌ది. 2007–08 సంవత్సరంతో పోల్చితే.. 2008–09 సంవత్సరానికి ఒక్క ఏడాదిలోనే దాదాపు 23 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు 2014 సెప్టెంబర్ ఆరో తేదీన రాష్ట్ర శాసనసభకు సమర్పించిన కాగ్ రిపోర్టులోనే ప్రభుత్వం పేర్కొంది. 2004కు ముందు తొమ్మిదేళ్ల చంద్రబాబు పాలనలో పింఛనుదారుల్లో ఎవరో ఒకరు చనిపోతేనే ఆ స్థానంలో కొత్త వారికి పింఛన్ మంజూరు చేసే పరిస్థితి ఉండగా.. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయాలని ఆదేశాలు జారీచేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది.


జగన్ రాక కోసం ఎదురుచూస్తున్నా..

నాకు 70 ఏళ్లు.. 30 ఏళ్ల కిందట నా భార్య మృతి చెందింది. నాకు ముగ్గురు కుమార్తెలు.. ఓ కుమారుడు. కుమార్తెలకు వివాహం చేశాను. తీవ్ర అనారోగ్యంతో నా పనులు కూడా నేను చేసుకోలేకపోతున్నాను. నా కుమారుడు బాధ్యత మరవడంతో వాడిని కూడా నేనే సాకాల్సిన పరిస్థితి. రోజు రోజుకూ ఒంట్లో సత్తువ కోల్పోతున్నాను. వృద్ధాప్య పింఛన్ రూ.1,000 ఎటూ చాలడం లేదు. భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న దశలో రాజన్న బిడ్డ ప్రకటించిన నవరత్నాలతో నాలో ఆశలు చిగురిస్తున్నాయి. ఆ బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాక నాకు పింఛన్ నగదు పెరుగుతుందని ఆశిస్తున్నాను.

– కోటి శేషారావు, తాతపూడి, కపిలేశ్వరపురం, తూర్పుగోదావరి జిల్లా

- చంద్రబాబు సర్కార్‌లో పింఛన్‌లపై ఆంక్షలు
- వృద్ధాప్య పింఛన్‌కు 60 ఏళ్లు దాటిన వారు అర్హులని కేంద్ర ప్రభుత్వం పేర్కొంటే.. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం 65 ఏళ్లు దాటితేగానీ పింఛన్‌కు అర్హులు కాదని నిబంధనపెట్టింది.
- తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో గ్రామ, మండల స్థాయిలో ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీలు సూచించిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారు.
- అసలైన అర్హత టీడీపీ మద్దతుదారులుగా ఉండటమే.

వైఎస్ జగన్ నవరత్నాల హామీ..



- ప్రస్తుతం ఉన్న వృద్ధాప్య పింఛన్ల అర్హత వయస్సు 65 నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తాం.
- వృద్ధాప్య, వితంతువులకు రూ.2000 చొప్పున పింఛన్
- వికలాంగులకు పింఛన్ రూ.3,000కు పెంచుతాం.
- అర్హత ఉన్న కుటుంబానికి ఈ పథకంలో ఏడాదికి రూ.24 వేల నుంచి రూ.48 వేల దాకా లబ్ధి

బాబు ప్రభుత్వ తీరును తప్పుబట్టిన కోర్టు

చంద్రబాబు ప్రభుత్వం జన్మభూమి కమిటీల ద్వారా రాజకీయ కారణాలతో పింఛన్ల తొలగింపునకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పలువురు మూకుమ్మడిగా కోర్టులను ఆశ్రయించారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో కోర్టు గడప తొక్కారు. హైకోర్టు సైతం ఒకానొక సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కోర్టు తీర్పు ద్వారా చాలా మంది పింఛన్లు పొందుతున్న పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో ఉంది.

సాక్షి
భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం
9-1-2019

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com



మెరిసిన హైదరాబాద్ అమ్మాయిలు

ప్రఖ్యాత బీస్కూల్స్ ఐఐఎంల్లో ప్రవేశానికి అవకాశం కల్పించే క్యాట్ ఫలితాలు వెల్లడయ్యాయి. ఎప్పటిలానే ఐఐటీయన్లు టాప్ పర్సంటైల్ సాధించారు. అంతేకాదు టాప్ స్కోర్ సాధించిన వారిలో ఎక్కువ మంది ఇంజనీరింగ్ విద్యార్థులే! ఇందులో విశేషం ఏమీలేదు.. కానీ, మన హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు అమ్మాయిలు క్యాట్‌లో మంచి స్కోర్ సొంతం చేసుకొని.. వారి తల్లిదండ్రులు గర్వపడేలా చేశారు. వారిలో ఒకరు చిన్న వయసులోనే పదిహేడేళ్లకే క్యాట్‌లో 95.95 పర్సంటైల్‌తో ఘనత సాధించగా.. మరొకరు బీఆర్క్ చదివి ఐఐఎంల్లో చేరడమే లక్ష్యంగా కష్టపడి 98.97పర్సంటైల్ సొంతం చేసుకున్నారు!క్యాట్ విజేతలు పిన్నవయస్కురాలైన సంహిత, బీఆర్క్ పూర్తిచేసిన జూహీ వల్లభ్ మనోగతం... మీకోసం..

మనసుపెట్టి చదివా: జూహీ వల్లభ్



మాది హైదరాబాద్. నాన్న వి.సునీల్ కుమార్ మార్కెటింగ్ మీడియా కన్సల్టెంట్. అమ్మ కృష్ణ శ్రీ. చదువు పరంగా అమ్మా నాన్న నన్ను నిరంతరం ప్రోత్సహించారు. వారి మద్దతు వల్లే నేను ఈ రోజు క్యాట్‌లో టాప్ పర్సంటైల్ సాధించగలిగాను. ఇంటర్ పాసయ్యాక.. నేను భోపాల్‌లోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో బీఆర్క్ పూర్తిచేశాను. బీఆర్క్ చదివేటప్పుడే నాకు మేనేజ్‌మెంట్ కోర్సుపై ఆసక్తి కలిగింది. వేసవి సెలవల్లో నాన్న సంస్థలో పనిచేయడం కూడా నాకు మేనేజ్‌మెంట్ అంశాలపై ఆసక్తి పెరగడానికి కారణమైంది. దాంతో ఐఐఎంలే లక్ష్యంగా క్యాట్-2018 ప్రిపరేషన్ ప్రారంభించాను. ప్రిపరేషన్‌లో భాగంగా మొదట బేసిక్స్‌పై పట్టుసాధించా. క్యాట్ కోసం కోచింగ్‌లో కూడా చేరాను. పూర్తిగా నూటికి నూరుశాతం మనసుపెట్టి ప్రిపరేషన్ సాగించా. 20 మాక్ టెస్టులకు హాజరయ్యా. వీటిని విశ్లేషించుకుంటూ.. నా ప్రిపరేషన్‌ను మెరుగుపరచుకున్నా. సందేహాలు ఎదురైనప్పుడు గూగుల్ సహాయంతో నివృత్తి చేసుకున్నా. మొదట్నుంచీ ఇంగ్లిష్‌పై బాగానే పట్టుంది. దాంతో మ్యాథ్స్‌పై ఎక్కువగా దృష్టిపెట్టా. ఫలితంగా 98.97 పర్సంటైల్ వచ్చింది. మార్కెటింగ్ స్పెషలైజేషన్‌తో ఎంబీఏ చేయాలనుకుంటున్నా!!

ఫైనాన్స్‌పై ఆసక్తి: సంహిత



మాది హైదరాబాద్. నాన్న ఎల్ఎన్ కాశీభట్ల, అమ్మ గీత చతుర్వేదుల. నాకు చిన్నప్పటి నుంచి జ్ఞాపక శక్తి ఎక్కువ. దాంతో అమ్మానాన్న, టీచర్ల ప్రోత్సాహంతో పదేళ్ల వయసులోనే పదో తరగతి పూర్తిచేశా. పదో తరగతిలో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో పదికి పది గ్రేడ్‌లు సాధించా. పదో తరగతి పూర్తయ్యాక ప్రత్యేక అనుమతితో ఇంటర్‌లో చేరి.. ఇంటర్ ఎంపీసీని మంచి మార్కులతో పూర్తిచేశా. అనంతరం ఇంజనీరింగ్ కాలేజీ(సీబీఐటీ)లో చేరి.. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో 16 ఏళ్లకే బీటెక్ పట్టా అందుకున్నా. నాకు మొదట్నుంచీ మేనేజ్‌మెంట్ కోర్సుపై ఆసక్తి ఉంది. అందుకే బీటెక్ పూర్తయ్యాక ఎంబీఏ చదవాలనే లక్ష్యంతో క్యాట్ ప్రిపరేషన్ ప్రారంభించా. తక్కువ సమయంలోనే క్యాట్‌కు హాజరు కావాల్సి వచ్చింది. ఎక్కువగా ప్రాక్టీస్ చేయడంపై దృష్టిపెట్టా. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా.. ప్రశాంతంగా పట్టుదలతో ప్రిపరేషన్ సాగించా. క్యాట్ పరీక్షలో అడిగే వెర్బల్, లాజికల్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ..ఇలా మూడు విభాగాలపైనా దృష్టిపెట్టా. గంటలు గంటలు చదివేదాన్ని కాదు. కానీ, చదివినంత సేపు ఏకాగ్రతతో ప్రిపరేషన్ సాగించడం వల్లే 95.95 పర్సంటైల్ వచ్చింది. ఫైనాన్స్ చదవడమే నా లక్ష్యం!!

ప్రతిభ కళాశాలల్లో ప్రవేశాలు

ప్రవేశాలు


తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రతిభ కళాశాలల్లో 2019-20కి గాను ప్రవేశ ప్రకటన విడుదలైంది.
- **ప్రవేశం కల్పించే తరగతి:** ఇంటర్ మొదటి ఏడాది.
- **గ్రూపులు:** ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ. వీటితో పాటు ఐఐటీ/ఎన్ఐటీ, నీట్‌కు ప్రత్యేక ఉచిత శిక్షణ అందిస్తారు.
- **అర్హత:** మార్చి 2019లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన గిరిజన బాల బాలికలు మాత్రమే అర్హులు.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ద్వారా.
- **పరీక్ష తేదీ:** ఫిబ్రవరి 10, 2019.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 21, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.tgtwgurukulam.telangana.gov.in

ఏపీ-ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్‌లోని 164 ఆదర్శ పాఠశాలల్లో 2019-20కి గాను ఆరో తరగతి ప్రవేశాలకు ప్రకటన వెలువడింది.
- **అర్హత:** 2018-19 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలి. సంబంధిత జిల్లాల్లో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2017-18, 2018-19 విద్యా సంవత్సరాలు చదివుండాలి.
- **వయసు:** ఓసీ, బీసీ విద్యార్థులు సెప్టెంబర్ 1, 2007 నుంచి ఆగస్టు 31, 2009 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సెప్టెంబర్ 1, 2005 నుంచి ఆగస్టు 31, 2009 మధ్య జన్మించి ఉండాలి.
- **ప్రవేశ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 1, 2019 (ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు).
- **పరీక్ష కేంద్రం:** ఏ మండలంలో ఆదర్శ పాఠశాల పనిచేస్తుందో ఆ పాఠశాలలోనే పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష ఐదో తరగతి స్థాయిలో తెలుగు/ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో. ముందుగా పరీక్ష ఫీజు చెల్లిస్తే ఒక జనరల్ నెంబర్ కేటాయిస్తారు. దీన్ని ఉపయోగించి ఇంటర్‌నెట్ సెంటర్ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పరీక్ష ఫీజు:** ఓసీ, బీసీలకు రూ.100; ఎస్సీ, ఎస్టీలకు రూ.30.
- **పరీక్ష ఫీజు చెల్లించుటకు తేదీలు:** జనవరి 10, 2019 నుంచి ఫిబ్రవరి 11, 2019 వరకు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://apms.ap.gov.in

- వయో పరిమితిని 27 ఏళ్లకు తగ్గించాలని సిఫార్సు చేసిన నీతి ఆయోగ్
- అటెంప్ట్‌ల సంఖ్యను ఆరు నుంచి నాలుగుకు తగ్గించాలని బస్వాన్ కమిటీ సిఫార్సు
- కనీస విద్యార్హత డిగ్రీలో కనీసం 50 శాతం మార్కుల నిబంధన అమలుకు సలహా
- దరఖాస్తు చేసినా అటెంప్ట్‌గానే పరిగణించాలని ప్రతిపాదిస్తున్నట్లు వార్తలు
- సివిల్స్ ఎంపిక విధానంపై రోజుకో వార్తతో అభ్యర్థుల్లో ఆందోళన

సివిల్ సర్వీసెస్.. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక సర్వీసులు! ఈ సివిల్ సర్వీస్‌లో చేరాలని కలలు కనే అభ్యర్థులు లక్షల్లోనే!! యూపీఎస్సీ మూడంచెల విధానంలో ఏటా నిర్వహించే సివిల్స్ ఎంపిక ప్రక్రియ అత్యంత క్లిష్టమైంది. ఇలాంటి అత్యున్నత పరీక్షకు సంబంధించి వయోపరిమితి, అటెంప్ట్‌ల సంఖ్య, విద్యార్హతలు, పరీక్ష విధానంలో మార్పులు జరిగే అవకాశముందనే వార్తలపై అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొద్దిరోజుల క్రితం 'స్ట్రాటజీ ఫర్ న్యూ ఇండియా' పేరుతో నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదికలో.. 2022 నాటికి సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో మార్పులు తేవాలని సూచించింది. తాజాగా సివిల్స్ పరీక్షకు దరఖాస్తు చేసినా అటెంప్ట్‌గానే పరిగణించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో సంస్కరణలు, ఆయా కమిటీల సిఫార్సులు, తాజాగా తెరపైకి వచ్చిన ప్రతిపాదనలు, అభ్యర్థులపై పడే ప్రభావం గురించి నిపుణుల విశ్లేషణ..



సివిల్స్.. సంస్కరణల పథం!

సిఫార్సులపై చర్చ

- ఏడాది క్రితం.. బస్వాన్ కమిటీ సిఫార్సుల మేరకు.. సివిల్ సర్వీసెస్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు జనరల్ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితిని 26 ఏళ్లకు తగ్గిస్తారని, అకడమిక్‌గా డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులుండాలనే వార్తలు.
- ఆ తర్వాత జోనల్ విధానం అమలు. దేశంలోని రాష్ట్రాలను అయిదు జోన్లుగా విభజించడం. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ జోన్‌లో పనిచేయాలనుకుంటున్నారో చెప్పాలనే విధానం.
- ఏడాది క్రితం జాయింట్ సెక్రటరీ స్థాయిలో లేటరల్ ఎంట్రీ పేరుతో ఆయా రంగాల్లోని నిపుణులను నేరుగా సివిల్ సర్వీసెస్‌లోకి నియమించేందుకు చర్యలు చేపట్టడం.
- కొద్ది రోజుల క్రితం నీతి ఆయోగ్ సిఫార్సు మేరకు సివిల్స్ వయోపరిమితిని 27 ఏళ్లకు తగ్గించనున్నారనే వార్తలు.

తాజాగా.. సివిల్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకొని... పరీక్షకు హాజరైనా కాకున్నా అటెంప్ట్‌గానే పరిగణించాలని కోరుతూ యూపీఎస్సీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వార్తలు. ఇప్పటివరకూ పరీక్షకు హాజరైతేనే అటెంప్ట్‌గా పరిగణిస్తున్నారు.

ప్రస్తుతానికి వాయిదా వేసినా

గత రెండేళ్లుగా సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో పలు మార్పులు జరుగుతాయని.. అందుకు ఆయా కమిటీల సిఫార్సులే నిదర్శనమనే వార్తలతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వయోపరిమితి, అటెంప్ట్‌ల విషయంలో ఈ ఆందోళన మరింత ఎక్కువగా కనిపిస్తోంది. బస్వాన్ కమిటీ సిఫార్సులు, నీతి ఆయోగ్ ప్రతిపాదనలను ప్రస్తుతానికి వాయిదా వేసినా.. భవిష్యత్తులో వీటిని అమలుచేసే ఆస్కారముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజాగా తెరపైకి వచ్చిన 'దరఖాస్తు చేసుకున్నా అటెంప్ట్‌గానే పరిగణించాలనే' ప్రతిపాదనను కూడా ప్రస్తుతానికి వాయిదావేస్తారని.. కానీ, భవిష్యత్తులో అమలుచేసే ఆస్కారముందంటున్నారు.

బస్వాన్ కమిటీతో మొదలు

సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో సంస్కరణలపై మాజీ ఐఏఎస్ అధికారి బి.ఎస్.బస్వాన్ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల కమిటీని 2017లో యూపీఎస్సీ నియమించింది. ఈ కమిటీ పలు అంశాలను అధ్యయనం చేసి.. కీలకమైన సిఫార్సులు చేసింది. జనరల్ కేటగిరీలో వయోపరిమితిని 26 ఏళ్లు లేదా 28 ఏళ్లకు తగ్గించాలని సూచించింది. ప్రస్తుతం ఇది 32 ఏళ్లుగా ఉంది. దాంతోపాటు ప్రస్తుతం ఆరుగా ఉన్న అటెంప్ట్‌ల సంఖ్యను నాలుగుకే పరిమితం చేయాలని సూచించింది. అదేవిధంగా విద్యార్హతల పరంగా బ్యాచిలర్ డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలని పేర్కొంది. అంతేకాకుండా మెయిన్ పరీక్షలో ఆప్షనల్ పేపర్‌కు పూర్తిగా స్వస్తి పలకాలని కూడా బస్వాన్ కమిటీ సిఫార్సు చేసింది. కొన్ని ప్రత్యేక సర్వీసులకు సంబంధిత అకడమిక్ అర్హతలను తప్పనిసరి చేయాలని.. ఆ సర్వీసులను ప్రాథమ్యంగా ఎంచుకుంటే.. అలాంటి అభ్యర్థులు సదరు సబ్జెక్ట్‌లో ప్రత్యేక పేపర్లతో పరీక్ష రాయాలని పేర్కొంది. సివిల్స్ ఇంటర్వ్యూలను డిఫెన్స్ సర్వీసుల ఎంపిక ప్రక్రియకు అనుసరించే ఎస్ఎస్‌బీ తరహా విధానాన్ని అమలు చేయాలని సలహా ఇచ్చింది. ఈ సిఫార్సులు వెలుగులోకి రావడంతో గతేడాది అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వాటిని ప్రస్తుతానికి అమలుచేసే యోచన లేదని అధికార వర్గాలు చెప్పడంతో ఊరట చెందారు.

నీతి ఆయోగ్ సిఫార్సులు

'స్ట్రాటజీ ఫర్ న్యూ ఇండియా' పేరుతో ఇటీవల నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదికలో.. 2022 నాటికి సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో మార్పులు తేవాలని సూచించింది. 2022 నాటికి దశల వారీగా జనరల్ కేటగిరీలో అభ్యర్థుల గరిష్ట వయో పరిమితిని 27 ఏళ్లకు తగ్గించాలని పేర్కొంది. దాంతోపాటు ప్రస్తుతం దేశంలో ఆయా రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ పరిధిలో వేర్వేరుగా 60కు పైగా ఉన్న సివిల్ సర్వీసుల సంఖ్యను కుదించాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది. పోస్ట్‌ల భర్తీకి జాతీయ స్థాయిలో ఒకే పరీక్ష నిర్వహించాలని, అందులో అభ్యర్థులు చూపిన ప్రతిభ ఆధారంగా వారికి సరితూగే సర్వీస్‌ను కేటాయిస్తే బాగుంటుందని సూచించింది. ఈ ప్రతిపాదన అమలైతే రాష్ట్రాల పరిధిలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర నామమాత్రం అవుతుందనే వాదన వినిపిస్తోంది. గరిష్ట వయోపరిమితిని 27 ఏళ్లకు కుదించాలనే సిఫార్సుపై వ్యతిరేకత రావడంతో.. అలాంటి ఉద్దేశం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. 27 ఏళ్ల నిబంధన ప్రస్తుతానికి లేదని చెప్పినా.. భవిష్యత్తులో అమలు చేసే ప్రయత్నాలు చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

దరఖాస్తు చేసినా అటెంప్ట్‌గానే!

సివిల్స్‌కు దరఖాస్తు చేసుకునే జనరల్ అభ్యర్థులు 32 ఏళ్ల వయసులోపు ఆరుసార్లు మాత్రమే పరీక్ష రాసే వీలుంది. ఓబీసీలకు అందుబాటులో ఉన్న అటెంప్ట్‌ల సంఖ్య 9. ప్రస్తుత నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షలో ఒక పేపర్‌కు హాజరై, రెండో పేపర్ రాయక పోయినా.. దాన్ని ఒక అటెంప్ట్‌గా పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే చాలు.. అటెంప్ట్‌గానే పరిగణించాలనే ప్రతిపాదన అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తోంది. తాజా ప్రతిపాదన అమలైతే.. అభ్యర్థులు పరీక్ష సమయానికి పూర్తిస్థాయి సన్నద్ధత సాధించలేదని భావించి పరీక్షకు గైర్హాజరైతే.. అందుబాటులో ఉన్న విలువైన అటెంప్ట్‌ల సంఖ్యలో ఒక అటెంప్ట్‌ను కోల్పోతారు. ఏటా దాదాపు తొమ్మిది నుంచి పది లక్షల వరకు అభ్యర్థులు సివిల్స్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు. కానీ.. పరీక్షకు హాజరు శాతం మాత్రం 50 శాతం లోపే ఉంటోంది. దాంతో కమిషన్‌కు పరీక్ష నిర్వహణ ఏర్పాట్ల పరంగా ప్రయాస తగ్గించడంతోపాటు అభ్యర్థుల్లోనూ సీరియస్‌నెస్ పెంచాలనే ఉద్దేశంతోనే 'దరఖాస్తు చేసుకున్నా అటెంప్ట్ ఇచ్చినట్లే..!' అనే ప్రతిపాదన తెరపైకి తెచ్చారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అభ్యర్థుల ఆలోచన మరోలా

సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల్లో సగానికి సగం మంది గైర్హాజరుపై నిపుణుల విశ్లేషణ భిన్నంగా ఉంది. చాలామంది అభ్యర్థులు సివిల్ సర్వీసుల పట్ల నెలకొన్న క్రేజ్ కారణంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. పరీక్ష రోజు వరకు ప్రిపరేషన్ కూడా సాగిస్తున్నారు. కానీ, పరీక్ష సమయానికి వచ్చేసరికి అప్పటికే ఒకట్రెండుసార్లు పరీక్ష రాసిన అభ్యర్థులను చూసి.. తొలి ప్రయత్నంలో విజయం కష్టమనే ఆలోచనతో ఆగిపోతున్నారు. పరీక్షకు హాజరై అనవసరంగా ఒక అటెంప్ట్ వృథా చేసుకోవడం ఎందుకు? అనే ఆలోచనతో పరీక్షకు హాజరుకావడం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఇలాంటి ధోరణి ఆయా కోర్సుల చివరి సంవత్సరం చదువుతూ సివిల్స్‌కు తొలిసారి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ప్రిలిమ్స్ పరీక్ష సమయానికి వారు తమ అకడమిక్ కోర్సుల చివరి అంకంలో ఉంటారు. దీంతో అకడమిక్ పరీక్షలకే ప్రాధాన్యమివ్వక తప్పదు. ప్రిలిమ్స్‌కు దరఖాస్తు చేసుకున్నా.. ప్రిపరేషన్‌కు సరైన సమయం కేటాయించలేరు. ఇలాంటి అభ్యర్థులు దాదాపు మూడు నుంచి నాలుగు లక్షల వరకు ఉంటున్నారు. వీరందరిపైనా తాజా ప్రతిపాదన (దరఖాస్తు కూడా అటెంప్ట్‌గానే) ప్రభావం చూపనుంది.

ఆ రెండూ.. అమలైతే

సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో మార్పుల పరంగా అటెంప్ట్‌ల సంఖ్యను, గరిష్ట వయోపరిమితిని తగ్గించడం అభ్యర్థులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది. యూపీఎస్సీ గణాంకాల ప్రకారం గత నాలుగేళ్లలో తుది జాబితాలో నిలిచిన అభ్యర్థుల్లో పీజీ పూర్తిచేసిన వారు, మూడో అటెంప్ట్‌లో విజయం సాధించిన అభ్యర్థుల సంఖ్య 50 శాతం వరకు ఉంది. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతోనే తొలి ప్రయత్నంలోనే విజయం సాధించిన అభ్యర్థుల సంఖ్య పది శాతంలోపే ఉంది. పీజీ పూర్తిచేసే సమయానికి ఒక అభ్యర్థి వయసు 23 లేదా 24 ఏళ్లు ఉంటుంది. అప్పటినుంచి ప్రయత్నించి రెండో అటెంప్ట్‌లోనో లేదా మూడో అటెంప్ట్‌లోనో విజయం సాధించే సమయానికి 25 లేదా 26 ఏళ్ల వయసుకు చేరుకుంటారు. వీటిని చూస్తే 26 ఏళ్ల నిబంధనతో ఇబ్బంది ఏంటి? అనే వాదన సహజం. 32 ఏళ్ల గరిష్ట వయో పరిమితిని, ఆరుసార్లు అటెంప్ట్‌ల అవకాశాన్ని దృష్టిలోపెట్టుకుని అభ్యర్థులు దీర్ఘకాలిక ప్రిపరేషన్ సాగించే వీలుంది. ఇందుకు భిన్నంగా 26 ఏళ్లలోపు నాలుగు అటెంప్ట్‌లలోనే విజయం సాధించాలని ప్రయత్నించడంలో మానసిక ఆందోళన అధికంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. అటెంప్ట్‌ల సంఖ్య తగ్గిపోతున్నకొద్దీ ఆత్మవిశ్వాసం కూడా సన్నగిల్లుతుందని చెబుతున్నారు.

గ్రామీణ, డిగ్రీ అభ్యర్థులకు ప్రతికూలం

సివిల్స్ ఎంపిక ప్రక్రియలో మార్పుల పరంగా గ్రామీణ అభ్యర్థులు, సంప్రదాయ డిగ్రీ కోర్సుల అభ్యర్థులు మరింత ఆందోళనకు గురయ్యే ఆస్కారముంది. ఎందుకంటే.. ఇటీవల కాలంలో సివిల్స్ విజేతల నేపథ్యాలను పరిశీలిస్తే.. టెక్నికల్, మేనేజ్‌మెంట్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన వారి సంఖ్య 60 శాతం మేర ఉంటోంది. మిగతా వారిలో 10 శాతం ఎంబీబీఎస్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చేసిన అభ్యర్థులు ఉంటున్నారు. మొత్తంగా చూస్తే సంప్రదాయ డిగ్రీ కోర్సులు (హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ తదితర)తో విజయం సాధించిన వారి సంఖ్య 25 నుంచి 30 శాతం లోపే! తాజా నిబంధనలతో వీరంతా ఆందోళనకు గురవుతున్నారు. ఒక వైపు తరుముకొచ్చే వయోపరిమితి నిబంధన.. మరోవైపు పరీక్ష క్లిష్టత వంటి అంశాలు ప్రిపరేషన్‌పై ప్రభావం చూపుతాయి.

లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్‌కు స్వస్తి?

వాస్తవానికి యూపీఎస్సీ.. అన్ని నేపథ్యాల వారికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్‌కు ఆస్కారం కల్పించే విధంగా 2011 నుంచి సీశాట్ (సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్) పేరుతో కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ప్రిలిమ్స్‌లో ఆప్షనల్ విధానానికి స్వస్తి పలికింది. కానీ.. ఇది కూడా అన్ని నేపథ్యాల విద్యార్థులకు అనుకూలంగా లేదని.. ముఖ్యంగా ఆప్టిట్యూడ్ టెస్ట్ పేరుతో నిర్వహించే రెండో పేపర్ పూర్తిగా ఇంగ్లిష్ మీడియం, టెక్నికల్, మ్యాథమెటికల్ నైపుణ్యాలున్న వారికే అనుకూలంగా ఉందనే వాదన వినిపిస్తోంది. అదే విధంగా 2013లో మెయిన్ ఎగ్జామినేషన్‌లోనూ మార్పులు చేసి.. రెండు ఆప్షనల్ సబ్జెక్టుల విధానానికి స్వస్తి పలికి కేవలం ఒకే ఆప్షనల్ విధానాన్ని రూపొందించారు. ఇలా ఒకే ఆప్షనల్ సబ్జెక్ట్ కింద అభ్యర్థులు రెండు పేపర్లకు హాజరు కావాలి. మిగతా అయిదు పేపర్లు అన్ని నేపథ్యాల విద్యార్థులకు అనుకూలంగా ఉంటాయని అప్పట్లో ప్రకటించారు. దీని వల్ల ఏమేరకు ప్రయోజనం జరిగిందో స్పష్టతలేదు!!

ఏడాది ముందుగా చెప్పాలి

ఎంపిక ప్రక్రియలో ఏవైనా మార్పులు చేసే ముందు కనీసం ఒక ఏడాది ముందుగా చెప్పాలి. ప్రస్తుతం ప్రధానంగా ఆందోళనకు గురిచేస్తున్న అంశాలు వయో పరిమితి, అటెంప్ట్‌ల సంఖ్య తగ్గింపు. ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలి. ప్రస్తుతం వయో పరిమితి తగ్గించే యోచన లేదని పేర్కొన్నారు కాబట్టి ఈ విషయంలో అభ్యర్థులు ఆందోళన చెందక్కర్లేదు. నిపుణుల కమిటీలను నియమించి సిఫార్సులు కోరినప్పుడు దాదాపుగా వాటికే మొగ్గుచూపే పరిస్థితులు ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటినుంచే సివిల్స్ ప్రిపరేషన్ సాగించాలి.

– **శ్రీరంగం శ్రీరామ్**, డైరెక్టర్, శ్రీరామ్స్ ఐఏఎస్.

గత కొన్నేళ్లలో జరిగిన కీలక మార్పులు

2011
ప్రిలిమినరీ పరీక్షలో ఆప్షనల్ తొలగింపు. దాని స్థానంలో సీశాట్.

2012
మెయిన్ ఎగ్జామ్ సిలబస్‌లో మార్పులు

2015
సీశాట్‌ను కేవలం అర్హత పరీక్షగానే నిర్ణయిస్తూ ప్రకటన.

2013
మెయిన్‌లో సమూల మార్పులు. రెండు ఆప్షనల్స్ స్థానంలో ఒకే ఆప్షనల్ సబ్జెక్ట్. అదే విధంగా జనరల్ స్టడీస్‌కు ప్రాధాన్యం పెంచారు.

2018
సివిల్ సర్వీసెస్ కేడర్ కేటాయింపులో జోనల్ విధానం అమలు.

UPSC

2018
లేటరల్ ఎంట్రీ పేరుతో జాయింట్ సెక్రటరీ స్థాయిలో నేరుగా నియామకాలు.

బార్క్

ఖాళీలు 13

బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 13 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **విభాగాల వారీ ఖాళీలు:** మెడికల్/సైంటిఫిక్ ఆఫీసర్/డీ (డెంటల్ సర్జన్-ప్రోస్థో డాంటిక్స్)-1, మెడికల్/సైంటిఫిక్ ఆఫీసర్/డీ (డెంటల్ సర్జన్-పెరిడాంటాలజీ)-1, మెడికల్/సైంటిఫిక్ ఆఫీసర్/డీ (సైకియాట్రీ)-1, మెడికల్/సైంటిఫిక్ ఆఫీసర్-సీ (జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్)-5, సైంటిఫిక్అసిస్టెంట్-సీ(మెడికల్ సోషల్ వర్కర్)-1, ఫార్మసిస్ట్ బీ- 2, టెక్నీషియన్/సీ (సీఎస్ఎస్‌డీ-సెంట్రలైజ్డ్ స్టెరిలైజేషన్ సప్లయ్ డిపార్ట్‌మెంట్)-1, టెక్నీషియన్/సీ (ఎక్స్-రే/రేడియోగ్రఫీ)-1.
- **అర్హత:** పోస్టును బట్టి హెచ్ఎస్సీ (10+2), సంబంధిత విభాగాల్లో ట్రేడ్ సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ, ఎంబీబీఎస్, ఎండీఎస్, ఎండీ/డీఎన్‌బీ ఉత్తీర్ణత, పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష/స్క్రీనింగ్ టెస్ట్/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 25, 2019.
- **వెబ్‌సైట్:** https://recruit.barc.gov.in

ఎన్‌పీసీఐఎల్

ఖాళీలు 162

భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) కాక్రపర్ గుజరాత్ సైట్‌లో ఖాళీగా ఉన్న 162 స్టైపెండరీ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. **స్టైపెండరీ ట్రైనీ/సైంటిఫిక్ అసిస్టెంట్ (ఇంజనీరింగ్ డిప్లొమా అభ్యర్థులు): 51**
   - **విభాగాల వారీ ఖాళీలు:** మెకానికల్-26, ఎలక్ట్రికల్-17, ఎలక్ట్రానిక్స్-5, కెమికల్-3.
2. **స్టైపెండరీ ట్రైనీ/సైంటిఫిక్ అసిస్టెంట్ (సైన్స్ గ్రాడ్యుయేట్లు): 6**
   - **విభాగం:** కెమిస్ట్రీ
3. **సైంటిఫిక్ అసిస్టెంట్/బి (సివిల్ ఇంజనీరింగ్ డిప్లొమా అభ్యర్థులు): 7**
4. **స్టైపెండరీ ట్రైనీ/టెక్నీషియన్-ప్లాంట్ ఆపరేటర్: 51**
5. **స్టైపెండరీ ట్రైనీ/టెక్నీషియన్-మెయింటెయినర్: 47**
   - **విభాగాల వారీ ఖాళీలు:** ఫిట్టర్-17, ఎలక్ట్రీషియన్-6, ఎలక్ట్రానిక్స్ మెకానిక్-10, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-7, వెల్డర్-3, మెషినిస్ట్-3, డీజిల్ మెకానిక్-1.

- **అర్హత:** పోస్టును బట్టి సైన్స్ సబ్జెక్టులతో పదో తరగతి, 10+2/ఐఎస్‌సీ, ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణత, పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 31, 2019.
- **వెబ్‌సైట్:** https://npcilcareers.co.in



భారత వ్యవసాయ శాఖ

ఖాళీలు 32

భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన క్రాప్స్ డివిజన్ ఒప్పంద ప్రాతిపదికన 32 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **ఒప్పంద కాల వ్యవధి:** ఏడాది.
- **విభాగాల వారీ ఖాళీలు:** నేషనల్ కన్సల్టెంట్-6, కన్సల్టెంట్-4, ప్రోగ్రామ్ మేనేజర్-1, లీడ్ ప్రోగ్రామర్-1, సీనియర్ ప్రోగ్రామర్-1, ప్రోగ్రామర్-1, టెక్నికల్ అసిస్టెంట్-18.
- **అర్హత:** పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ, డాక్టొరేట్ డిగ్రీ, ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు సుదీర్ఘ పని అనుభవం ఉండాలి.
- **వయసు:** ఏప్రిల్ 1, 2018 నాటికి 65 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 22, 2019.
- **వెబ్‌సైట్:** www.indiaseeds.com

ఓఎన్‌జీసీ

ఖాళీలు 36

సూరత్‌లోని ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ) హజీరా ప్లాంట్‌లో ఖాళీగా ఉన్న 36 టెక్నికల్ (ఏ-1, ఏ-2 లెవల్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. **అసిస్టెంట్ టెక్నీషియన్ (ఏ-2 లెవల్): 12**
   - **విభాగాలు:** మెకానికల్-10, ఎలక్ట్రికల్-2.
   - **అర్హత:** సంబంధిత విభాగంలో మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా ఉండాలి.
2. **జూనియర్ అసిస్టెంట్ టెక్నీషియన్ (ఏ-1 లెవల్): 21**
   - **విభాగాలు:** ఫిట్టింగ్-9, డీజిల్-5, ఎలక్ట్రికల్-3, ప్రొడక్షన్-4.
   - **అర్హత:** పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో సర్టిఫికెట్ కోర్సు ఉండాలి.
3. **జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్: 3**
   - **విభాగం:** కెమిస్ట్రీ
   - **అర్హత:** బీఎస్సీ (కెమిస్ట్రీ)

- **వయసు:** 18-43 సంవత్సరాల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఎంపిక:** రాత పరీక్ష, అకడమిక్ ప్రతిభ, అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్, మెడికల్ టెస్ట్ ద్వారా.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 24, 2019.
- **ఆన్‌లైన్ పరీక్ష (సీబీటీ) తేదీ:** ఫిబ్రవరి 24, 2019.
- **వెబ్‌సైట్:** www.ongcindia.com

పీవీఎన్ఆర్‌టీవీయూ

ఖాళీలు 36

హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ (పీవీఎన్ఆర్‌టీవీయూ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 36 ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం ఖాళీలు:** 36 (వెటర్నరీ సైన్స్-30, ఫిషరీ సైన్స్-6).
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ (ఎంవీఎస్సీ, ఎంఎఫ్ఎస్సీ) లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణత. సంబంధిత రీసెర్చ్/టీచింగ్ రంగంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తారు.
- **ఎంపిక:** వర్సిటీ నిబంధనల ప్రకారం/ఇంటర్వ్యూ ద్వారా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 11, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.tsvu.nic.in